


ఆంధ్ర ప్రదేశ్

నవంబర్, 1971

50 పైసలు



సమైక్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ స్థిరపడింది

— *ముఖ్యమంత్రి సందేశం*

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు గారు దిగువ సందేశం యిచ్చారు.

"రాష్ట్ర సమగ్రతకు దోహదం కల్గించిన యిటీవలి సంఘటనల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ 15వ వార్షికోత్సవానికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉంది. అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి ఏకైక మార్గమైన తెలుగు ప్రజల సమైక్యతను పటిష్టంచేసే గురుతరమైన బాధ్యత మనపై ఉన్నదనే విషయాన్ని మనం గుర్తించాలి

గత 15 సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్ వివిధ రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది అధికారంలో ఉన్న ప్రభుత్వం వివిధ రంగాలలో చేసిన అవిరళమైన కృషే దీనికి కారణమనడంలో సందేహంలేదు పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలోను, బలహీనవర్గాల సముద్ధరణ విషయంలోనూ, విద్య, సహకార రంగాలలోను మన రాష్ట్రం ప్రశంసనీయమైన ప్రగతిని సాధించింది

ఇంతవరకు వ్యావసాయిక రాష్ట్రంగా ఖ్యాతిగాంచిన ఆంధ్రప్రదేశ్ యిప్పుడు పారిశ్రామిక శకంలో ప్రవేశించడం హర్షించదగిన విషయం.

ముఖ్యంగా రాష్ట్రం తరచు అనావృష్టి పరిస్థితులకు, వరదలు, తుఫాను భీభత్సాలకు గురి అవుతున్నప్పటికీ యింతటి అభివృద్ధిని సాధించడం సామాన్యమైన విషయం కాదు. తాత్కాలికమైన యిబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, సుస్థిరమైన, సమైక్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకుంది శాంతి భద్రతలతో పురోగమిస్తున్నది. భారత దేశం నడిబొడ్డున కీలక స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ మీద భాషా సమైక్యత దృష్టితోనే గాక మత సామరస్యం దృష్ట్యా కూడా గురుతరమైన బాధ్యత ఉంది. జాతీయ సమైక్యతకృషిలో మన రాష్ట్రం పాలొనాలి.

చారిత్రికదృష్ట్యా దేశభవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర వహించాల్సి ఉంది.

ఈ సందర్భంగా విచ్ఛిన్నకర శక్తులను అంతంచేసి, సమైక్యతా భావాన్ని పటిష్టం చేయడానికి సమైక్యంగా మనలో ప్రతి ఒకరు కృషి చేయాలి. దేశం యీ నాడు ఒకవైపు బంగ్లాదేశ్ నుండి కోటిమంది శరణార్థుల వలన రాకనూ, మరో వైపు సరిహద్దులలో యుద్ధ ప్రమాద పరిస్థితినీ ఎదుర్కొంటున్నది. మనందరము యీ పరిస్థితిని ఎదుర్కొంటూ అదనపు భారాన్ని సంతోషముగా వహించాలి. గతంలో దేశం మీద దురాక్రమణ జరిగిన పరిస్థితులలో ధైర్యంగా నిలవడంలో మనం ఎవ్వరికీ తీసిపోలేదు

ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చినా ప్రభుత్వానికి తమ పూర్తి సహాయ సహకారాలను అందజేస్తూ గతంలో మాదిరిగానే తమ దేశభక్తిని నిరూపించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను వివిధ రంగాలలో మనం సాధించిన విజయాలు యిదేవిధంగా కొనసాగుతూ మిగతా దేశంతోపాటుగా పురోగమించాలనుకున్నప్పుడు ఎట్టి పరిస్థితులలోను అభివృద్ధి కార్యక్రమాల అమలు ఆగిపోలేదు."

ఆంధ్ర ప్రదేశ్

నవంబరు, 1971

(కార్తీక-మార్గశిర, 1893 శా. శ.)

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ
ప్రత్యేక (తెలుగు సంస్కృతి) సంచిక

సంపుటి: 16 సంచిక: 1

ప్రధాన సంపాదకులు : **పెండ్యాల వామనరావు**

సంపాదకులు : కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి

మూడవ అట్ట :
మన నృత్య రీతులు

చివరి అట్ట :
1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ
సమయంలో హైదరాబాదులో నెహ్రూ.

వెల : 50 పైసలు

సాలు చందా: 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 133

ఈ సంచికలో

పేజీ

3 ఆంధ్రప్రదేశ్‌లో చలన చిత్ర పరిశ్రమ
5 ఆంధ్రుల ఆరాధ్య నాయకుడు-ఆంధ్రకేసరి
6 ఆంధ్ర కేసరి ప్రకాశం
10 రాక్షసత్వం నుంచి మానవత్వం లోకి (కవిత)
11 పరిశ్రమల్లోని కార్మికులు : విరామ కాల వినియోగం
14 ఆంధ్ర చిత్రలేఖన చరిత్ర
18 ఆంధ్రదేశంలో తోలుబొమ్మలు
20 తెలుగువారి సంగీత ప్రతిభ
24 వందేమాతరం (కవిత)
26 సన్నకారు రైతుల అభివృద్ధి పథకాలు
28 మైసూరులో ఖెడ్డా విశేషాలు
30 అడ్డతీగల ఏజన్సీలో చేకు తోటల పథకం
32 వేష భాషల ద్వారా జాతీయ సమైక్యత
35 ఆంధ్రప్రదేశ్‌లో అనావృష్టి
39 త్యాగరాజు కథ (సీరియల్)
41 పలురకాల పండ్లు
44 కవియోగి వేమన
47 వాడపల్లి పుణ్యక్షేత్రం
49 కిరణం (కథ)
53 మొగిలి దేవాలయం
56 మహాభారతము (సీరియల్)
62 గ్రంథ సమీక్ష
67 జిల్లా వార్తలు

సమైక్యతా సుస్థిరత్వం

భారతదేశపు పేరు ఫలాన్ని బట్టి అక్టోబరు, నవంబరు నెలలు మంచి నెలలు: గొప్ప సంఘటనలు జరిగే నెలలు. గాంధీజీ అక్టోబరు నెలలో పుట్టాడు. అలాగే శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి కూడా. అక్టోబరు నెలను విప్లవాల నెల అని కూడా అంటారు. అదే విధంగా నవంబరు నెల కూడా మనకు చాలా ప్రియమయిన నెల. ఎందుకంటే నవ భారత నిర్మాత శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, నేటి నూతన భారత దేశ ప్రతినిధి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఈ నెలలోనే పుట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, అంతకు ముందున్న ఆంధ్ర రాష్ట్రానికి నవంబరు, అక్టోబరు నెలలు చాలా ముఖ్యమయినవి. ఆంధ్రరాష్ట్రము అక్టోబరు నెలలోనూ, ఆంధ్రప్రదేశ్ నవంబరు నెలలోనూ అవతరించాయి. పైగా ఈ రెండు సందర్భాలలోనూ పండిట్ నెహ్రూ ప్రారంభోత్సవం చేశారు.

ఇటీవలనే ఆంధ్రప్రదేశ్‌లో నూతన మంత్రివర్గం ఏర్పడింది. ఈ మంత్రివర్గం ఏర్పడడంతో రాష్ట్రంలోని సమైక్యతా వాతావరణాన్ని స్థిరపరిచే కృషిలో, ఒక నూతన అధ్యాయం ప్రారంభమయింది. రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులు ఏర్పడినందువల్లనూ, బంగ్లాదేశ్ నుండి సుమారు కోటి మంది శరణార్థులు మనదేశంలోకి రావడంవల్లనూ, ఆర్థిక వ్యయంలో పొదుపు చేయవలసిన ఆవశ్యకత దృష్టిలో పెట్టుకొనే రాష్ట్రమంతటా, ఢిల్లీలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పదిహేనవ అవతరణోత్సవాలు కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలతో తగువిధంగా నిర్వహించబడినవి.

గత 15 సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వివిధ రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. వ్యవసాయ, ఖనిజ రంగాలలో సహజ వనరులు పుష్కలంగా కల మన రాష్ట్రంలో యిప్పుడు పారిశ్రామిక ప్రగతి శకం ప్రారంభమయింది.

రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి ఇలా అన్నారు. "పరిశ్రమల రంగంలోగానీ, వ్యవసాయంలోగానీ బలహీన వర్గాల ప్రజల పరిస్థితి బాగుచేయడంలో గానీ, విద్య, సహకార రంగాలలోగానీ మనరాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించింది. అయితే అన్నింటి కంటే ముఖ్యమయిన విషయం, కేవలం వ్యవసాయిక రాష్ట్రంగా మాత్రమే ఉన్న మనరాష్ట్రం పారిశ్రామిక పథంలో ప్రయాణించటం ప్రారంభించింది." మన రాష్ట్రం ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చూస్తే, ముఖ్యమంత్రి అన్నట్లు ఇదేమీ తక్కువ అభివృద్ధి కాదు.

అనివార్య కారణాలవల్ల ఆలస్యంగా జరిగినప్పటికీ ఉత్తమ చలన చిత్రాల బహుమతి ప్రదాన కార్యక్రమంద్వారా ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరమయిన హైదరాబాదులో చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి సంబంధించిన సమస్యలు ప్రాధాన్యం వహించాయి. ఈ ఉత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, సమాచారశాఖ మంత్రి, ఈ పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం చేయగలిగినంత సహాయం చేస్తుందని హామీ యిచ్చారు. కానీ కేవలం ప్రభుత్వ సహాయమే చాలదనీ, చలనచిత్ర పరిశ్రమలోని వారు హైదరాబాదును చలన చిత్ర నిర్మాణ కేంద్రంగా చేయాలనే దీక్షతో, దృఢసంకల్పంతో పని చేస్తేనే ఈ కృషి ఫలవంతమవుతుందనీ వారు హెచ్చరించారు. బహుమతి ప్రదానోత్సవానికి చలన చిత్ర రంగంలోని ప్రసిద్ధ నటీనటులు అధికసంఖ్యలో వచ్చి పాల్గొన్నారు. ప్రేక్షకులు జయ జయ ధ్వానాలతో వారికి స్వాగతం పలికారు. దీనివల్ల చలన చిత్రరంగంలోనివారు ఈ బహుమతి ప్రదానోత్సవానికి ఎంత ప్రాధాన్యం యిస్తున్నారో మనకు తెలుస్తుంది. ఈ బహుమతి ప్రదానోత్సవమూ, ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ కార్యక్రమాలూ, అంతకుముందు మూడురోజులుగా జరిగిన బల్గేరియన్ నృత్య ప్రదర్శనలు—వీటితో రాజధానీ నగరం పండుగ జరుపుకుంటున్నట్లుగా కళకళలాడింది. ఈ కార్యక్రమాలలో రెండు సందర్భాలలో ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి ఐక్యతతో ఉండవలసిన ఆవశ్యకతను గురించీ, హైదరాబాదులో సాంస్కృతిక, లలితకళల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించవలసిన ఆవశ్యకతను గురించీ నొక్కి చెప్పారు.

—పి. వి. ఆర్.

ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ

అక్కిరాజు వాసుదేవరావు

గత దశాబ్దకాలంలో అనేక రంగాలలో ఘనమైన అభివృద్ధిని సాధించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు చలన చిత్ర పరిశ్రమ రంగంలో కూడా గణనీయమైన ప్రగతిని సాధించారు. సాంస్కృతిక సంపదకు మన రాష్ట్రం వారసత్వం పొందింది. సిద్ధేంద్ర యోగి, త్యాగయ్య, ద్వారం వెంకటస్వామి నాయుడు, బళ్లారి రాఘవాచార్య, ధర్మవరపు కృష్ణమాచారి, యడవల్లి సూర్య నారాయణ, డా॥ గోవిందరాజుల సుబ్బారావు, స్థానం నరసింహా రావు వంటి సంగీత, నృత్య నాటక కళాప్రపూర్ణులు యీ గడ్డపై జన్మించారు. భవిష్యత్ తరాలవారికి వారు మార్గ దర్శకులు. తెలుగు వారిలో సంగీత విద్వాంసులు నటనాధురంధరులు ఉన్నారు. వారి జీవితం, చరిత్రలతో ప్రభావితులైనవారు కళాత్మకమైన చలన చిత్రాలను తీయనారంభించారు. తెలుగు వారిలో అంతర్గతంగా ఉరకలువేసే సంగీత, నాటక, నృత్య అభిలాష తెలుగు చలన చిత్రాల అభ్యున్నతికి దోహదం చేసింది. ప్రప్రథమ తెలుగు టాకీచిత్రం "భక్తప్రహ్లాద" 1931లో శ్రీ హెచ్. ఎం. రెడ్డి దర్శకత్వంలో నిర్మించబడింది. 1934లో మద్రాసులో మరో తెలుగు చిత్రం "సీతాకళ్యాణం" నిర్మించబడింది. అప్పటి నుండి తెలుగు చలన చిత్ర పరిశ్రమ క్రమక్రమంగా అభివృద్ధిచెందింది. 1969 ఆఖరు నాటికి 970 తెలుగు చిత్రాలు నిర్మించబడినాయి. సగటున ప్రతి సంవత్సరం 70 నుండి 80 వరకు తెలుగు చిత్రాలు నిర్మించ బడుతున్నాయి.

హైదరాబాదు-చలనచిత్ర నిర్మాణ కేంద్రం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజధాని హైదరాబాదు నగరం, తెలుగు చిత్రాల నిర్మాణానికి మరో కేంద్రంగా రూపొందింది. రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధినిమిత్తం కొంతమంది కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, దర్శకులు మద్రాసునుండి హైదరాబాదు తరలివచ్చారు

నిర్మాణం అవకాశాలు

ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర రాజధానీ నగరమైన హైదరాబాదు ఫిల్ముషూటింగ్‌కూ స్టూడియోలు, లెబోరెటరీలు మొదలైనవాటి ఏర్పాటుకూ బాగా అనువైన ప్రదేశం. హైదరాబాదులోని సుందరమైన ప్రకృతి దృశ్యాలు, రాష్ట్రంలోని యితర రమణీయ ప్రదేశాలు చలన చిత్ర నిర్మాతలకు స్వర్గధామం వంటివి. హైదరాబాదులో అన్ని హంగులతో సారధీ స్టూడియో, సదరన్ మూవీస్టూడియో నెలకొల్పబడినాయి. రాష్ట్రంలో టూరింగ్ సినిమాలతో సహా 1080 సినిమా థియేటర్లు ఉన్నాయి. వాటిలో 65 థియేటర్లు హైదరాబాదు, సికింద్రాబాదు జంట నగరాలలో ఉన్నాయి. ఇక్కడ అనేక చలన చిత్ర పంపిణీ సంస్థలు పని చేస్తున్నాయి.

లభించే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో యితర పరిశ్రమలతో సమానంగా చలనచిత్ర పరిశ్రమ కూడా అభివృద్ధి చెందడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటున్నది. హైదరాబాదులో బ్రహ్మానంద చిత్రపురి పేరుతో చలనచిత్ర ప్రాంతాన్ని ఏర్పాటు చేయడంతో పాటు యితర చర్యలనేకం తీసుకుంటున్నారు. చలన చిత్రాలకు రాష్ట్ర బహుమతుల ఏర్పాటు, ఉదారంగా ఋణాల మంజూరీ, చిత్ర నిర్మాతలకు సబ్సిడీలు మొదలైన వాటిని యీ సందర్భంలో పేర్కొనవచ్చు. తత్ఫలితంగా అన్ని హంగులు గల స్టూడియోల నిర్మాణం ప్రారంభం కావడమేగాక రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించు కోవడానికి ప్రముఖ చిత్ర నిర్మాతలెందరో ముందుకు వస్తున్నారు.

ఋణాలు

చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో స్టూడియోలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. హైదరాబాదులోని స్టూడియోలలో వసతి సౌకర్యాలను విస్తరింపజేయడానికి వీలుగా శ్రీ సారధీ స్టూడియోకు రు. $2\frac{1}{2}$ లక్షలు, సదరన్‌మూవీస్టూడియోకు రు. $2\frac{1}{2}$ లక్షలు మంజూరు చేయడం జరిగింది. బ్రహ్మానంద చిత్రపురిలో కొత్తగా స్టూడియోలను నిర్మించడానికి ప్రసాద్ ప్రొడక్షన్‌కూ, శ్రీ ఎన్.టి. రామారావుకూ రు 5 లక్షల ఋణాలు మంజూరుచేసే విషయం ప్రభుత్వ పరిశీలనలోఉంది. ఈ రెండు స్టూడియోల నిర్మాణం పూర్తి అయితే భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ చలన చిత్ర నిర్మాణ కేంద్రంగా రూపొందుతుంది.

చలన చిత్ర కాలనీ

చలన చిత్ర కాలనీ ఏర్పాటుకూ కొత్త స్టూడియోల నిర్మాణానికీ వీలుగా హైదరాబాదు, విజయవాడ జాతీయ రహదారిపై హైదరాబాదుకు 8 మైళ్ళ దూరంలోని హయాత్‌నగర్‌లో 206 ఎకరాల భూమిని సేకరించారు. చలన చిత్ర పరిశ్రమలోనివారికి ఖరీదు చెల్లింపు ప్రాతిపదికపై ఈ భూమిని కేటాయిస్తారు. స్టూడియోల నిర్మాణం నిమిత్తం ఎకరాకు రు. 2,500ల చొప్పున శ్రీ ఎల్. వి. ప్రసాద్, శ్రీ ఎన్. టి. రామారావులకు 20 ఎకరాల

చొప్పున భూమిని కేటాయించారు. శ్రీ ఎన్. టి. రామారావు, శ్రీ ఎల్. వి. ప్రసాద్ స్టూడియోల నిర్మాణం పనిని ప్రారంభించారు. శ్రీ ఎన్. టి. రామారావు పట్టణాలను నిర్మించగా శ్రీ ఎల్. వి. ప్రసాద్ ఉద్యానవనాలను పెంచుతున్నారు. బ్రహ్మానంద చిత్రపురిలో ప్రత్యేకంగా నెలకొల్పబడిన సెట్‌లో "ఖిలోనా" రంగుల చిత్రం అవుట్‌డోర్ షూటింగ్ జరిపారు. బొంబాయి చిత్ర నిర్మాత శ్రీ షేక్ ముఖ్తార్, యిటీవల హైదరాబాదులో "ఉస్తాద్ పెడ్రో" రంగుల చిత్రాన్ని నిర్మించారు. ప్రతిపాదిత కాలనీలో నీరు, విద్యుచ్ఛక్తి, రోడ్లవంటి ప్రాథమిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. చలన చిత్రాల నిర్మాణానికి వీలుగా అన్ని హంగులుగల స్టూడియోలను రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా నిర్మించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలోవుంది. ఈ చలన చిత్ర కాలనీ త్వరలోనే ప్రముఖ చలన చిత్ర నిర్మాణ కేంద్రంగా ప్రాధుర్యం పొందుతుందని ఆశిస్తున్నారు.

సబ్సిడీ పథకం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మించబడే చిత్రాలకు రు. 50,000ల చొప్పున సబ్సిడీ యిచ్చే పథకాన్ని ప్రవేశపెట్టారు. 1964 నుండి మార్చి 1970 వరకు యీ పథకం అమలులో వుంది. ఇంతవరకు 33 చిత్రాలకు రు. 50,000ల చొప్పున సబ్సిడీ ఇవ్వడం జరిగింది, అయితే 1970 ఏప్రిల్‌నుండి యీ పథకాన్ని ఆపివేశారు.

స్కాలర్‌షిప్పులు

రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమలోని సాంకేతిక విభాగంలో విద్యార్హతలుగల శిక్షణ పొందిన సాంకేతిక సిబ్బందిని లభింపజేసే దృష్టితో పూనాలోని చలన చిత్ర శిక్షణ సంస్థ యిస్తున్న సౌకర్యాలను ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకుంటున్నది. పూనాలో భారత చలన చిత్ర, టెలివిజన్ సంస్థలో చదువుతున్న ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్ షిప్పులను మంజూరు చేస్తున్నది స్క్రీన్ ప్లే, రచన, దర్శకత్వం, చలన చిత్ర ఫొటోగ్రఫీ, సౌండ్ రికార్డింగ్, సౌండ్ ఇంజనీరింగ్, ఫిల్ము ఎడిటింగ్ కోర్సులను చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం 4 స్కాలర్ షిప్పులను యిస్తున్నారు ప్రతి కోర్సుకు యిచ్చే స్కాలర్‌షిప్ విలువ సంవత్సరానికి రు 1200 ఇంతవరకు 16 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరు చేశారు.

చలన చిత్ర శిక్షణ సంస్థ

నాలుగవ ప్రణాళికా పథకంలో భాగంగా హైదరాబాదులో చలన చిత్ర శిక్షణ సంస్థను నెలకొల్పే ప్రతిపాదన సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరు పరిశీలనలో వుంది. చలన చిత్ర పరిశ్రమకు సంబంధించిన వివిధ రంగాలలో శిక్షణ యివ్వడానికి తద్వారా వీలు కలుగుతుంది. ఈ సంస్థ ఏర్పాటుకు అవసరమయిన స్థలాన్ని బ్రహ్మానంద చిత్రపురిలో కేటాయించడం జరుగుతుంది.

చలనచిత్ర బహుమతులు

విద్య, సాంస్కృతిక విషయాలలోను సాంకేతిక, కళా విషయికంగాను ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో తెలుగు కళా చిత్రాలు, వార్తా చిత్రాలు, బాలల చిత్రాలు, విద్యా విషయిక చిత్రాలకు ప్రతి సంవత్సరం బహుమతులు యిచ్చే పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతి రంగంలోని ప్రథమ ద్వితీయ తృతీయ ఉత్తమ చిత్రాలకు వరసగా బంగారు, వెండి, కాంస్య నంది విగ్రహాలను బహుమతులను యిస్తున్నారు వాటితోడు నిర్మాత, దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ నటికి, కథా రచయితకు రొక్కంబహుమతులు, ఫలకాలు బహూకరిస్తున్నారు. మంచి చిత్రాల నిర్మాణానికి యీ బహుమతులు ప్రోత్సాహకారులుగావున్నాయి.

అవుట్‌డోర్ షూటింగ్

రాష్ట్రంలో చలనచిత్రాల షూటింగ్ నిమిత్తం నిర్మాతలను ఆకర్షించడానికి అవుట్‌డోర్ షూటింగ్ చార్జీలను తగ్గించే సమస్యను, సంబంధిత అధికారులతో చర్చించడం జరుగుతున్నది. తత్ఫలితంగా నెహూర్ జంతు ప్రదర్శనశాల వారు అవుట్‌డోర్ షూటింగ్ చార్జీలను రోజుకు రూ. 250 నుండి 150లకు తగ్గించారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యానవనాల డైరెక్టరు రూ. 300 నుండి రూ. 100 లకు, ప్రాజెక్టు స్థలాలలో రూ. 500 నుండి రూ. 300 లకు చార్జీలు తగ్గించారు. తమ అధీనంలో ఉన్న ప్రదేశాలలో షూటింగ్ చార్జీలను తగ్గించాలని యితర శాఖాధిపతులకు విజ్ఞప్తిచేయబడింది.

హైదరాబాదులో ఫిలిం సెన్సార్ బోర్డు

రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన విషయాలతో ప్రభుత్వానికి సలహాలు అందజేసే నిమిత్తం ముఖ్యమంత్రి అధ్యక్షతన చలనచిత్ర ప్రముఖులతో రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి మండలి ఏర్పాటు చేయబడింది. ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి, రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ భవిష్యత్ అభివృద్ధి నిమిత్తం ముఖ్యమైన సలహాలను యీ మండలి అందజేస్తుందని ఆశించబడుతున్నది.

చలనచిత్ర అభివృద్ధికి వివిధ చర్యలను చేపట్టడానికి వీలుగా వినోదపన్నులో కొంత భాగాన్ని చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి నిధిగా ఏర్పాటు చేయడం పరిశ్రమ అభివృద్ధిలో గణనీయమైన చర్యగా భావించవచ్చు. సేకరించిన వినోద పన్నులో రెండు శాతం మొత్తాన్ని యీ నిధికి కేటాయిస్తారు.

రాష్ట్ర బాలలచలనచిత్ర సంఘం

బాలలకు, కౌమారదశలోని పిల్లలకు అనువైన చలన చిత్రాల నిర్మాణాన్ని, ప్రదర్శనలను ప్రోత్సహించడానికి 1970 జూన్‌లో రాష్ట్ర బాలలచలనచిత్ర సంఘాన్ని ఏర్పాటుచేశారు. 1970నవంబరులో ఈ సంఘం బాలల చలనచిత్ర ఉత్సవాన్ని ఏర్పాటుచేసింది*

ఆంధ్రుల ఆరాధ్య నాయకుడు

ఆంధ్ర కేసరి

-వావిలాల గోపాలకృష్ణయ్య

శ్రీ ప్రకాశం పంతులు మూర్తీభవించిన ఆంధ్ర స్వరూపులు గర్భదరిద్రంతో జన్మించారు వేలు, లక్షలు గడించారు మహోన్నత పదవులు అందుకున్నారు. గాంధీజీ ప్రబోధంతో స్వాతంత్ర్య సమరంలోకి దూకారు గాంధీజీ బోధించిన ఐచ్ఛిక దారిద్ర్యాన్ని తెచ్చి పెట్టుకున్నారు లక్షలార్జించే బారిష్టరీ తృణ ప్రాయంగా త్యజించారు.

స్వరాజ్య పత్రికతో దేశభక్తి, త్యాగం, సహనం దక్షిణ భారతంలో వెదజల్లారు ఉద్దంతులైన రచయితలను తయారు చేశారు స్వరాజ్యపార్టీతో శాసన సభలకు వెళ్ళారు.

సైమను కమీషను మద్రాసు వస్తే, బహిష్కరించి, ప్రతిఘటించి తుపాకిగురికి గుండె ఎదురొడ్డారు మద్రాసు నగరాన్ని శ్రీమతి దుర్గాబాయి, తమ ఉప్పు సత్యాగ్రహంతో ఉర్రూతలూపారు

1936 ఎన్నికలలో ఆంధ్రలో శాసన సభ స్థానాలన్నీ కాంగ్రెసువారు కైవసం చేసుకున్నారు రెవెన్యూ మంత్రిగా జమీందారీ రద్దు నివేదిక తయారుచేశారు జమీందార్ల రక్షణకు రామరక్షగా వున్న జి వోలు కనబడలేదని అధికారులు దాచడానికి ఎత్తువేస్తే, అవి అన్నీ రద్దు అయినట్లు జి వో యివ్వమనడంతో అన్నింటిని బయటకు లాగారు

ప్రజల భాషలో పరిపాలన

1946 లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు ఉత్పత్తిదారుల, వాడుకదారుల సహకార సంఘాలు ఏర్పరచినారు ప్రజల భాషలో పరిపాలన జరుగవలెనని ప్రతిపాదించి జిల్లా స్థాయిలో తూర్పు గోదావరిలో తెలుగు, తంజావూరులో తమిళం, మలబారులో మలయాళం భాషలలో పరిపాలన జరగాలని ఆదేశించారు గాంధీజీ సిద్ధాంతము ననుసరించి అభివృద్ధిపథకాలు అమలు జేశారు మరకదుళ్ళు వ్యతిరేకించారు రాష్ట్రం అంతటా మద్య నిషేధం అమలు జరిపారు చివరకు ఆయనను దింపివేశారు అయినా జంకని మేరునగధీరుడు ప్రకాశం పంతులు

1952 లో మద్రాసు శాసన సభలో మైనారిటీని మెజారిటీగాచేసి రాజాజీ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడినప్పుడు గవర్నరు ప్రసంగాన్ని అడ్డగించి వేలుచూపి నీకు హక్కులేదని చేసిన ప్రసంగం ప్రకాశం గారి రాజకీయ సాహసానికి మరుపురాని మణిపూస

ఆంధ్ర రాష్ట్ర అవతరణతో ఆంధ్ర కేసరి ఆంధ్ర ప్రథమ ముఖ్య మంత్రి అయ్యారు ఖైదీలందరిని వదలివేశారు. కృష్ణా బ్యారెజ్, నందికొండ (నాగార్జునసాగర్ ప్రాజెక్టు) తుంగభద్ర ఎగువ కాలువ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము సాధించారు ఆంధ్ర ముఖ్యమంత్రిగా పది రూపాయలలోగా నున్న భూమి శిస్తులను రద్దుచేస్తూ ప్రకటించారు విశాలాంధ్ర నిర్మాణానికి ఆనాటి హైదరాబాద్ ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణా రావు గారితో కలిసి పునాదులు వేశారు

ప్రజలే నేను, నేనే ప్రజలుగా ఆంధ్ర జీవితంలో ఆంధ్ర ప్రజల హృదయాలలో లీనమైపోయారు సాహసము, త్యాగము, కొనితెచ్చుకొన్న దారిద్ర్యము, దేశభక్తి మూర్తీభవించిన ఆంధ్రకేసరి గతించినా ఆంధ్రభూమిలో సజీవుడే ఆంధ్రుల హృదయాలలో మరపురాని అరమరలులేని ఆరాధ్య నాయకుడు, ఆదర్శ నాయకుడు, అమరుడు ఆంధ్రకేసరి, వారి శతజయంతి ఈ యేడు జరుపుకుంటున్నాం వారికి జోహార్లు సమర్పించి వారి అడుగుజాడలోనే నడుద్దాం

జాతీయోద్యమ వీర యోధుడు ఆంధ్ర కేసరి ప్రకాశం

(గత సంచిక తరువాయి)

పండ్రంగి రాజేశ్వరరావు



1930 లో జాతీయోద్యమపు పిలుపునందుకుని కాంగ్రెసు శాసన సభ్యుల్ని రాజీనామా చేయమన్నప్పుడు ప్రకాశంగారు కేంద్ర అసెంబ్లీకి రాజీనామాచేసి ఉప ఎన్నికల్లో పోటీచేసి, గెలిచి పార్టీ ముద్రతో సంబంధంలేకుండా ప్రజలలో తనకు గల పలుకుబడిని నిరూపించుకున్నారు. ఉప్పుసత్యాగ్రహం ప్రారంభమైనప్పుడు ఆయన వెంటనే రాజీనామాచేసి సత్యాగ్రహోద్యమంలోకి దుమికారు. తన కొడుకు హనుమంతరావు మశూచివ్యాధికి గురై చావుబ్రతుకుల్లో వూగిసలాడుతున్నా లెక్కచేయకుండా ప్రకాశంగారు సత్యాగ్రహోద్యమంలోకి దుమికినారు. నాగేశ్వరావు, దుర్గాబాయ్, రంగయ్యనాయుడుగార్లు వెంటరాగా ప్రకాశంగారు మద్రాసులో ఉప్పుచట్టాన్ని ధిక్కరించారు. చట్టధిక్కరణ నేరానికి ప్రకాశం గారికి జుల్మానావిధించబడింది. ఆయన కారును ప్రభుత్వం జప్తు చేసింది. ఆ తర్వాత ఆయనకు ఒక ఏడాది కారాగారశిక్ష విధించింది. ఇతరులు తాలూకాలలోనూ, గ్రామాలలోనూ జాతీయోద్యమాన్ని నడిపిస్తుండగా ప్రకాశంగారు మద్రాసు వంటిమహానగరంలో విజయవంతంగా నడిపి ప్రజాజీవితంలో పలుకుబడిని సంపాదించి ప్రథమ గణ్యులైనారు. మహాత్మాగాంధీగారు నడిపిన అన్ని ఉద్యమాల

లోనూ ఆయన పాల్గొని అనేకసార్లు కారాగారశిక్షను అనుభవించారు.

జస్టిస్ పార్టీకి స్వస్తి

1937 లో ప్రాంతీయ శాసన సభలకు అక్షరాస్యత ప్రాతిపదికమీద సాధారణ ఎన్నికలు జరిగాయి. పార్టీ నాయకుడుగా ప్రకాశంగారు ఆంధ్ర ప్రాంతంలో శ్రీ సాంబమూర్తిగారు కార్యదర్శిగా ఎన్నికల ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆ సాంబమూర్తిగారే ఆ తరువాత శాసనసభ స్పీకర్ అయ్యారు. ఆ యిద్దరి కలయిక అమోఘమైనది. అరుదైనదికూడా. కులప్రాతిపదికగలిగి అధికార్ల అండదండలున్న జస్టిస్‌పార్టీ ఒక పెద్దపోటీగా వీరిముందు నిలిచింది. నిధులు తగినంతలేక పోయినప్పటికీ ప్రకాశంగారు తానొక్కడూ మొత్తం ఆంధ్ర ప్రాంతమంతా తిరిగి ఎన్నిక ప్రచారం కావించారు. అన్న పానాదుల్ని కూడా ఆయన మరిచి పోయేవారు. మాసిన బట్టల్ని మార్చడానికి కూడా తీరిక వుండేదికాదు. విశ్రాంతి అనేది మర్చిపోయారు. పదినిమిషాలపాటు ఎక్కడా నిలకడగా నిలుచోలేదు. ఒక చోటినుంచి మరోచోటికి, ఒకవ్యక్తినుంచి మరోవ్యక్తి దగ్గరకి ఆయన కదులుతూనే వున్నారు. ప్రచారం చేస్తూనేవున్నారు. ప్రజలు ఆయన సరసకు వచ్చేరారు. తత్ఫలితంగా ఆంధ్రదేశంలో జస్టిస్ పార్టీ నామరూపాలు లేకుండా పోయింది. మళ్ళీ ముందు ముందు తలెత్తే ఆశ కూడా లేకుండా పోయింది. ప్రకాశంగారి నిరంతర కృషికి, కార్యదీక్షకు యిది మచ్చుతునక.

కార్యశూరుడు

ప్రాంతీయ పరిపాలనాధికారాలతో కాంగ్రెసుపార్టీ పరిపాలన చేపట్టినప్పుడు ప్రకాశంగారు మద్రాసు రాష్ట్రానికి రివెన్యూ మంత్రి అయ్యారు. జాతీయోద్యమంలో పాల్గొన్నందుకు పదవుల నుంచితొలగించబడిన గ్రామాధికార్లను ప్రకాశంగారు తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. అంతేగాక జాతీయోద్యమమప్పుడు ఉమ్మడిగా విధించిన జుల్మానాలను తిరిగి యిచ్చివేశారు. పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు ఉదారంగా, శిస్తుచెల్లించనక్కరలేకుండా రెమిషన్ సౌకర్యాల్ని కలిగించారు. చెప్పినపని చెయ్యకపోవడమంటూ ఆయనకులేదు. ఒక ఆలోచనవస్తే దాన్ని కార్యరూపంలో పెట్టే వరకు ఆయన విశ్రమించరు.

జమీందారీ కమిటీ నివేదిక

జమిందారీ ప్రాంతంలో పన్నుల విధింపు విధానాన్ని తుడిచిపెట్టేసి, రైతులకు ప్రయోజనకరంగా దాన్ని మార్పుచేయాలని, అవసరమైతే దాన్ని సమూలంగా నిర్మూలించాలని తలచి విచారణా సంఘాన్ని ఒక దానిని ఏర్పాటుచేశారు. తను అధ్యక్షుడుగాగల యీ విచారణాసంఘం యీసమస్యను కూలంకషంగా పరిశీలించి పద్దెనిమిది వాల్యూముల నివేదికను సమర్పించింది. ఇది ప్రకాశంగారి ప్రతిభకు ఆయన పరిశ్రమకు గొప్ప నిదర్శనం.

ప్రజల మంత్రి

ప్రజల మంత్రిగానే ప్రకాశంగారు ఎప్పుడూ వ్యవహరించారు. అందరికీ ఆయన అందుబాటులో వుండేవారు. తప్పులు చేసే అధికార్లనీ, తతిక్క అధికార్లనీ గుర్తుపట్టిపిలిచి ప్రజలకు వారు అధికార్లు కారనీ, ప్రజాసేవకులని వారికి తెలియజెప్పి వారు గుర్తించేట్టు చేసేవారు. రెవెన్యూ బోర్డుసభ్యుడు సర్ జాన్ హాల్‌ను ప్రకాశంగారు పదిహేను నిమిషాలు నిలిపినందుకుగాను ఆయన తన తీవ్రఅసమ్మతిని తెలియజేసినప్పుడు 'ప్రభుత్వ సేవకునికన్న మంత్రికి ఆ పదిహేను నిమిషాల కాలం చాలా విలువైనదిగా గుర్తుంచుకో', మని ప్రకాశంగారు తెలియజెప్పారు. మొట్టమొదటి సారిగా తాము అధికారాన్ని పాలుపంచు కుంటున్నామని, తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దు కుంటున్నామని ప్రజలు భావిస్తున్నారంటే అందులో ఆశ్చర్యంలేదు.

"క్విట్ ఇండియా"

దేశ నాయకులతో సంప్రదించకుండానే, ద్వితీయ ప్రపంచ యుద్ధంలోకి భారతదేశాన్ని కూడా లాగినందుకు నిరసనగా కాంగ్రెసు మంత్రి వర్గం రాజీనామా చేసినప్పుడు దక్షిణాదిలో సత్యాగ్రహంచేసి జైలుశిక్ష అనుభవించిన మొట్టమొదటి మంత్రి ప్రకాశంగారే, కాకినాడలోనూ, విశాఖపట్నంలోనూ జపానువారు బాంబులు వేసినప్పుడు వెంటనే ఆ ప్రాంతాలకు వెళ్ళి అక్కడ ప్రజలకు తోడ్పడే నిమిత్తం వాలంటీరు దళాలను ఏర్పాటు చేశారు 1942 లో బొంబాయిలో క్విట్ ఇండియా తీర్మానం చేయబడినప్పుడు బ్రిటిష్‌వారు గడగడలాడి ప్రకాశం గారిని బొంబాయినుంచి వస్తుండగా కడపలో అరెస్టుచేసి 1945 వరకు డిటెన్షన్‌లో వుంచారు. విడుదలైన తర్వాత ఆయన ఆంధ్రదేశ మంతా పర్యటించారు. ఆయన వెళ్ళిన చోటల్లా ప్రజలు పెద్ద పెద్ద మొత్తాలలో విరాళాలు యిచ్చారు. డబ్బు విషయాల్లో ఆయనకుగల స్వాభావికమైన అశ్రద్ధవల్ల ప్రజల విరాళాలకు సంబంధించిన లెక్కల్ని ఆయన ఎప్పటికప్పుడు వ్రాసుకోలేదు. దాన్ని ఆయన ప్రత్యర్థులు మహాపరాధంగా గాంధీజీ చెవిలో యిల్లుకట్టుకుని మరీ చెప్పారు. ఆయనకు వ్యతిరేకంగా ప్రచారంచేశారు. అయినప్పటికీ ప్రకాశంగారు 1946 ఎన్నికల్లో విజయాన్ని సాధించగలిగారు. జాతీయోద్యమానికి వెన్నుపోటు పొడిచిన కమ్యూనిస్టులను ఓడించి విజయం సంపాదించి, ఏకైక ప్రజానాయకుడయ్యారు.

ముఖ్యమంత్రిత్వం

ప్రకాశం, కామరాజుగార్ల యునైటెడ్ ఫ్రంట్‌వల్ల రాజగోపాలాచారిని నాయకుడిగా నియమించాలనుకున్న గాంధీగారి ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయితే నాయకుడిని ఎన్నుకోవలసి వచ్చినప్పుడు కామరాజు ప్రకాశంగారికి మద్దతు యివ్వకుండా సి. ఎన్. ముత్తురంగ ముదలియార్‌ను నిలుచోబెట్టాడు. రాజాజీ అనుయాయుల గోడమీది పిల్లివాటం ధోరణి వల్ల ప్రకాశంగారు అవిభక్త మద్రాసు రాష్ట్రానికి నాయకుడుగా ఎన్నుకోబడ్డారు.

ప్రకాశంగారి అనుయాయి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు స్పీకర్ పదవికి జరిగిన పోటీలో ఓడిపోయారు. అందువల్ల ప్రకాశంగారికి శత్రువులమధ్య, పరిమితమైన అధికారాలతో పదవిని నిర్వహించ వలసివచ్చింది. కష్టాలకు ఎంత మాత్రం ఆయన వెరవలేదు. తన ముందున్న ప్రతిఘటనను, ఇబ్బందులను ఆయన ఎంతమాత్రం పట్టించుకోలేదు.

గాంధీ యుగ చరిత్రలోనే అపూర్వమైన సంఘటన ఒకటి జరిగింది. గాంధీజీ, కాంగ్రెసు హైకమాండుకు వ్యతిరేకంగా ఒక బాధ్యతా యుతమైన పదవిని అధిష్ఠించిన ఘనత గాంధీయుగంలో ఒక ప్రకాశంగారికే దక్కింది. లోగడ కాంగ్రెసు అధిష్ఠాన వర్గాన్ని గాంధీజీని కాదన్న కె.ఎఫ్ నారిమన్, ఎన్.బి. కారె, సుభాష్ చంద్ర బోసువంటి ఉద్దండులుసైతం ఘోరపరాజయంపొంది కాంగ్రెసు నుంచి తప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రకాశంగారు మాత్రం తన సాహసంతో ధైర్యంతో, దృఢచిత్తంతో ఎదుర్కొని ప్రజా స్వామ్యపునాదుల్ని మరింత పటిష్టం చేసారు.

ఫిర్కా అభివృద్ధి ప్రణాళిక

తన మంత్రివర్గ సహచరులు నెలకు రూ 1500 చొప్పున జీతం తీసుకుంటుండగా తానుమాత్రం నెలకు రూ 100 మాత్రమే తీసుకొనేవారు. ఫిర్కా అభివృద్ధిని ప్రకాశంగారే ప్రారంభించారు. ఖాదీకి బహుళ ప్రచారం కలిగించే వుద్దేశంతో బట్టల మిల్లులకు కండెలకోటాను ఎక్కువ చేయడానికి నిరాకరించారు. అవసర పరిస్థితుల్లో లోగడ జాతీయ కార్యకర్తలుగా పనిచేసినవారి సేవలను ఆయన వినియోగించుకున్నారు. మధ్యదళారీల బెడదతప్పించే ఉద్దేశంతో ఉత్పత్తి—వినియోగదార్ల సహకార సంఘాలను స్థాపించారు. గ్రామస్థాయిలో ప్రజాస్వామిక వ్యవస్థ అభివృద్ధి చెందాలని పంచాయతీ రాజ్యవ్యవస్థ నెలకొనాలని గట్టిగా ఆయనభావించారు.

కొరకరాని కొయ్య

స్వలాభపరులకు ఆయన కొరకరానికొయ్యగా వున్నందువల్లా పదవిలో నిలదొక్కుకోడానికి ఎత్తుకు పై ఎత్తులు వేయడం చేత కాకపోవడం వల్లా ప్రకాశంగారి ప్రత్యర్థుల బలం పెరగజొచ్చింది. బాహాటంగా జరిగే తిరుగు బాటుకన్న అంతర్గతంగా జరిగే కుట్రలు కుతంత్రాలే చాలా ప్రమాదకరమైనవి. చివరికి ఎలాగైతేనేం ప్రకాశంగారిని గద్దెనుండి దింపేశారు. మహా భారతంలో కర్ణుడిలాగ ఆయన ఓడిపోయారు.

ప్రకాశంగారిని గద్దెనుంచి పడదోసినందుకు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. కొత్త మంత్రులు కొంత కాలం వరకు ప్రజల మధ్యకు వెళ్ళలేకపోయారు కూడా. మొక్కవోని ఆయన దీక్ష, ప్రజల్ని సమ్మోహితుల్నిచేసే వాక్ప్రవాహం, వాస్తవ విషయాల్ని లెక్కలతోసహా వేసిచూపించే విషయపరిజ్ఞానం ఆయన ప్రత్యర్థులకు గుండెదడ కలిగించింది. వారిమీద ప్రకాశంగారు అవినీతి ఆరోపణలుచేసి ఒక ఉద్యమంలాగ ప్రారంభించేసరికి ప్రత్యర్థులకు భయం పట్టుకుని ప్రజలమధ్యకు పోవడానికి చాలాకాలం వెనుకంజ వేయవలసి వచ్చింది.

బ్రిటిష్‌వారు భారత దేశం వదలి వెళ్ళిపోయిన తర్వాత హైదరాబాదు నిజాము తన రాజ్యం భారత దేశంలో విలీనం కావడానికి అంగీకరించలేదు. అలాటి పరిస్థితుల్లో నెహ్రూవారిస్తున్నా సరే ఏ మాత్రం భయపడక ప్రమాదకరమైన సరిహద్దు ప్రాంతాల్లో నిరాయుధుడుగా పర్యటించిన ఏకైక నాయకుడు ప్రకాశంగారు ఒక్కరే. భారత దేశంలో ఆయనలాటి వ్యక్తి మరొకరు ఉండే అవకాశమేలేదు.

ప్రజా పార్టీ

వయోజన ఓటింగు ప్రాతిపదికమీద 1952లో సాధారణ ఎన్నికలు జరిగినప్పుడు ప్రజాపార్టీ బేనర్ క్రింద ప్రకాశంగారు ప్రముఖపాత్ర వహించారు. ప్రత్యర్థి పార్టీలన్నిటినీ సంఘటిత పరచిన ఆ యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు ప్రకాశంగారు నాయకుడై మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసే అధికారం తనకువున్నదని నొక్కి చెప్పారు. ఇలాటి పరిస్థితుల్లో కాంగ్రెసు నాయకులు రాజగోపాలాచారిని యీ సమస్యను పరిష్కరించమన్నారు. మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి వీలుగా గవర్నరు శ్రీప్రకాశ రాజగోపాలాచారిని శాసన మండలి సభ్యుడిగా నామినేటు చేశారు.

శాసనసభ సంయుక్త సమావేశంలో గవర్నరు ప్రసంగించబోతున్నప్పుడు ప్రకాశంగారు నిర్భయంగా లేచినుంచుని, ప్రజాస్వామిక సూత్రాలను ధిక్కరించి ప్రవర్తిస్తున్నందుకు గవర్నరుకు కంచుకంఠంతో తన నిరసన తెలియజేసి తన అనుయాయులతో శాసన సభలోంచి బయటికి వెళ్ళిపోయారు. అప్పుడే ప్రకాశంగారి అదృష్టం వక్రించింది. డెమొక్రటిక్ ఫ్రంట్ విచ్ఛిన్నం అయిపోయింది. ఆయన ఒంటరివాడయిపోయారు. ఆ తర్వాత ఆయన ప్రవర్తనమీద సభవారు చర్చించి చివరకు ఆయనమీద గౌరవంకొద్దీ దాన్ని మళ్ళీ వదులుకున్నారు. కొంతకాలంపాటు ఆయనకు కాలం కలిసి రాలేదు. తప్పు మార్గంలోనే ప్రయాణించి వుండొచ్చు. అయితే ఆ తప్పిదం ప్రమాదకరమైనదికాదు. మోర్లే విషయంలో గార్డినర్ చెప్పినట్టు అది తప్పుదారి కానేకాదు. ప్రకాశంగారి విజయాలు తరచుగా ఆయనకు బాధల్నే కొనితెస్తున్నాయి. ఆనందాన్నీ, దుఃఖాన్నీ కూడా చిరునవ్వుతోనే భరించేవారాయన. వీరయోధుడిగా ఆయనకు జయాపజయాలు సమానమే.

కర్నూల్లో రాజధాని

ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు నాందిగా ఎవరో ఒకరు సూత్రధారుడు కావాలి. అలా కాగలవారు ప్రకాశంగారు తప్ప మరెవరున్నారు? తను కోస్తా ప్రాంతానికి చెందినవాడైనా రాయలసీమ ప్రాంతాలవారి అపోహలను తొలగించే వుద్దేశంలో రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా కర్నూలును రాజధానిగా చేయడానికే ఆయన ఉద్దేశించారు. ప్రధాని నెహ్రూజీ కూడా ప్రజాభిప్రాయాన్ని మన్నించి నట్టుగా ఆంధ్ర ప్రజల హర్షధ్వానాల మధ్య ఎనభైఏళ్ళ

ప్రకాశంగారిని ముఖ్య మంత్రిని చేశారు. ప్రకాశంగారు ఆంధ్ర రాష్ట్రంలో అగ్రగణ్యులైన వీరయోధుడే గాక రాష్ట్ర రథ సారధి కూడా అయ్యారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ఖైదీలనందరినీ విడుదల చేశారు. గుంటూరులో హైకోర్టును నెలకొల్పారు. తిరుపతిలో విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కృష్ణా-పెన్నా ప్రాజెక్టును ధైర్యంగా త్రోసిరాజని బ్రహ్మాండమైన నాగార్జునసాగర్ పథకాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి రాకుండానే కృష్ణా బరాజ్ నిర్మాణం ప్రారంభించారు.

మద్యపాన నిషేధం సమస్యపై ఆయన మంత్రి వర్గం పడిపోయాక రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. గోపాల రెడ్డి నాయకుడుగా యునైటెడ్ కాంగ్రెసుకు అధిక మెజారిటీ లభించింది. అనారోగ్యం, వయోభారం పైబడి నప్పటికీ, తాను చిన్నప్పుడే వదిలి వెళ్ళిపోయిన తన స్వస్థలమైన ఒంగోలు నియోజక వర్గంనుంచి పోటీచేసి అంత వరకు కమ్యూనిష్టులకు దక్కుతూ వస్తోన్న ఆ సీటును తను చేజిక్కించుకున్నారు. హైదరాబాదు ఆంధ్రరాష్ట్రాలు విలీనమై ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయినప్పుడు శ్రీ సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఏ కాలంలో నైనా సరే చరిత్రను సృష్టించే వ్యక్తులు అరుదుగానే వుంటారు. ఆ అరుదు వ్యక్తులు కూడా తోటి ప్రజల మేలుకోరిన మనుష్యులు సత్పురుషులూ గొప్పవారూ మరీ తక్కువగా వేళ్ళమీద లెక్కపెట్టేటట్టు వుంటారు. అటువంటి వారికే తమ ఉన్నత ఆశయాలు ఫలప్రదమైన సత్ఫలితాల్ని యిస్తూవుంటే చూసే అదృష్టం లభిస్తుంది. వర్తమాన చరిత్రలో అట్టి మహద్భాగ్యం లభించిన వ్యక్తి ప్రకాశంగారు.

డబ్బంటే మోజులేదు

మానవత్వం మూర్తీభవించిన వ్యక్తి ప్రకాశంగారు. జాలి, దయతో తడిసిన సున్నిత హృదయం ఆయనది. సోదరులన్నా సోదరీమణులన్నా అభిమానం మెండు. తనను యింతవాణ్ణి చేసిన హనుమంతరావు నాయుడుగారికి ఆయన ఎప్పుడూ కృతజ్ఞుడిగానే వున్నారు. వారి కుటుంబాన్ని అనేక సందర్భాలలో ఆదుకున్నారు. తన దగ్గర డబ్బు వున్నప్పుడు. అది తన దైనా యితరుల దైనాసరే డబ్బు కావాలని ఏ వ్యక్తి అయినా వచ్చి అడిగితే వెంటనే మరో ఆలోచన లేకుండా యిచ్చేవారు. దారిద్ర్యంలో పుట్టి, దరిద్ర దేవత ఇనుప పిడికిలిలో యిరుక్కుని అష్టకష్టాలు పడినా, తరువాత తర్వాత ఐశ్వర్యం వచ్చి భోగభాగ్యాలతో తులతూగినా ఎప్పుడూ ఆయన డబ్బుకి అంటి పెట్టుకొని వుండలేదు. డబ్బంటే మోజు పడలేదు. సామాన్యుల్లో ఒకడిగా కలిసిపోయి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకొనే మనిషి ప్రకాశంగారు.

1942 లో ప్రకాశం గారి భార్య హనుమాయమ్మగారు— ఆయన కంటే ముందే మరణించింది. ప్రకాశం గారిలో రాజఠీవి ఉట్టిపడుతుండేది. ప్రాచీన రోమను నాయకుల వలె ప్రతి సభలోనూ ఆయనే ప్రధాన పాత్రవహిస్తూ అందరికంటే మిన్నగా కనిపిస్తుండేవాడు. ఎవరైనా ఆయన మీదికి కయ్యానికి వెళ్ళితే-తగరు కొండను ఢీకొనబోయినట్లుండేది. ఆయన దేశభక్తి, సిద్ధాంత అవధులు లేనిది. కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడే స్వభావంతో ఎత్తిపొడుపులు, నిందలు లేకుండా నిరాడంబరంగా మాట్లాడేవాడు. ఆయన ఆలోచనలకు రహస్యమనేది ఏమీ లేదు. చెప్పేదానికీ చేసేదానికీ తేడాకూడా వుండేదికాదు. అందువల్లనే ఆయన్ను అందరూ ఆరాధించేవారు. ఆయన మీదికి దూకుడుగా వెళ్ళేవారు కారు. ఆయన ఎప్పుడూ ఉదారంగా ఉన్నతంగానే ఆలోచించేవాడు. తన భావాలను ఆచరణలో పెట్టడంలో కూడా అంత ఉన్నతంగానే పనిచేసేవాడు. ఆయన ఎప్పుడూ వెనుకంజ వేసినవాడు కాదు-మడమత్రిప్పని ఆంధ్ర వీరుడాయన. రొమ్ము విరుచు కుంటూ ముందుకు దూకడమే ఆయన సహజ ప్రవృత్తి.

ప్రకాశంగారు ప్రతివారితో కలిసి మెలిసి మాటాడే స్వభావం కలవారు. సార్వజనీన దృక్పథంకలవారు కాలం తాకిడికి తట్టుకుని నిలిచిన సంప్రదాయపు విలువలను ఆయన హర్షించేవాడు. విలియం బేకన్‌లాగా ప్రకాశంగారికి కూడా మతమంటే రాజకీయాలు-రాజకీయాలంటే సౌభ్రాతృత్వం. పనిచేయడం అంటే దైవపూజ అంతగా ప్రాధాన్యం యిచ్చేవాడు. ఆయన దృష్టిలో మతమంటే, ధైర్యసాహసాలు. అంతేగాని విధిపై విశ్వాసంతో మనమెంతలే అనే నిర్వీర్యత, నిస్సహాయత కాదు. ఆయన తన స్వీయ చరిత్రకు "నా జీవిత యాత్ర" అని సార్థకంగా పేరుపెట్టుకున్నారు. ఆయనకు మత మంటే యిష్టమే. కాని మూఢభక్తి, తత్త్వదర్శన ఆయనకు గిట్టవు. 70 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత ఆయన సంస్కృతభాష అభ్యసించి "ప్రస్థానత్రయం" మీద ప్రజోపయోగకరంగా వ్యాఖ్యానం రాశారు. విరామమెరుగని వైవిధ్యంతో కూడిన ఆయన జీవితంలో—ఆధ్యాత్మిక చింతనతో కూడిన యీ కాలమే బహుశః ఆయనకు నిజమైన సుఖప్రసాది అయివుంటుంది. ఆయనకు దైవంలో విశ్వాసం వుండేది. అదృష్ట సంఘటనలలో నమ్మకమూ వుండేది.

ప్రకాశంగారి చివరి దశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు నెలకు 750 రూపాయల అలవెన్సు మంజూరు చేయడమే కాక ఆయనకు ఒక కారు కూడా యిచ్చింది. దేశం కోసం తన సర్వస్వాన్ని అర్పించిన ఆ మహానుభావుడికి ఆ విధంగా ప్రభుత్వం తన కృతజ్ఞతలు అర్పించుకున్నది. ఆయన సేవలకు గుర్తింపు కలగడానికి రహస్యం ఏమంటే అప్పటికీ ఆయన పేరే సమ్మోహనాస్త్రంగా పనిచేస్తుండేది. ఆయన తుది రోజుల్లో-ఉత్తరాయణ పుణ్యకాలం కోసం అంపశయ్యమీద వేచియున్న కురువృద్ధ భీష్ముని వలె ఆయన కాలం గడిపారు. ఎంతపేరు ప్రతిష్ఠలు గడించినా చావు తప్పదు గదా. 1957 మే 20వ తేదీన హైదరాబాదులో ఆయన కన్నుమూశారు. మర్త్యత్వం వదలి అమరుడైనాడు. ఆయనను సమస్త ప్రభుత్వ లాంఛనాలతో దహనం చేశారు. శ్మశానానికి ఊరేగింపులో ప్రజాసమూహమూ, పెద్దపెద్ద అధికారులూ తమ హృదయమే బద్దలైనట్లుగా కన్నీరు కారుస్తూ తమ ప్రియతమ నాయకునకు శ్రద్ధాంజలి సమర్పించారు. ఊరేగింపు దాదాపు మైలు పొడవున సాగిపోయింది. చనిపోయిన ఆశవం

(మిగతా 23వ పేజీలో)

రాక్షసత్వం నుంచి మానవత్వంలోకి

✻ శశికాంత్ శాతకర్ణి

భారత దేశంలో కొందరు ఆవేశపరులు......
ఆవేశం అగ్నికి మూర్ఖత్వం ఆజ్యం తోడైనవాళ్ళు
వివేచన, విచక్షణ-అనే రెండు కళ్ళనూ పొడిచేసుకున్నవాళ్ళు
తమ తలిదండ్రుల, చెల్లెళ్ళ తమ్ముళ్ళ తలలు నరికి
నరికిన తలల్ని దండలుగా గుచ్చి, ఆ దండల్ని మెళ్ళో వేసుకొని
పట్టపగలు నడిబజార్లలో సంచరిస్తూ
భయంకర వాతావరణాన్ని సృష్టిస్తూన్న
అత్యంత అమానుష సమయంలో......

మిలాయ్‌లో, నాంపెన్‌లో
వియత్నాంలో, కాంబోడియాలో
అమెరికా కంసులు ఆడ శవాలకోసం వెదుకుతూ
తాము కాల్చి చంపిన ప్రజల శవాలను
గుట్టలు గుట్టలుగా పేరుస్తున్న
అత్యంత జుగుప్సాకర వేళలో...

సమాన హక్కులు కావాలన్న నీగ్రో తమ్ముని వంటి
అనేకమంది యువకుల హృదయాలు వేయి వ్రక్కలుగా
చేయబడుతున్న అత్యంత భీతావహ దుర్ముహూర్తాన...

నా సౌఖ్యం కోసం
ఇతరుల జీవితాలనే బలిపెడుతున్న,
నా ఆకలిని తీర్చుకొందుకు నా అవయవాలనే
నరుక్కొని తింటూన్న అనూహ్య క్షణాన
నన్ను నేను దూరంగా
దుర్గమారణ్యాల్లోకి విసిరేసుకున్నా ...

మహత్తర సంగీతవేత్త జీవితపు సితారాపై
ఆనంద హిందోళను పలికించ గలిగినపుడు
యువకవి తన కవితల అగ్గిపుల్లతో
ప్రజల హృదయాలను మండించ గలిగి నపుడు
మహానాయకుడు వర్గాలులేని సమాజానికి
రూపకల్పనచేసి సాధించ గలిగి నపుడు
వియత్నాం కాంబోడియా దేశాకాశాలపై
అమెరికన్ బాంబర్లు, జెట్లు జట్లుగా ఎగరడం మానివేసినపుడు
మిలాయ్, నాంపెన్ నగరాలు
భయాందోళనలు మరచిపోయిన
ఆనందమూర్తులైన మనుష్యులతో హసత్ రేఖలుగా మారినపుడు
నీగ్రో తమ్ముని హృదయం పోయమై
సంతోష సాగరాన సంచరించినపుడు
ఆ ఏకైక మహత్తర సుముహూర్తాన
విసిరేసుకున్న 'నన్ను' నేను చేరుకుంటా !



పరిశ్రమల్లోని కార్మికుల విరామకాల వినియోగం

రావిపాటి మహానంద

వ్యక్తులకు సమోన్నత జీవితావకాశాన్ని కల్పించటమే ప్రజాస్వామ్యానికి పరమధ్యేయం మంచి జీవితం అంటే ఏమిటని నిర్వచించడంలో భిన్నాభిప్రాయాలుంటే వుండవచ్చును. కాని మంచి జీవితమంటే వ్యక్తుల ముఖ్యమైన ఆర్థికావసరాలు తీరటం. నిరంతర బాధలనుంచి విముక్తి కలిగించి వారిలోని సృజనశక్తుల వికాసానికి అవకాశం కలిగించేదిగా వుండటం అనడంలో సందేహం లేదు. ప్రజాస్వామ్యపు పరమధ్యేయాన్ని గురించి మాట్లాడుతూ పూజ్య పండిత నెహ్రూ "మంచి జీవిత మంటే వ్యక్తుల ముఖ్యమైన ఆర్థికావసరాలు తీరడం, తద్వారా నిరంతర బాధల నుంచి వారికి విముక్తి గలగడం "అన్నారు. నిత్య జీవితావసరాల నిమిత్తం తన ఆర్థికమైన జీవిత సమస్యల తొలగించు కొనుటకు ఒకొక్కరు ఒక్కొక వృత్తి చేపడుతుంటారు. ఆవిధంగా అవలబించడం ప్రకృతి ధర్మం. వృత్తి అవలంబించి నిత్య జీవితావసరాలు తీర్చుకోవడం తోటే మానవుడు వూరుకోడు. తన మానసిక వికాసానికి, ఆనందం కొరకు శారీరక సౌఖ్యం కొరకు తీరిక సమయాల్లో యితర కార్యక్రమాన్ని చేపట్టుతుంటాడు. మనగ్రామాల్లోని రైతులు, కూలీలు కష్టించి చెమటోడ్చు తున్న సమయాల్లో వినోదాన్ని విశ్రాంతిని అనుభవించడానికి పాటలు పాడుతుంటారు. కళ్ళములో పనిచేయునపుడు నాట్లు వేయునపుడు కోతల సమయాల్లో గింజలు దంచునపుడు రకరకాల ఎంకిపాటలు, ఈల పాటలు, వదిన మీదిపాటలు, ముద్దులగుమ్మ పాటలు శ్రమను మరపించు ధోరణిలో పాడుతుంటారు.

ప్రతిదేశంలోను పారిశ్రామిక కార్మికుల పనికాలాన్ని పరిమితం చేసే చట్టాలున్నాయి. మనదేశంలో పరిశ్రమల్లో కార్మికుడి చేత రోజుకు ఎనిమిది గంటలకు మించి పనిచేయించడానికి వీలులేదు వరుసగా ఆరురోజులుచేస్తే ఏడోరోజున విరామంయివ్వాలి. సంత్సరం కాలంలో వరుసగా 240 రోజులు పనిచేసిన కార్మికుడికి సంవత్సరంలో ప్రతి 20 రోజులకు ఒకరోజు చొప్పున సెలవు దొరకుతుంది. ఇవన్నీ చట్టంలో కార్మికుడికి యిచ్చిన వసతులు, హక్కులు.

శాస్త్ర విజ్ఞానము పురోగమించిన కొలది పరిశ్రమల వుత్పత్తి సాధనాల్లోను విధానాల్లోను విప్లవాత్మకమైన మార్పులు అనేకం వచ్చాయి. తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో అధికంగా ఉత్పత్తి చేయటం సాధ్యమైంది. ఉత్పత్తి సాధనాలు సమర్థవంతమై మానవ శ్రమకు, కాలాన్ని పొదుపు చేసేందుకు సహాయ పడుతున్నాయి. ఫలితంగా పరిశ్రమ వుత్పాదకశక్తి పెరిగి వుత్పత్తి వ్యయం తగ్గింది. కార్మికులకు అధిక వేతనాలతోపాటు యితోధికంగా విరామ కాలాన్ని కల్పించడం యిప్పుడు సాధ్యమైనది. సాంకేతిక విజ్ఞానంతోపాటు మానవ తత్వ విజ్ఞానం కూడా యీ గడచిన 3, 4 దశాబ్దాలలో బ్రహ్మాండమైన పురోగమనం సాధించింది. ముఖ్యంగా మనస్తత్వ విజ్ఞానం వల్ల మానవ ప్రకృతిగురించిన విషయాల్లో మనస్తత్వ శాస్త్రజ్ఞులు పారిశ్రామిక రంగంలో ఎన్నో పరిశోధనలు జరిపి కార్మికుల మానసిక వాతవరణాన్ని గురించి మనస్తత్వపు తీరును గురించి అనేక క్రొత్త విషయాలు గ్రహింపగలిగారు. వీరి పరిశోధనలన్నీ గూడా పరిశ్రమల్లో కార్మికులకు తగిన సమయానికి తగిన మేరకు విరామం కల్పించవలసిన అవసరాన్ని ఉద్ఘాటిస్తున్నవి. అలా విరామం కల్పించడం అధికోత్పత్తికి చాలా అవసరం అని కూడా యీ పరిశోధనలు నిరూపించాయి.

ప్రాణం లేని యంత్రాలు కూడా మధ్య మధ్య విరామం యివ్వకపోతే చక్కగా పనిచేయవు. ఈ విరామంలో అరిగిపోయిన భాగాలను బాగు చేయాలి. అవసరమైన మరమ్మతులు చేయాలి. తెరపి లేకుండా పని చేస్తుంటే యంత్రాల ఆయుర్దాయం క్షీణిస్తుంది. పని చేసినకొద్దీ కాలం కూడా అవి వాటి శక్తి మేరకు పనిచేయవు. మనుష్యుల సంగతి కూడా అంతే.

విరామం ఎందుకు?

విరామ కాలాన్ని ఎలా వినియోగించు కోవాలి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేముందు, అసలు విరామం ఎందుకు అన్న ప్రశ్నకు సమాధానం తెలియాలి. సేద తీర్చుకోవడానికి విరామం అవసరం. అలసిన అంగాలు కోలుకోవటానికి విరామం అవసరం. క్షీణించిన శక్తిని పుంజు కోవడానికి విరామం అవసరం. మనిషి ఎటువంటి వాడైనా అతను చేస్తూన్న పని ఎటువంటిదైనా కొంత కాలం పనిచేసిన తరువాత అతనిలో కొంత స్తబ్ధత ప్రవేశిస్తుంది. దీనిని తొలగించుకొని మళ్ళ మనసును ఉత్తేజం చేసుకోవటానికి విరామం అవసరం.

ఇవన్నీ మన కందరికి తెలిసిన విషయాలే. విరామ కాలం నుంచి ఈ ప్రయోజనాలను అందరం కూడా అంతో యింతో పొందుతూనే వున్నాం. ఐతే సామాన్యంగా మనకు తోచని ప్రయోజనం మరొకటి కూడా యున్నది. దీనిని మట్టుకు పూర్తిగా పొందేందుకు మనలో చాలా మంది ప్రయత్నం చేయటం లేదని ఒప్పుకోవాలి. విరామాన్ని, వికాసానికీ, వ్యక్తిగత అభివృద్ధికి

కూడా వినియోగించు కోవడం నేర్చుకోవాలి. డబ్బులు పోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు. కోల్పోయిన ఆరోగ్యం కూడా వైద్య సహాయంతో మళ్ళీ పొందవచ్చు. గడచి పోయిన కాలాన్ని మాత్రము మనం ఏ విధంగాను తిరిగి తెచ్చుకోలేము. ఈ నిజం మనకు తెలియనిది కాదు. పని చేసేటప్పుడు కాలం విలువ గుర్తించి కాలం వృథా చేయకుండా, చాలా జాగ్రత్త పడుతూంటాము. విరామ సమయంలో మాత్రము ఈ విషయాన్ని చాలా మంది మర్చిపోతుంటారు. ఇందుకుకారణం లేకపోలేదు. మనం పని చేసే కాలానికి డబ్బుల విలువ వున్నది. ఇది ప్రత్యక్షముగా మనకందరికి కనబడుతూనే ఉంటుంది. విరామ కాలానికి అటువంటి విలువను డబ్బు రూపంలో లెక్కకట్టడం యింకా మనకు చేతకాలేదు. కాని కార్మికుడికి పనిచేస్తున్న కాలం ఎంత ముఖ్యమో విరామం కూడా అంతేముఖ్యం. విరామ కాలాన్ని ప్రయోజనకరంగా తన శక్తి సామర్థ్యాలను వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నిస్తే దాని వల్ల ఫలితం పనిలో కూడా కన్పిస్తుంది. వృత్తిలో పురోగమించేందుకు సహాయం చేస్తుంది.

విరామ కాలంలో సేద తీర్చుకోవడం, కోల్పోయిన శక్తి పుంజుకోవడం యివి మన ప్రయత్నం లేకుండానే జరిగే పనులు. వీటిని గురించి ఎక్కువగా చెప్పే అవసరం లేదు. పోతే విరామ కాలాన్ని సృజనాత్మకంగా, ప్రయోజనకరంగా వినియోగించటానికి మాత్రం మనః పూర్వక ప్రయత్నం అవసరం. దీనిని గురించి ఆలోచిద్దాము. జిహ్వకొక రుచి అన్నారు. అట్లాగే ప్రతిమనిషికి వేర్వేరు అభిరుచులుంటాయి. ప్రత్యేకమైన ఆశలు, ఆశయాలు, ఉంటుంటాయి. వీటిని సాధించుకొని సఫలం చేసుకోవటం వలన మానవుని వ్యక్తిత్వానికి పరిపూర్ణత వస్తుంది. అభివృద్ధి సిద్ధిస్తుంది. విరామ కాలాన్ని యీ ప్రయోజనానికే వినియోగించుకోవడం నేర్చుకుంటే కార్మికుడికి సర్వతో ముఖాభివృద్ధి లభిస్తుంది.

మానవ మనస్తత్వ విజ్ఞానం వెల్లడిచేసిన క్రొత్తవిషయాల ఫలితంగా తమ కార్మికుల పట్ల పరిశ్రమల యాజమాన్యం దృక్పథంలో చాలా మార్పు వచ్చినది. కార్మికుడి కాలంలో తమకు హక్కు వున్నది కొంత భాగం మీదనే అయినా, తమకు పని చేస్తున్న ఆ కొద్ది సేపట్లో కార్మికుడు ఎలాటి పనిచేసేది, ఎలావ్యవహరించేది, ఎంత సమర్థవంతంగా ఉండేది, మిగిలిన కాలంలో అతను వుండే పరిసరాల ప్రభావం మీద ఆధారపడి ఉంటుందని యిప్పుడు యాజమాన్యం గుర్తించింది. ఈ గుర్తింపుతో అతని జీవితాన్ని సుఖవంతం చేసేందుకు అతని జీవిత సమస్యలను వీలైనంత వరకు తగ్గించేందుకు యాజమాన్యం నిరంతరం కృషి చేస్తున్నది. యింకా చేయాలి. ఈ పరిణామం పాశ్చాత్య దేశాలలో కనిపించినంత స్పష్టంగా మన దేశంలో కన్పించవని మాట వాస్తవం. ఇందుకు కారణం మన దేశంలో పరిశ్రమలు ఏ కొద్దో తప్ప పాశ్చాత్య దేశాల పరిశ్రమల ఆర్థిక స్థాయిని వాటికున్న ఆర్థిక స్తోమతను సంపాదించుకోలేదు. కార్మిక సంక్షేమ పథకాలను విస్తార స్థాయిలో చేపట్టగల స్థితికి రాలేదు. మన పరిశ్రమలు ఈ స్థితికి వచ్చేందుకు యింకా కొంత కాలం పట్టవచ్చు కాని ప్రస్తుతం నడుపు పరిశ్రమల్లోని కార్మికుల స్థితి కొంత మెరుగు. వారొక స్థాయిని చేరుకున్నారు. ఈ విషయంలో ఉదాసీనత పారిశ్రామిక ప్రగతికి, అధికోత్పత్తి సాధన ప్రయత్నాలకు హానికరము.

వినోద అవకాశాలు

తమంతటతాము తమకు కావలసిన వసతులు కల్పించుకోగల శక్తి కార్మికులకు లేదు. వేతనాల పెరుగుదల ఎంత వున్నా పెరుగుతున్న ధరలలో అది మునిగిపోతోంది. జీవితావసరాలే సమకూర్చుకునే శక్తిలేని కార్మికుడు విలాసాలమాటేమి ఆలోచిస్తాడు ? ఈ నాడు కార్మికుడి జీవితంలో తిండి బట్ట తప్ప మిగిలిన అవసరాలు అన్నీకూడ విలాసాలుగానే పరిణమించాయి. అమెరికా, జర్మనీ, ఇంగ్లాండు దేశాల్లో కార్మికుల వినోదవికాసాలకు దోహదంచేసే కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రభుత్వాలు, యజమానులు, కార్మిక సంఘాలు కృషి చేయుచున్నవి. కార్మికుడి స్థాయినిబట్టి అక్కడ సంవత్సరానికి 15 రోజులనుంచి నెలదాకా జీతంతో శెలవు దొరుకుతుంది. ఈ సెలవును గడిపేందుకు వినోద, వాహ్యాళి స్థలాలున్నవి. ఈ స్థలాల నిర్వహణ ఖర్చును యజమానులు పూర్తిగా భరిసున్నారు. ఇవిగాక, క్లబ్బులు ఆట కేంద్రాలు, సాంస్కృతిక కార్యక్రమ కేంద్రాలు, రేడియో గోష్ఠులు ఇలాటివెన్నో వసతులుకూడా అక్కడి ప్రయివేటు యజమానులు కల్పిస్తున్నారు. వ్యక్తి వికాసానికి, విజ్ఞానం అభివృద్ధి చేసుకునేందుకు రాత్రి పాఠశాలలు, వృత్తివిద్యా కళాశాలలు, అక్కడి పరిశ్రమలు నిర్వహిస్తున్నవి. కార్మికుడి మానవత్వాన్ని గుర్తించి మానవత్వపు అవసరాలను తీర్చేందుకు పాశ్చాత్య దేశాలలో విస్తారంగా, నిరంతర ప్రయత్నం సాగుతోంది. పరిశ్రమలన్నీ ప్రభుత్వ స్వాధీనంలోవున్న కమ్యూనిస్టు దేశాలలో, ఈ వసతులన్నీ ప్రభుత్వపరంగా ఏర్పాటవుతున్నాయి. పాశ్చాత్య దేశాలలో కార్మికుడే గాదు అతని కుటుంబానికికూడా వినోద అవకాశాలు లభిస్తున్నాయి.

విజ్ఞానాభివృద్ధి

మన దేశంలోకూడా ఇంత విస్తారంగా యిటువంటి సౌకర్యాలు ఏర్పడేందుకు కొన్ని రోజులు పడతాయి. మరి అంతవరకు ఎలా ? ఆ రోజు వచ్చేవరకు కార్మికుడు తన వికాసానికి స్వశక్తితో ప్రయత్నం చేయాలి. మానవజీవితంలో వినోదానికి అవసరం లేకపోలేదు. వ్యక్తి పరిపూర్ణతకు వినోద కార్యక్రమాలు తోడ్పడవనడం కూడా ఉద్దేశంకాదు. అయితే విరామ కాలాన్నంతా వినోదానికే ఖర్చు పెట్టడం మంచిది కాదు. విరామ కాలాన్ని మనో వికాసానికి, విజ్ఞానాభివృద్ధికికూడా వినియోగించుకోవడం విజ్ఞతకు చిహ్నం. దీనివల్ల కార్మికుడికి వృత్తిలో పురోభివృద్ధి సిద్ధిస్తుంది. సంపాదనా శక్తి పెరుగుతుంది. జీవితం సౌఖ్యవంతం అవుతుంది. విరామకాలంలో మనం కొత్త అభిరుచులు అలవరచుకొనవచ్చును. క్రొత్త రంగాలలో విజ్ఞానం సంపాదించుకోవచ్చును, సంపాదనా శక్తిని అభివృద్ధి చేసుకొనేందుకు క్రొత్త మార్గాలు సృష్టించుకోవచ్చు. తన వాడ, వూరు, బాగుపడేందుకు సంఘ సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి నిర్వహించవచ్చును. పని కాలంలో యజమానికి, తన సంస్థకు

ప్రయోజనం చేకూర్చే కార్మికుడు విరామ కాలంలో తన దేశానికి ప్రయోజనకారి కాగలడు.

కార్మికుడికి నాల్గు రకాల బాధ్యతలున్నవి. మొదటిది తన పట్ల, రెండవది తన కుటుంబంపట్ల, మూడవది తను పని చేస్తున్న సంస్థపట్ల, నాల్గవది దేశంపట్ల. సంస్థ, దేశం పచ్చగా వుంటేనే కార్మికుడికి భృతి పురోభివృద్ధి. ఈ బాధ్యతలను ఏ లోటు లేకుండ తీర్చడం కార్మికుడి కర్తవ్యం. అందుకు అతను తన సంపాదన శక్తిని పెంచుకోవాలి. ఉత్పాదన శక్తిని అభివృద్ధి చేసుకోవాలి. విజ్ఞానం పెంచుకోవాలి. వీటి సాధనకోసం కాక పోతే విరామకాలాన్ని కార్మికుడు ఇంకేవిధంగా ప్రయోజనకరం చేసుకోగలడు? ఇతర దేశాల్లోని కార్మికుడు యింటికిరాగానే తన బాధలు మరచిపోయే పరిస్థితుల వాతావరణం కనిపిస్తుంది అతనికి. కాని మన దేశంలో మురికివాడల దుర్వాసనమధ్య ప్రపంచ జ్ఞానం కొరవడిన బిక్క మొఖంతో భార్య ప్రతిదీ భర్తకు భారంగా చేస్తుంది. తెలివిగల కార్మికులు తమకున్నదానితో తృప్తిపడి కాపురాలు చల్లగా గడుపుతూ తమ పెరటిలో కూరగాయలు పెంచుట, కోళ్ళ పెంపకం, పాడి బర్రెల పోషణతో తనవిరామ కాలాన్ని గడుపుతూ ఆర్థికంగా మనస్సుకు ఊరట కలిగించుకుంటూ ఇంటికి వచ్చేసరికి ఎదురు వచ్చే బోసినోటి తన పాపాయిలను కళకళలాడే ముఖంతో స్వాగతమిచ్చే యిల్లాలిని చూచి తన్నుతానే మరచిపోతాడు. కాని ప్రపంచ జ్ఞానంలేని, అనుకూల దాంపత్యం లేని కార్మికులు కొందరు త్రాగుడు, జూదము మొదలగు వ్యస నాలకు లోనై యిల్లు వొళ్లు గుల చేసుకొని ఎప్పుడూ యీసురో మంటూ సుఖమనేది లేకుండా ఉంటారు. అందుకే "యీసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయి" అని గురజాడ కవి చెప్పారు.

వీటన్నిటికీ యజమానులపై హెచ్చు బాధ్యత వున్నది. పల్లెల్లో ఒక సామెత వుంది: ఊరి సంగతి గోడలు, యింటి సంగతి యిల్లాలి నడక చెబుతుందని. అదేవిధంగా యజమానులు తమ కార్మికుల తీరుబాటు కాలము దుర్వినియోగం కాకుండా హెచ్చు శ్రద్ధ తీసుకోవాలి. వారి జ్ఞానాభివృద్ధికి, వినోదానికి, సచ్ఛీలతకు, ఆరోగ్యవంతమైన జీవనానికి, ఆదాయాన్ని పెంచుకోవడానికి మార్గాలు కల్పించాలి. ఎద్దు ఏడిచే సేద్యం—కోడలు ఏడిచే కాపురం ముందుకు రాదంటారు. అలానే సంతోషముతో విజ్ఞానవంతుడైన కార్మికుడు యజమానికి అధికోత్పత్తిలో ఎంతైనా తోడ్పడుతాడు.

అయితే కార్మికుడు ఈ అభివృద్ధి సాధించేందుకు కావలసిన బయట సహాయంకూడా ఎంతో ఉంది. ఈ సహాయం అందించేందుకు ప్రభుత్వం, కార్మిక సంఘాలు పూనుకోవాలి. కార్మిక చట్టాలను అమలు జరుపుతూ కార్మికుల సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం పెద్ద యంత్రాంగాన్ని సృష్టించి ఎంతో ధనం వెచ్చిస్తోంది. దీంతోపాటు కార్మికుల మనోవికాసానికి, పురోభివృద్ధికి కార్యక్రమాలు రూపొందించడం అవసరం. కార్మిక సంఘాలు కార్మికుల హక్కుల పోరాటంతో సమంగా, వారి అభివృద్ధి అవకాశాలు పెంచే ప్రయత్నానికి పూనుకోవాలి. యీ కృషిలో ప్రభుత్వం, యాజమాన్యంతో సహకరించాలి. పరిశ్రమలు ఈ లక్ష్యానికి కృషిచేయాలి. కార్మికుడికి ఈ అవకాశాలు కల్పించడం స్వార్థరాహిత్యం అనుకో నక్కరలేదు. వాటి ప్రయోజనం పరిశ్రమకు దేశానికి కూడా దక్కుతుంది. ★


జననం: నవంబరు, 14, 1889

నెహ్రూ వాణి

"స్వాతంత్ర్యం కేవలం ఒక రాజకీయ నిర్ణయం మీదనో, నూతన రాజ్యాంగం మీదనో, అంతకంటే ప్రధానమైన ఆర్థిక విధానం మీదనో ఆధారపడి వుండదు.

అది మనస్సుకి, హృదయానికి సంబంధించినది.

ఎక్కడ మనస్సు కలుషితమై, సంకుచితమై వుంటుందో, హృదయం ఆగ్రహ ద్వేషాలకు ఆటపట్టు అవుతుందో, అక్కడ స్వాతంత్ర్యం వుండదు."



మరణం: మే, 27, 1964

12–4

ఆంధ్ర చిత్రలేఖన చరిత్ర



ఉప్పూరి గోపాలకృష్ణ

భారత దేశ కళాచరిత్రలో తెలుగువారి కళాసంపదను గురించి ప్రత్యేక అధ్యాయమే రాయగలిగిన అవకాశం ఉంది. అయినా తగిన పరిశోధన సక్రమంగానూ, విరివిగానూ జరగని కారణం చేత అనేకమైన ముఖ్యాంశాలు ఇంకా అజ్ఞాతంగానే వుండి పోయాయి. ఇటీవలనే ఈ పరిస్థితి కొద్దికొద్దిగా మార్పు చెందుతున్నది.

మన రాష్ట్రంలో అనేక దేవాలయాలూ, కళా కేంద్రాలూ ఉన్నాయి. ఐతే, మన పరిశోధకుల దృష్టిని ఆకర్షించి ప్రచురణకు నోచుకొన్నవి చాలా తక్కువ. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖ గణనీయమైన కృషి చేస్తున్నప్పటికీ ప్రజాసహకారం లేనందువల్ల తగినంత లాభం ఉండటంలేదు. కళా చరిత్రను నిర్మించడానికి ముఖ్యాధారాలయిన కళా ఖండాలు ఎన్నో దొంగిలింపబడటం, ధ్వంసం కావడం జరుగుతూ వుండడంచేత కళా చరిత్రకారుల కృషి, ఫలవంతం కావడంలేదు. ఈ పరిస్థితి త్వరలో చక్కబడుతుందని ఆశిద్దాం. ఇలాంటి విషయాలలో ప్రజలు తగినంత శ్రద్ధతీసుకొని తమతమ ప్రాంతాలలో కానవచ్చే పురాతన కళాఖండాల భద్రతకై కృషి చెయ్యడం అత్యవసరం.

ముఖ్యంగా మన కళాచరిత్రలో మనకి కొట్టవచ్చేటట్లు కనిపించేది అసమగ్రమైన చిత్రలేఖనా చరిత్ర. ప్రాచీన కాలంలో భారీ ఎత్తున చిత్రాలు, దేవాలయాలలో, గృహాలలో చిత్రించబడినట్లు ఆధారాలు కనిపిస్తున్నా మనకు లభ్యమైనవీ, తెలిసినవీ చాలా కొద్దిగా మాత్రమే వున్నాయి. ముఖ్యంగా మన పరిశోధకులు ఈ విషయంలో శ్రద్ధకనబరచడం చాలా ముఖ్యం.

విజయనగర సామ్రాజ్య స్థాపనకు పూర్వం చాలా రాజవంశాలు దక్షిణాపథంలో రాజ్యం చేశాయి. వీరందరిలోకీ ప్రథములూ, ప్రముఖులూ అయినవారు శాతవాహనులు. ఈ రాజవంశంవారు చరిత్రకారులచే ఆంధ్రులని వ్యవహరింపబడుతున్నారు. శాతవాహనులు బ్రాహ్మణ మతావలంబకులైనప్పటికీ బౌద్ధ సంప్రదాయానికి చెందిన అనేక కట్టడాలకు తమ ప్రోత్సాహాన్ని అందజేశారు. వీరి కాలంలోనే భారత కళా చరిత్రలో అత్యుత్తమమైన కళాఖండాల నిర్మాణం జరిగింది. కార్లా, బెడ్సా, కన్హేరీ మొదలయిన గుహాలయాలూ, అమరావతి, సాంచీ, నాగార్జునకొండ స్తూపాలూ నిర్మితాలయినాయి. అయితే ఈ ప్రాంతాలన్నిటిలోనూ శిల్పాలే ప్రముఖస్థాన మాక్రమిస్తాయి. ఈ కాలంనాటి వర్ణచిత్రాలను అజంతా గుహలలో పది, తొమ్మిది సంఖ్యగల గుహల్లో చూడవచ్చును. ఈ గుహల్లోని వర్ణచిత్రాలు చాలావరకు ధ్వంసమైనప్పటికీ మిగిలినవైనా ఆ నాటి చిత్రకారుల మహత్తర కళాశక్తికి నిదర్శనంగా కనపడుతున్నాయి. ఈ చిత్రాలలో ఒకచోట పరివారావృతుడయిన రాజు చిత్రం ఉంది. ఇందులో చిత్రకారుడు ప్రదర్శించిన హావభావాలు ప్రశంసనీయమైనవి. ఆంధ్ర చక్రవర్తులచే



లేపాక్షిలోని భిక్షాటన మూర్తి

నిర్మితాలయిన అమరావతి మొదలయిన స్తూపాలమీద శిల్పంలో విన్యసించబడిన మానవ, జంతు మూర్తులవలెనే ఈ అజంతా చిత్రాలలోకూడా శరీర నిర్మాణం అతి సహజంగా చిత్రించబడింది. ఈ చిత్రాలలో మానవ మూర్తులు ధరించిన అలంకరణలూ, శిరోజాలంకరణలూ, శిరోవేష్టనాలూ, దుస్తులూ అన్నీ మమ్మూర్తులా అమరావతీ శైలిని పోలివుంటాయి. సుప్రసిద్ధ పాశ్చాత్య



లేపాక్షిలో స్త్రీమూర్తి చిత్రం

కళావిమర్శకుడు బెంజమిన్ రౌలండ్ ఈ కాలంలో జరిగిన కళా సృష్టిని గురించి రాస్తూ "భారత కళ పెరిగి పుష్పించిన ప్రథమ కళాపుష్పం ఇది" అని చేసిన వర్ణన ఈ చిత్రాల విషయములో కూడా వర్తింపచేయడం అప్రస్తుతం కాదు. ఈ గుహల్లోనే మరో చోట చిత్రించబడిన చిత్రానికి బౌద్ధ జాతక కథ షడ్దంత జాతకం మూలాధారం. ఈ చిత్రంలో కాశీరాజైన బ్రహ్మదత్తుడూ, అతని రాణీ, పరివారమూ అత్యద్భుతంగా చిత్రించబడ్డారు. ఈ చిత్రాలను చూస్తుంటే వొక మహా నాటకాన్ని చూసిన భ్రాంతి కలుగుతుంది. ఈ చిత్రాలలో రాజుమొదలు, సామాన్య సేవకుని వరకూగల తరతమాలను చిత్రకారుడు అద్భుతంగా వ్యక్తీకరించాడు. ఆయా పాత్రల ముఖ కవళికలనూ, హస్త భంగిమలనూ చూస్తుంటే, ఆ కథలో జరుగుతూన్న సంభాషణలో మనం కూడా పాలుపంచుకొంటున్నట్లుగానే వుంటుంది. ఇదే శ్రేణిలోనే వున్న అరణ్య దృశ్యాలు అతి సహజంగా చిత్రితమైనాయి. ఈ చిత్రాలలో కానవచ్చే ఏనుగులగుంపు, ఆ గుంపుయొక్క సహజ గంభీర ప్రవర్తన చూస్తుంటే నిజంగా అడవుల్లో నిలబడి చూస్తున్నట్లుగా వుంటుంది. ఇందులో చిత్రకారుడి ప్రకృతి పరిశీలనాగుణం ఎంత నిశితమైనదో తెలుస్తోంది.

ఆంధ్ర శాతవాహనరాజ్య కాలం అంతరించిన తరువాత దేశంలో శాంతిభద్రతలు తక్కువై కళాసృష్టికి అంతరాయం కలిగింది. ఈ పరిస్థితి చాళుక్యులు అధికారంలోకి వచ్చినదాకా కొనసాగినట్లు కనిపిస్తున్నది. ఈ మధ్యలో ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు మొదలైనవారు చిన్న చిన్న రాజ్యాలను స్థాపించినప్పటికీ శాతవాహనుల కాలంలో జరిగినట్లుగా విస్తృత కళాసృష్టి జరిగినట్లు కనిపించడంలేదు ఈ కాలంలోని చిత్రకళా ఖండాలేవీ పరిశోధకుల దృష్టికి రాలేదు.

కల్యాణీ చాళుక్యుల కాలానికి చెందినవని భావింపబడుతూన్న చిత్రాలుకొన్ని ఇటీవలనే అల్లాదుర్గ్‌లో లభించాయి భూగర్భంలో ఉన్న ఈ చిత్రాలను ఆధునికశాస్త్రీయ విధానాలద్వారా మన రాష్ట్ర ప్రభుత్వ పురావస్తుశాఖ త్రవ్వి తీసి భద్రపరిచారు. వీటిని నేడు హైదరాబాదులోని పురావస్తుశాఖ మ్యూజియమ్‌లో చూడవచ్చు. గోడలమీద చిత్రించబడిన ఈ చిత్రాలను గోడలతో సహా తీసి భద్రపరచడం నిజంగా చెప్పుకోదగిన సాంకేతిక విజయం. ఇందుకు పురావస్తుశాఖను అభినందించాలి. ఈ చిత్రాలు శైవ మతానికి చెందినవి. ఒక చిత్రంలో నల్లని ఉడుపులను ధరించిన ఒక యోగి చిత్రం ఉన్నది. ఈ చిత్రంలోని వర్ణసమాహరణం, ప్రపంచంలోని ఏ ముఖ్య కళాఖండానికీ తీసిపోనిది. ఈ చిత్రంలోనే ఒక భాగంలో చిత్రితమైన హరిణ చిత్రం ఎంతో స్వాభావికంగా ఉంది. ఇందులో రేఖలను తీర్చడంలో చిత్రకారుడు ఎంత నేర్పరితనం చూపించాడో గ్రహించవచ్చు.

చాళుక్యుల తరవాత ఆంధ్రదేశాన్ని పరిపాలించిన కాకతీయుల కాలంలో గూడా చిత్రలేఖనం బాగా పోషింపబడినట్లు మనకు చాలా సాహిత్యపరమైన ఆధారాలు ఉన్నాయి కాని వస్తురూపంగా ఉన్న ఆధారం ఒకటే ఒక రాచకొండ దేవాలయంలో లభించింది. ఈ చిత్రం పరిమాణంలో చాలా చిన్నదైనప్పటికీ కళా చరిత్రలో దీనికి చాలా ప్రముఖస్థానమున్నది. ఈ చిత్రానికీ ఎల్లోరా గుహలలో ఇంద్రసభ పైకప్పులమీదవున్న చిత్రాలకీ శైలిలో కొంచెం దగ్గర పోలికలున్నాయి. కాకతీయుల కాలంనాటి శిల్పశైలితో చాలా సారూప్యత ఉండడం వలన దీనిని కాకతీయుల కాలపు చిత్రకళా శైలికి ప్రతినిధిగా మనం భావించవచ్చు. ఈ పోలిక ముఖ్యంగా

మానవ రూపవిన్యాసంలో కనిపిస్తుంది. అందువల్ల ఎల్లోరా చిత్రాల శైలి పరిణామమే రాచకొండ చిత్రశైలి అని అనిపించక తప్పదు. ఇది నిర్వివాదంగా విజయనగర కాలానికన్నా ముందుదని చెప్ప వచ్చును. అందువల్ల ఈ రాచకొండ చిత్రాన్ని కాకతీయ చిత్రకళా ప్రమాణంగా స్వీకరించి తరవాత కాలపు విజయనగర వర్ణచిత్రాలను పరిశీలించినట్లయితే అత్యద్భుతమైన అభివృద్ధి సాధింపబడినట్లు విదితమౌతుంది. కేవలం నిరాడంబరంగానూ సరలంకృతంగానూ ఉన్న రాచకొండ చిత్రానికీ, వర్ణోజ్వలంగా, ప్రతి అంగుళమూ అలంకరణలతో అతి శోభాయమానంగా చిత్రింపబడిన లేపాక్షి చిత్రాలకూ మధ్యలో జరిగిన ఎందరెందరో కళాకారుల మహత్తర కృషి ఇంకా అజ్ఞాతంగానే ఉండిపోవడం విషాదకరం.

లేపాక్షి చిత్రాలు

విజయనగర కాలానికి చెందిన లేపాక్షి దేవాలయం పైకప్పుల మీద చిత్రించబడిన చిత్రాలు అతి విస్తృతమైనవి. వైశాల్యంలోనూ, అతి విశిష్టస్థానం సంపాదించుకున్నాయి. ఈ చిత్రాలలో ముఖ్యంగా కానవచ్చే ప్రత్యేకత నేత్ర రచన. అర్ధముఖం చిత్రించే సమయాలలో ఒక పూర్తి నేత్రం, రెండవది సగం కనిపిస్తున్నట్లు చిత్రించబడి వుంటుంది. ఈ లక్షణం ఈ కాలాని కన్నా కొంచెం ముందుగానే—అనగా పన్నెండో శతాబ్దానికే గుజరాతు, రాజస్థాన్ ప్రాంతాలలో వెలిసిన జైన కల్ప సూత్ర గ్రంధాలలోని చిత్రాలలో కూడా కనిపిస్తుంది. ఐనప్పటికీ లేపాక్షి చిత్రాలలో ప్రత్యేకత లేక పోలేదు. కల్ప సూత్ర గ్రంధాలలోని చిత్రాలలో లాగా ముందుకు వచ్చిన రెండో కన్ను వికృతంగా కనిపించదు. ఒకటి రెండు చోట్ల వికృతంగా వున్నా అది శైలిలోని లోపంకాదు. లేపాక్షి మానవ మూర్తుల నేత్రాలు ఈజిప్టు పిరమిడ్లలో గల కుడ్యచిత్రాల లోని మానవ మూర్తుల నేత్రాలను ఎక్కువగా పోలివుండటం ఒక విశేషం. కొన్ని బెంగాలీ జానపద చిత్రాల (కాళీఘాట్) లోని నేత్రాలు భీభత్సాన్ని ప్రకటిస్తాయి. చిత్రంలోని ప్రధాన రసం భీభత్సం కాక పోయినప్పటికి ఇది తప్పదు కాని లేపాక్షి చిత్రాల లోని నేత్రాలు ప్రసన్నంగా గోచరిస్తాయి. భీభత్సాన్ని ప్రకటించ వలసిన చోట్ల నేత్ర రేఖలలోని కొద్ది మార్పులతో చక్కగా భావ ప్రకటన సూచించబడింది. కళల్లో నీరసత్వం అనేది మచ్చుకు కూడా కనపడదు. పూర్తిగా వికసించిన నేత్రాలు మొత్తం చిత్రానికే ప్రకాశాన్ని కలుగచేస్తాయి.

స్థూలంగా చూసినప్పుడు లేపాక్షి చిత్రాలు అన్నీ ఒకే శైలిలో చిత్రించ బడినట్లు అనిపించవచ్చు. కాని రెండు రకాల శైలులను సూక్ష్మ పరిశీలనలో గుర్తించవచ్చు. ఇందులో అర్ధమండపంలోనూ దేవాలయ అంతర్భాగంలోనూ ఉన్న చిత్రాలు దాదాపుగా ఒకే శైలివి. తరువాతి కాలంలో నిర్మించబడిన నాట్య మండపంలో రెండవ శైలి చిత్రాలు గోచరిస్తాయి. ఈ రెండు వేర్వేరు కాలాలకు చెందినవని చెప్పడానికి కొన్ని ఆధారాలున్నాయి. అర్ధ మండపంలో ఉన్న శిల్పాలంకృతమైన గోడ, పైకప్పు మీద చిత్రాలను రచించిన తర్వాతనే నిర్మించబడింది.

ఈ గోడ పైకప్పు బరువును వహించడానికి ఉద్దేశింపబడ లేదు. అందువల్ల గోడపై భాగానికి, కప్పుకీమధ్య కొన్ని అంగుళాల ఖాళీవున్నది. ఈ ఖాళీని ఇటీవల పురావస్తు శాఖవారు చిత్ర సంరక్షణకై మూసివేశారు. అయినా అతుకును చూడవచ్చు. ఈ ఖాళీలో గూడా కొన్ని చిత్ర శ్రేణులు గోడను దాటి గర్భ గృహం వైపుగా సాగిపోవడం చూడవచ్చును. అంటే నేడు గర్భ గృహంగా వ్యవహరింప బడుతున్న నిర్మాణం మొదటి దశలో నిర్మింపబడింది. తరువాత కాలంలో ఈ నిర్మాణానికి నాట్య మండపం చేర్చబడింది. గర్భ గృహానికి వెనుక వైపు—అనగా వినాయకుని విగ్రహంవైపు చిన్న వసారా ఒకటివుంది. ఈ వసారాలోని చిత్రాలు అసంపూర్ణంగా వదలివేయబడినై. ఈ చిత్రాల్ని పరిశీలిస్తే లేపాక్షి కళాకారులు అవలంబించిన సాంకేతిక వివరాలు తెలుస్తాయి. అంతేకాక, ఈ చిత్రాలూ, కళ్యాణమండపమూ కూడా సమకాలీనమైవుండాలి. తీవ్రమైన రాజకీయ కల్లోలాల వలన ఈ మహత్తర కళా కృషికి విఘ్నం ఏర్పడినట్లు భావించవచ్చు విరూపణ్ణ గాథ ఈ విషయాన్నే బలపరుస్తుంది. అందువల్ల అర్ధ మండపం చిత్రాలనూ, నాట్య మండపం చిత్రాలనూ రెండు విభిన్న కాలాలకు సంబంధించినవిగా తీసుకోవచ్చును. మొదటి దశలో గర్భ గృహంలోని చిత్రాలూ, అర్ధ మండపంలోని చిత్రాలూ చిత్రితమైనాయి. నాట్య మండపంలోని చిత్రాలు తరువాతి కాలానికి చెందినవి. గర్భ గృహానికి వెనుక నున్న వసారాలోని చిత్రాలు అంతిమ దశకు చెందినవి

అర్ధ మండపంలోని చిత్రాలలో వున్న ప్రధాన లక్షణం నిర్దుష్టత. అవయవ నిర్మాణం సంప్రదాయ బద్ధంగానూ నిర్దుష్టం గానూ వున్నది ముందుకు వచ్చిన రెండవ కన్ను సహజత్వానికి అనుగుణంగా వున్నది. దేవాలయంలో కాగడాలు, దీపాలు మొదలైనవి ఉపయోగించడం వల్ల ఈ అర్ధ మండపంలోని చిత్రాలన్నీ పొగచూరి పోయినవి. వీటిని శుభ్రపరచిన తర్వాత ఛాయా మాత్రంగా గోచరిస్తున్నవి. ఈ నాడు మనకు కనిపిస్తున్న రంగులు ఆభరణాల రేఖలకుపయోగించిన కావిరంగు, పసుపు, యెర్రజేగురు. పాలిపోయిన ఆకుపచ్చ రంగు వాడారు. నీలిమందు (ఇండిగో) నలుపు రంగుకై వాడారు. అర్ధ మండపంలోని చిత్రాలలో మరొక విశేషం రేఖలు. ఇక్కడి చిత్రాలను చిత్రించిన చిత్రకారుల ప్రతిభ మనలను ముగ్ధులనుచేస్తుంది. ఈచిత్రాలలోని రేఖలన్నీ అతివేగంగా ప్రవహిస్తాయి. ఆ విసురు ఆవేగము చూసిన తరువాత ఆ చిత్రాలన్నీ ఎంత తక్కువ కాలంలో చిత్రితమైనవా అని ఆశ్చర్యం కలుగుతుంది ఆ విసురుతోకూడిన రేఖలనుచూస్తే చైనా, జపాన్ చిత్రాలలోని రేఖలు జ్ఞాపకానికి వస్తాయి.

బహుశః దక్షిణాపథంలో అత్యంత ప్రాచీనతమమైన రూపచిత్రాలు లేపాక్షిలో కానవస్తాయి. దేవాలయ నిర్మాణానికి కారకులైన శ్రీ వీరణ్ణ, విరూపణ్ణల రూప చిత్రాలు గర్భగృహం లోను నాట్యమండపంలోనూ చిత్రించబడినవి. వీరణ్ణ, విరూపణ్ణను మనం చూడకపోయినప్పటికీ ఈ చిత్రాల ద్వారా ఆ వ్యక్తుల ప్రత్యేక లక్షణాలను మన మూహించుకో వచ్చును. పౌరాణిక కథా చిత్రాలలో నిర్లక్ష్యం చేయబడిన " రూపభేద '' మనే లక్షణాన్ని ఈ చిత్రకారులు పాటించారు. సగం మాసిన గడ్డం, శరీరచ్ఛాయలోని భేదం చూపించడానికి చిత్రకారుడు గణనీయమైన ప్రయత్నం చేశాడు. వస్త్రధారణలోని వైవిధ్యాన్ని, తరతమ భేదాల్నీ శైలికి భంగం లేకుండానే చిత్రించడం జరిగింది. వ్యక్తుల వయః పరిమితి మాత్రమేకాక ఉద్యోగపు అంతస్తులను సైతం దృశ్యమానం చేశారు. కాని యీ చిత్రాలు నాట్యమండపం పైకప్పున చిత్రించవలసి రావడం వలన కాబోలు అవయవ

నిర్మాణం సంప్రదాయ బద్ధంగా ఉన్నప్పటికీ నిర్దుష్టంగా మాత్రం లేదు. మానవ మూర్తులన్నీ ఒక పక్కకు వొరిగి నట్లుంటాయి. ఈ శ్రేణిలోని చిత్రాలలో ముఖాలలోని వైవిధ్యం గమనార్హమైనది. గర్భాలయంలో వీరభద్రుని ప్రక్కన నిలిచినట్లు చిత్రించ బడిన వీరణ్ణ, విరూపణ్ణల చిత్రాలు అన్ని విధాలా నాట్యమండపంలోని చిత్రాలనే పోలివున్నాయి. గర్భ గృహంలో ఎన్నో సుందరమైన చిత్రాలు వున్నప్పటికీ దీపాలు లేనందువల్ల ఎక్కువనుంది చూసే అవకాశం లేదు. అందువల్ల మొత్తం చిత్రసముదాయంలో విశిష్టస్థాన మాక్రమించిన ఈ చిత్రాలకు రావలసినంత ఖ్యాతి రాలేదు. ఈ చిత్రాలలో చిరుతపులి వేట చిత్రితమైన ఒక శ్రేణి ముఖ్యంగా చెప్పుకోదగినది. గర్భగృహపు పైకప్పుమీద వున్న బ్రహ్మాండమైన వీరభద్రుని చిత్రం ఆనాటి చిత్రకారుల సాంకేతిక నైపుణ్యాన్ని తెలియచేస్తుంది. దాదాపు ముప్పయి అడుగులు పొడుగు ఉన్న ఆ చిత్రం అత్యంత గంభీరమై ఆశ్చర్యాన్ని కొలుపుతుంది. బహుశా మొత్తం భారతదేశంలో ఇంత పెద్ద దేవతామూర్తి చిత్రం ఇదొక్కటేనేమో.

చిప్పగిరి దేవాలయం

చిప్పగిరి దేవాలయచిత్రాలు అన్నివిధాల లేపాక్షి చిత్రాలనే పోలివున్నాయి. ఇక్కడగూడా రాజకీయ ఉద్యోగుల చిత్రాలు ఉన్నాయి. దురదృష్టవశాత్తూ ఈ చిత్రాలలో చాలాభాగం నాశనమైనాయి. కొరుకొళ్ల, రాయచోటి మొదలైన దేవాలయాలలోవున్న చిత్రాలమీద సున్నంకొట్టి ధ్వంసం చేశారు.

లేపాక్షికి కొద్దిగా తరువాతి కాలానికి చెందిన సోమపాలెం దేవాలయ చిత్రాలు విజయనగర చిత్రలేఖనానికి పరాకాష్ఠ. ఇక్కడ కూడా దురదృష్టవశాత్తూ ఎన్నో చిత్రాలు నాశనమైనప్పటికీ, మిగిలిన కొద్దిచిత్రాలూ అత్యద్భుతంగా వున్నాయి. ఇక్కడి చిత్రాలకు వస్తువు రామాయణ గాథలనుంచి స్వీకరించారు. రేఖారచన అత్యుత్తమంగా వుంది ఇక్కడ నిమ్నోన్నతాలు సూచించడానికి అనుసరించిన వర్ణలేపనా విధానం చక్కగా వుంది. దేవతా మూర్తులకు కూడా విజయనగర కాలంనాటి దుస్తులను తొడిగారు. ఒక దృశ్యంలో యుద్ధానికి వెళుతున్న సైన్యం ఎంతో చక్కగా చిత్రించబడింది. ఇక్కడ Perpspective చూపించడానికి ప్రయత్నం జరిగింది. ఇంకొక చిత్రంలో మేఘాలు కాంగ్రా చిత్రాలను జ్ఞప్తికి తెస్తాయి. అసలు దేవాలయ నిర్మాణమే అత్యంత సుందరంగా జరిగింది. అసంపూర్ణంగా వున్నప్పటికీ, ఇంత సుందరమైన దేవాలయాన్ని ఆంధ్రదేశంలో నేనెక్కడా చూడలేదు.

ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖవారి ప్రదర్శనాలయంలో ఉన్న రామాయణం వ్రాతప్రతిలో విజయనగర కాలానికి చెందిన వర్ణచిత్రాలు ఉన్నాయి. గుడ్డమీద సన్నని కాగితా లంటించి దానిమీద చిత్రాలను చిత్రించారు. ఇవి సోమపాలెం దేవాలయ చిత్రాలను చాలా వరకు పోలివున్నాయి. ఈ చిత్రాలను సూక్ష్మాకృతిలో రచించి నప్పటికీ రేఖలను తీర్చడంలో చిత్రకారుని ప్రతిభ అద్వితీయమని తెలుస్తుంది. తెలుగు దేశంలో చిత్రితమై, పరిశోధకుల దృష్టికి వచ్చిన వ్రాతప్రతి ఇదొక్కటే.


విజయనగర పతనానంతరం మహమ్మదీయ సైన్యవాహిని దక్షిణా పథాన్ని ముంచెత్తింది. అందువల్ల ఈ కాలపు చిత్రాలలో మహమ్మదీయ ప్రభావం చాలావరకు కానవస్తుంది. ఈ కాలపు చిత్రాలు కదిరి దేవాలయంలో చూడవచ్చును. ఇక్కడివన్నీ "మినియేచర్" చిత్రాలు. కాగితంమీద రచించినంత పొందికగా ఈ చిత్రాలు దేవాలయపు కప్పుమీద చిత్రించబడినాయి. గుర్రం మొదలైన జంతువుల చిత్రాలు ఎంతో సహజంగా చిత్రించబడినయి. ఇంకొక ముఖ్యమైన విషయం చిత్రకారుడి పేరు పళ్లె శ్రీనివాస రాయణి. ఈయన తన పేరు, ఏ తేదీన చిత్రాలు చిత్రించడం ముగించినదీ రాసుకున్నాడు. ఈ చిత్రాలు ఆంధ్ర కళా చరిత్రలో ప్రముఖస్థానమాక్రమిస్తాయి.

మాచెర్ల, పిల్లలమర్రి

ఈ తరువాతి కాలపు చిత్రాలు మనకు మాచెర్ల, పిల్లలమర్రి దేవాలయాలలో తటస్థపడతాయి. మాచెర్ల చెన్న కేశవస్వామి ఆలయంలో పైకప్పుమీదా, దూలాలమీదా ఈ చిత్రాలు చిత్రితమైనాయి. ఇవి బహుశా పద్దెనిమిదవ శతాబ్దపు ప్రథమ భాగానికి చెందివుండవచ్చు. ఈ చిత్రాల శైలి కలంకారీ చిత్రశైలికి దగ్గరగా వుంటుంది. దేవాలయం చిన్నది కావడం వలన విశాలమైన చిత్రాలు రచించేందుకు అవకాశం లేదు. ముఖమండపం ప్రవేశించగానే కుడివేపున వున్న పైకప్పు చిత్రాలు మాత్రం చెడిపోకుండా వున్నాయి. నిస్సందేహంగా ఈ చిత్రాలు విజయనగర కళాశైలి పొందిన ఆఖరిదశను సూచిస్తాయి ఇలాంటివే అయినప్పటికీ కళానైపుణ్యంలో బాగున్న చిత్రాలు కాళహస్తి దేవాలయంలో కానవస్తాయి. ఈ చిత్రాలలో కలంకారీ శైలి కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. కాళహస్తి సుప్రసిద్ధ కలంకారీ క్షేత్రం. కాళహస్తిలో దాదాపు అన్ని ప్రధాన వర్ణాలూ వాడారు. మాచెర్లలో కేవలం తెలుపు భూమికమీద జేగురు, నలుపు మాత్రమే వాడారు. రేఖారచన విసురుగానే సాగినప్పటికీ నిర్దుష్టంగా లేదు. చిత్రాలు కేవలం అలంకార శ్రేణిలాగా కనిపిస్తాయి. దేవాలయ దూలాల మీద అలంకార శ్రేణులకు బదులు చిత్రాలనే చిత్రించారు.

బహుశా ఇదే కాలానికి చెందిన చిత్రాలలో చెప్పుకోదగినవి పిల్లలమర్రి దేవాలయంలో కానవస్తాయి. ఇక్కడి చిత్రాలు మాచర్ల చిత్రాలలాగా పరిమాణంలో చిన్నవైనప్పటికీ చిత్ర సమాహరణంలో గాని, రేఖా విన్యాసంలోగానీ చాలా క్షీణదశను సూచిస్తాయి. మొగల్ ప్రభావం వేష భూషణాల్లో కనిపిస్తుంది. దేవదానవ యుద్ధం దూలంమీద చిత్రించబడింది. క్షీరసాగర మథనం చిత్రశ్రేణిలోని ఒక స్త్రీ (బహుశా అమృతం పంచుతున్న మోహిని) ముస్లిం పద్ధతిలో చీరను ధరించినట్లు చిత్రించబడింది.

ముందుముందు జరిగే పరిశోధనలో ఇంకా అజ్ఞాతంగా ఉన్న కళాఖండాలు బయటపడితే మరికొన్ని విషయాలు తెలియవచ్చు. ఏమైనా ప్రజలు తమతమ ప్రాంతాల్లో వున్న కళాఖండాల రక్షణకు శ్రద్ధ తీసుకొన్నట్లయితే మరికొన్ని కళాఖండాలు కాలగర్భంలో కలిసిపోకుండా చేసినవారవుతారు. ★



ఆంధ్రదేశంలో తోలుబొమ్మలు

ఉమ్మెత్తల నరసింహమూర్తి

బొమ్మలాటలు, నాటకములు, హరికథలు, కూచిపూడివారి నాట్య నాటకములు, పురాణ పఠనాలు, వీరగీతాలాపనలు చాలా కాలం నుండి మన దేశంలో ప్రచారంలో వున్నాయి. వీటివల్ల ప్రజలకు విజ్ఞాన, వికాస, వినోదాలు పెంపొందడమే కాకుండా ధర్మ ప్రబోధ సాధకాలుగా కూడా ఇవి వెలసినట్లు ప్రబల నిదర్శనాలున్నాయి.

అలాగే తెలుగు దేశంలో 'తోలుబొమ్మలాట' కూడా అతి ప్రాచీనమైన కళ!

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దిలో ఆంధ్రదేశాన్ని పాలించిన శాతవాహనుల కాలం నాటికే ఆంధ్ర దేశంలో ఈ తోలుబొమ్మలాటలు, వీధినాటకాలు, నాట్యాలు ప్రసిద్ధి చెందినట్లు కనిపిస్తుంది. హాలుడు రచించిన 'గాథా సప్తశతి' లో నాట్యసంగీత, వినోదాల ప్రసక్తి ఎంతగానో కనిపిస్తుంది. పశ్చిమాంధ్ర ప్రాంతములో చాలా వరకు మరాఠీవారు ఈ తోలుబొమ్మలాటను ప్రదర్శించేవారు. వీరిని కన్నడనాడులలో కి(షి)ల్లెక్యా(ఖ్యా)త జాతివారని, పశ్చిమోత్తర తమిళ మండలంలో కిల్లేక్యాత వారని, తెలుగు దేశంలో బొమ్మలాటవారు, చర్మనాటకులు అని పిలుస్తారు. ఇక పండితారాధ్య చరిత్రను ప్రమాణంగా తీసుకున్నట్లయితే శ్రీశైలపు 'పరుస నడక'లలో తెనుగులు, తక్కిన ద్రావిడులతోపాటు 'ఆరె' వారు కూడా ఉన్నారని తెలుస్తుంది.

అయితే ఈ తోలుబొమ్మలాటను ఆడే వారి నుండి తెనుగులు తదితరులే నేర్చారో లేక స్వయంగానే అభ్యసించారో, ఎవరి నుండి ఎవరు సంగ్రహించారో నిర్ణయించి చెప్పాలంటే సరియైన ఆధారాలు చాలవు. మీదుమిక్కిలి దక్షిణ దేశమందలి బొమ్మలాట జాతి వారంతా మరాఠీవారు కారు. మైసూరు సీమలో ''ఊరు జంగాలు'', బొంబాయి మైసూరు సరిహద్దుల్లో ''కతుబు'' లనే వారు, మధుర తంజాపుర మండలాల్లో ''కూత్తడీ'' అనే నట్టువ జాతివారు, బళ్ళారి జిల్లాలో కొన్ని ప్రాంతాలందు 'బలిజలు' విశాఖ జిల్లాలో ఈడే, బొందలి తెగ వారు, గోదావరీ మండలమున తెలుగు గొల్లలు, గుంపు తెగవారు, జంగాలు మొదలగు వారు ఆరె వారికంటే భిన్నులగు బొమ్మలాట గాండ్రు. ఆంధ్రదేశంలో సర్వసిద్ధి, శృంగవరపు కోట, ఎలమంచిలి, తణుకు, బెళగల్లు, కళ్ళేపల్లి అగ్రహారము, మండపేట, అంగర, రామదుర్గము, సింగరాయ కొండ, అవులన్న, సోందూరు, కడమలకుంట, జరుట్ల రామపురము, తోరణగల్లు ప్రాంతాల్లో ఈ బొమ్మలాట ఆడే వారెక్కువగా ఉన్నారు.

అయితే, చాలా మంది తోలుబొమ్మల్ని తెరమీద కెక్కించి ఏదో ఆట ఆడించడం ఓ గొప్ప పనా? అనుకుంటారు. కాని, ఇలా ఆడించడం అంత సులభమైన పనికాదు. ఇది అభ్యాసం మీద రావాల్సిన విద్యే! తెరమీద తోలు బొమ్మల నాడించాలంటే ఎంతో నేర్పరితనం, నైపుణ్యం కావాలి. ఆయా సమయాల్లో ఆయా పాత్రల్లో పూర్తిగా లీనమై ఉచ్చమైన స్వరాలతో గంభీరంగా ఆలాపన చేస్తూ, చమత్కృతితో చతురంగా సంభాషణలను జనరంజకంగా ఉచ్చరిస్తూ, హాస్యం ఉట్టిపడేలా చేస్తూ, భావావేశం కలుగజేస్తూ ఆయా పాత్రలకు తగ్గరీతి జీవం పోస్తూ కథను నడుపుతూ ఈ బొమ్మలను ఆడించాలి. అంతటి సమర్థత చూపాలంటే విద్యను పూర్తిగా ఆకళింపు చేసుకున్నవాడై ఉండాలి. అలా ఉంటేనే తప్ప ఈ బొమ్మలాట మనోరంజకంగానూ, చూచేందుకు సుందరంగానూ, వినేందుకు ఉత్సాహంగానూ ఉండదు.

కథాంశాలు

సాధారణంగా భారత, రామాయణ కథాంశాలనే ఇతివృత్తాలుగా తీసుకొని తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తారు. లంకాదహనము, మైరావణ చరిత్ర, ఇంద్రజిత్తు వధ, యయాతి కథ, కీచక వధ, దుశ్శాసన కథ, ప్రహ్లాద చరిత్రలు మొదలైనవి ఇతివృత్తాలుగా తీసుకోవడం జరుగుతుంది. ఇవేకాక దేశీయములైనటువంటి జింజి దేశింగు రాజు కథ, పల్నాటి వీర చరిత్ర, కరి భంటన కథ, కుమార రాముని కథ మొదలైనవి అరుదుగా ప్రదర్శిస్తారు. వీరు ముఖారి, అసావేరి, దేవగాంధారి, రేగుప్తి, మధ్యమావతి, ఆరభి, ఆనంద భైరవి మొదలయిన రాగా లుపయోగిస్తారు.

ఈ తోలు బొమ్మలాటను ఊరి చావడులందో, పెద్ద మైదానముల్లో తాత్కాలికంగా వేదిక లందో ప్రదర్శిస్తారు. తలుపు చెక్కలతో లేక కొయ్య పలకలతో నేలకు రెండు రెండున్నర అడుగుల ఎత్తు మీద అట్టువ నిర్మించి, తురక వేప అడ్డు పట్టెలు, వెదురు వాసాలతో రంగశాల (స్టేజీ) నిర్మిస్తారు. ముందు తెల్లని పల్చని తెరకడ్తారు. తక్కిన వైపుల నల్ల కంబళ్ళను లేక నీలం రంగు మందమైన బట్టలను కడ్తారు. తెర వెనక దీపాలను సాధ్యమైనంత వరకు బొమ్మల నాడించే వారి నీడ తెరమీద పడకుండే

టుగా_అమరుస్తారు. స్త్రీపాత్రల వెనుక స్త్రీలు, పురుష పాత్రల వెనుక పురుషులు ఉండి తెరమీద తమ తమ పరికరాలతో పాత్రలను ప్రవేశ పెట్టి, వాటిని సమయాను సందర్భంగా ఆడిస్తూ సంభాషణల నారంభిస్తారు. పాత్రల రూపాలను తెరమీద ప్రవేశింప చేయడం, నీడలోకి తీసేప్పుడు అంతర్ధానమైనట్లు చేయడం వీరి ప్రత్యేక నైపుణ్యాన్ని చాటుతుంది.

బొమ్మల తయారీ

సాధారణంగా బొమ్మలను జింక, మేక, దుప్పి మొదలైన వాటి చర్మాలతో తయారు చేస్తారు. మొదట తోలును పదునుచేసి అంతకు పూర్వము బొమ్మను నమూనాగా ఉంచుకొని ఆ బొమ్మ ఆకారం వరకు రేఖారచనచేసి గీతల వెంట తోలును కత్తిరిస్తారు. ప్రధాన పాత్రలు జింక చర్మంతోను, మిగిలావి మేక మొదలయిన వాటి చర్మాలతోనూ తయారుచేస్తారు. ఆ తరువాత, వాటికి అనువైన రంగులను వేస్తారు. ఆభరణాదులకు బంగారు మలాము చేస్తారు. ఆయా పాత్రల స్వభావాన్నిబట్టి సత్వ రజస్తమోగుణ ప్రాధాన్యాన్నిబట్టి, ధీరోదాత్తాది నాయకా వైవిధ్యాన్ని బట్టి నీలము, ఎరుపు, నలుపు, ఆకుపచ్చ రంగులను మొహాలకు వేస్తారు.

ఈ బొమ్మలను అభిముఖంగా, పార్శ్వ భంగిమలందు తయారుచేస్తారు. ప్రతి బొమ్మకు వెనుకవైపున తలనుండి వెన్నెముక మీదుగా కాళ్ళవరకు, చేతులకు-భుజాలకు వెదురు బద్దలు కట్టి కాళ్ళకు, మెడకు దారాలు కట్టి వీటి సహాయంవల్ల బొమ్మల నాడిస్తారు. ఒకేవ్యక్తికి సంబంధించి వివిధ ప్రమాణాలుగల బొమ్మలు నాలుగయిదు వరకు తయారుచేస్తారు. వ్యక్తుల బొమ్మలే కాక జంతువులు, పక్షులు,లతలు, వృక్షాలు మొదలైన బొమ్మల్ని కూడా తెరమీద ప్రవేశపెడ్తారు బొమ్మ తెరమీదనిలవాలనుకున్నప్పుడు తుమ్మముళ్ళతో వాటిని తెరకు గుచ్చుతారు.

ఆట రాత్రి, పదిగంటలకు ప్రారంభంచేసి తెల్లవారే వరకు ప్రదర్శిస్తారు. ప్రార్థనా సమయంలో సూత్రధారుడు_మేళనాయకుడు వారు నేర్చిన పద్యాలను అనేకం చదువుతారు. మొదట విఘ్నేశ్వర పూజ, పిమ్మట సరస్వతీ స్తవము చేస్తారు. సరస్వతి బొమ్మలు తెరమీదకు వచ్చి ప్రదర్శకులను, ప్రేక్షకులను ఆశీర్వదించి పోతాయి. అటు తరువాత బంగారక్క, కేతిగాడు తెర మీదకెక్కుతారు. గందోడిగాడు, కేతిగాడు కలిసి ప్రదర్శన కారకులను ప్రశంసించి గ్రామప్రముఖుల్ని పేరుపేరున పేర్కొంటూ పొగడ్తారు.

హాస్య పాత్రలు

ఆట పూర్తయ్యేవరకు వీరు అప్పుడప్పుడు తెరమీదకు వస్తుంటారు. ఆట చప్పచప్పగా నుండి ప్రేక్షకుల్లో గుసగుసలు, అల్లరి బయల్దేరే సమయంలో వీరితోపాటు బంగారక్క కూడా తెరమీద ప్రత్యక్షమయ్యి బండబూతుప్రసంగాల్తో తిరిగి ప్రేక్షకుల్లో ఆనందం, ఉత్తేజం కలుగజేస్తారు.

నేటి చిత్రాల్లో హాస్యపాత్రల ప్రాధాన్యం ఎలాగ అవసరమో ఈ ఆటలో కూడ హాస్యంకొరకు ప్రత్యక్షమయ్యే వీళ్ళ అవసరం కూడా అలాగుంటుంది.

తెరమీద ఈ బొమ్మలు వెనుకఉండే దీపాల వెలుగువల్ల ఛాయవలె కనబడుతాయి. కాబట్టి "ఛాయక్రీడ" అని ఈనాటి కాలంవారు కాలానుగుణమైన నాటకాన్ని అట్టలతో పాత్రలు తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. ఒకప్పుడు_ఇప్పుడుకూడ, ఆయాపాత్రల ఆకారాలు తోలుతో తయారుచేసి ప్రదర్శించడంవల్ల "తోలుబొమ్మలాట" అని పిలువడం ప్రచారంలోకొచ్చింది.

ఈ ఆటతో బొమ్మలతో నాట్యం చేయించడం, యుద్ధం చేయించడం, గంతులు వేయించడం లాంటివి ఎంతో సహజంగా చేయిస్తారు. ఉత్తమమైన పాత్రలు శిరస్సు, హస్తము కదల్చడం తప్ప మరే అంగము కదల్చవు. కాని నీచపాత్రలు, మధ్యమ పాత్రలతో సర్వాంగాభినయం చేయిస్తారు.

ఈ మేళములవారు ఊరూర తిరుగుతూ చాలా తక్కువ భృతికే ఈ ప్రదర్శనలిస్తుంటారు. అభిమానులగు శ్రీమంతులు, కొన్ని బొమ్మలు తయారుచేయుటకు కావల్సిన ధనాన్ని ఇస్తారు. లేక బొమ్మలను తయారు చేయించిస్తూంటారు. అలాంటివారిని ప్రదర్శనా సమయంలో, ఈ ఫలానా బొమ్మలు ఫలాన 'దానకర్తల యొక్క ధర్మమని పొగడ్తారు. ఈ ఆటలో బొమ్మలు ఎంత ఎక్కువగా ఉంటే అంతగా ఆట రక్తికడుతుంది.

ప్రదర్శనానంతరం బొమ్మలమీద చెత్తా_దుమ్ము దులిపి శుభ్రంచేసి పేము పెట్టలందు, వెదురు పేళ్ళ బుట్టలందు వానిని భద్రపరుస్తారు.


మారుతున్న కాలంవల్ల ఒకనాడభివృద్ధిలో ఉన్న ఈ కళ నేడు చాలా చిన్నచూపు దశలోకి దిగుతున్నది. పూర్వాపరాయంగా వస్తున్న ఈ కళను రాను రాను మరచిపోకుండా ప్రోత్సాహం కల్పించి తిరిగి అత్యద్భుతమైన స్థానాన్ని నేర్పరులైనవారు, అభిమానులు కలుగజేసి ప్రజలకాసక్తి కలిగేట్లు చేయాలి.

ఈ తోలుబొమ్మలాటను వివాహ సందర్భాలలో, దేవుని పెళ్ళిళ్ళ సమయంలోనో, ప్రత్యేక సభ-సమావేశాల్లోనో నేర్పుకల వారిచే ప్రదర్శింప చేయవచ్చు. ఇక పరిపాలనా ప్రభుత్వం కూడా ప్రోత్సాహం కల్పించి దేవుని కళ్యాణ మహోత్సవాలలో, పండుగ సందర్భాలలో ఎండోమెంట్ బోర్డువారు ప్రతి ట్రస్టీ ఇవి ఏర్పాటు గావించునట్లు నిర్ణయిస్తే కొంతవరకైనా అభివృద్ధిలో కొచ్చే అవకాశముంది.

ముఖ్యంగా చెప్పుకొనే విషయమేమంటే, ఈ కళయే యితర దేశాల్లో "మిక్కీ మౌస్" చిత్రాలను తయారు చేయటానికి అవకాశం కల్పించింది.

ఇలాంటి ఉన్నతమైన కళను కుంటుపడనీయకుండా అందరి కండ్లలో పడేట్టుగా చేయడం మన అందరిపైన ఉంది; ప్రభుత్వం వారు కూడా కళా పునరుద్ధరణలో తగిన స్థానాన్ని దీనికి కల్పిస్తారని ఆశించుదాం!

తెలుగువారి సంగీత ప్రతిభ



బాపరి రామమూర్తి

"త్రస గీతి యరవ జాతిని పాటకులనుగా దిద్ది వర్ధిల్లిన తెలుగు వాణి." అని ఆచార్య రాయప్రోలు సుబ్బారావు మహోదయులు నుడివినారు.

భారతీయ ఇతిహాసములయందు నారద తుంబురులు గొప్ప గాయకులనియు, వారి గాన మాధుర్యమును ఇంద్రాది దేవతలు ఎల్లవేళల విని ఆనందించుచుండిరనియు కీర్తించబడినది. గాంధర్వ విద్యలుగా స్తుతింపబడుచున్న నాట్య సంగీత శాస్త్రములు, ఐహిక, ఆముష్మికములు బడయుటకు సాధనములని మన పూర్వులు ప్రబోధించిరి.

ప్రపంచమున యితర ఖండములవారికి నాగరిక స్పర్శ తాకకమునుపే భారతావనిని సమస్త కళలు వెలసినవి. అందు సంగీతము పండిత పామరులకు ఆహ్లాదము కలిగించునది గాన, దానికి రాజాదరణము, ప్రజాదరణము మిక్కుటముగా లభించుట సహజము.

ఇతిహాస మహాపురుషులలో మహానుభావుడైన శ్రీ కృష్ణ పరమాత్ముడు పిల్లనగ్రోవి నుపయోగించి గోపికలతో నృత్య వినోదములలో పాల్గొనినట్లును, శంకరుఁడు కైలాసముపై నృత్య విన్యాసములలో పార్వతీదేవితో లీనుడగుచున్నట్లు, బ్రహ్మదేవుఁడు సతతము సరస్వతీదేవి గానము నాలకించ హితుడైనట్లు చెప్పబడుచున్నది. రాజాస్థానములందు, దైవ సాన్నిధ్యములందు సంగీత సరస్వతికి, నివాళులర్పింపబడుచు, సంగీత పాఠకులు, నాట్య కన్యకలు ప్రత్యేకమైన మాన్యములుపొంది సంఘమునందు గౌరవమును పొందుచుండిరి.

వసిష్ఠ, గౌతమ, భరద్వాజాది మహాఋషులు, ఆంజనేయాది మహా భక్తులు సంగీత ప్రియులుగను, గాంధర్వ విద్యా దురంధరులుగను కొనియాడబడుచు, భారతీయ సంస్కృతీ సభ్యతల యందు సంగీతమొక ముఖ్యమైన అంగముగను, కళగను భాసింపబడుచున్నది. చతుర్వేదములందు సామగానము, ధర్మార్థ కామ మోక్షములను, చతుర్విధ పురుషార్థములను బడయుటకు సాధనముగా నిర్దేశింపబడినది. సంగీతానికి సంబంధించిన ప్రతి విషయము సామవేదములో కలదని ప్రాజ్ఞులు తెలియ చెప్పుచున్నారు. సంగీత, నాట్య, నృత్యకళ లొకదానితోనొకటి మైత్రి కల విద్యలు.

"Music is a moral Law, it gives a soul to the universe, wings to the mind, flight to immagination, a charm to sadness, gaiety and life to everything"

అని గ్రీకు వేదాంత శిరోమణియగు ప్లేటో (plato) సంగీతమును శ్లాఘించినాడు.

భరత మహాముని, భరత శాస్త్రాన్ని రచించిన సమయానికే ఆంధ్రులు సంగీతాది గాంధర్వ విద్యలయందు అసమాన ప్రజ్ఞా పాటవము కలిగియుండిరని పరిశోధకులు ధృవీకరించినారు.

క్రీ. పూ. ఒకటవ శతాబ్దములో శాతవాహన రాజైన హాలుడు 700 శ్లోకములతో ప్రాకృత భాషలో రచించిన గాధా సప్తశతియందు సంగీతమును గూర్చియు తత్ పరికరములను గూర్చియు చెప్పబడియున్నది యని పరిశోధనలు తెలియజేయు చున్నవి.

శాతవాహనుల కాలమునాటి జగ్గయ్యపేట, భట్టిప్రోలులలో లభ్యమైన శిల్పములందు వాద్య జంత్ర చిత్రణములు, నాట్య భంగిమలు కానవచ్చుచున్నవి. వీరి తరువాత తెలుగుదేశము నేలిన రాజవంశములవారందరును సంగీత సరస్వతిని మనసార కొలిచిన వారే. అమరావతి నాగార్జున కొండలలో లభ్యమైన శిల్ప కళా సంపదయందు సంగీత విద్యకు సంబంధించిన అనేక విశేషములు తెలియవచ్చుచున్నవి.

రెండవ పులకేసి, పల్లవ రాజ వంశమును తెలుగు సీమ నుండి పారద్రోలినప్పుడు ఆ రాచ వంశముతోపాటు అనేక మంది సాహిత్య సంగీత గాన కళావిశారదులు దక్షిణ దేశమును చేరిరి. అటులనే, కి. శ. 1565 లో జరిగిన తల్లికోట యుద్ధము తరువాత విజయనగర రాజవంశము పటాపంచలైనప్పుడు తెలుగు సాహిత్య సంగీత సరస్వతులు దక్షిణ దేశమున తలదాచుకొనుట సంభవించెను.

12వ శతాబ్దమున కాకతీయుల పరిపాలనా కాలమునందు వెలసిన 'జయప్ప' గొప్ప సంగీత విద్వాంసుడు. గణపతి దేవ చక్రవర్తికి బావమరిదిగా చెప్పబడుచున్న నీ'జయప్ప' 'జయప్పసేనాని' 'గీత రత్నావళి' 'నృత్య రత్నావళి' యను గ్రంథములను రచించినట్లు తెలియవచ్చు చున్నది.

కాకతీయ సామ్రాజ్యము క్షీణదశ నొందు సమయమున విద్యారణ్యుడను బహుమేధా సంపన్నుడు కాకతీయుల కొలువులో పనిచేసిన హరిహర బుక్కరాయ సోదరులను ప్రోత్సహించి వారిచే విజయనగర రాజ్యస్థాపన కావించి తానే వారికి మంత్రిగా వ్యవహరించెను. విద్యారణ్యుడు 1296 నుండి 1386 వరకు జీవించి అద్వైత మతమును ప్రబోధించి, శృంగేరి శారదాపీఠమునలంకరించి, ఈ ఆచార్య శేఖరుడు "జీవన్ ముక్తి వివేక", "పంచాదశి" యిత్యాది వేదాంత గ్రంథములతో పాటు "సంగీత సారము" యనునొక గ్రంథమును రచించెను. కాని నేడది లభ్యమగుట లేదు.

14 వ శతాబ్దమున 'కళానిధి' "వసంత రాజీయము" యిత్యాది సంగీత గ్రంథములు వెలసినవి. ఈ శతాబ్దమునందుననే సర్వజ్ఞ సింగన్న "సంగీత సుధానిధి" పై వ్యాఖ్య వ్రాసినాడు.

యాదవ సింగన్న కొలువు కూటములో సంగీత విద్వాంసుడుగా వెలసిన సారంగదేవుడు "సంగీత రత్నాకరము" యను గ్రంథమును రచించెను. ఆ గ్రంథమునకు ప్రౌఢ దేవరాయలు ఆస్థాన విద్వాంసుడగు మల్లినాథ పండితుడు వ్యాఖ్యానము ప్రకటించెను. ప్రౌఢ దేవరాయలు వారి కాలముననే దేవన భట్టు యనునొక విద్వాంసుడు "సంగీత ముక్తావళి" యను గ్రంథమును రచించెను.

శ్రీకృష్ణదేవరాయలు (1509–1530) సంగీతసాహిత్యములకు చతుష్షష్టి కళలకు చేసిన సేవయు, బహు భాషలను నేర్చి, భాషాకోవిదులను, పండితులను, కవులను పోషించిన రీతియు చరిత్రయందు సువర్ణాక్షరములతో లిఖించ బడియున్నది. మను చరిత్ర, ఆ ముక్తమాల్యద, రాధామాధవీయము. ఇత్యాది అపూర్వ గ్రంథాలు, ఆ నాటి సంగీతరసమును గూర్చియు, సంగీత పోషణమును గూర్చియు వివరముగా తెలియ చెప్పుచున్నవి.

'సంగీత సూర్యోదయము' అను గ్రంథమును లక్ష్మణభట్టు యను నొక విద్వాంసుడు రాయలవారి కోరికపై రచించినాడు. ఈ గ్రంథమునందు కర్ణాటక రాగముల విభజన చూపబడినది. రాయలవారి ప్రోద్బలమువలన కామదేవి విలాసమను గ్రంథము రచింపబడినది.

శ్రీ కృష్ణదేవరాయలు వారి కాలమున తిరుమల నుంచి తాళ్ళపాక అన్నమాచార్యులు (1424–1503) వారు రచించిన పదాలు, ఏలలు, సంకీర్తనలను, అన్నమాచార్యులవారి వంశీయులు విజయనగరమునకు కొనివచ్చి రాజాదరణ పొందిరి. అన్నమాచార్యులు వారి వంశీయులైన పెద్ద తిరుమలాచార్యులు, చిన్న తిరుమలాచార్యులు మొదలైన వారందరు గొప్ప సంగీత విద్వాంసులై విరాజిల్లిరి. అన్నమాచార్యులు సుమారు 32000 కీర్తనలు, పదములు, యిత్యాదులు రచించినట్లు పరిశోధనల వలన తెలియవచ్చుచున్నను, అవన్నియు నేడు మనకు లభించుటలేదు. శ్రీకృష్ణదేవరాయలు వారి అంతఃపుర స్త్రీలకు బండారు లక్ష్మీ నారాయణగారను విద్వత్ శిఖామణి, నృత్య సంగీతాచార్యుడుగా విలసిల్లెను.

శ్రీకృష్ణదేవరాయలు వారి అల్లుడైన అళియరాయలు గొప్ప సంగీత ప్రియుడు. అభినవభరతాచార్య బిరుదాంకితుడై "స్వరమేళ కళానిధి" అను గ్రంథమును 1550 వ సంవత్సర ప్రాంతమున రచించిన రామామాత్యుని ప్రశంసించి, ఆ గ్రంథమును కృతినొంది, కృతికర్తకు ప్రశంసా చిహ్నముగా కొండవీడును దత్తం చేసి గౌరవించెను. రామామాత్యుడు కర్నాటక సంగీతానికి రాగములను తీర్చి దిద్దినాడు. ఈతని శిష్యుడైన పుండరీక విఠలుడు అక్బరు పాదుషా ఆస్థానమున తన సంగీత ప్రతిభను ప్రదర్శించి పాదుషాచే బహు ప్రశంసలను సన్మానములను పొందినాడు. రామామాత్యుని అన్న కుమారుడైన కవినాథుడును గాంధర్వ విద్యల యందు ఆరి తేరిన వాడే.

పాల్కురికి సోమనాథుడు రచించిన బసవ పురాణము, పండితారాధ్య చరిత్రల యందు, నాటి సంగీత రీతులు గోచరించు

చున్నవి. భక్తి రసోన్మాదము కొరకు సంగీత నాట్య శాస్త్రములను వీర శైవులు ఉపయోగించుకొనినారు.

కవిత్రయములో కడపటి వాడైన ఎఱ్ఱనార్యుడు, ప్రాచీనాంధ్ర గ్రంథ కర్తలలో విశిష్టుడై కవి సార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథ కవివరేణ్యుడు, తన భక్తి పారవశ్యముచే శ్రీరామ చంద్రుని సాక్షాత్కరింప చేసుకొని, శ్రీమదాంధ్ర మహాభాగవత కర్త అయిన బమ్మెర పోతనామాత్యుడు, తెలుగు సాహిత్యములో సంగీత రసమును జొప్పించిన ప్రముఖులలో ముఖ్యులని పరిశోధకుల నివేదిక.

క్రీ.శ. 13 వ శతాబ్దము వరకు ఏవత్ భారత దేశమునకు ఒకే పద్ధతిని సంగీత శాస్త్రమును, తత్‌శాస్త్ర ప్రమాణములును ఉండెడివి. కాని భారత దేశమునకు ముస్లిముల రాకతో భారతీయ సంగీతమునందు మార్పులు వచ్చినవి. ముస్లిము వాగ్గేయకారులు, మొగలు చక్రవర్తులు కనపరచిన ప్రేమాభిమానముచే, ఉత్తర దేశ సంగీత విద్వాంసులపై విదేశీయ సంగీత ప్రభావము పడ నారంభించినది. ఈ ప్రభావమునకులోనై భారతీయ సంగీతము హిందూస్థానీ బాణీ అనియు, కర్ణాటక సంగీతమనియు రెండు పాయలుగా చీలెను. విదేశీ ప్రభావమును ఆకళింపుచేసుకొని ఉత్తర భారతమున హిందూస్థానీ బాణీయను, ప్రాచీనతకు న్యూనత కలిగింపక, దక్షిణ భారతమున కర్ణాటక సంగీతమును సరసగతిని పరుగిడ నారంభించినది.

జనక జన్య రాగముల నిర్మాత అయిన సోమనాథ పండితుడు 15, 16 శతాబ్దముల నడుమ గోదావరి తీరమున జన్మించి ' రాగ విబోధము ' యను సంగీత లక్షణ గ్రంథమును రచించెను.

కృష్ణా జిల్లా నివాసులై, అనేక తరంగములను సృష్టించిన శ్రీనారాయణ తీర్థులు 16 శతాబ్దమున వెలసిన గొప్ప కృష్ణ భక్తులు. వీరికి తీర్థనారాయణస్వామి అని కూడ నొక పేరుకలదు. ఈ బయకారుడు ' లీలా తరంగిణి ' గ్రంథకర్త. వీరి సమాధి తంజావూరులో గలదు. నవ్యాంధ్ర సాహిత్య సీమ యందు ధ్రువతారగా వెలుగొందుచున్న స్వామి శివశంకరులు (వేలూరి శివ రామ శాస్త్రిగారు) నారాయణ తీర్థుల వారి వంశములోని వర్ధమాన చంద్రులు.

16 వ శతాబ్దముననే వెలసిన పోలూరు గోవింద మంత్రి " రాగతాళచింతామణి " " సంగీత శాస్త్ర ప్రబంధము " అను గ్రంథములను రచించెను.

భక్తరామదాసుగా కీర్తిగాంచిన కంచర్ల గోపన్న గొప్ప రామభక్తుడు 17 వ శతాబ్దమున వెలసిన ఈ భక్తాగ్రేసరుడు నేలకొండపల్లి నివాసి అయి భద్రాచలరాముని ఆరాధించినాడు. గోలకొండ నవాబు అయిన అబుల్‌హసన్ తానీషా కొలువు కూటమున మంత్రిగాను, సేనాపతిగాను ఉన్న అక్కన్న మాదన్న సోదరులకు మేనల్లుడును, అల్లుడును అయి, భద్రాచల క్షేత్రమునకు తహసీలుదారుగా వ్యవహరించెను. భక్తి పారవశ్యములో లౌకిక జ్ఞానము లోపించినవాడై గోపన్న సర్కారు ఖజానాను ఖాళీచేసి ఆ పైకమును భద్రాచల క్షేత్రమును వృద్ధిపరచుటకు ఉపయోగించిన కారణమున గోలకొండ కోటలో ఖైదుచేయబడి పండ్రెండు సంవత్సరములు పలు బాధలకు లోనైనాడు. గొప్ప సంగీత పాటకుడైన గోపన్న సీతారామలక్ష్మణులను తన వాగ్గేయ కారణ నైపుణ్యముచే వేనోళ్ళ కీర్తించెను. నేడా కీర్తనలు విని భక్తిపారవశ్యమున మునగని తెలుగు వాడుండడు. సామాన్యులకు సులభముగా గ్రాహ్యమగు సాహిత్యమును గోపన్న తన కీర్తనలలో జొప్పించెను. రామ లక్ష్మణులే స్వయముగా తానీషాను కలిసి పైకమునిచ్చివేసి గోపన్నను విడుదల చేసిరి. భక్తకబీరు గోపన్నకు గురువు అని పేర్కొన బడుచున్నది. కాని ఇది చారిత్రికముగా పొసగని కట్టుకథ.

శ్రీకృష్ణ దేవరాయలు వారి మరణానంతరము దక్షిణ భారతమున శక్తిని పుంజుకొనిన, తంజావూరు, మధుర, జింజి రాజ్యములయందు తెలుగు సంగీత సాహిత్యములకు నీరాజ్యము లొసంగబడెను.

శ్రీకృష్ణ దేవరాయుల వారి వంశీయులు తురుష్కుల దాడికి దాసోహులై స్వస్థానములు వదలి, చంద్రగిరి, పెనుగొండ, రాజ్యములందు తలదాచుకొనిరి. ఇంత కష్టసమయములయందును ఈ రాజన్యులు తమ పూర్వ అభిరుచులైన సంగీత సాహిత్య కళా పోషణను విడువలేదు.

రాయలవారి వంశీయుడైన తిరుమలరాయుని ఆస్థాన విద్వాంసుడైన చెరుకూరి లక్ష్మీధరుడు ''గీత గోవిందము''(జయదేవుని రచన)పై వాఖ్య వ్రాసి ఆ ప్రభువరేణ్యునకు అంకితమిచ్చెను.

క్రీ. శ. 1614 నుండి 1633 వరకు తంజావూరు రాజ్యమును పరిపాలించిన రఘునాథనాయకుడు గొప్ప కళా పోషకుడు. వీణావాయిద్యములో అసమాన ప్రతిభా సంపన్నుడైన ఈ రాజన్యుడు ''సంగీత సుధ''యను గ్రంథమును వ్రాసి ప్రకటించగా దానిపై వారి గురువర్యులైన గోవింద దీక్షితులు వారు వ్యాఖ్య వ్రాసినారు. గోవింద దీక్షితులవారి ద్వితీయ పుత్రుడైన వేంకటమఖి ఈ ప్రభువరేణ్యుని ఆస్థానగాయక కోటిలోని సభ్యుడై "చతుర్దండి ప్రకాశిక" అను గ్రంథమును రచించినాడు. జయదేవుని అష్టపదుల ననుసరించి త్యాగేశునిపై 24 అష్టపదులు గానము చేసినాడు రఘునాథ భూపాలుని కుమారుడైన విజయ రాఘవుడును గొప్ప విద్వత్ ప్రభువుగా భాసిల్లినాడు. ఈతనిని దర్శించిన వారిలో పదకర్తయగు మువ్వ క్షేత్రయ్య కలడు. ఆతనిని గూర్చి యిట సవిస్తరముగా వ్రాయవలసి యున్నది.

క్షేత్రయ్య అసలు పేరు వరదయ్య. క్రీ. శ. 1600 ల ప్రాంతమున జన్మించెను. క్షేత్రములన్నియు దర్శించుటచే వరదయ్య క్షేత్రయ్య అయ్యెను. చిత్తూరు జిల్లాలోని మొవ్వ ఈతని జన్మస్థలమని కొందరభిప్రాయపడిరి కాని శ్రీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1923 లో ఈ వాదనను ఖండించి క్షేత్రయ్య జన్మస్థలము కృష్ణా జిల్లాలోని "మువ్వ" గ్రామమని స్థిర పరచిరి. ప్రస్తుతము "మువ్వ"ను 'మొవ్వ' అని వ్యవహరించుచున్నారు. శాస్త్రిగారి నిర్ణయమును వారి వియ్యంకులైన శ్రీ. శే ఆచార్య విస్సా

అప్పారావు పంతులుగారు సహేతుకమైన నిదర్శనముంతో బలపరచిరి. క్షేత్రయ్య జనన మరణ తిథులు, తల్లిదండ్రులు, గురువులు ఎవ్వరో తెలియవచ్చుటలేదు. లభించిన సాక్ష్యము లాధారముతో కొన్ని నిర్ణయములు చేసిరి.

"మువ్వ" (ప్రస్తుతము మొవ్వ) లో గల వేణుగోపాల స్వామి ఈతని ఆరాధ్యదైవము. ఈ ఆలయమున విగ్రహమునకు అడుగు భాగమున "మువ్వ" అని పాత తెలుగు భాషలో చెక్కబడి యున్నది. మొవ్వలో నేటికిని క్షేత్రయ్య వంశము వారు ఉన్నారు.

మొవ్వకు అతి సమీపములో భరతనాట్యాచార్యులకు ప్రసిద్ధి చెందిన కూచి పూడి కలదు. క్షేత్రయ్య ఇచ్చటి భరత నాట్యాచార్యులలో నొకరి వద్ద విద్య నభ్యసించి యుండవచ్చుననియు, ఆ కాలముననే ఒక చక్కని దేవదాసి సహాధ్యాయిని అయినదనియు, వారుభయులు సంగీత సాహిత్య నాట్యాలంకార శాస్త్రములు కలసి నేర్చుచుండిరనియు ఈ సహవిద్య వారిని ప్రేయసీ ప్రియులుగ మార్చెననియు, నిర్ణయించిరి.

క్షేత్రయ్య, కంచి, తిరుపతి, శ్రీశైలము, శ్రీరంగము, మధుర, చిదంబరము, తంజావూరు ఇత్యాది పదునెనిమిది పవిత్ర క్షేత్రములను దర్శించినట్లు నిదర్శనములు కానవచ్చుచున్నవి. క్షేత్రయ్య మొత్తము నాలుగు వేల ఐదువందల పదములు రచించినట్లు ఆధారములు లభించినవి.

మధుర రాజ్యాధి నేతయగు తిరుమల నాయకుని కోరికననుసరించి రెండువేలు, తంజావూరు విజయ రాఘవుని ఆస్థానమున వెయ్యి, గోలుకొండ పాదుషా దర్బారులో తులసిమూర్తియను పండితునితో వివాద మేర్పడినప్పుడు పదునైదు వందల పదములు రచించెను. కాని వానిలో 381 పదములు లభ్యముకాగా, వానిని కీ॥ శే॥ గిడుగు సీతాపతిగారు సంపాదకత్వము వహించ పీఠికాపురాధీశ్వరులయిన శ్రీశ్రీశ్రీ రావు వెంకటకుమార మహీపతి సూర్యారావుగారి సమాదరమున ప్రకటించిరి. శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు క్షేత్రయ్య పదముల కొక పీఠికా వ్యాసమును వ్రాసి ప్రకటించిరి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు క్షేత్రయ్య పదములపై కీ॥ శే॥ విస్సా అప్పారావు పంతులు గారు డాక్టరు దివాకర్ల వేంకటావధానిగారు, శ్రీ బాలాంత్రపు రజనీ కాంతరావుగారు, శ్రీ మంచాళ జగన్నాథరావుగార్ల ప్రసంగ వ్యాసములను ముద్రించి ప్రకటించిరి.

క్షేత్రయ్య జావళీలు తెలుగుదేశమున చక్కగా ప్రదర్శింపబడుచూ జ్యోతిని గాంచినవి.

క్షేత్రయ్య పద కవితలో, పూర్వుడైన అన్నమాచార్యులను అధిగమించెనని కొందరు శ్లాఘించగా, మరికొందరు మీ పదములు అశ్లీలముతో నిండియున్నవని విమర్శించిరి. మరికొందరు శృంగార మార్గమున తన ఆరాధ్యదైవమైన మొవ్వ గోపాలుని అర్చించి అద్వైత సిద్ధి కాంచినాడని సమర్థించిరి.

మొగలాయి చక్రవర్తులైన జహంగీరు, షహజహాన్ చక్రవర్తులచే సన్మానింపబడి కృష్ణాజిల్లా వాస్తవ్యుడై 17 వ శతాబ్దమున వెలసిన జగన్నాథ పండిత రాయలు సంగీత సాహిత్యములయందు ఉన్నతస్థాన మాక్రమించినవాడు. ఇతని సంగీత జ్ఞానము ఉన్నతమైనది. ఈతని గాన మాధుర్యమును విని, తురుష్క చక్రవర్తుల ఉన్నత వంశమునకు చెందిన ఒక స్త్రీ ఈతనితో ప్రేమలోపడి నాథునిగా చేసుకొనెనని ఒక కథ గలదు.

ఔత్తరాహ సంగీతానికి మూల గ్రంథముగా పరిగణింపబడుచున్న "సంగీత పారిజాత" గ్రంథకర్త అగు అహోబిల పండితుడు మన తెలుగువాడు. 17 వ శతాబ్దమున వెలసిన ఈ వాగ్గేయకారుడు ప్రస్తుతము కర్నూలు ప్రాంతమునగల అహోబిల క్షేత్ర నివాసి అని నిర్ణయింపబడినది. (సశేషం)

ఆంధ్రకేసరి ప్రకాశం

(9వ పేజీ తరువాయి)

వెనుక బారులుతీరి వెళ్ళుతున్న జీవచ్ఛవాల్లా ప్రజలు మౌనముద్ర పాటించారు. ఒక్కరి ముఖాన కూడా నెత్తురుచుక్క లేదు అంబరుపేటలోని శ్మశానవాటిక రాజఘాట్‌లా కనిపించింది.

వ్యక్తి యొక్క ఘనత అతడు సంపాదించిన దాని మీదకాక, అతడు త్యజించిన దాని మీదనే ఆధారపడి వుంటుంది. ప్రకాశంగారు శిబి, కర్ణ, దధీచుల వంటివాడు. మహారాష్ట్రులకు తిలక్ ఎంతో, బెంగాలీలకు సి. ఆర్. దాస్ ఎటువంటివాడో, లాలాలజపతిరాయ్ పంజాబీలకు ఎంతో, ప్రకాశంగారు ఆంధ్రులకు అటువంటివాడు. ఎన్నో కాలనీలకు, భవనాలకు, పార్కులకు, రోడ్లకు, వంతెనలకు బరాజ్‌లకు ఆంధ్రప్రజలు ఆయన పేరు పెట్టుకున్నారు. ఆయన మరణించిన దశాబ్దం తరువాత కూడా మద్రాసులోని డి.ఎం.కే. ప్రభుత్వం మద్రాసు హైకోర్టు ఎదురుగా ఆయన విగ్రహం ప్రతిష్ఠించాలని నిర్ణయం తీసుకున్నది. ఆ ప్రదేశంలోనే ఆయన సైమన్ కమీషన్‌ను ధిక్కరించి ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. "వీర భోగ్యా వసుంధరా" అన్నట్లు వీరులదే రాజ్యం అనే విషయాన్ని ఆయన సిద్ధాంత, ఆచరణ రూపాలలో లోకానికి చూపించారు. కేవలం కాంస్య విగ్రహాలు, శిలావిగ్రహాల రూపంలోనే కాకుండా ఆయన మూర్తి ప్రజామనః ఫలకాల మీద స్థిరంగా చోటు చేసుకున్నది. సుదూర ప్రాంతాల వరకు హిమాలయ శిఖరోన్నతంగా, సుందరంగా కనిపించే ఒకానొక మనోహర ప్రకృతి దృశ్యంలా ఆయన స్మృతి ప్రజల మనస్సుల మీద చిరకాలం నిలిచి వుంటుంది. ఏటేటా ఆయన జయంతి అనేక ప్రదేశాల్లో భక్తి శ్రద్ధలతో జరుపబడుతున్నది. ఆయన త్యాగమయ జీవితాన్ని, ఆయన సాధించిన ఘనకార్యాలను ఒక్కమారు వెనుదిరిగి చూసుకుంటే భవభూతి మహాశయుడన్నట్లు "తేహినో దివసంగతః"— ఆరోజులు వెళ్ళిపోయాయిగదా అనిపిస్తుంది. ఆయనకు ముందెన్నడూ అంతటివాడులేడు ; ఆయన తర్వాత మళ్ళీ అంతటివాడు వస్తాడనడం కూడా అనుమానాస్పదమే అటువంటి వ్యక్తి 'నభూతో నభవిష్యతి. ఆయన మూలపురుషుడే గాని ఒక మూలపురుషుని సంతతిలోనుండి వచ్చినవాడు కాదు. మళ్ళీ అటువంటి వ్యక్తిని మనం చూడగలమా?

(సమాప్తం)

వందేమాతరం

— మదిగొండ వీరభద్రమూర్తి

బెంగాలులో సంభవించిన ఘోరమైన కరువు పరిస్థితుల్లో గదాధరుడు(రామకృష్ణపరమహంస) కేశవచంద్రసేన్, రమేశచంద్ర దత్తు మొదలగు ప్రముఖులు ప్రజాసేవచేశారు. అప్పుడు దాదాభాయి నౌరోజీ ఇంగ్లండులో వుంటుండేవాడు. బ్రిటిష్ ప్రభుత్వం భారత ప్రజలను ఏ విధంగా పీల్చి పిప్పిచేస్తున్నదో ఆయన తన గంభీరోపన్యాసాల ద్వారా ప్రచారం చేశాడు. "దీన విప్లవ స్ఫు ణము వచ్చుచున్నది" అని బ్రిటిష్ ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. (సం)

ఒక్కొక్క రాష్ట్రమం దొకొక డుద్భవమందును దీనబంధు పై
యిక్కరణిన్ జనమ్ము విలపించెడు వేళ గయాధిదేవతా
దృక్కిరణ మ్మితండె యనిపించిన వాడు గదాధరాఖ్యు డా
స్రుక్కెడివారిలోన నొకరుండుగ దా నయి ప్రోచె వారలన్

కాళిన్ సేవించుట లో
కాళిన్ సేవించు టొకటె యని యతడు దగన్
శీలించె దక్షిణేశ్వర
మాలయ మై కాళిఘట్ట మావాసం బై

ఒడలి పై వి వెన్నెల డాలు పడని వాడు
వావి మృదులోక్తి నోదార్పబడని వాడు
లేడు బెంగాలులో నను వాడుక, వలి
గట్టు కురుచ కా దను వాడుకయును నొకటె

ఊడిచినాడు మై ంబడెదో యని స్మార్తులు గీయిడన్, జెవిన్
గాడగనీక పీడిత జనస్థలి చీపురు చేత బట్టి, కేల్
మోడిచినాడు కాళికి సముద్ధరణార్థము పిల్లవాడుగా
నేడిచినాడు వారి వ్యథ నెంచి గదాధరు డుగ్రవేళలో

లేవలేని కృశుల లేవనెత్తుచు నూఱ
డించుచు నారట యెఱుగు వారి
బట్ట గట్టుచు నోటబెట్టి తినిపించుచు
బన్నుండ బెట్టుచు బడుగు వారి

నేడ్చుచు నేడ్చెడి మృత బాంధవుల తోడ
బుజ్జగించుచు జిటిబొజ్జ వారి
నుపచరించుచు మందు లొసగి రోగులకు బో
ధించి పూంచుచు నాశ తెగినవారి

రామ! కృష్ణా! యనెడి భక్త రాజి కాత్మ
యగుచు, కొలనికి గొలనికి నెగురు పరమ
హంస వలె గ్రామచరు డయ్యె నా జగద్ధి
తార్థి భైరవీబ్రాహ్మణీదత్త సిద్ధి

యతిరూపి యగు గదాధరు
డతిశయ జాతీయ భావ హరితాద్వైత
స్థితి శిష్యులకొఱ కరసెను
మతి బల వాగ్ధాటి నెసగు మహితుల కొఱకున్

కేశవచంద్రసేనుడు ప్రకీర్తితు డాంగ్లమునందు జ్ఞానసం
తై శ్రుతియంతయున్ జదివె నందున బైబిలుతోడ, దీన ర
క్షాశ్రము డయ్యె నాతడును సంసదుదీరిత వాఙ్మభారిత
శ్రీ శకలమ్మును న్నిలువ సేయక క్షామ మఠమ్ముకై యిడెన్

మండలనాథుడై పదవి మానొక్కనినట్టిడు సంస్కృతమ్మునన్
బండితు డయ్యెదం బ్రజల బాసట యయ్యె రమేశ చంద్ర ద
త్తుండు తదీతిబాధ నొక తోరపు గ్రంథము చూచువారి రా
గుండియ నీరుగా రచన గూర్చె వసించె బ్రిటన్ మహాపురిన్

భారతమును జదివించిరి
దూరాసీతోదకమున ధూర్జటిని కడు
న్నీరాడించిరి వర్ష
ప్రేరణకై యెన్నో సేసిరి బుధుల్ క్రతువుల్

వల్లడి వచ్చి యిటుల బ్రజ
తల్లడిలిన వేళ ఖర్చు తారల కంటన్
ఢిల్లీదర్బారు ప్రవ
ర్తిల్లె మహారాజ్ఞి 'కైజరేహిం' దనుచున్

రోము తగులబడంగ నీరోవిభుండు
వాయులీనమ్ము వాయించు పగిది దేశ
మింత నెంజిలి పడుచుండ నిపుడె యదనౌ!
దొరతనమునకు బండుగ జరుపుకొనగ!

తమ దిగుచున్న మత్తకరీంద్రముల కొమ్మ
కళకు నుద్దించు చెక్కిళుల తెలుపు
తమ యూపుచున్న మోదము తెల్పు కేల యుం
గ్రపు గెంపు జిగి దూరు కంటి యెఱుపు
తమ వంచుచున్న యౌదలల తురాకుచ్చు
చిన్నిముత్యములంత చెమటబొట్లు
తమ చేయుచున్న వందనకర్మ మటు చేత
నొసటి వ్రాతను జూపి కుసులు తీరు

కలిగి కలగి విట్టూర్చెడు కన్నతల్లి
భారతాంబ నోదార్చెడు ప్రాజ్ఞపుత్రు
డొక్కడును లేడు దర్బారు పిక్కటిలగ
వరుసబడ నున్న సంస్థానపతులయందు

ఒకవైపు సితులదర్బా
రొకవైపున మృతులబారు నొకదేశము వా
రొకవేళ ప్రజ నేలిన
ప్రకార మిది యనుచు నాంగ్లవరు డొక డాడెన్

ఈ పరిస్థితి గుర్తించి యింత ప్రాణ
గొడ్డ మగు నన్నకఱవునకు మొదలెంచి
యెంచి యిటనుండి లండను కేగు ధనము
హెచ్చరించె నౌరోజి పాలించువారి

తరళ తరళ రత్నాదాయి బొంబాయి యూరై
వఱలు నతడు దాదాభాయి నౌరోజీ పేరై
స్థిరపడియెను లండన్ జేరి వ్యాపారవృత్తిన్
కొఱవడె నని యనొక్కరాదు దేశీయ భక్తిన్

అతని చేతికి నెముక లే దనగవచ్చు
బ్రిటను కేగుము న్నెబదివేల రూక
లతడు బొంబాయి విశ్వవిద్యాలయమున
కిడె, గడించె నప్డె లక్ష లిడియె నప్డె

ఆ తేజోనిధి సీమ కేగి యచటన్ వ్యాపారమున్ భారత
స్వాతంత్ర్యాహవపూర్వకాలముననే సాగించి తత్రత్యుల
మైత్రీక్షరితులం బొనర్చి వినిచెన్ మాటోటు లావర్తకుల్
చేతస్సారము విక్రయింప రని వర్షీభూతవాఙ్మాధురిన్

దాదాభాయివచస్సరోవరము సద్యస్స్ఫూర్తివాఃపూర మై
యొదిగించున్ వినువారి మానసము నెన్నెన్నో చలోక్తుల్ కథల్
ప్రోడిన్ దామరకల్వతేనియలతో బువ్వమ్ములన్ బెట్టు ద
ద్వాదోక్తుల్ పెదవాదువారి యెడదం బట్టున్ జలూకాళి యై

ఆతడింగ్లాండునం దధివసించు భరత
ఖండాగతానధికారిదూత
ఆతడు భారతీయప్రజారాగమ్ము
లాయ మౌ నొక రాజకీయ మురళి
ఆత డిందైన నందైన విద్యార్థి కు
ద్యోగఫలప్రదద్యోగ తరువు
ఆతడు హిందూమహాబ్ధిలో నాంగ్లనా
గరకతా నావకు గర్ణధారి

ఆతనికి నిరుత్సాహము నపజయమ్ము
నను పదమ్ములు వాని పర్యాయపదము
లును గనుపడని కోశ మిచ్చె నట భరత
మాత యాతడు దాదాసమాఖ్యనేత

ఎన్నో సంస్థలకున్ ధనం బొసగె బంహిష్ఠప్రజాసేవ సం
పన్నుండై యచటన్ గళానివసనోపన్యాసకుండై సము
ద్యన్నానావిధ గోష్ఠిసభ్యుడయి యందౌ రాజకీయాల వ్య
త్పన్నుండై నవరోజి దేహతులితాత్మ శ్వేతభాభ్రాజి యై

క్రాగిన యిన్మ నీరమును కైవడి వైభవపార మానుచున్
మూగ పలె న్నెటించెడు ప్రభుత్వముతో జలగా! మృతాంతమున్
ద్రాగుట లగ్గు గాదు భరత ప్రజ రక్తము నన్నవాడు దా
దా గెలువన్ దలంచు ప్రజ తాకుచు జెప్పితి నన్న వాడునున్


భరతఖండమందు బహునాయకులు కల
రంతమంది నితడె యగ్రసరుడు
కఱవు లన్నిటికిని కారకు లాంగ్లులే
యనుచు బ్రిటిషు సభల నఱచినాడు

ఉప్పుతో తొమ్మిదింటిపై నుప్పరము స్పృ
శించు కరము విధించుటచేత కఠిన
కఠిన శాసనములచేత గఱవుచేత
ప్రజలు కదలిక గల యస్థిపంజరములు!

చుట్టు నున్నవారు శుద్ధ సన్న్యాసులు
మధ్య మద్యపాత్ర మాయ మయ్యె
కావలున్నవారు కటికి న్యాయసులు
నిండియా ధనమ్ము లండ నేగె

[తరువాయి 29వ పేజీలో]

సన్నకారు రైతుల అభివృద్ధి





సన్నకారు రైతులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ వారిలో చాలా మందికి సొంతంగా పశువులుగాని వ్యవసాయ పరికరాలు గాని లేవు. భూస్వాములతో పోల్చినపుడు సన్నకారు రైతులకు సహకార పరపతి సేద్యపు ఖర్చు విషయాలలో ఎన్నో యిబ్బందులు ఏర్పడుతున్నాయి. సమాజంలో అధిక సంఖ్యాబలంలో ఉన్న సన్నకారు రైతులు మధ్యకారు రైతులు వ్యవసాయకూలీలు ఆర్థికాభివృద్ధి ఫలితాలను పొందితే తప్ప ప్రజల జీవనస్థాయి పెంచే విషయంలో మనం నిర్ణయించుకున్న లక్ష్యాన్ని సాధించలేము. వీరు ఉన్న సంఖ్యనుబట్టి కాని, వారి అవసరాలకు తగినట్లుగాని వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల లాభాలు కలగటంలేదని భారత ప్రభుత్వం భావించి గ్రామీణాభివృద్ధికై రెండు ప్రత్యేక పథకాలను రూపొందించింది. ఇందులో ఒకటి సన్నకారు రైతుల శ్రేయస్సును, మరొకటి మధ్యకారు రైతులు వ్యవసాయ కూలీల శ్రేయస్సును పెంపొందించడానికి దోహదం చేస్తాయి.

సన్నకారు రైతులు

ఆర్థికంగా కొంత పుంజుకొని యిచ్చిన సహాయాన్ని నిర్దిష్ట మార్గాలలో ఉపయోగించుకొని ఋణానికి తగిన ఫలితాలను సన్నకారు రైతులు పొందడానికి వీలుగా సన్నకారు రైతుల అభివృద్ధి పథకం ఉద్దేశింపబడినది. మరొక విధంగా చెప్పాలంటే ఆర్థికంగా కొంతవనరులు కల్గిన సన్నకారురైతులు ఈ పథకం క్రింద లభ్యమయ్యే ఋణసహాయంతో భూమి అభివృద్ధి, తీవ్రతర వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడి వరి వంగడాల ఉపయోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు మొదలైన వాటిని అమలు జరిపి నిర్దిష్ట కాలంలో తమ ఆదాయాన్ని పెంపొందించుకోగలుగుతారు.

ఎవరు సన్నకారు రైతు ?

ఈ పథకం క్రింద 2.5 ఎకరాల నుండి 5 ఎకరాల వరకు మాగాణి భూమిగానీ, 2.5 నుండి 8 ఎకరాల వరకు (10 ఎకరాల వరకు మార్జినల్ సవరింపుతో) మెట్ట భూమిగాని, కమతంగాని కలవారిని సన్నకారు రైతులుగా నిర్వచించారు. దక్షిణాది ధాన్యాగారమైన ఆంధ్రప్రదేశ్‌లో సన్నకారు రైతులు అధికంగా ఉన్నారు అందువల్ల సన్నకారు రైతుల పథకాన్ని అమలు జరపడానికి యీ రాష్ట్రం చాలా అనువైనది. కేంద్రప్రభుత్వం మన దేశంలో అమలు జరుపనుద్దేశించిన 45 సన్నకారు రైతుల పైలట్ పథకాలలో మూడింటిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడం జరిగింది. ఈ మూడింటిని వెనుకబడిన ప్రాంతాలైన శ్రీకాకుళం, కడప, నల్లగొండ జిల్లాలలో అమలు జరుపుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అమలు జరపడానికి జిల్లా కలక్టర్లు అధ్యక్షులుగా, ప్రతిజిల్లాలో సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థలను రిజిష్టరు చేశారు. ప్రతి పథకం పెట్టుబడి రూ. 1.5 కోట్లు. ఈ మొత్తాన్ని కేంద్రప్రభుత్వం యీ సంస్థల పరంచేస్తుంది. 50,000 మంది సన్నకారు రైతులకు యీ మొత్తం నుండి ఋణ సహాయం అందజేయబడుతుంది. ఈ మూడు జిల్లాల్లోని దాదాపు 1.5 లక్షల సన్నకారు రైతులకు రూ. 2.71 కోట్ల సబ్సిడీతో సహా రూ. 15.36 కోట్ల మేరకు అదనంగా ఆర్థికసహాయం అందచేయడానికి అవకాశం ఉండేవిధంగా యీ పథకాలను రూపొందించారు. నాలుగు సంవత్సరాల కాలంలో దశలవారీ వినియోగిస్తూ ప్రతి జిల్లాలో దాదాపు 50,000 మంది సన్నకారురైతులకు లాభం చేరుకూస్తారు. బావుల త్రవ్వకం, ఆయిల్ ఇంజనులు, విద్యుచ్ఛక్తి మోటార్లు, పంపుసెట్లు నెలకొల్పడం, అధికదిగుబడి రకాల సేద్యం, పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం వంటి అనుబంధ ఆదాయమార్గాల అనుసరణ కార్యక్రమాలను యీ నిధులను వినియోగిస్తారు.

శ్రీకాకుళం

ఈ జిల్లాలో సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థను 1970 డిసెంబరులో రిజిస్టరు చేశారు. చీపురుపల్లి, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, శ్రీకాకుళం తాలూకాలలో యీ పథకాన్ని అమలు జరుపుతున్నారు. 1971 జనవరిలో కేంద్ర ప్రభుత్వం రు. 5 లక్షలను యీ సంస్థకు మంజూరు చేసింది. సన్నకారు రైతుల అభివృద్ధికి ఉద్దేశించబడిన యీ నూతన ప్రక్రియలో పాల్గొనడానికి వాణిజ్య బ్యాంకులు కూడా ముందుకు వస్తున్నాయి. రు. 3.78 కోట్ల మేరకు ఆర్థిక సహాయం అందజేయడానికి ప్రతిపాదించారు. ఈ పథకం క్రింద అదనంగా ఋణాల పంపిణీని చేపట్టున్న శ్రీకాకుళంలోని సహకార కేంద్ర బ్యాంకు నిర్వహణను పటిష్ఠం చేసేందుకుగాను, వాటాధనం, ఋణ రూపంలో ప్రభుత్వం 1970–71లో రు. 13 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది.

ఈ పథకం క్రింద రూపొందించబడిన సమీకృత అభివృద్ధి ప్రణాళికలో బావుల త్రవ్వకానికి రు. 51 లక్షలు, పాడిపశువుల కొనుగోలుకు రు. 31.40 లక్షలు, అధిక దిగుబడి వంగడాల వినియోగానికి రు. 99 లక్షలు, తీవ్రతర మెట్ట సేద్యానికి రు. 114 లక్షలు, గ్రామీణ వృత్తి పనివారల అభివృద్ధికి రూ. 5 లక్షలు కేటాయించారు.

కడప

కడప జిల్లాలో సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థను, 1971 డిసెంబరులో ఏర్పాటుచేశారు. కేంద్ర ప్రభుత్వం రూ. 5 లక్షల గ్రాంటును మంజూరు చేసింది. జిల్లాలోని 48,682 మంది రైతులకు రూ. 4.81 కోట్ల మేరకు ఆర్థిక సహాయం అందజేయడానికి యీ సంస్థ ఉద్దేశించింది. రాయలసీమ ప్రాంతం వర్షాభావానికి గురిఅయ్యే కడప జిల్లాలో ఆయిల్ ఇంజనులు, విద్యుచ్ఛక్తి మోటార్లు నెలకొల్పడానికి ఎక్కువ ప్రాధాన్యం యిస్తూ రు. 1.40 కోట్లు కేటాయించారు. భూమి సేద్యయోగం చేయడానికి రూ. 98 లక్షలు ఖర్చు చేయాలని కూడా ప్రతిపాదించారు. కూరగాయల పెంపకం, ఎద్దుల సరఫరా, ఫిల్టర్ పాయింట్ల త్రవ్వకం, దురువు రకం బావులు త్రవ్వకం మొదలైన వాటినికూడా యీ పథకంలో చేర్చారు. కడపలో సహకార బ్యాంకు నిర్వహణను పటిష్ఠం చేయడానికి వాటాధనం, ఋణం రూపంలో ప్రభుత్వం కడపజిల్లాలో రు. 7.10 లక్షలను మంజూరుచేసింది.

నల్లగొండ

నల్లగొండ జిల్లాలో 1970 నవంబరులో సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ ఏర్పాటుచేయబడింది. రామన్నపేట, నల్లగొండ, సూర్యాపేట తాలూకాలలో 50,000 మంది సన్నకారు రైతులకు రు. 976 లక్షలమేరకు ఆర్థిక సహాయం అందజేయడానికి యీ సంస్థ ఉద్దేశించింది. అభివృద్ధి ప్రణాళిక క్రింద పైర్ల ఋణాలకు రూ. 380 లక్షలు కేటాయించారు. దీనికితోడు బావుల త్రవ్వకం పాత బావుల లోతు త్రవ్వకం, ఆయిల్ యింజనులు విద్యుచ్ఛక్తి మోటార్ల సరఫరాకు రు. 2.20 కోట్లు కేటాయించారు. కోళ్ళ పెంపకం, బాతుల పెంపకం, గొఱ్ఱెల పెంపకం, గ్రామీణ వృత్తి పనుల అభివృద్ధి కార్యక్రమాలను కూడా యీ ప్రణాళికలో చేర్చారు.

మధ్యతరహా రైతులు, వ్యవసాయ కూలీలు

మధ్యతరహా రైతులు వ్యవసాయ కూలీల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం మరో ముఖ్యమైన పథకాన్ని ప్రారంభించింది. 25 ఎకరాలకు తక్కువ భూవసతిగల మధ్యతరహా రైతులు, ఉద్యానవనాలు, పశువుల పెంపకం, పాడిక్షేత్రం, కోళ్ళ పెంపకంవంటి గరిష్ఠ ఆదాయాన్ని లభింపజేసే కార్యక్రమాలను చేపట్టడంలో సహాయం అందజేయడానికి యీ పథకం ఉద్దేశించబడింది. వ్యవసాయ కూలీద్వారా 50 శాతానికి పైగా సంపాదిస్తున్న భూమిలేని వ్యవసాయ కూలీలకు కూడా సహాయం అందజేయబడుతుంది. ప్రాజెక్టు ప్రాంతంలో వ్యవసాయ వనరులను గరిష్ఠస్థాయిలో వినియోగించుకోడానికి వీలుగా గ్రామీణ పనులను చేపడుతూ వారికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి. వచ్చే నాలుగు సంవత్సరాలలో దేశమంతటా కేంద్రప్రభుత్వం అమలు జరిపే 40 పథకాలలో 2 పథకాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. విశాఖపట్నం, నల్లగొండ జిల్లాలో యీ రెండు పథకాలను అమలు జరుపుతారు ప్రతి పథకానికి కోటి రూపాయలు చొప్పున కేంద్ర సహాయం లభిస్తుంది. పెంపుదలకు అవకాశం ఉండేవిధంగా వినియోగ డిమాండు ఉన్న మార్కెటు ప్రాంతాలలో వాటిని అమలు జరుపుతారు దాదాపు 40,000 మంది మధ్యతరహా రైతులకు, వ్యవసాయ కూలీలకు యీ పథకంద్వారా లాభం చేకూరుతుంది.

1971 ఫిబ్రవరి నెలలో యీ పథకాలు మంజూరు చేయబడినాయి. విశాఖపట్నం, నల్లగొండ జిల్లాలలో మధ్యతరహా రైతులు వ్యవసాయ కూలీల అభ్యున్నతికి రూ 5.35 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. సేద్యపు బావుల త్రవ్వకం, ఆయిల్ ఇంజనులు, విద్యుచ్ఛక్తి మోటార్ల కనుగోలు, పాడి క్షేత్రాలు, కోళ్ళ పెంపకం, గొఱ్ఱెల పెంపకం, పద్రంగం కమ్మరిపని, కూరగాయల తోటల పెంపకం మొదలైన కార్యక్రమాలకు యీ మొత్తాన్ని వినియోగిస్తారు. గ్రామీణ వృత్తి పనుల అభివృద్ధికి ప్రతి పథకంలో రూ. 3 లక్షలు నిర్దేశించారు. కార్మికులకు ఉపాధి కల్పించే నిమిత్తం గ్రామీణ పనులకు రూ. 37 లక్షలు కేటాయించారు. వివిధ కార్యక్రమాల అమలుకు విశాఖపట్నం జిల్లాకు రూ. 5 లక్షలు నల్లగొండ జిల్లాకు రూ. 5 లక్షలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

ఈ రెండు పథకాల అమలువల్ల గ్రామీణ నిరుద్యోగాన్ని నివారించడమేగాక సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి అవకాశం కలుగుతుంది.

రైతు - కూలీల క్షేమమే దేశ క్షేమం

మైసూరులో ఖేడ్డా విశేషాలు

కొరిపు కూర్మావతారం

ఈ సంవత్సరం మైసూరు సందర్శించిన దేశ విదేశ యాత్రీకులకు, 'ఖెడ్డా' (ఏనుగులవేట) గొప్పగా ఆకర్షించిందనే చెప్పాలి, గత జనవరి 9వ గేదీనుండి 12వ తేదీవరకు కాకన్ కోట్ వన్యప్రదేశంలో కాబినీ నది తీరప్రాంతంలో ఏనుగుల్ని వేటాడేరు. గత అరుమాసాల నుండి యీ వేటకు సముచిత సన్నాహాలు సలుపుతూ వచ్చారు. ఈ సారి వంద ఏనుగుల్ని గుంపుగా పట్టాలని ప్రణాళిక వేసారు. ఈ ప్రణాళిక జయప్రదం అయేందుకు సుమారు రెండొందల మంది చిన్న పెద్ద ఆఫీసర్లు, అచ్చట వన్యప్రాంతంలో నివసిస్తున్న ఓ వెయ్యిమంది ఆదివాసులు బాగా తర్ఫీదు పొందినటువంటి మరో ఏబది పెంపుడు ఏనుగుల మూకుమ్మడి సేవాశ్రమలు అత్యంత అవశ్యకములయినవి.


మైసూరు నగరానికి అగ్నేయ దిశగా 80 కిలో మీటర్ల దూరంలో కాకన్‌కోట్ వన్య ప్రదేశముంది. ఈ ప్రదేశాన్ని అనుకొని ప్రవహిస్తున్న కాబినీ నది తీరప్రాంతంలో అడవి ఏనుగులు గుంపులు గుంపులుగా విహరిస్తూ నదిలో జలక్రీడలు సలుపుతూ ఉంటాయి. ఏనుగులకు ప్రియమయిన ఖాద్యపదార్థం వెదురు. ఈ వెదురు పొదలు పొదలుగా కాబినీనది తీరప్రాంతంలో విస్తారముగా నుండుటచేత ఆ ప్రదేశంలో ఏనుగులు గుంపులు గుంపులుగా నివసిస్తూ ఉన్నాయి.

1971 జనవరిలో జరిగిన 'ఖెడ్డా' యే బహుశా ఆఖరుది కావచ్చు. ఎందుచేతనంటే కాబినీనదిపై ఆనకట్ట కట్టి అచ్చటి ప్రదేశాన్ని పచ్చని పైరులతో సస్యశ్యామలంగా చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. అందుచేత 'ఖెడ్డా' జరుపవలసిన ప్రదేశమంతా జలమయ మవుతుంది. కనుక ఆ ప్రదేశంలో యిక ఏనుగులు విహరింప వీలుండదు. మరి 'ఖెడ్డా' జరిగేదెట్లా?

అయితే మొట్టమొదటి సారిగా యీ 'ఖెడ్డా' 18వ శతాబ్దపు మధ్యభాగంలో ఆనాడు మైసూరు పరిపాలిస్తున్న హైదరాలీ నవాబు ద్వారా ఏర్పాటు చేయబడింది. కాని ఆనాడు అంతగా ఫలితాన్ని సాధించలేక పోయేరు. మరోకొన్ని సంవత్సరాల తరువాత కర్నల్ పియర్సన్ అనే ఆంగ్లేయుడు కూడా వ్యర్థ ప్రయత్నమే చేసాడు. ఈ రెండు విఫల ప్రయత్నాల తరువాత ఖెడ్డా అభియాన భారం నియమానుసారంగా మొదటి సూపరింటెండెంటు అయిన జి. పి. సాండర్సన్ వహించాడు. ఆయన 1873లో చామరాజనగర్ తాలూకాలో ఓ గ్రామమందు 'ఖెడ్డా' ఏర్పాటుచేసి 55 ఏనుగుల్ని పట్టుకొన్నారు. అంతర్జాతీయ యాత్రిక సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకొని 1968 ఖెడ్డా అభియానం జరిగింది ఆనాడు 87 ఏనుగులు పట్టుబడ్డాయి. ఇంతవరకు జరిగిన 35 ఖెడ్డా అభియానాలలో 1860 ఏనుగులు వశమయినవి. కొన్ని సమయాలలో 75 నుండి 100 ఏనుగులు కూడా పట్టుబడుతుండేవి.

ఏనుగుల్ని వేటాడి వశపర్చుకోవడమంటే సాధారణమైన పని కాదు, 'ఖెడ్డా' చాలా ప్రమాదకరమయింది. ఇందుకు సామూహికమయిన ధైర్యసాహసాలు శక్తి సామర్థ్యాలు, చొరవ యుక్తి అన్నీ ఆవశ్యకములే. పెద్ద పెద్ద కొయ్యస్థంభాలతో తయారు చేయబడిన గోతులవైపు మదపుటేనుగుల్ని మళ్ళించడమంటే మాటలమీద జరిగే పనికాదు, ప్రాణాల్ని అరచేతుల్లో పెట్టుకొని యీ కార్యరంగంలో దిగుతారు.

'ఖెడ్డా' జరుపవలసిన భూభాగం సుమారు పది ఎకరాలు విస్తీర్ణం కలిగి ఉంటుంది. ఆ ప్రదేశంలో ఏయే మార్గాలగుండా ఏనుగులు వస్తూ పోతుంటవో వన్యప్రజలకు బాగా తెలుసు. అందుచేత 'ఖెడ్డా'కు అనుకూలమగు స్థలం వాళ్ళు సులభంగా ఎంచుకో



గలరు. ఆ దగ్గర్లో ఉన్న వృక్షాలపై యాత్రికుల కోసం మంచెలు నిర్మిస్తారు. ఆ మంచెల పైనుంచి శరీరానికి గగుర్పాటు కలిగించే ఖెడ్డా అభియానాన్ని నిర్భయంగా తిలకిస్తూ అంతా ఆనందిస్తూ ఉంటారు.

'ఖెడ్డా' జరిపే పదిహేనురోజులు ముందునుంచే అడవి ఏనుగులను వాటిని పట్టుకొనుటకు ప్రత్యేకంగా నిర్మింపబడిన గోతుల వైపు తరమడం ప్రారంభిస్తారు అడవి ఏనుగులముందు పెంపుడు ఆడ ఏనుగులను విడిచి పెడతారు. ఈ ఆడ ఏనుగులను 'కుమ్‌కీ' అని అంటారు. అడవి ఏనుగులు కుమ్‌కీల వెంటబడతాయి. ఇవి లేవిదే అడవి ఏనుగుల్ని పట్టడం అసాధ్యమే. వేటలో ఆరితేరిన వన్యప్రజలే కాకుండా సుశిక్షితులయిన ఉద్యోగులుకూడా పాల్గొం టారు. సుమారు 20 చదరపు మైళ్ల విస్తీర్ణముగల వన్యప్రాంత మందు సంచరిస్తున్న ఏనుగులన్నింటిని కంచెలు నిర్మించిన గోతుల వైపు తరిమివేయడం ఎంత కష్టమైనదో, ప్రమాదకరమయినదో చెప్పలేము. ఇలా ఏనుగుల్ని తరిమివేయడంలో యీ 20 చదరపు మైళ్ల విస్తీర్ణము రోజురోజుకీ తగ్గిపోతూ, ఆఖరురోజున అంటే-పదిహేనవరోజుకి రెండు చదరపు మైళ్లే మిగులుతుంది. సంకీర్ణమయిన ఆ రెండు చదరపు మైళ్ల ఆవరణలో చిక్కిన ఏనుగులు తప్పించుకొని మరల అడవిలోకి పారిపోకుండా బహు జాగ్రత వహిస్తారు. ఇందు నిమిత్తం పెద్ద పెద్ద కర్రదూలాలు రాత్రి పొడుగునా చుటూ ముట్టించి పెడతారు.

ఏనుగుల్ని వశపరచుకొనుటకు 8 అడుగుల లోతుకలిగిన గోతులు త్రవ్వుతారు. ఈ గోతి ముఖభాగము 9 అడుగుల వెడల్పు వున్నప్పటికి అట్టడుగు భాగము 2 అడుగుల కంటే ఎక్కువ వెడల్పు ఉండదు. అందుచేత విశాలకాయుడగు గజరాజుకి ఆ గోతిలో యిటుఅటు కదలుటానికే అవకాశం ఉండదు. మరి గోతినుండి బైటకు రావడం ఎలా సాధ్యమవుతుంది. పెద్ద పెద్ద కర్రదూలాలు భూమిలో పాతిపెట్టి వాటిని మంచి బలిష్టమయిన త్రాళ్లతో కట్టి గోతియొక్క ప్రవేశద్వారం నిర్మిస్తారు. ఈ ద్వారం గుండా గుంపులు గుంపులుగా పరుగెత్తుకొంటూ వచ్చిన ఏనుగులన్నీ కొద్ది దూరంలో నున్న గోతిలో 'ధనేల్' మని పడిపోతాయి. వెంటనే ద్వారాన్ని మూసేస్తారు. అయితే ఆ ద్వారం కృత్రిమంగా కనబడదు. ప్రకృతి జన్యమయిన రమణీయమయిన వనభాగంగానే ద్వారాన్ని చాలా సహజంగా తయారు చేస్తారు. అందుచేత ఆ భూభాగంలో గజరాజులు ఎలాంటి భయంగానీ, సందేహంగానీ లేకుండా స్వేచ్ఛగా విహరించేందుకు అలవాటు పడతాయి. 'పీల్ ఖానా' అనే స్థలంలో పట్టుబడిన ఏనుగులన్నింటినీ మచ్చిక చేస్తారు. వాటికి బాగా తర్ఫీదుయిచ్చి పనులు చేయించు కొంటారు.

కాకన్‌కొట్‌వన్య ప్రదేశమందు వేంచేసిన దేవిపూజతో ఈ ఖెడ్డా అభియానం ఆరంభమవుతుంది. మస్తీగుడి ఆలయంలో యీ దేవి విరాజిల్లు చున్నది. 'ఖెడ్డా'తో సంబంధమున్న ప్రతి వ్యక్తి దేవిని నిష్ఠతో నిత్యం కొలిచి దేవిఅనుగ్రహానికి పాత్రుడవుతాడు ఆ తరువాతనే ఖెడ్డాలో పాల్గొనేందుకు ప్రయాణమవుతాడు.

(25వ పేజీనుండి)

వందేమాతరం


తల్లి రత్నగర్భ తనయులు గర్భ ద
రిద్రులా యయారె ! సృష్టి కెదురు
ఎందొ ? భరత ఖండ మందు బాలించువా
రెవరొ ధర్మపరులు బ్రిటిషువారు

పాలించెడువారలు మొఱ
లాలించెడువారు కాని యపుడు ప్రజా క
ష్టాలన్ వాకొన వశమా !
నీలపు దుస్తులను దాల్ప నీకున్ యశమా !

సురుచిరదృష్టి నా ప్రభుత ! చూడగదే బ్రిటనందు గోవు లె
వ్వరొ భరతావనిం బులులు వా రగుచున్నది. దీన విప్లవ
స్ఫురణము వచ్చుచున్నది యపోహము గా దిది కాననమ్మ గా
దిరునెడలం బొలమ్మె యగు నీయది యం చనిపించుకోగదే !

కురువృద్ధా నవరోజి పల్కినవి పుల్కల్ ముల్కలై యివ్వి యె
వ్వరి కంటున్ జనటుచ్యపాలనకళాపారీణు లౌ వారి కి
క్కరిణిన్ మాత్ర కథించి రెవ్వరు సమైక్యక్ష్మమహారాష్ట్రమ
ధ్యరసా పంచనదీక చన్నపురవంగాశ్యామ రాష్ట్రమ్ములన్

క్షామము బాప విత్తము పొసంగును బండరువందు భాగమై
భూమికరాన సె స్సనగ బూర్తి గ నచ్చ్యది ఖర్చుకాక యే
క్షేమము మొల్చి జీవకళ చిన్నెలు పొల్చె ననేక వత్సరాల్
బ్రామిన వ్యాధియుం బ్రకృతివైద్యముచే నయ మైన కైవడిన్.



అడ్డతీగల ఏజన్సీలో టేకుతోటల పథకం

— పి.వి.సుబ్బారావు

తూర్పు గోదావరి జిల్లాలో తూర్పు కనుమలను అనుకుని అడ్డ తీగల ఏజన్సీ వుంది. ఇది మన్య ప్రాంతము. దీని విస్తీర్ణం 1,04,761 హెక్టారులు. ఇక్కడి అడవుల్లో గృహ నిర్మాణానికి పనికివచ్చే టేకు, వేగిస, బండారు, మద్ది, తడ, కొడిస సిరిమాను, ఋూసి, గుమ్మడి, కరక, తునిక, మామిడి, వనస, నెమిలి అడుగు, నేరేడు జాతుల కలప దొరుకుతున్నది. ఇందులో కొన్ని రకాల కలప రాజమండ్రి కలప మిల్లులో సీజనింగ్ చేయుట వలన దాని జీవ ప్రమాణముపెరిగి టేకతో సమానంగా యిండ్ల పనులకుపయోగించుచున్నారు. ఇవికాక నగిషీ పనులకు, ఫర్నీచరు చేయుట కుపయోగించు విరుగుడు చావ [రోజ్‌వుడ్], తోకమల్లి [వైట్‌వుడ్], సిందుగ [రెడ్‌వుడ్] రకాలుకూడా లభిస్తున్నాయి. వంటచెరకుగా వుపయోగించే అల్లి, గొత్తి, నక్కిన, తొగరు, చింత వెలగ, తుమ్మ, ముష్ఠిజాతులు కూడా యిక్కడ మెండుగా వున్నాయి.

ఇంటి పనులకు అనాదిగా పేరు పొందిన టేకు జాతి స్థానే మారు జాతులను సీజనింగ్‌చేసి వాటి జీవ ప్రమాణం పెంచినప్పటికి దానినే ప్రత్యేకంగా వాడవలసిన నావలు, పడవలు, లాకు తలుపులు, తెరచాప కొయ్యలు తయారుచేయుటకు మారు జాతులు పనికి రావు. ఎందుకంటే టేకు కర్ర సుమారు 100 సంవత్సరాలు మన్నుతుంది. ఇది కావలసిన పొడవులో సుమారు 100 మొదలు 140 అడుగుల వరకు దొరుకుతుంది. ఇది తడిసినా పుచ్చదు. పెళుసు వుండదు. చెద పట్టదు. అందువలన టేకుజాతి అభివృద్ధి అనివార్యమయింది. ఈ టేకు రకములలో రంగూన్ లేక బర్మా రకము చాలా మంచిది. చాలా మెత్తగా తెగుతుంది. సుమారు 200 అడుగుల నిడివికూడా దొరుకుతుంది. భారతదేశంలో ఒరిస్సా కేరళ రాష్ట్రాలలో దొరికే టేకు రెండవ రకముగా పరిగణించవచ్చు. ఇవి 150 మొదలు 170 అడుగుల పొడవు దూలములు యిస్తాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో యింతకన్న కొంచెం తక్కువ పొడవు లభించినా దాని కొక ప్రత్యేకత వుంది. అందువలన యీ టేకు వుత్పత్తిలో మన రాష్ట్రం ప్రముఖ పాత్ర వహిస్తున్నదనే చెప్పాలి. మన దేశంలో టేకు నల్లమల కొండలు, పాపికొండలు, వరంగల్ మొదలగు ప్రదేశములందు దొరకుతున్నను మొట్టమొదటగా కేరళ రాష్ట్రంలో 1841–55 సంవత్సరాలలో మలబార్ జిల్లా కలెక్టరు శ్రీ హెచ్. వి. కోనల్లీ నిలంబూర్‌లో [illegible] టేకు తోట వేయించినట్లు ఋజువులు వున్నాయి. అసలు అటవీశాఖ వారు నియమబద్ధంగా అడవులు నడపుటలో యిది ప్రథమ సోపానమని చెప్పవచ్చును. ఆ ప్లాటులో యిప్పటికీ అయిదెకరాలలో 152 అడుగుల ఎత్తు 12 అ. 6 అంగుళాలు కైవారముగల టేకు చెట్లను ప్రపంచ ప్రదర్శనం కోసం భద్రపరచి వుంచారు. ఈ చెట్టు ఒక్కొక్కటి రూ 4,880/-లు ఖరీదు చేసే 244 ఘ. అడుగుల కర్ర దిగుబడి యిస్తుంది. ఈ రకం చెట్లు ప్రతి యకరంలో కనీసం 29 వున్నాయి. ఇదే విధంగా తూర్పు గోదావరి, విశాఖజిల్లాల సరిహద్దున అడ్డతీగల గ్రామానికి 35 కి.మీ దూరానగల మర్రిపాకల గ్రామంలో జాగ్రత్త పరుచబడిన పదెకరాల ప్లాటులో యిలాంటి పెద్ద పెద్ద చెట్లు వున్నాయి. వాటి ఎత్తు 150 అడుగుల మొదలు 160 అడుగుల వరకు వుండి 14 అడుగుల వరకు కైవారం కలిగి వున్నాయి. ఇందులో ఒక అపూర్వ వృద్ధ వృక్షరాజం వుంది. ఇది గాలిదెబ్బకు తలవిరిగి, మొదలు మాత్రం నిలిచి వుంది. ఆ గ్రామ గిరిజనుడొకడు వరంగల్‌నుంచి తెచ్చి యీ చెట్టు నాటినట్లున్నా, 1922లో అల్లూరి సీతారామరాజు పితూరీ తర్వాత ఆ గ్రామము బేచరాకుగా నిర్జనంగా మారి రహదారులులేని కారణంచేత 1960 నుంచి అటవీశాఖ వారి నిరంతర జాగ్రత్తవలన ఆ చెట్లు యింకా వున్నట్లూ ఆ ప్రాంతమువారు చెప్పుతారు. నిపుణులు కొందరు పరిశీలనలు జరిపి యీ చెట్టు నిలంబూరులో ప్రపంచ ప్రదర్శనానికి భద్రపరచిన టేకుల కన్నముదరునిగా నిర్ణయించారు.

అడ్డతీగల రేంజిలో 1927 సంవత్సరము నుంచి యీ టేకు తోటల అభివృద్ధి పథకం అమలులోనున్నప్పటికీ 1947 నుంచి యీ పథకము విస్తృతంగా జరుగుచున్నది. ఈ తోటల పెంపకానికి అనువైన ప్రదేశములుగా (1) అడ్డతీగల (2) చీడి పాలెం. (3) మర్రిపాకలు, (4) పి. ఎర్రగొండ, (5) పలక ప్రదేశములు ఎన్నికచేసి యీ కార్యక్రమం అటవీశాఖవారే అమలుజరుపుతున్నారు. 1947 నుంచి 1958 వరకు సంవత్సరానికి యిరవై యకరాల చొప్పున అడ్డతీగల ప్రాంతంలో యీ ప్లాటులు వేశారు. సుమారు 200 యకరాల్లో యీ టేకు తోటలు అభివృద్ధి చెందుతున్నాయి. అలాగే చీడి పాలెంలో 1027 ఎకరాలు, మర్రిపాకలులో 208 ఎకరాలు, పి. ఎర్రగొండలో 50 ఎకరాలు, పలకజీడిలో 95 ఎకరాల విస్తీర్ణంలో టేకు తోటలు అభివృద్ధి చెందాయి.

ఇకముందు నుంచి తూర్పు గోదావరి జిల్లాలో సంవత్సరా

నికి వేయి ఎకరాలు టేకు తోటలు పెంచుటకు నిర్ణయించారు. ఒక్కొక్క తోటను 80 సంవత్సరాలపాటు పెంచవలసి వుంటుంది. తోట వేసిన 7వ సంవత్సరము, 14వ సంవత్సరము రెండవ పర్యాయము 27వ సంవత్సరము మూడవ పర్యాయము, 40వ సంవత్సరము నాలుగవ పర్యాయము యీ తోటల నుంచి తీసివేసిన మొక్కలు అమ్ముటవలన పెట్టుబడి అంతా ఆదా అవుతుంది.

టేకు తోటల పెంపకం పద్ధతి

ఈ తోటలు పెంచడానికి 1,000 అడుగులు మొదలు 3,000 అడుగులవరకు నిమ్నోన్నతముగల కొండ ప్రాంతము ఎన్నిక చేస్తారు. దీనికి ఎక్కువ వర్షపాతము, నీరు నిలువ వుండే తావులు పనికి రావు. ఒండ్రు మట్టిగల బలమగు నేలలు కావాలి. తేమ నేలలు చాలు భూసారము, శీతోష్ణస్థితులమీద ఆధారపడి యీ చెట్లు ఎత్తు, మందము పెరుగుతాయి. అడవులు కాలిపోయి నపుడు ఆ వేడికి తట్టుకొని బ్రతుకగల స్వభావము యీ చెట్టుకు వుంది

నారుమడి : దీని విత్తనాల గింజలు, సూదికొండ ప్రాంతం నుంచి జనవరి ఫిబ్రవరి మాసాల్లో సేకరిస్తారు. ఈ గింజలు నూటికి 30 మొదలు 40 మాత్రమే మొలకెత్తుతాయి. మార్చి మాసంలో 40″×1″×1″ కొలతలుగల నారు మళ్లు తయారు చేస్తారు. మే నెలలో యీ విత్తనాలకు మందులు కలిపి యకరానికి అరబస్తా (సుమారు 30 కేజీలు) విత్తనాలు పోయాలి. తర్వాత నీరు పెట్టాలి నారుమళ్ళకు తెగులు నివారణ మందులు కూడా కొట్టాలి. ఈ విధంగా నారుమడిలో మొక్క 1 సంవత్సరం నుండి 2 సంవత్సరాలు పెంచాలి. ఆ మొక్కలు తీసి వాటి తలలు నరికి పిల్ల వేళ్ళు తీసివేయాలి వీటిని టేకు స్టంపులు అంటారు. ఈ స్టంపులను తేమ వున్నచోట వాటిని పాతేవరకు జాగ్రత్త చేయాలి.

తోటల పెంపకం : ఇందుకు ఎన్నిక చేసిన ప్రదేశాలను బాక్టీరియా లేకుండా మార్చి, ఏప్రియల్ మాసాలలో పూర్తిగా కాల్చి వేయాలి. వెంటనే రెండవసారి కలుపు మొక్కలు, తుప్పలు పూర్తిగా పోయేవరకు మళ్ళీ మంటపెట్టాలి. ఈ ప్లాటులో 6′×8′ లేక 8 1/2×8 1/2 దూరము వుండునట్లు వెదురుపుల్లలు భూమి మీద గుచ్చాలి. జూన్, జూలై మాసాల్లో తొలకరించగానే ముందు తయారుచేసివుంచుకున్న స్టంపు ఒక్కొక్కటి ఒక్కొక్క వెదురు పుల్ల వద్ద గునపంతో కన్నముచేసి దానిలో వుంచి దట్టంగాకూరాలి. దూరమునుబట్టి యకరానికి 605 మొదలు 1,210 మొక్కల వరకు పడతాయి. జూలై మాసంలో ప్రతి మొక్కకు ఒకటిన్నర అడుగులు దూరమువుండు వరకు కలుపు తీయాలి. మళ్ళీ అక్టోబరు, నవంబరు మాసాలలో రెండవసారి కలుపు తీసి వరుసలలో చచ్చిన మొక్కలు తీసివేసి మంచి మొక్కలు పాతాలి, డిశెంబరు మాసములో మళ్ళీ కలుపు తీయాలి. రెండవ సంవత్సరంకూడా యిదే విధంగా కలుపు తీయాలి తర్వాత 6′×6′ మొక్కలయితే 5వ సంవత్సరము, 8 1/2×8 1/2 మొక్కలయితే 7వ సంవత్సరము మొక్క విడిచి మొక్క కొట్టివేయాలి. అప్పటికి యీ మొక్కలు 15 మొదలు 20 అడుగుల వరకు పెరుగుతాయి. ఈ మొక్క 12 అంగుళాల నుంచి 14 అంగుళాల వరకు మందం వుంటుంది. కనర మడత మంచాలు, బండిపోలు కర్రలు, వాసాలుగా వుపయోగ పడతాయి. వీటి అమ్మకంతో ఆదాయం ప్రారంభమవుతుంది. 14వ సంవత్సరం మిగిలిన మొక్కలలో వంకరగా వున్నవి, వెర్రి తలలు వేసినవి, బలహీనముగా వున్నవి తీసివేయాలి. దీనిని సిల్వీకల్చరు లేక డయాగనల్ థిన్నింగ్ అంటారు. ఇవి దూలాలకు ఎలక్ట్రిక్ స్తంభాలకు పనికివస్తాయి అందువలన రెండవ దఫా ఆదాయము వస్తుంది మిగిలిన మొక్కల నుంచి 27వ సంవత్సరము, మూడవసారి 40వ సంవత్సరము, నాల్గవసారి డయాగనల్ తిన్నింగుచేసి యకరానికి 100 మానులు వుంచవచ్చును. ఈ మొక్కలు మాత్రము 80 సంవత్సరముల వరకు పెంచబడుతాయి. అపుడు వాటిని నరికితే మానులు నుంచి మంచి దూలాలు, చెక్కలు, కమ్మిలు యిస్తాయి.

ఈ ప్రాంతంలో తయారైన టేకు మిగతారకాల కన్న ఒక విధంగా ప్రశస్తమైనదనే చెప్పాలి. దీనిని గోదావరి టేకు అని పిలుస్తారు. దీనిని చెక్కలుగా కోసినపుడు అందమైన డిజైనులు గల చారలు కనిపిస్తాయి. అందు వలన విలాసంగా తయారుచేయు ఫర్నీచరు, విలాస వస్తువులకు, డిజైన్ గల గుమ్మాలు తయారు చేయడానికి దీనికి ప్రాధాన్యంయిస్తారు. అందు వలన బొంబాయి, బల్హార్షా మొదలగు ప్రాంతాలలో దీనికి మంచి గిరాకివున్నది. మంచి ధర కూడా వస్తుంది. కలుపు తీసేటపుడు దర్భగడ్డి త్వరగా చావని కారణం చేత యీసమస్య తప్ప, యీ ప్రాంతంలో టేకు తోటలు విజయవంతముగా పెంచబడు తున్నాయని చెప్పవచ్చు.


ఆదాయ-వ్యయాలు

పైన సూచించిన విధముగా 7వ సంవత్సరము, 14వ సంవత్సరము, 27వ సంవత్సరము, 40వ సంవత్సరములో థిన్నింగ్ చేయడం వల్ల వచ్చిన కలప ఆదాయము దాని పెట్టుబడికి సరిపోతుంది. ఆతరువాత ఆఖరిసారిగా తీసివేసేమానులు ఒక్కొక్కటి రూ. 1000/లు మొదలు రూ. 1,500/- కనీస ధర కట్టినప్పటికీ 100 మానులకూ సరాసరిని రూ 1,25,000/- ఆదాయం వస్తుంది 80 సంవత్సరాలలో రూ. 1,25,000/-లు ఆదాయం సారాసరిగాచూస్తే రూ. 1,565లు వుంటుంది సారవంతమైన పల్లపు భూముల వ్యవసాయము, అందుకు శ్రమ లెక్కవేసుకుంటే దీని ఆదాయమే ఎక్కువగా వుంటుంది. కానీ దీర్ఘకాలం వేచివుండాలి. ★

వేషభాషలద్వారా జాతీయ సమైక్యత

* ముద్దసాని రాంరెడ్డి

భర్తృహరి సుభాషితాల్లో "భూషలుగావు మర్త్యులకు భూరి మయాంగద తార హారముల్" అంటూ మానవులలంకరించు కొను తారహారములు, సుమహారములు, పరిమళ సుగంధ ద్రవ్య లేపనములు ఏవీ యథార్థమగు భూషణములు కావనీ, మానవుణ్ణి ఆజన్మాంతం భూషితం చేసి భాసింప జేసేది వాగ్భూషణం మాత్రమే నని ప్రకటించాడు. నిజమే మరి. నశ్వర మగు శరీరాన్ని క్షణికములగు అలంకారములు ఏ విధంగా భూషితం చేయ గలవు? మానవుణ్ణి దేవతగా తీర్చి దిద్ది సదసద్వివేచనతో భూషించి భాసింప జేయుశక్తి గలది ఒక్క వాగ్భూషణం మాత్రమే! తదితరము లేవీ దీనితో సరితూగ జాలవు. వాక్కును హృదయ రంజకంగా అలంకరించి మెరుగులు పెట్టునది భాష. మానవుని భావాభినివేశానికి, భావ వ్యక్తీకరణకు భాషయే మూలకందము. భావ సమైక్యతకు పట్టుగొమ్మ భాష. భావ వ్యక్తీకరణకు భాష అక్షర రూపము. నిశ్శబ్దాన్ని శబ్దమయంచేయు శక్తిమయి భాష. భావాన్ని వ్యక్తం చేసి భావోద్రేకాన్ని పరిసమాప్తం చేసేది భాష. సమాజంలో భావ సమైక్యతను సాధించ సంకల్పించినపుడు భాషకు తదాశయ సిద్ధిలోగల ప్రాముఖ్యతను గమనించకుండా ఉండలేము. అనేక భావములను ఒక భాష అభివ్యక్తం చేసినట్లే, ఒకే భావాన్ని అనేక భాషలు ఏకరీతిగా వ్యక్తం చేయగలవు. భాష మారితే భావాలు మారి తీరాలనే సిద్ధాంతం సరికాదు. అట్టి భాష తెలుగైనా, ఉరుదైనా, తమిళమైనా, కన్నడమైనా మరేదైనా వాటిలో అంతర్వాహినిగా ప్రవహించే భావ వాహిని మాత్రం ఒకటే! భారతదేశం బహుభాషలకు, పెక్కు మతాలకు, పలు సంస్కృతులకు ఆటపట్టు. భారతీయ భాషలకు సంస్కృత భాషయే జనని కాబట్టి భారతదేశభాషలలో ఒకే భావం, ఒకే సాంప్రదాయం ఒకే సాహితీ సంవిధానం పూసలలో దారం వలె గుది గుచ్చబడి యుండుట చేత, అనాది నుండి యీనాటిదాకా భారతీయులు భిన్నత్వంలో ఏకత్వాన్ని అవిచ్ఛిన్నంగా అనుభవించ గలుగు తున్నారు.



బ్రిటిష్ పాలనా హయాంలో ఖ్యాతిగడించిన దేశ నాయకులందరూ దేశభాషల ద్వారా ప్రజానీకాన్ని సంబోధించి, వారిలో స్వాతంత్ర్య జ్యోతిని రగిలించి, చైతన్యం కలిగించి, భావ సమైక్యతను సాధించి దేశాన్ని ఏక సూత్రంపై నడిపించారు. స్వాతంత్ర్యసాధనకు చిత్తశుద్ధితో కృషి సల్పిన జాతీయ నాయకులందరూ మాతృ భాషతో పాటు కొన్ని ప్రాంతీయ భాషలను కూడా అభ్యసించారను విషయం అందరెరిగినదే! వారు దేశం నలుమూలలా పర్యటించి ఆయాప్రాంతీయులను వారిమాతృభాషలలో ఉద్బోధించి భావ సమైక్యతతో పాటు, దేశసమైక్యతను కూడ సాధించారు. జాతీయనాయక మణులుగా ఖ్యాతి నార్జించిన, ఆజాద్, దాస్, బోస్, లాల్, పాల్, మాలవ్య, శాస్త్రి లాంటిప్రముఖులెందరో బహు భాషా కోవిదులు కావడం వలన వారు దేశప్రజలకు మరెంత సన్నిహితులు కాగలిగారు. వారు బహు భాషా కోవిదులేగాక, బహుభాషా నిష్ణాతులై ఎన్నో రచనలు చేసి ప్రజానీకాన్ని ప్రగతిపథం వైపు పయనింప జేశారు. నాయకుల మాట అటుంచి సామాన్యుల విషయం తీసుకున్నా, బహు భాషలలో ప్రవేశమున్న వారికి ప్రజలలో పలుకుబడి మరియు ప్రజారంజకత్వం అబ్బుతుందనుటలో విప్రతిపత్తియుండదు. 'ఏక నామం సదాప్రీతి' యను నానుడి ననుసరించి ఏకరీతి వేష భాషల నభిమానించు ప్రజల్లో పరస్పరం ఉండు అన్యోన్యత, ఆప్యాయత, అన్య భాషా వేష ధారుల యెడ సాధారణంగా ఉండదు. ఒకే జాతి విహంగాలు కలసి విహరించు చందమున, ఆయా ప్రాంతీయ భాషా వేషసంతతికి చెందిన వారు తమలో తామున్నంత సన్నిహితంగా తదితరులతో ఉండలేక పోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం మత మనుటకంటె ప్రాంతమనుటే సమంజసంగా ఉంటుంది. ప్రత్యేక వేషభాషా సంతతికి చెందకున్నా, మాకు ప్రత్యేక తెలంగాణం కావాలన్న వాదం ప్రాంతీయ సంకుచితత్వానికి సంబంధించిన దేయని యీ సందర్భంలో పేర్కొనవచ్చు. కనుక భారతీయుల్లో వేళ్ళు పాతుకొనియున్న వేష భాష దురభిమానం ఎంత త్వరగా నశిస్తే, దేశం అంత శీఘ్రంగా సుసంఘటిత మవుతుంది. భాషా వేష వైవిధ్యాలను ప్రజానీకంలో అంతరింప జేయడానికి ప్రభుత్వ బాధ్యత కంటె, ప్రజల బాధ్యతే అత్యధికంగా ఉంది. భారతీయుల్లో జాతి విచక్షణ, భాషా భేషజం, మత సంకుచితత్వం వైదొలగాలంటే యీ గడ్డపై పుట్టి పెరిగిన హైందవ, క్రైస్తవ, సిక్కు, మహమ్మదీయులు ఒండొరులను సక్రమంగా అవగాహన చేసుకొనడానికి తమ మాతృభాషతో పాటు ఒకటి రెండు ప్రాంతీయ భాషలను కూడ అభ్యసించి వారితో సన్నిహిత సంబంధాలను పెంపొందించుకొన వలసియుంది. త్రిభాషా సూత్రము ననుసరించి అన్ని రాష్ట్రాల ప్రజలు ఏవేని మూడు భాషలను నేర్చుకొనడం వలన ప్రజల్లో అవగాహనదృక్పథం అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంది. త్రిభాషా సూత్రం ఆచరిస్తే హిందీ మాతృభాష కలవారు ఒక్క ఇంగ్లీషునే నేర్చుకొని దక్షిణ రాష్ట్రాల భాషలను న్యూన భావంతో చూస్తున్నారను అపప్రథ యుండుట వలన తమిళనాడు లాంటి రాష్ట్రాలు హిందీని అభ్యసించడానికి విముఖతను వ్యక్తం చేస్తున్నవి. హిందీ మాతృ భాషగల రాష్ట్రాలలో ఏదేని ఒక దక్షిణ భాషను పాఠశాలలలో నిర్బంధ పఠనీయ భాషగా ప్రవేశ పెట్టినచో భాషల యెడ ఆయా ప్రభుత్వాలు వ్యక్తం చేయు దురవగాహన తొలిగిపోగలదు. ఆయా భాషల ప్రచారమునకు ప్రభుత్వాలు చేయు సేవ కంటె స్వచ్ఛంద సంస్థలు గణనీయమగు అభివృద్ధిని సాధించగలవు. భాషను అభ్యసించుటలో అక్షరాస్యులు చూపించు చొరవకన్న నిరక్షరాస్యులు కనబరచు అభివృద్ధి గణనీయంగా ఉంటుంది. పొట్ట చేత బట్టుకొని భుక్తి కోసం నగరాలకెగ ప్రాకు పల్లెటూరి ప్రజలు ఒకటి రెండు సంవత్సరాల్లో రెండు మూడు భాషలు మాట్లాడ నేర్చుకొనుట మనమెరిగిన అంశమే! నవనాగరికత తొణకిసలాడు మహానగరాల్లో అన్ని ప్రాంతాల ప్రజలు, అన్ని మతాల మనుషులు మనుగడ సాగిస్తున్నారు. తెల్లవారింది మొదలు నడిరేయిదాకా సమస్త జనులు స్వామి కార్య నిమిత్తమో, స్వకార్య నిర్వహణార్థమో, వృత్తి వ్యాపారోద్యోగ రీత్యా ఒండొరులను కలుసుకుంటూ తమ కార్యములను నిర్వర్తించు కుంటున్నారు. నాగరికతా నగరాల్లో నరులకు నిర్విరామంగా ఒకరితో ఒకరికి ఏదో ఒక పని ఉండనే ఉంటుంది. ఆయావ్యక్తులు ఒండొరుల కార్య సాఫల్యత కొరకు బిజినెస్‌లైక్ (Business-like) ధోరణిలో కలిసికొనడం కంటే, ఇన్‌ఫార్మల్ (Informal) గా కలసి కొని, సమరస భావంతో కార్యార్థి, కార్య నిర్వాహకుడితో అతని భాషలో అనునయంగా ముచ్చటిస్తే కార్యార్థికార్యములు సులభంగా నెరవేరుటయేగాక వారి వైయక్తిక సంబంధాలు కూడా మెరుగు పడుటకు అవకాశం ఉంటుంది. కేవలం లౌకిక దృష్టితోనేగాక పరస్పరావగాహన దృక్పథంతో ఉభయులూ వ్యవహరిస్తే, పూవుకు తావియబ్బినట్లుంటుంది. వ్యక్తుల్లో పరస్పరానురాగం, సఖ్యత, సౌభ్రాతృత్వం, వర్ధిల్లాలంటే, వారి ఆచార విచారముల్లో వేషభాషలలో, సారూప్యము, సాదృశ్యము సమకూర్చుట అవసరము. ఇట్టి సుగుణాల నలవరచు కొనుటకు అక్షరాస్యులు రెండు మూడు భాషలను అదనంగా నేర్చుకొన వలసిన అవసరం ఉంటుంది. అన్యభాషలను నేర్చుకొనడం మనలో కొందరికి వృత్తి రీత్యా, మరికొందరికి వ్యాపారరీత్యా, ఇంకొందరికి వ్యవహారరీత్యా తప్పనప్పుడు, తదితరులు తమంత తామే అట్టి పనికి పూనుకుంటే ఉభయతారకంగా ఉండదూ? స్వభాషా వ్యామోహం, అన్యభాషా నిరసన భావం నాగరికుల నాగరికతకే గొడ్డలిపెట్టు! అందువల్ల అతని కొరిగేదేమీ లేకపోగా, అతని సంకుచిత ధోరణి అతని భావి జీవితానికి కంటకంగా పరిణమిస్తుంది. జలంకంటె రక్తం గాఢమైనట్లే, స్వభాషా వ్యామోహం, అన్య భాషాభినివేశమున కన్న ప్రగాఢమైన దనవచ్చు. అయినా మానవుని దృష్టిలో రక్తానికున్న విలువ నీరుకు కూడా ఉంటుంది. నీరు, రక్తం పరస్పరాధారాధేయము లైనట్లే, ఆయా ప్రాంతీయ భాషల ప్రగతి, పొరుగు భాషల అభ్యుదయ భావాలపై ఆధారపడి ఉంటుంది. కనుక ప్రాంతీయ భాషల పట్ల న్యూనతా భావం కలిగి యుండుట అర్థరహితము, అనర్థదాయకము. ప్రాంతీయ

భాషల అధ్యయనం, పరస్పరావగాహనము పెంపొందించి, సుహృద్భావమును దృఢతరం చేసి, మాతృభాషలకు నూతనాలంకారములను చేకూర్చుతుంది.


పాశ్చాత్యుల అనుకరణ

ప్రాంతీయ భాషల అధ్యయనం దేశప్రజల భావసమైక్యతకు ఎలా దోహదం చేస్తుందో, ఆయా రాష్ట్రాల వస్త్ర ధారణానుకరణం కూడ దేశ సమైక్యతకు ఆవిధంగా దోహదం చేయగలదు. "When you are in Rome, be like a Roman" అను నానుడి అందరు విన్నదే! రోమ్‌లో ఉన్నప్పుడు రోమను వలె నుండుట అవసరమైనపుడు, ఇండియాలో నున్నవాడు, ఇండియన్ వలెనుండ గూడదా? పై నానుడి విదేశంలోనే వర్తిస్తుంది కాని స్వదేశంలో వర్తించదా? ప్రపంచంలో గల నాగరిక రాజ్యాలన్నిటిలో నివసించు ప్రజలకు, ఆయా దేశాల వాతావరణమునకు సరిపడు వస్త్రధారణ విధానమంటూ ఉంటుంది. అలాగే భారతదేశ భౌగోళిక వాతావరణ పరిస్థితుల ననుసరించి, భారతీయులకు గూడ ఒక పంథా కట్టు, బొట్టు పద్ధతి అనాదినుండి ఆచరణయందున్నది. కాని యీనాడెంత మంది నాగరికులనబడువారు వస్త్ర ధారణ రీత్యా భారతీయులనిపించు కుంటున్నారు. భారతీయుల కట్టు బొట్టు జుట్టు యీనాడేమైనట్టు! పాశ్చాత్య నాగరికత మనకు భావదాస్యంతోపాటు, వేష భాషా లంపటత్వాన్ని కూడ రుద్దింది. ప్రచండ వేదాంత జ్ఞాన ప్రాభవం కల ప్రాచ్య భారతంలో పాశ్చాత్య నాగరికత ప్రాచుర్యం పొందవలసిన అవసరం ఏముంది? నాగరికతా భానుడు ప్రప్రథమంగా భరత ఖండంలోనే ఉదయించి పాశ్చాత్య దేశాలను ప్రభావితం చేశాడని నేటికీ ప్రగల్భాలు పలుకుటలో అర్థమేముంది? నవనాగరికతలో, శాస్త్ర పరిజ్ఞానంలో, పాశ్చాత్య దేశాలను తలదన్ను జపానులో నేటికీ నాటి సంస్కృతీ సదాచారములు విలసిల్లడం లేదా? మానవాళి బట్ట కట్టు పద్ధతి భౌగోళిక శీతవాతాతపముల నిమ్నోన్నతలను బట్టి మారుచుండును గదా! చైనీయుడు, జపానీయుడు, ఆంగ్లేయుడు, అరబ్బువాడు, నీగ్రోవాడు నివసించు దేశాల్లో వాళ్ళవేషం, భాష, రంగు, రూపు, ఆకారం, అలంకారాది విషయాల్లో గల తేడా జగమెరిగిన సత్యమే! దేశకాల వాతావరణ స్థితిగతులను బట్టియే వేషధారణలో మార్పు గోచరిస్తుంది. అది సహజము; అట్టి కట్టు బాట్లను త్రోసి రాజనుట సాధ్యము కాదు, అభిలషణీయ మంతకంటె కాదు. "దేశం తీరువేషం" అన్న నానుడికి అర్థం ఇదే! స్వకీయ సదాచారములను వదలి, పరకీయ దురాచారములను పెనవేసి కొనుటలో మనకు మనమేసాటి. శ్రీపానుగంటివారు తమ "సాక్షి"లో "ఎంతసేపు మనది గొడ్డుగేదె, పైవానిది కామధేనువు; మనది చీకు, పైవానిది సేవ; మనది అంట్లకుండ, పైవానిది అపరంజికుండ; ఇట్టి దుర్బుద్ధి చేతనేగదా మనము మొదటి నుండియు స్వచ్ఛమైన జాతీయత్వమును జంపు కొంటిమి. మన జాతికి, మన దేశకాల పరిస్థితులకు తగిన బట్టకట్టు మనవారు మన కేర్పాటు చేసియుండగా,... మిస్టర్ జాన్ గారిని చూచి బొంత అరటి కాయ పోలిక పంట్లముతో తయారైన నాగరికుడి నేమనవలయునో తెలియ కున్నది. సంవత్సరమున నైదు మాసములు 114 డిగ్రీల ఉష్ణోగ్రత చే మరగి మంగలములో మాడి పోవుచున్న మనకీ పాశ్చాత్య వేషాల మోజు ఎందులకో యను చింత కాస్తంత యెన కలుగక పోవుట మన పూర్వులగు మహర్షుల మహాపాపము కాని మరొకటియా." అంటూ అతి దీనంగా సాక్ష్యమిచ్చినా, మనకు మన పూర్వులపైన గాని, మన సంస్కృతి పైనగాని, తుదకు రచయిత పైనగాని జాలి కలుగలేదు. నాటికీ నేటికీ కాల ప్రవాహంలో ఎంతో నీరు ప్రవహించింది. బొంత అరటి కాయ పంట్లములు మరీ బిగుసుకుపోయి గొట్టం ప్యాంట్లకు చోటు కల్పించాయి. బుష్ షర్టులు బిగుతులో బ్లౌజుల చోటు నాక్రమించ ఉవ్విళ్ళూరుతున్నవి. శరీరాని కంటుకు పోయిన బట్టకట్టు వల్ల ఆరోగ్యం క్షీణించి, చర్మవ్యాధులు ప్రబలు తాయని డాక్టర్లు చెవి నిల్లు గట్టుకొని చెప్పినా, వినిపించుకునే యువతరం కరువైపోయింది. వస్త్రాలంకరణమే మోజుగా కలవారు పాశ్చాత్య బట్టకట్టు పద్ధతులనే ఎందుకు స్వీకరించాలి? భారతదేశం, భిన్న మతాలకు, జాతులకు సంస్కృతులకు కూడలి పట్టు అయినట్లే భిన్న వస్త్రధారణకు కూడ నిలయమను సంగతి సర్వులెరిగినదే! దేశంలో గల పదునెనిమిది రాష్ట్రాలలో పదునెనిమిది విధములగు బట్టకట్టు పద్ధతులున్నవి. వాటిని స్వీకరించుట వలన సరసుల మోజు తీరుటయే గాక, జాతీయతా దృక్పథమును కూడ అలవరచు కున్నవార మగుదుముగదా! ఒకరి భాష నొకరు నేర్చిన అవగాహన అలవడునట్లు, ఒకరి వస్త్ర ధారణ రీతిని మరొకరు స్వీకరించుట వలన ఆత్మీయత పెంపొందును. రమ్జాన్, పొంగల్, ఓనమ్, ఉగాది లాంటి పర్వదినములలో ఆయా మతముల వారు తమ మిత్రులకు శుభాకాంక్షలను తెలియ జేసికొను సందర్భంలో, వారి మతాచార విహితములగు వస్త్రములను ధరించి, వారి ముందు ప్రత్యక్షమైనపుడు వారి సంతసమునకు పట్టపగ్గము లుండునా? ఉదాహరణకు రమ్జాన్ శుభ దివసమున మహమ్మదీయ మిత్రునింటికి అతని హైందవ సోదరు డొకడు శేర్వానీ ధరించి, చుడీదార్ పైజామా బిగించి, సలీమ్ షాహీ జూతాలు వేసుకొని, అపర నవాబులా మందస్మితవదనారవిందంతో "ఈద్ ముబారక్" అంటూ స్నేహితునింట అవతరిస్తే, అతని ఆనందాని కవధులుంటాయా? ఇలాగే ప్రతి మిత్రుడు తన అన్యజాతి స్నేహితునింటికి పండుగ దినముననో, శుభసమయాల్లోనో అతడభిమానించు వేషంలో ప్రత్యక్షమై అతని భాషలో పలుకరిస్తే ఉబ్బి తబ్బిబ్బై పోడా? ఇలాంటి పద్ధతులు భావ సమైక్యతకు, దేశ సమైక్యతకు దోహదం చేయవా? ఇట్టి పద్ధతులను లౌకిక దృష్టితోగాని, పాక్షిక దృక్పథంతో గాని వీక్షించి ఈసడించు కోనవసరంలేదు. మానవుడు సంఘజీవి. సంఘంలో ఉంటున్నపుడు, సంఘీ భావాన్ని పెంపొందించు కొనుటకు వలయు మార్గాలన్నీ కొల్లగొట్టి స్నేహ సౌహార్ద్రములను పెంపొందించుకొని, దేశ సమైక్యతకు చేయూత నిచ్చుట విజ్ఞుల కర్తవ్యము సంఘజీవులు ఒండొరుల ప్రేమాభిమానములను చూరగొనుటకు సంస్కారయుత మగు చర్యల నన్వేషించడం స్వార్థపరత్వ మనిపించదు. పాశ్చాత్య వేషభాషా వ్యామోహమున కంటె, భారతీయ వేషభాషల ఆలంబనం సర్వశ్రేయములకు మూలము. అందువలన భారతీయులలో జాతీయతా భావం ఏర్పడి, దేశం ప్రగతి పథంలో పయనించుటకు ఆస్కారం కలుగుతుంది. ★

ఆంధ్రప్రదేశ్‌లో అనావృష్టి

మే నెలలో వర్షాలు పడడంతో 1971–72 వ్యవసాయ సంవత్సరం ఆశాజనకంగా ఆరంభమైంది. అయితే జూన్ నెలలో రాయలసీమ, కోస్తా జిల్లాలలో వర్షాలు సరిగ్గా పడలేదు. రాయలసీమలో 37 శాతం, కోస్తా ఆంధ్రలో 12 శాతం, రాష్ట్రం మొత్తంమీద 8 శాతం వర్షాలు తగ్గిపోయాయి. జూలై నెల మరీ అధ్వాన్నంగా వుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ వర్షాలు లేవు. ఆ నెల అంతా యించుమించు వర్షాలు లేకుండానే వుంది. మొత్తం 21 జిల్లాల్లోనూ 18 జిల్లాల్లో 29 శాతం నుంచి 80 శాతం వరకు వర్షాలు తగ్గిపోయాయి. తెలంగాణాలో జూలైలో 61 శాతం వర్షపాతం లోపించింది. ఆ నెలలో కోస్తా ఆంధ్రలో 41 శాతం, రాయలసీమలో 29 శాతం వర్షపాతం లోపించింది. మొత్తం, రాష్ట్రంలో 51 శాతం మేరకు వర్షపాతం వెనకబడింది. ఆగస్టు మూడోవారం వరకు రాష్ట్రమంతటా వర్షాభావ పరిస్థితి కొనసాగింది. దీనితో అంతటా పరిస్థితులు మరీ క్షీణించాయి.

ఆగస్టు ఆఖరివారంలో కొద్దిగా వర్షాలు పడ్డాయి. అయితే వ్యవసాయ కార్యక్రమాల్ని ప్రారంభించడానికి అప్పటికే బాగా



* సేద్యపు నీటి బావిని లోతు చేస్తున్న వర్తమానకోట రైతులు



* రైతుతోపాటు బక్కచిక్కిన పశువులు

ఆలస్యం అయిపోయినందువల్ల యీ వర్షాలవల్ల ఏమంత లాభం లేకపోయింది. అంతకుముందు వరసగా తొమ్మిది నెలలపాటు వాతావరణం పొడిగా వున్నందువల్ల ఈ వర్షాలవల్ల ప్రయోజనము జరగలేదు.

పంటల సాగు


రాష్ట్రమంతటా వర్షాలు లేకపోవడంచేత కాలువ సాగుకాని చోట్ల చెరువులు మొదలైన నీటి వనరులన్నీ ఎండిపోయాయి. సాగునీటి చెరువులు పూర్తిగా ఎండిపోవడమో, కొద్దిపాటి వర్షపు నీటితో వుండీ లేనట్టు వుండడమో జరిగింది. ఉదాహరణకి రాయలసీమలోని చిత్తూరు జిల్లాలో ఆగస్టు నెల మధ్యలో మొత్తం 3063 చెరువులకి 2889 చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. మిగతా చెరువుల్లో 15 రోజులకు మాత్రమే సరిపడ నీరు వుంది. తెలంగాణాలోని హైదరాబాదులో 2249 చెరువులకి 2247 చెరువులు ఎండిపోయాయి. రెండే రెండు చెరువుల్లో మాత్రమే నీరు వుంది అదిన్నీ పదీ పదిహేను రోజులకు మాత్రమే సరిపడుతుంది.

కోస్తాఆంధ్రలోని మెట్టప్రాంతాల్లో కూడా యిదే పరిస్థితి వుంది. కృష్ణాజిల్లాలోని మెట్టప్రాంతాల్లో గల 910 చెరువులకి 833 చెరువులు ఎండిపోయాయి, 77 చెరువుల్లో 10 రోజుల నుంచి 15 రోజులవరకు సరిపడనీరు మాత్రమే వుంది. రిజర్వాయర్లలోని నీటి పరిస్థితీ యిదే విధంగా వుంది. నిజామాబాదుజిల్లాలోని నిజాం సాగర్‌లోనూ, ఆదిలాబాదు జిల్లాలోని కడెం రిజర్వాయరులోనూ ఆగస్టు మూడోవారంవరకు కనీసం రిజర్వాయరు తూముల అట్టడుగు రాతి లెవెల్ వరకైనా నీళ్ళు లేవు. ఆగస్టు ఆఖరివారంలో పడ్డ వర్షాలవల్ల కొన్ని చెరువుల్లో 15 నుంచి 30 రోజులకు సరిపడ్డ నీరు చేరిందిగాని చాలా ప్రాంతాల్లో మాత్రం ఏ మాత్రం ప్రయోజనం కలుగలేదు.

చెరువుల ద్వారా సేద్యానికి నీరు లభించక పోవడం వల్ల సేద్యపు పంటల సాగు ప్రారంభం కాలేదు. కొన్ని ప్రాంతాల్లో ముందుగా కురిసిన వర్షాలకు నారు మడి వేసినప్పటికీ ఆ తర్వాత నీటి సరఫరా లేకపోవడం చేత నాట్లు పడక నారంతా ఎండిపోయింది.










ఆంధ్రప్రదేశ్

వ్యవసాయోత్పత్తి

వుంటుంద









ో అనావృష్టి


ష్టం రు. 600 కోట్లు

అంచనా











* నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం సమితికి చెందిన తిరువీధిపాడు గ్రామంలో ఎండిపోయిన వరిపైరు.

ఖరీఫ్ పంట కాలంలో సాధారణంగా మాగాణి పంటల్ని 64.56 లక్షల ఎకరాల్లో వేయడం రివాజు అయితే యీ ఏడాది 31.60 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగుజరిగింది దీనిలో ఆగస్టులో ఆలస్యంగా పడిన వర్షాల తర్వాత జరిగిన సాగు కూడా కలవడం జరిగింది. తెలంగాణా ప్రాంతంలో 73 శాతం, రాయలసీమలో 63 శాతం, కోస్తా ఆంధ్రలో 32 శాతం—మొత్తం రాష్ట్రం మీద చూస్తే 47 శాతం వర్షపాతం తగ్గింది. పంట దిగుబడి కూడా తక్కువగా వుండొచ్చుగనుక యీ ఏడాది రాష్ట్రంలో పంట ఉత్పత్తి బాగా తక్కువ వుంటుంది.

మెట్ట పంటల పరిస్థితికూడా యిదేవిధంగా అధ్వాన్నంగా వుంది. ఖరీఫ్ పంటకాలంలో మామూలుగా 144.85 లక్షల ఎకరాలలో మెట్ట పంటల్ని వేస్తుండేవారు. ఈ ఏడాది మాత్రం 109.33 లక్షల ఎకరాల్లోనే మెట్ట సాగు జరిగింది. అంటే 24 శాతం సాగు తగ్గిపోయిందన్న మాట. మెట్ట సాగు ప్రాంతాలోని పంట కూడా వర్షాలు లేకపోవడంతో సాగైన దానిలో 60 నుంచి 70 శాతం ప్రాంతంలో పంట చాలా వరకు ఎండిపోయింది

కోతలు జరిగిన తర్వాతగాని అసలు లెక్కలు తెలియవు. ఉజ్జయింపుగా చెప్పాల్సివస్తే యీ ఏడాది పంట దిగుబడి తగ్గినందువల్ల రూ. 600 కోట్ల మేరకు వ్యవసాయోత్పత్తికి నష్టం జరిగిందని అంచనా.

రాష్ట్రంలోని 21 జిల్లాలూ కరువుకు గురి అయ్యాయి. ఇటీవలి నివేదికల ప్రకారం మొత్తం రాష్ట్రంలోని 197 తాలూకాల్లోనూ 171 తాలూకాలు—అంటే 87 శాతం—కరువుకు గురి అయ్యాయి. రాష్ట్రంలో వున్న 26,199 గ్రామాలోకి 17,353 గ్రామాల్లో—అంటే 66 శాతం గ్రామాల్లో—కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. 416.28 లక్షల రాష్ట్రజనాభాలోనూ (జంట నగరాల జనాభా మినహాయించి) 231.47 లక్షలు—అంటే 56 శాతం జనాభా-కరువుకు గురి అయ్యారు.

ఈ ఏడాది పంటలు పండించే ప్రాంతం బాగా తగ్గిపోవడం వల్లా, కొన్ని ప్రాంతాల్లో అసలు పంటలు వేయకపోవడంవల్లా వ్యవసాయకూలీలకు, మామూలు రైతులకు పని లేకుండాపోయింది. వ్యవసాయ కూలీలకు తగినంత పని వుండడంలేదని జిల్లాలనుంచి వస్తోన్న వార్తలవల్ల తెలుస్తోంది. పంట కాలంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి కార్మికులు వెళ్తూవుండే అలవాటుకు కూడా యీ యేడాది అంతరాయం ఏర్పడింది. అందువల్ల అంతంత మాత్రంగా వున్న స్థానిక వసతులు పూర్తిగా సరిపోవేట్టులేవు.


ఏదో కొద్దిపాటి భూమి వుండి స్వంతంగా వ్యవసాయం చేసుకుని తీరిక వేళల్లో యితర పనులు చేసుకుని బొటాబోటీగా జీవిక వెళ్ళబోసుకొనే సన్నకారు రైతుల్ని కలిపితే యీ కరువుకు గురైన వ్యవసాయ కూలీలు 37.88 లక్షల మేరకు వున్నారు.

ఆహార ధాన్యాల పంపిణీ

క్షామ పరిస్థితులు ప్రారంభం కావడంతో ధాన్యం, ముతక ధాన్యాల ధరలు కొద్దికొద్దిగా పెరుగజొచ్చాయి. ఇందువల్ల యీ పరిస్థితిని ఎదుర్కొనేందుకై ప్రభుత్వం తమ నిలవ నుంచి 10,000 టన్నుల బియ్యాన్ని ఆగస్టు నెలలో విడుదలచేసి సూపర్ బజార్లద్వారా, తదితర ఏజన్సీల ద్వారా పంపిణీ ప్రారంభించింది చిల్లర షాపుల ద్వారా పంపిణీకి వీలుగా పల్లెల్లవద్ద బియ్యాన్ని సేకరించి ఆయా ప్రాంతాల్లో విడుదలచేసే ఏర్పాటు కూడా జరిగింది

కరువు పరిస్థితులు అధికం కావడంతో బియ్యాన్ని మరింత ఎక్కువగా విడుదలచేసే ఏర్పాట్లు జరిగాయి 1971 సెప్టెంబరు నుంచి 1972 మార్చి మాసాంతం వరకు నెలనెలా 20 వేలు మొదలుకొని 25 వేలు టన్నుల వరకు బియ్యాన్ని విడుదలచేయాలని ప్రభుత్వం ఉద్దేశించింది. రాష్ట్రమంతటా 4,500 చవుకదుకాణాలను ప్రారంభించడం జరిగింది. అవసరమైతే యింకా ఎక్కువ దుకాణాలను కూడ ప్రభుత్వం తెరవాలని భావిస్తోంది. చవుక దుకాణాలద్వారా పంపిణీ చేయడానికై భారత ఆహార సంస్థ ద్వారా రాజస్థాన్ నుంచి సజ్జలు తెప్పించుకోడానికి ఏర్పాట్లుకూడా జరిగాయి ధరలను అదుపుచేసి, ముతక బియ్యాన్ని పేదవాళ్ళకు అందుబాటులో వుంచే నిమిత్తం వీటిని కిలో ఒక్కంటికి 1 రూపాయి

(తరువాయి 55వ పేజీలో)



*బుచ్చిరెడ్డి పాలెంలో ఎండిపోయిన వరిపైరును పశువులు మేస్తున్న దృశ్యం

త్యాగరాజు కథ

-బి. ఎ. పద్మనాభరావు



తెరతీయగ రాదా....

కలియుగ వైకుంఠం తిరుమల కొండ పైన శ్రీవెంకటేశ్వర స్వామి వెలసిన నగరం మాత్రము తిరుపతే. "కమలేశు జూడని కన్నులు కన్నులే" యని పోతనా మాత్యుడు ప్రవచించినట్లు శ్రీవెంకటేశ్వరుని కనులారా జూచి, పూజించి తరించని భారతీయునికి ముక్తి లభించదని పెద్దల భావన. శ్రీ కృష్ణ దేవరాయులు వెంకటేశ్వరుని ఆలయనిర్మాణం చేసి తన భక్తిని చాటుకొన్నాడు. ఈ నాటి భారత ప్రజలు తమ తీర్థయాత్రలకు మొదటి యాత్రగా తిరుమలేశ్వరుని సాక్షాత్కారమునే యెన్నుకొంటారు. సుమారు తొమ్మిది శతాబ్దాల నుంచి ప్రపంచం నలుమూలల నుంచి జనావళి నాకర్షిస్తున్న దైవం శ్రీ వెంకటేశ్వరుడు. వెంకటేశ్వరుని రాజ్యలక్ష్మి పద్మావతీ దేవి. కోరితెచ్చుకొన్న భార్య అలివేలుమంగమ్మ.

త్యాగరాజు శిష్యబృందంతో మధ్యాహ్నానికి కొండపైకి జేరాడు పుష్కరిణిలో స్నానమాడి స్వామి దర్శనానికి వచ్చేసరికి తలుపులు మూసుకునివున్నాయి. పూజాది విధులు నిర్వహించి పూజారులు యింటికి చేరుకొన్నారు. త్యాగరాజు యెంతటి ఆతృతతో స్వామిని జూడవచ్చాడో, అంతటి నిరాశజెందాడు స్వామి దర్శనానికి కూడా కాల నిర్ణయమా? భగవంతునికీ, భక్తునికి కాలము అడ్డుగా నిలుస్తుందా లేక తన ఓర్మిని స్వామి పరీక్షిస్తున్నాడా? తన భక్తిలో లోపమున్నదా? స్వామిని జూడనిదే తీర్థంకూడా పుచ్చుకోకూడదని నిశ్చల మనస్సుతో, తెరతీయగరాదా— లోనేతిరుపతి వెంకటరమణ— మచ్చరమనులోనే కీర్తన గౌళపంతువాళి రాగంలో గానం చేయసాగాడు. స్వామీ! నాలోని అసూయ యను దురజ్ఞాన్ని పారద్రోలు నీముందున్న తెరను తొలిగించు నాకునేత్రానందాన్ని కలుగజేయి. పంచ భక్ష్యాదులు భుజించు సమయములో అందు ఈగపడి అడ్డు కలుగునట్లు నీ రూపమును దర్శించుట కీయడ్డేమిటి? దివ్య కాంతి ప్రసారమునకు అడ్డుగా మరొక వస్తువుండునా! లేక నాలోని మచ్చరమను పారద్రోలుటకు యీతెర అడ్డయినా, ఆ అడ్డును నీవేతొలిగించు యని కీర్తించగనే, తలుపులు తెరచు కొన్నాయి. స్వామి ముందున్న తెరతొలగిపోయింది, దివ్యకాంతులతో జగజ్జేయమానంగా ప్రకాశిస్తున్న స్వామిని నయనానందకరంగా జూచి బ్రహ్మానందం జెందాడు.

స్వామీ! నిన్ను యేమనివర్ణించేది, నీ దివ్యరూపవర్ణనకు పదివేల కన్నులు కూడా జాలవే ద్వినేత్రుడైననేను యెలావర్ణించేది. నీకీర్తి పుంజములు అష్ట దిక్కులా భాసిస్తున్నాయి నీ నామజపము, నీరూప దర్శనము నాగత జన్మ విశేషము. ఉత్తమగతికి సోపానము నీమధుర నామస్మరణ. నీపాదపంకజముల ప్రకాశమునకుకొలత బద్దలు.

సప్తాద్రి శిఖరవాసా! సకలలోక నివాసా! నీ నామస్మరణ సదా నానోట పలికేట్లు కరుణించు అంటూ స్వామిని తనివిదీరా ధ్యానించి కొండపైపూజారుల ఆతిథ్యాన్నిస్వీకరించి తిరుగు ప్రయాణం కట్టాడు. త్రోవలో నాగపురము లాల్‌గుడి షోలింగ పురములు మొదలైన తీర్థ ప్రదేశముల నీలాయితాక్షిని, దేవి శ్రీమతిని, నరసింహస్వామిని, అనేక కీర్తనలలో సంకీర్తన గావించి యింటి ముఖం పట్టారు.

సాక్షాత్కారం

1845 వ సంవత్సరం, ఏప్రిల్ మాసంలో త్యాగరాజు ద్వితీయ కళత్రము కమలాంబ భర్త చేతులలోనే కన్నుమూసినది. సుఖదుఃఖాల కతీతుడైన త్యాగయ్య భార్య మరణానికి నామమాత్రముగా కన్నీరు గార్చాడు.

ఏకాకయిన త్యాగరాజు తానున్న గృహాన్ని అన్నగారైన జపేశుని కుమారునికిచ్చాడు. రామ నామ సంకీర్తన పరమావధిని నిరంతర కీర్తన రచన సాగించాడు.

రామా! సకల సద్గుణరాశివి, జనకుని అల్లుడవు. జానకి తల్లి భూదేవికున్న ఓర్పు నీ లోనూ వుంది.

కనకాంబరధారుడవు. రాజకులాబ్ధి చంద్రుడవు రామా! నా సర్వస్వం నీవే. సకల దైవాలకు ఆలంబనుడవు. నన్ను నీ వాడు అనుకుంటే చాలు. పరమార్థ తత్వ మెరుగలేని అల్పజ్ఞులు లౌకిక బంధాలలో జిక్కుకొని నీధ్యానం చేయలేకున్నారు. వారికి నీవే మార్గదర్శివి. ఇహలోక సౌఖ్యములకన్న పరలోక సౌఖ్యమే ముక్తి మార్గమునకు ప్రథమ సోపానమనే భావన వారిలో కలుగజేయి. పంచనదీక్షేత్రవాసివి. కంచియందు నెలకొన్నవాడవు. శ్రీరంగంలో శయనించినవాడవు, కాశిని పరిపేష్టించిన విశ్వేశ్వరుడవు. కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వరుడవు. అన్నీనీ ప్రతిబింబాలని ప్రపంచానికి తెలియజెప్పు.

త్యాగరాజుకు ఒక్కొక్కప్పుడు రాముడు తన నింకా పరీక్షిస్తున్నాడని. దయ జూడలేదని చిరుకోపము, అలుక రెండూ కలిగేది. తండ్రి రామునిపై కోపమువస్తే. అలిగి తల్లిని ధ్యానం చేశాడు.

రామా! నీ కీర్తి యెలా వచ్చినదనుకొన్నావు. నా తల్లి చేయిని పట్టుకొన్నందువల్లే. ఆమె నీ కీర్తి కాంత.

నీ ముద్దుమోము గనలేని నా జన్మ వ్యర్థము. నా లాటి దీనుల రక్షించడానికి నిన్నెవరు అడ్డగిస్తారు. పొరబాటున నీ వాహన రాజు గరుడుడు నా చెంతకు వచ్చుటకు ఆకాశానికి, భూమికి చాలా దూరమన్నాడేమో! సర్వ జగ్రక్షకుడయిన నీకు దూరమేముంది. నీతోగాక నేనింకెవరితో మొరబెట్టుకొనేది. నన్ను కరుణించు. ఆలసించకు.

సీతమ్మ మా తల్లి, శ్రీరాముడు మాకు తండ్రి, సౌమిత్రి భరత, శత్రుఘ్నుడు, హనుమంతుడు మా సోదరులు. వసిష్ఠ, పరాశర, నారద, శౌనకాదులు గురువులు. అందుకే నేను నీకు కేవలం భక్తుడిని గాదు. నీ బంధుకోటిలోని వాడిని, నీ శిష్యుడను. వారిపై దయా రసం చిలికించినట్లే నా పై కరుణజూపు

ఇలా ఎన్నో రీతుల సంకీర్తన గావించేవాడు

స్త్రీ హృదయము సున్నితము. అందుకు సీతమ్మ తన నాథునికన్న ముందుగ ఆనందాశ్రువులు రాల్చి భక్తుని దీవించమని ప్రార్థించింది నాథుని.

ప్రియ భామిని మాట ఉల్లంఘించని శ్రీరాముడు చిరునవ్వుతో సరే నన్నాడు. సతీసమేతుడై త్యాగరాజుకు దర్శన మిచ్చాడు. ధ్యానముద్రలోనున్న త్యాగరాజు మేను పులకరించింది. నీకోరిక యేమిటనే ప్రశ్న త్యాగిరాజు చెవిని దాకింది. త్యాగరాజు తనువు పులకరించింది. వెలుగును జిమ్మింది. నాకు నీసోదర, హనుమాన్ సమేతంగా దర్శన మిచ్చి, నన్ను నీలో జేర్చుకోమని అర్థించాడు.

వెను వెంటనే శ్రీరాముని పట్టాభిషేక దర్శన మయింది త్యాగరాజుకు.

రామా! నా జన్మ తరించింది, అంటూ కనుగొంటిని శ్రీరాముని నేడు కనుగొంటిని అనే కీర్తన గానంచేశాడు.

త్యాగరాజూ! ఇక పది పూటలలో నీవు నాసన్నిధికి చేరుకోగలవని ఆశీర్వదిస్తూ అంతర్థానమయ్యారు స్వామి.

క్షణ మాత్రములో జరిగిన యీ సంఘటన త్యాగరాజుని చరితార్థుని జేసింది. అవధులు దాటిన సంతోషంలో అన్నను, శిష్యులను బిలచి తన తండ్రి శ్రీరాముడు యిచ్చిన వరము వివరించాడు. తన గురువు గారయిన శొంఠి వెంకటరమణయ్య గారి సమాధి ప్రక్కనే తన సమాధి నేర్పరచమని కోరాడు.

దావానలం లా వ్యాపించిందివార్త. పుర ప్రజలు తంజావూరు చుట్టుప్రక్కల గ్రామాలనుంచి త్యాగరాజుని చివరి దర్శనం చేసుకోవాలని తండోప తండాలుగా రావడం ప్రారంభించారు.

పరమ హంస బ్రహ్మనందేంద్ర స్వాములవారు త్యాగరాజుకు "నాదబ్రహ్మ" అనేబిరుదు ప్రసాదించాడు.

త్యాగరాజు కాదు గానబ్రహ్మ
గానబ్రహ్మ కాదు నాదబ్రహ్మ
నాదబ్రహ్మ శ్రీ త్యాగబ్రహ్మ

వాన ప్రస్థాశ్రమం స్వీకరించాడు నిరంతర ధ్యాన భజన ప్రారంభమయింది. ఉజయీాల్పాళం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్, వాలజాపేట వెంకటరమణ భాగవతార్, కంచి వెంకటాద్రి, తాసిల్దార్ శ్యామారావు తదితర శిష్య గణమంతా గురుదేవునికి మనసారా నమస్కరించి రామనామ జపం ప్రారంభించారు.

చివరిసారిగా నాదబ్రహ్మ "పరమాత్ముడు, జీవాత్ముడు, పరితాపముగని యీడిన శ్యామ సుందరాంగ కీర్తనలపాడి, తనకోప తాపాలను, అలకలను, తప్పులను క్షమించమని విన్నవించుకొన్నాడు.

తొమ్మిది పూటలు గడిచాయి. వేద మంత్రోచ్చారణ కొనసాగుతోంది. ఒకవంక శిష్యులు రామనామ జపం కొనసాగిస్తున్నారు. ప్రజావాహిని త్యాగబ్రహ్మను తదేక దృష్టితో చూస్తున్నారు. అఖండ జ్యోతి స్వామి సన్నిధిని వెలుగుతున్నది.

నాదబ్రహ్మ చిన్ముద్ర రూపుడైనాడు. శిష్యులు, ప్రజలు రెప్ప వాల్చకుండా స్వామిని చూస్తున్నారు అందరి హృదయాల్లో నాద బ్రహ్మం రూపం తప్పితే మరొక్కటి లేదు. రామనామం ఉచ్చ స్వరంలోకి పోయింది.

మెల్లగా నాదబ్రహ్మ శిరస్సు బీట పడసాగింది. మరుక్షణంలో నాదబ్రహ్మ శిరస్సు నుంచి జ్యోతి బయల్పడి ఆ స్వామి సన్నిధిలోని అఖండ జ్యోతిలో కలసిపోయింది.

నిశ్శబ్దం ఆవరించింది. నాదబ్రహ్మ రాముని సన్నిధి జేరాడు. నాదబ్రహ్మ భౌతిక కాయాన్ని గురువు శొంఠి వెంకటరమణయ్య పంతులు గారి సమాధి ప్రక్కనే చేర్చారు ఖననంచేయ దానికిభూమి త్రవ్వుచుండగా అందుండి సుగంధవాసనలు రాసాగాయి. రామనామ శబ్దం వినిపించ సాగింది. కావేరి పాయగావున్న పంచనది కావేరికి ఆనుకొనివున్న ఆ ప్రదేశమంతా సువాసనతోనిండిపోయింది. నాదబ్రహ్మ భూదేవి ఒడిలో జేరిపోయినాడు.

ఆ నాటి రాత్రి ప్రథమ శిష్యుడైన వెంకటరమణ భాగవతార్ తనకు స్వప్నంలో గురుదేవుడు కనుపించి తాను సిద్ధిపొందినట్లు, తన జీవాత్మ సకల తీర్థములు సేవించి మూడు దినములు పూర్వ సిద్ధి చెందుతున్నట్లు సెల విచ్చారని విన్నవించాడు.

—సమాప్తం—

పలురకాల పండ్లు

ఎ. లక్ష్మీరమణ

సృష్టిలో సుందరమైనవి సుకుమారమైన పూలయితే, మధురిమలు పూరించేవి పండ్లని చెప్పవచ్చునేమో! దేవతలకు, మానవులకు మాత్రమే కాకుండా జంతువులకు, పక్షులకూ చివరకు క్రిమికీటకాలకు కూడా పండ్లంటే ఆపేక్ష. అందుకే ఆది దైవమైన విఘ్నేశ్వరుడ్ని "మారేడు, మామిడి, మాదీ ఫలంబులు, ఖర్జూర పనసలును కదళికములు, నేరేడు నెలవంది, టెంకాయ తేనెయు చాలగానిచ్చెద" అంటూ పండ్లతో ప్రసన్నుణ్ణి చేయచూస్తాము. పండ్ల పసందు లెరిగిన గురజాడ కవి ఆనాడే అన్నారు.

"ఏ ఏ ఋతువుల పండే పండ్లను ఆయా ఋతువుల నందించీ బంగరు దుర్గను భక్తితొ కొలిచెను పుత్తడి బొమ్మా పూర్ణమ్మా!"

పక్షులకు పండ్లంటే ఎంత ప్రీతోకాని, పండు పండీ పండక ముందే పసికట్టి వేస్తాయి. చిలుక కొరికిన జామ పండు మరీ తీపి అంటారు. చిత్రమేముందీ! కోయిల కోర్కెలెరిగిన, చిలిపి చిలుకల చిత్తాలెరిగిన మామిడి చెట్టును వర్ణిస్తూ వెంకట పార్వతీశకవులేమన్నారు? "చిగురులిచ్చుచుండె చిన్నకోయిలకు ఫలములిచ్చుచుండె చిలుకలకును; నీడ లిచ్చుచుండు నీకును నాకును, తనకు మామిడేమి దాచుకొనియె!" ఫలరాజాన్ని (King of fruits) కన్న మామిడమ్మను, మహచక్కగా వర్ణించారు మహానుభావులు

ఆ మామిడి పండ్లలో ఎన్నెన్ని జాతులు. ఎన్నెన్నిరుచులు! పరమాత్ముడు ఆ మామిడి పండులో మధురా. మధురమైన రుచి, మనులకింపైన రంగు మనోరంజకమైన సువాసనా, ఆరోగ్యాన్ని పుష్టినీ పూరించే ఆహారం అన్నిటినీ సమకూర్చినట్లున్నాడు మనదేశంలో మామిడి చెట్టు మంగళకరమైన దంటాము. మామిడి చెట్టు ఆదిమ స్థానమైన దక్షిణ ఆసియాలో, యీ వృక్షం నాలుగువేల సంవత్సరాల పాటు పెంచబడిందని చెప్పబడ్డా, మద్రాసు వద్దనున్న కంచీపురంలో కూడా యీ నాటికీ బహుపురాతనమైన మామిడి వృక్షాన్ని చూస్తున్నాము. పార్వతీ దేవి ఆ వృక్షం క్రింద తపస్సు చేసిందనీ, ఆ వృక్షం ఒక్కొక్క కొమ్మకు ఒక్కొక్క రుచి గల ఫలం పండుతుందనీ వదంతి. అజంతా, ఎల్లోరా గుహల్లో చిత్రాలలో మామిడి ఆకులకు పండ్లకు చాలా ప్రాముఖ్యం యిచ్చారు. అక్బరు చక్రవర్తి "ల్యాక్‌బాగ్" లో లక్ష మామిడి చెట్లు గల తోట నాటినాడట ఆనాడే

జాతీయ ఫలం మామిడి

జాతీయ ఫలంగా పరిగణింప బడుతున్న యీ మామిడి పండ్ల రకము లెన్నెన్నో చెప్పనలవికాదు. బంగారు లాంటి బంగన పల్లిలో



ప్రారంభిద్దాము ఇది బంగనపల్లి సంస్థానం నుండి ప్రసిద్ధికెక్కినది. ఇది కోత రకము పండు. తీయతీయగా వుంటుంది. గోదావరి, కృష్ణా జిల్లాల నుండి ఎగుమతి అవుతుంది బంగనపల్లి మామిడి పండ్లు కొన్ని కడియం నుండి మరి కొన్ని విశాఖపట్నం జిల్లా నుండి కూడా వచ్చేవి వున్నాయి. వీటిని బంగనపల్లి తియ్య కడియం బంగనపల్లి బంగనపల్లి రాజా అని అంటారు. పెద్ద ముట్టెయిదు లాంటి పెద్ద రసం పుట్టిల్లు నూజివీడు. ఇది పిడుపు రసం. పీచు వుంటుంది. దీని రసం చాల మధురం చిన్నరసం కడియం నుండి వస్తుంది. మామిడి పండ్లలో పాదుషాలు మొదలు పామరుల పేర్ల వరకు వున్నాయి. జహంగీర్ బడా, జహంగీర్ చోటా మహమ్మదీయులచే సంగ్రహించబడి, మచిలీ పట్టణంలో నిలయ మేర్పరచుకొని ఇతర ప్రాంతాలకుకూడా ప్రాకిన రకము. ఈ పండు చాలా వుత్తమమైనదిగా పరిగణింప బడుతుంది. పండు చూడడానికి అంత అందముగా అగపడక పోయినా సువాసనతో కూడిన మేలైన రకం పండిది. జహంగీరు చోటానే నాజీమ్ పసందని కూడా అంటారు. గోదావరి జిల్లా నుండి వస్తుంది. ఆంధ్రూసు అనే మామిడిని మల్గొవా అని కూడా అంటారు. పరిమళంతో కూడి తీయగా వుంటుంది. ఇది విశాఖపట్టణం జిల్లాలోనిది. ఇందులో అంధ్రూసు గవర. అంధ్రూసు పరవాడ, అంధ్రూసు నల్లగాయల, అంధ్రూసు మొక్క, అంధ్రూసు సన్యాసి నాయుడు అంటూ ఎన్నో రకాలు కూడాను. బొంబాయిలో చెప్పుకోదగిన పండు అల్ఫాంసో. బెంగుళూరులో దానినే బదామీ అనీ, మైసూలో రసపురి అనీ హైదరాబాదులో గోవాబందరీ అని అంటారు. తీపి, పరిమాణం అన్నీ కలిసిన కొత్తరకం పండు ఇది. ఐస్ లో నిల్వచేసి ఎగుమతి చేయటానికి వీలైన పండు. ఇమాం పసంద్ మచిలీపట్టణం నుండి వచ్చే ప్రశస్తమైన పండ్లలో ఒకటి. చిత్తూరు జిల్లా నుండి వచ్చే పండ్లలో నీలం ఒకటి. ఇందులో నీలం చిన్న, పెద్ద అని రెండు రకాలు. కార్తీక మాసం రెండవ కాపు కూడా కాసేరకం పెద్ద పండ్లలో ఏనుగ దంతం, ఏనుగ తలకాయ అని రెండు రకాలు. కలెక్టరు మామిడి బెంగుళూరు ప్రాంతంది.

అమృత కలశ అని గోదావరి జిల్లా నుండి వచ్చే మామిడి కొత్తరకము. చాలా తీపి. అమృత రసాయనం అని మరోటి. ఇదేవిధంగా మామిడి పండ్లలో అక్బర్ పాదుషా. సుందర్‌షా. షాజహాన్, శివాజీ పసంద్. సఖాషోక్. సాలార్ సమ్మర్, హైదర్ సాహెబ్, హిమాయుద్దీన్, లాంగ్రా,లార్డు రుమానీ, రామభోగ్, రాజుమామిడి, రాంపల్లి ఉప్ప, రస్కారా. రసనా మృతం, మైలాపురి, మెల్లిన్పు, బ్యూటీ, మాల్దా, మల్గొబా, మక్కువ, భూలోకసుందరి భగ్గుజ, బారామాసి, బందర్ బోండం, బావరు ఖండీ బంగారు తీగ. బంగారు గున్న, పిరంగిలడ్వా, ఫద్వా, పైరీ, పీటర్ రాజా, గోవా పాకాలు, పాపయ్య పణుకుల మార్సిను, పలక దంతం, పన్నీరు గోవా, పంచదార్ల మార్సిను, పంచదార కలశ, దిల్ పసంద్, దూధ్ పేడా, దోపుల్లా, దుర్గాభోగ్, దొండకాయలు, నల్లమామిడి, నల్లరసం, నవనీతం, నాగులపల్లి యిరసాలా, తియ్యమామిడి,తూనికల మామిడి, తన్నేరు, తెల్లగాయలు, తెల్లగులాబి, తాబేలు మామిడి తగరంపూడి మామిడి, జీడిమామిడి, జిల్లేడు కాయ జీబి, జరిగి పోతుల మామిడి, జామిమామిడి, జానికి రాముడు మార్సిను, జనార్దన పసాది, జరుకాబాద్, జంపులు, అప్పయ్యా గారి గున్న, అచ్చయ్యా గారి మార్సిను, అప్పాలి మామిడి, అయ్యవార్లంగారి తియ్య మామిడి, అరిసెల మామిడి, అంటూ మామిడి రకరకాలు.

అరటి రకాలు

మన దేశంలో బీదసాదలందుబాటులో వుండే పండ్లలో అరటి పండు ఒకటి. సీతాఫలం మరోటి మామూలు అరటిపండ్లు చవుకగానూ రుచిగానూ కూడా వుంటాయి వరి అన్నములో లేని విటమిన్ 'ఎ' అరటిపండ్లలో స్వల్పంగానూ విటమిన్ 'బి' రెండింతలు విటమిన్ 'సి' స్వల్పంగానూ అగుపిస్తున్నాయని నిరూపించబడింది. చక్కెర కేళీ చాలా ప్రశస్తమైన రకం. అరటి పండు. ఆరోగ్యకరము కూడాను. ఇది గోదావరి జిల్లాలో అసులాపురం, రాజోలు తాలూకాలలో పెరుగుతుంది. కర్పూర చక్కెర కేళీని తమిళనాడులో పూవన్ అని అంటారు. కాయపండినప్పుడు తొక్కపచ్చబడి పసుపుచగా వుంటుంది. ఈ రకము చక్కెర కేళీలా కాకుండా అన్ని నేలలలోనూ పెరుగుతుంది. అమృత పాణీలు కృష్ణా జిల్లా తణుకు తాలుకా, విశాఖపట్టణం జిల్లాలలో, కొన్ని కొండలపైన పెరుగుతుంది. విశాఖపట్టణంలో దీనిని మొకిరి అంటారు ఈ పండ్లు అన్ని పండ్లలా తోలు పసుపు పచ్చగానూ ఆకు పచ్చగానూ కాకుండా మిగల పండినప్పుడు నల్ల పడుతుంది. తోలు నల్ల బడినప్పుడే యీ పండు తీయగా వుంటుంది. ఈ పండు దొరకటం కొంత వరకు అరుదే అని చెప్పవచ్చును. మద్రాసు వైపు దొరికే మలవాళ ఫల కొండలలో పెరుగుతుంది. అది వర్షపు నీటికి విరివిగా వస్తుంది. హైదరాబాదులో చిట్టిలాలా మౌజ్ బండకు బండ్లే వస్తూవుంటాయి. అతి బీదవారికి కూడా అవి అందుబాటులో వుండటం వల్ల కడుపునిండా తిన వచ్చును. మలబారు ప్రాంతంలో నేంద్రపళం అని పెద్ద అరటి పండు దొరుకుతాయి. దానితో వారు ఎన్నెన్నో పిండి వంటలుకూడా చేస్తారు మలబారులో కొబ్బరి, అరటి, పనస పండ్లు బాగా పండుతాయి. అరటి పండు అంత బాగా అరగదన్న అపోహ ఒకటి వుంది. బాగా పండిన తరువాత అరగక పోవటం అంటూవుండక పోయినా అనారోగ్యంగా వున్నప్పుడు మాత్రం అది అనువర్తించవచ్చును. అరటి పండ్లను ఆయుర్వేదం, హోమియో మందులలో వాడటం కూడా కద్దు. మామిడి పండ్లలాగనే అరటి పండ్లలో కూడా చాలా రకాలే వున్నాయి. అందులో పొట్టి మొకిరి, నీసు, కొమ్మరటి, ఎర్ర అరటి లేక ఎర్ర చెక్కెర కేళీ, కర్పూర కేళీ, వామన కేళీ, ఏనుగ అరటి, పంకల బొంత, సపోటా అరటి, నూకల బొంత, గింజల అరటి అని కొన్ని వున్నాయి

వేసంగిలో

వేసవిలో సూర్య భగవానుడు ఒకంట నిప్పులు కురిపించినా ఒకంట చల్లగాచూసి మధురమైన పండ్లను ప్రసాదిస్తాడు. వేసవిలో మామిడి పండ్లు మాత్రమేకాకుండా పుచ్చకాయలులాంటి పెద్ద పండ్లు పాల్సాలాంటి చిన్న పండ్లు, దాహంతీర్చే ద్రాక్షపండ్లు ఎన్నెన్నో. నీలిరంగు గల బెంగుళూరు ద్రాక్షే కాకుండా, అనాబ్‌షాహి, కాడా

షాహి, గులాబ్‌షాహి, గింజలులేని కిస్‌మిస్ ద్రాక్ష అని పలురకాలు. హైద్రాబాదులో అనాబ్‌షాహీ ద్రాక్ష విరివిగా పండుతుంది.

సీతాఫలాలు

సీతాకాలంలో వచ్చే పండ్లలో సీతాఫలం ఒకటి. తెలంగాణా ప్రాంతంలో యివి చాలా ఎక్కువ. సీతాఫలం నుండి ఇటీవల పృధ్వీఫలం అనే ఓ కొత్త రకం పండుకూడ కనిపెట్టారు. ఇందులో గింజలు తక్కువ. కండభాగం ఎక్కువ సీతాఫలాన్నే కసర్దు ఆపిల్ అనికూడా అంటారు ఆపిల్, పైనాపిల్‌పండ్లు కస్టర్డు యాపిల్ అంత చవుక కాదు.

అనాసకూడా అంత విరివిగా కాకపోయినా మన దేశంలో కూడా కొంత వరకు పెరుగుదలవుంది. అనాస పండుకు అదోరకమైనపరిమళం, రుచి వుంటాయి. అనాస పండులో ఔన్సుకు 12 నుండి 16 కాలరీల పౌష్టిక శక్తి వుందని అంచనా వేయబడింది దీనిలో నారింజ, మామిడి, బొప్పాయి, అరటిలోకన్న ఇనుము ఎక్కువ. విటమిన్‘సి’నారింజలో వున్నంతగా దీన్లో కూడ వుంటుందని కనుగొన్నారు. అనాసపండు రసం మేహశాంతికి మంచిదంటారు. డబ్బాలలో నిల్వచేసిన అనాసపండ్లు, రసం కూడా రుచి మారకుండా వుంటుంది.

అందాల ఆపిల్ పండు

ఆపిల్ అందాల పండే కాకుండా ఆరోగ్యానికి అందెవేసిన పండు. అందుకే An apple a day keeps the doctor away అంటారు అంతా చల్లని ప్రదేశాల్లో పండే పండు ఆపిల్. కాశ్మీర్‌లో, పీచెస్, ఆప్రికాట్స్. ఆపిల్సు బాగా పండుతాయి. అక్కడ ఆపిల్సు జామపండంత చవుకగా కూడా లభిస్తాయి.

ఆరోగ్యంగా వున్నప్పుడూ, అనారోగ్యంగా వున్నప్పుడూ కూడావాడే పండు బత్తాయి. అందులో విటమిన్‘సి’వుండటం ప్రత్యేకత. కడపజిల్లా కోడూరులో బత్తాయిపండ్లు చాలా బాగుంటాయి. తోలు పలచన, రసం చాలా ఎక్కువగా వుంటుంది కడపజిల్లాలో సిదవటం అనే గ్రామంలో సిద్దవటం దోసకాయని కరుబూజాని పోలి వున్నా యింకా చాలా మధురంగా వుంటుంది. తేలిక ఆకుపచ్చని రంగులో వుంటుంది. బత్తాయిలా పెద్దదిగా వుండే పండు పంపరపనస. తోలు మందంగానూ తొనలు పెద్దవిగానూ వుంటాయి నాగపూర్ వైపు నాణ్యమైన కమలాపండ్లు లభిస్తాయి. ఎక్కువ కాపు కాసే పండ్లలో జామ, సపోటా చెప్పవచ్చును. జామలో గింజలు లేని జామ కూడా వున్నా దాని కాపు తక్కువ మిలబారు, గోదావరి ప్రాంతాలలో పనసపంట ఎక్కువ మనకు సాధారణంగా లభించే పండ్లలో బొప్పాయి ఒకటి అది దాని వాసన సహించక చాలా మందికి రుచించదు కానీ నిజానికి ఆరోగ్యానికి అది చాలా శ్రేష్ఠం. దానిలో విటమిన్ ‘ఎ’ లభిస్తుంది. దానిమ్మగింజలెంత అందమైనవో అంత ఆరోగ్యవంతం కూడాను.

కొన్ని ఫలాలు మనకు అపురూపంగా లభిస్తాయి. అలాంటివి లభించటం జరిగినప్పుడు, తప్పక రుచి చూసితీరాలి. ఉత్తర ప్రాంతంలో లభించే లీబ్‌లీపండు ఆజాతిలో చెందింది దాని పై తోలు అంత ఆకర్షణీయంగా వుండదు. చెక్కరంగులో గరుకుగా వుంటుంది. పరిమాణానికి యీతకాయిని బోలివుంటుంది. లోపలి భాగం తాటిముంజలా మృదువుగా అతి మధురంగా, సువాసనతో కూడి వుంటుంది. చిన్న పండ్లయినా ఉసిరిక, నేరేడు, రేగి, పాల్సా పండ్లలోకూడా వేటి రుచులు, విలువలు వాటివే!

మన దేశంలో ఖర్జూర లాంటి పండ్లు పండకపోయినా ఆఫ్రికాలాంటి దేశాల నుండి మనదేశానికి దిగుమతి చేయబడతాయి ఆఫ్రికాలాంటి దేశాల్లో ఖర్జూరచెట్లే వారి ఆస్తి. ఖర్జూరపండ్లు చెట్టు మీద పండగానే తింటే చాలా రుచిగా వుంటుందట. కానీ దూర దేశాలు పంపవలసి వచ్చినప్పుడు వాటిని ఎండబెట్టి నిల్వచేసి పంపవలసి వస్తుంది. మనదేశంలో మామిడిపండు చిత్రాన్ని ఎంత మక్కువతో చిత్రించుకొంటిమో యీజిప్టులాంటి దేశాల్లో ఖర్జూరని కూడా అదేవిధంగా చిత్రించుకుంటారట. శిల్పాలలో కూడా ఆ చిత్రాలు చూడవచ్చునట! అత్తిపండు కూడా యిలాంటి పండే. ఈ పండు మన దేశంలోకూడా అక్కడక్కడ ఫలించటం కద్దు. ఎడారిలో పండే పండు ఒక్క ఖర్జూరం ఒక్కటే. రొట్టెకన్నా ఖర్జూర పండు విలువైన ఆహారమని గ్రహించబడుతోంది. స్ట్రాబెరీ, రాస్‌బెరీ, ఫిగ్సు, బెబ్బసు లాంటివి రుచికరమే కాకుండా వాటిలో విటమిన్ ‘ఎ’,‘సి’,కాల్షియం వున్నాయి, ఈ విధంగా ప్రతి ఫలంలోనూ ఆ మాధవుడు మధురిమలు పూరించి సృష్టించాడు. ★

కవియోగి వేమన

గంధం అప్పారావు

వేమన పురాణప్రబంధ కవుల వలె బహుగ్రంథకర్త కాకపోయినా, వారివలె వ్యాకరణాలంకార శాస్త్రములలో అంత ప్రవేశమున్నవాడు కాకపోయినా, సాధారణ దేశీయ ఛందస్సులో (ఆటవెలది) సామాన్య ప్రజాభాషలో పద్యరచన చేసినా, తార్కిక దృక్పథంతోనూ మానవత్వ విలసిత గుణవిశేషంచేతనూ ఈతనిని విశ్వకవులలో ఒకనిగా ఎన్నదగును.

మానవుని మానవత్వం గూర్చి, అతని నైతిక సంపదను గూర్చి, బాధ్యతాయుత జీవితాన్ని గూర్చి నవలల ద్వారా, కథల ద్వారా, అనేక విధాలా, బహుముఖాలా బోధించిన ప్రజాకవి, ప్రపంచకవి అయిన టాల్‌స్టాయ్‌తో కూడ మన వేమన్నను కొన్ని విషయాల్లో సరిపోల్చ వచ్చును.

వేమన కవిత్వంలో దేశకాల పరిస్థితులకు లోనైన సంకుచిత విషయాలకు చోటులేదు. అతని ఉపదేశాలు, విమర్శలు, నీతులు, ధర్మాలు ఆనాటి మత, సాంఘిక, ఆర్థికన్యాయస్థాపనకు సంబంధించిన వైనా, వానిలో విశ్వజనీన ధర్మమిమిడి వుంది. దేశాలు వేరైనా, మత, ఆర్థిక రాజకీయ వ్యవస్థలు వేరైనా మానవుని మానసికాభివృద్ధికి, మానవత్వానికి సంబంధించినధర్మాలు అందరికీ సమానమే కదా!

మానవుడు శాంతితో సుఖంగా కలకాలం జీవించడానికి ఏమి కావాలి? ఈ ప్రశ్న ఇప్పుడుత్పన్నమైంది కాదు. మానవుడు వానర రూపంలో చెట్లకొమ్మలపై నివసిస్తుండేకాలంలోనే ఉదయించింది ఈ నాటి మానవుడు మానసికంగా ఎంత అభివృద్ధి పొందెనో వర్ణించసాధ్యంకాదు. పాంచభౌతికమైన ఈ ప్రపంచాన్నే తన వశం చేసుకున్నాడు. సమస్త లోకాల్లో విచ్చల విడిగా విహరిస్తున్నాడు. అతని వేగానికి అడ్డూ ఆపన్నది లేదు. కాని ఇంత అభివృద్ధి గాంచినా అతని మనస్సుకు శాంతిలేదు ఆనందంలేదు. దానికి కారణ మేమిటి? దానికి కారణము మరేమీ కాదు, అది అతని ఆత్మ వంచన, స్వార్థపరత్వం, ఉదాసీనభావం.

మానవతావాది

వేమన మానవతా వాది ప్రగతిశీల మానవుల జీవితాల్లోని నిగూఢ రహస్యాల నెరింగిన మనస్తత్వ శాస్త్రజ్ఞుడు, మనుష్యుడు వివేకవంతుడై, విచక్షణా విజ్ఞానము కలవాడై, తార్కిక దృష్టితో తన ధర్మాలను దైనందిన జీవితంలో తప్పక పాటించాలి. ఎట్టి సమయంలోగాని తన మానవత్వాన్ని, బాధ్యతలను విస్మరించరాదు అని బోధించాడు. అతడొక చోట ఈ ఉత్తమ ధర్మాన్ని గూర్చి చెప్పిన ఈ పద్యం చూడండి.

"అన్యుల కును వచ్చు నాపద తనదిగా
నెన్నువాడు భువిని నున్నవాడు"

ఇతరులకు వచ్చు ఆపద తనదిగా భావించువాడే ఈ లోకంలో ఉన్నవాడు. తక్కినవారు లేనివారి క్రిందే జమ అని మానవుని బాధ్యతాయుత జీవితము గట్టిగా చెప్పాడు ఈ రెండు పదాలలో ఎంత గంభీరభావ మిమిడి యుందో మానవత్వంగల ప్రగతిశీలురకు మాత్రం బాగా అర్థంకాగలదు. మానవుడు ఈ ధర్మాన్ని



పాటించనినాడు అతని సమస్య లేవీ పరిష్కారంకావు. అతని మనస్సుకు నిజమైన శాంతి, ఆనందము ఉండదు.

"ఎవరికర్మ వారిది. వారి కర్మానికి మన మేమి చేయగలం? అది వారి పూర్వజన్మ కర్మఫలం. దైవకృప ఎట్లుండిన అట్లు జరుగుతుంది. ఇంతకూ మానవ సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదు ఒక సమస్య పరిష్కరింప బడితే ఇంకొక సమస్య తలెత్తుంది. ఒకరిని బాగుచేయడానికిగాని, పాడుచేయ డానికి గాని మన చేతులలో ఏముంది?" అను వేదాంతులు మన సమాజంలో లెక్కకు మీరి ఉన్నారు. మనకు ఇరుగు పొరుగు ఇండ్లలో దొంగలు దూరినా కళ్లారా చూస్తూ కూడా అది వారి దుర దృష్టమని ఊరకున్న మహానుభావులు కూడా కొంత మంది లేక పోలేదు. ఈ మహా వ్యక్తులు ఏ తరగతికిచెందిన మను ష్యులో చెప్ప సంభవికాదు.

గొప్ప ఆశావాది

వేమన్న ఈ విధమైన కర్మ సిద్ధాంతాలకు పరమ శత్రువు. మానవుని సృజనాత్మక శక్తిలో నమ్మకము గల గొప్ప ఆశావాది.

మానవుడు చెట్ల కొమ్మలపై నివసించిన నాటి నుండి ఈనాటి వరకు జరిగిన మహా యుగపరంపరల్లో అతడేవిధంగా, ఎన్ని విధాలుగా మానసికంగా అభివృద్ధి పొందుతూ వచ్చాడో మనకు చరిత్రే తెలుపుతున్నది. ఈ ప్రపంచంలో సంభవించిన అనేక విధాలైన విప్లవాలకు, విజ్ఞానాభివృద్ధికి మానవుని ప్రయత్నమే కారణమని వేరుగా చెప్పనవసరము లేదుకదా? ప్రయత్న శీలి, కార్యసాధనా కుశలుడైన మానవుడు తన బాధ్యతలను ఎట్టి సమయం లోకూడా విస్మరించరాదు. అతనికి ఇదే ధర్మములోకెల్ల ఉత్తమ ధర్మం. తను సంఘజీవి. సంఘములో గల మంచిచెడ్డలతో అతనికి అవినాభావ సంబంధమున్నది. ప్రకృతిలోగల సమస్త శకులు ఏవిధంగా తమ, తమ క్రమవిధానాలు, పరిధులు దాటడం లేదో, ఆ విధంగానే దైవసృష్టిలో ఉత్తమోత్తమ ప్రాణియైన మానవుడు తననీతి, నియమాలను తప్పరాదు. బాధ్యత అన్నది ఉత్తమ సంఘజీవితానికి ప్రాణం వంటిది.

పరస్త్రీ పట్ల తనకు చెడ్డదృష్టి కలిగిన, తన స్త్రీ పట్ల ఇతర్లకు అదేదృష్టి కలగడంలో దోషంలేదు. పరుల ధనము అపహరింప ప్రయత్నించిన తన ధనము ఇతరులు అపహరించిన తప్పులేదు కదా? సర్వవిధాలా తనవలె ఇతరులను చూడాలి. ఇతర్లకు వచ్చు ఆపద తనదిగా భావించాలి. బాధ్యతారహిత సమాజము అన్ని సమస్యలకు ఆలవాల మౌతుంది. అభ్యుదయ సమాజం నిర్మాణానికి బాధ్యత అను ఒక్క ధర్మముండిన చాలు. తక్కిన సమాజ ధర్మాలన్నీ దాన్ని అనుసరించి మానవునకు సమ్యక్ మార్గాన్ని చూపును. అంతేకాని ధర్మాలకొరకు వివిధ విధాల వాఖ్యానంచేయు ధర్మశాస్త్రాలను ఆశ్రయించిన ప్రయోజనం లేదు. ఒక చోట చెప్పిన ధర్మాలను, నీతులను ఇంకొక చోట ఖండించు నీతిశాస్త్రాలను సదా వల్లించడంచేత లాభం రవంతైనా ఉండదు.

ధర్మాలకు, న్యాయానికి జన్మస్థానం మానవుని హృదయాంత రాళము కాని ధర్మశాస్త్రాలు కావు. ధర్మాలు, నీతులు దేశ కాలపాత్రలు, ఆయా సమయ సందర్భాలనుబట్టి ఉండును. మానవ సంఘాభివృద్ధికి ఏ ధర్మం తోడ్పడుతుందో అదే ఉత్తమోత్తమ మైన ధర్మం సంఘానికి హాని చేకూర్చునవి ఏ ధర్మశాస్త్రంలోని వైనా అవి అధర్మ ధర్మంబే అని గట్టిగా చెప్పాలి.

మన దేశంలో ధర్మశాస్త్రాలకు, నీతి కావ్యాలకు, సుభాషి తాలకు ఏ విధమైన లోపము లేదు ఈనాడు కూడా సుభాషిత గ్రంథాలు విరివిగా పుట్టుతునే వున్నవి. పదముల కూర్పులో, అర్థాలలో కొంచెము భేదముతప్ప అన్ని నీతికావ్యాలలోని నీతులూ, ధర్మాలూ ఒకటే.

"సత్యము పలుకుము. ధర్మ మాచరింపుము. తలిదండ్రు లను భక్తితో పూజింపుము. గురువులను గౌరవింపుము. మనుష్యు నకు శీలమే గొప్ప ఆభరణము. పరుల సొమ్ములు అపహరింప రాదు. పరోపకార బుద్ధి కలిగి ఉండాలి. పరకాంతలను కోర రాదు. మాన పౌరుషాలతో బ్రతకాలి" మొదలగునవి.

హేతువాది

వేమన్నకూడా ఈ ధర్మాన్నే, ఈ నీతులన్నే బోధించినా వీనిలో ఒక ప్రత్యేకత ఉంది. ఈతని ధర్మాలు, నీతులు హేతు వాద విలసితాలు. వాస్తవానికి పట్టుకొమ్మలు. వీటిని అర్థం చేసుకోడానికి శాస్త్రదృష్టి కావాలి. ఈ మహావ్యక్తి ఒక సంద ర్భాన సత్యాన్ని గూర్చి ఈవిధంగా చెప్పాడు.

> నిజములాడువాని నిందించు జగమెల్ల
> నిజము లాడరాదు నీచుతోడ
> నిజ మహాత్మునూడ నిజమాడవలయురా. విశ్వ॥

నిజము పలుకువానిని లోకము నిందిస్తుంది. (యదార వాది బహుజన విరోధి కదా?) ముఖ్యంగా నీచలోకం, అందువలన నీచులతో నిజం చెప్పరాదు. నిజ మహాత్ముని గూడినప్పుడు మాత్రం అబద్ధమెంతమాత్రం చెప్పరాదని బోధించాడు. వేమన నీచులతో నిజం చెప్పరాదని గట్టిగా శాసించినట్లు మనం భావింప రాదు. చాదసంగా మాత్రం సత్యంవద, ధర్మంచర-నీచుల దగ్గర చూపనక్కరలేదని ఆయన భావము. సత్యధర్మాలు సందర్భాను సారంగా వినియోగించాలి. ఈ ధర్మాన్నే తమిళ మహాకవి తిరువళ్లు వరు ఒక చోట చెప్పారు. వేమన లౌకికకావ్యము ఎంత గొప్ప లోకానుభవ వేదాంతాన్ని (Practical Philosophy) మాన వాళికి బోధిస్తుందో చూడండి. సత్య హరిశ్చంద్రుని కథలో ప్రగాఢ విశ్వాసమున్నవారికి ఇతడు సత్యాన్ని గూర్చి చెప్పిన మాట ల్లోని యదార్థం అంత రుచించక పోవచ్చు. కీ। శే। డా। కట్ట మంచి రామలింగారెడ్డి గారుచెప్పినట్లువేమన్నకు ధర్మ సందేహం కల్గి నప్పుడు తనకు నైజమగు బుద్ధి విశేషానే గాని విపరీత వ్యాఖ్యానా లకు పోవు ధర్మశాస్త్రాలను ఆశ్రయింపడు. కారణ విమర్శ శక్తికి పట్టాభిషేకంచేసిన మహాత్ముడీయన అని శ్రీరెడ్డిగారు అన్నారు. ఈ సహృదయాగ్రగణ్యుడు ఒక చోట దాన ధర్మాలలోని ధర్మ

తత్త్వాన్ని గూర్చి చెప్పిన మాటలు ఎంత గంభీరార్థ విలసితాలో పరికించవచ్చును.

దోసకారియైన దూసరి కాపైన
పగతుడైన వేద బాహ్యుడైన
వట్టిలేని పేద గానికీ దగు నీతి
ధనికునకు నొసంగతగదు వేమ.

ఆనాటి ఆర్థిక వ్యత్యాసాలు

వేమన కాలము నాటి తెలుగు సమాజము చెప్పరానంత ధనిక పేద వ్యత్యాసంతో నిండియుండేది. పేదలు ధనవంతుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేవారు. ధనవంతులు వారి గురువుల, పురోహితుల సలహాల ప్రకారం దానధర్మాలు చేస్తూండేవారు. ఆ దానాలు గ్రహించేవారు సాధారణంగా బ్రాహ్మణులై యుండేవారు. వారిలో కూడా కొన్ని శాఖలు వారు మాత్రం దానార్హులై ఉంటుండేవారు. పోనీ వారిలోనైనా బీదవారు పొందుతుండేవారంటే అదీ చెప్పలేము. ఆ దాన గృహీతల కలిమిలేములతో దాన ప్రదానాలకు సంబంధం లేదు. బ్రాహ్మణులకు దానం చేయడమే ఆనాటి పాత్రదానం. ఆ దానం కూడా ధనవంతులు ఆత్మవంచనతోనే చేస్తుండే వారు. సాధారణంగా తీసుకొన్నవారు అటువంటి వారే. ఇదంతా ఒక తమాషా. ఈ తమాషా ఈనాడుకూడా మన సమాజంలో పలుచోట్ల చూస్తుంటాము. విచక్షణా దృష్టితో, మంచి మనస్సులతో దాన ధర్మాలు చేసిన సహృదయులు మన సంఘంలో చాలా అరుదు.

వేమన హృదయంలో ఆత్మవంచనకు చోటులేదు. అతని మాటల్లో అస్పష్టతకు తావులేదు. అతని భావాలు తార్కిక దృష్టిగల సహృదయుల హృదయ కమలాలకు సూర్యోదయం. తిండికి లేక మల మల మాడుచున్న వట్టిలేని పేదవారికి దానం చేయండని ధనవంతుల్ని కోరాడు. ఆ వట్టిలేని పేదవాడు దోషకారియైనా, దుష్టుడైనా విరోధియైనా మనకు చండాలుడైనాసరే అతన్ని తప్పక సాకాలి అని చెప్పాడు. ధనము గలవాడు ఏ కులానికి చెందినవాడైనా దానానికి అర్హుడుకాడని గట్టిగా నిషేధించాడు. వట్టిలేని పేదవానికి మాత్రం దానము చేయండని నొక్కిచెప్పడంలో ఎంతో విశేషార్థమిమిడివుంది. ఈ భావాల్లోని లోతులు తెలియడానికి మానవునకు శాస్త్రదృష్టి కావాలి.

నిరుపేదల పక్షపాతి

వేమన గొప్ప మానవతావాది అనీ, నిరుపేదల పక్షపాతనీ ఈ మాటలే మనకు స్పష్టం చేస్తాయి. వట్టిలేని పేదవారికి దానంచేసి, వారి ప్రాణాలను నిలపండి. మనుష్యుడు ఎక్కువకాలం సుఖంగా ప్రశాంతంగా బ్రతకడానికి పుట్టాడు గాని "జాతస్య మరణం ధ్రువమ్"—అని అచిర కాలములో చనిపోవ డానికి పుట్టలేదు. చావు మనుష్యునకు తప్పదని, అది యెప్పుడు వచ్చునో చెప్పలేమని, దాన్ని గూర్చి సదా చింతిస్తూ అది రాక పూర్వమే చనిపోవుట ఎందుకు ? ఆ యాలోచన ముందు పెట్టుకొని ఉండిన మనుష్యుడు ఈ ప్రపంచంలో ఏమి చేయ గలిగి వుండేవాడు ? ఇంత విజ్ఞాన శాస్త్రాభివృద్ధి గాంచి ఉండేదా ? ఇన్ని సంస్కరణలు వచ్చి వుండేవా ? మానవునకు చావు తథ్యమ్ అను మాట అందరికీ తెలిసిన విషయమే. కాని బ్రతికున్నంత వరకు సుఖంగా ప్రశాంతంగా బ్రతకాలి. అతడు నానాకష్టాలుపడి సృష్టించు కొనిన జీవ వస్తువులు దానికోసమే. మనుష్యుడు తీవ్ర ప్రయత్నంతో ఈ ప్రపంచమున ఏ పనినైనా సాధించగలడని వేమన్న విశ్వ మానవలోకానికి చెప్పాడు.

విశ్వ సందేశం

ఆ నాటి తెలుగు సమాజంలో చాలా మంది ధనవంతులు, పేద ప్రజలు తిండికి లేక చనిపోవు స్థితిలో వున్ననూ అది వారి పూర్వజన్మకర్మ అని తమవద్ద వారి ప్రాణాలు నిలుపగల జీవవస్తువులున్నా వారిని బ్రతికించడానికి ఇష్టపడక ఉదాసీన భావులై ఉండేవారు. వారిని వేమన ఈ విధంగా అడుగుతున్నాడు.

జీవి పోక ముందె జీవ వస్తువు లిచ్చి
జీవి నిలుప వలయు జీవనమున
జీవి తొలగు వెనుక జీవ వస్తువు లేల ?

జీవి పోక ముందే మీవద్దనున్న జీవ వస్తువు లిచ్చి జీవిని జీవితముతో నిలుపుడు, ఆ జీవి పోయిన వెనుక మీ వద్ద నున్న జీవ వస్తువు లెందుకు ? ఎవరి కోసం ? ఆలోచించండి, అని హృదయాల కెక్కు నట్లు సూటిగా ప్రశ్నించాడు. ఇదే ప్రస్తుత విశ్వమానవ లోకం ఎదుర్కొంటున్న ముఖ్యాతి ముఖ్యమైన సమస్య. మానవుడు సృష్టించు కొన్న అశేష భౌతిక సంపద అందరి కొరకే గాని కొందరి కొరకు కాదను మాట ప్రతి వారు గ్రహించాలి. సర్వజనులు సుఖంగా ఉండాలని కదా మన స్వస్తి వాక్యాలు. ఇదే వేమ నార్యుడు విశ్వమానవ లోకాని కిచ్చిన విశ్వసందేశము

టాల్‌స్టాయి నవలల్లో, కథల్లో ఈ ధర్మమే (సందేశమే) నిండి వుంది. ఆ మహానుభావుడు కూడా వేమనవలె గొప్ప మానవతా వాది. ప్రత్యక్ష వేదాంతి(Practical Philosopher) అతని మాటల్లో కూడా అస్పష్టతకు తావు లేదు. అతడు కూడా మానవునిచే సృష్టంప బడిన ఈయశేష భౌతిక సంపద ఉమ్మడి ధనమని నొక్కి వక్కాణించాడు. సమస్త జనులు కుల, మత వర్గ భేదములు లేకుండా సహజ సహకార భావంతో జీవించాలి. అప్పుడే వారు నిజమైన ఆనందము, శాంతి పొందుతారు, ఇదే జీవిత మోక్షము అని చెప్పాడు. *

కాకతీయులనాటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి

సి.వి. నరసింహారెడ్డి

వాడపల్లి, నల్లగొండ జిల్లాలో మిరియాలగూడెం నుండి 25 కిలోమీటర్ల దూరాన కృష్ణా–మూసీ నదుల సంగమ ప్రదేశమందు గల చిన్న గ్రామం ఇచ్చట కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు 14 వ శతాబ్దంలో నిర్మించిన రమణీయమైన కోట, రెండు పవిత్ర దేవాలయాలు, పురములు, జీర్ణావస్థలో నున్నవి. శిలాశాసనాలు కూడా కొన్ని ఉన్నవి. కృష్ణానది, వాడపల్లి వద్ద నల్లగొండ–గుంటూరు జిల్లాలను వేరుచేస్తుంది. పడవలను దాటించే వారి వాడగా నుండుటవలన యీ గ్రామానికి వాడపల్లి అని పేరు వచ్చినట్లు తెలుస్తుంది. ఈ కోటను మహమ్మదీయ రాజులు వశపర్చుకున్న తరువాత వాడపల్లి "వజీరాబాదు"గా మారింది.

వాడపల్లికీ, కాకతీయ వంశానికీ చాలా సన్నిహిత సంబంధం ఉన్నట్లు చరిత్ర ఋజువు చేస్తుంది. కాకతీయ వంశపు రాజులు ఓరుగల్లును రాజధానిగా తెలుగుదేశాన్ని క్రీ. శ. 1030 నుండి క్రీ. శ. 1350 సంవత్సరం వరకు సుమారు మూడు దశాబ్దాలు అతి సమర్థవంతంగా పరిపాలించినట్లు చారిత్రిక ఆధారాలు గలవు. ఈ రాజులు తెలుగు పౌరుల పౌరుష ప్రతాపాలను చూపించడమే గాకుండా, శిల్పకళ, విద్య, వాణిజ్యం మొదలగు విషయాలలో కూడా మహోన్నత శిఖరాలను అందుకొన్నట్లు ఆ యా యుగ చరిత్రలలో చక్కగా వర్ణింపబడియున్నది. కాకతీయ చక్రవర్తులు తెలుగు దేశాన్నంతటినీ ఏకచ్ఛత్రాధిపత్యము క్రిందికి తెచ్చినట్టి కీర్తిగలవారు. నిజంగా తెలుగు జాతి చరిత్రలో కాకతీయుల కాలం "స్వర్ణయుగం" అని ఘంటాపథంగా చెప్పవచ్చును. ఇదే యుగంలో అభేద్యమయిన కోటలు, సుప్రసిద్ధ దేవాలయాలు విరివిగా వెలసినవి. వాటిలో వాడపల్లి ఒకటి.

వాడపల్లి చారిత్రిక ప్రసిద్ధమైన ప్రదేశం. ఇక్కడ లభించిన శిలాశాసనాలు, జీర్ణావస్థలోనున్న కోట, దేవాలయాలు కాకతీయుల పరిపాలనా విధానాన్ని వ్యక్తం చేయడమేగాక, యీ ప్రాంతపు చారిత్రిక విశిష్టతను కూడా వర్ణిస్తవి. కృష్ణా–మూసీ నదుల సంగమ స్థానమిందుండుటచే యీ ప్రదేశం అతి మనోహరంగా ఉంటుంది. వర్షాకాలంలో, కోటపైభాగం నుండి చూచినట్లయితే కృష్ణా–మూసీ నదులలో ప్రవహించే నిండువరదలు, నదీలోయలోని పచ్చిక బయళ్లు, సస్యశ్యామలమైన పైరులు, రకరకాల రంగులపూలు నేత్రానందముగా వుంటాయి. నిజంగా ఆ రమణీయ దృశ్యాలు కన్నులపండువుగా ఉండును. రెండు నదులు కోటకు తూర్పు–ఉత్తర సరిహద్దులుగా ప్రవహించుటవలన రక్షణదృష్ట్యా శత్రు దుర్భేద్యమయిన కోటగా వుండేది వాడపల్లి కోట. కోట వలయం సుమారు నాలుగు మైళ్లు ఉంటుంది. ఇందులో నాలుగు పురములు ఉండేవట. అవి వీరభద్రపురం, నరసింహపురం, అగస్తీశ్వరపురం. ప్రతిపురమునకు ప్రత్యేకమైన సింహద్వారాలు కట్టించబడినవి. శిథిలావస్థలోనున్న యీ ద్వారాలను నేటికి కూడా చూడవచ్చును. ఆ యా పురములలో ప్రతిష్ఠాపించిన దైవములను బట్టి వాటికి ఈ పేర్లు వచ్చినట్లు స్థానికులందురు. వాటిలో నరసింహాలయం, అగస్తీశ్వరాలయం ముఖ్యంగా పేర్కొనదగినవి.

మిణుకు - మిణుకు దీపం

కృష్ణానదీ తీరాన గల వాడపల్లి, మట్టపల్లి, వేదాద్రి, మంగళగిరి, కేతవరం అను అయిదు ప్రసిద్ధ నరసింహాలయాలు "పంచనరసింహాలు" అని ప్రతీతి. ఇతర నరసింహాలయాలతో పోల్చితే వాడపల్లి నరసింహాలయం ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. అదే మిణుకు – మిణుకు దీపం. ఈ దేవాలయంలోని మూల విగ్రహానికి ఎదురుగా మూడు దీపాలు పెట్టబడివుంటవి. అందులో మధ్యన వ్రేలాడగట్టిన దీపం ఎల్లప్పుడు మిణుకు–మిణుకు మంటూ రెపరెపలాడుతుంటుంది. చూసేవారికి దీపం గాలికి ఆరిపోతుందా అనే అనుమానం కూడా కలుగుతుంది. మిగత రెండుదీపాలు మాత్రం యథారీతిగా ఎట్టికదలిక లేకుండా నిశ్చలంగా వెలుగుతూనే వుంటవి. ఈ మిణుకు – మిణుకు దీపం స్వామివారి ముక్కు క్రింది భాగంలో నుండుటవలన వారి ఉచ్ఛ్వాస, నిశ్వాసాల ఫలితంగా దీపం రెపరెపలాడుతుందని భావిస్తారు. ఈ వింత అనేక యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తుంది. గర్భగుడికి యిరువైపుల శిల్పకళానైపుణ్యంతో చెక్కబడిన చక్కని రెండు విగ్రహాలు ఉన్నవి. వీరు స్వామివారి ద్వారపాలకులు.

అగస్తీశ్వరాలయం

కృష్ణవేణి–మూసీ నదుల సంగమ స్థానమందున్న కొండపై ఒక శివాలయం ఉంది. దానిని అగస్తీశ్వరాలయమని కూడా అంటారు. ఈ దేవాలయ స్థాపనకు సంబంధించిన గాథ ఒకటి ఉంది. అగస్త్య మహర్షి శివకేశవులను కావడిబుట్టలో తీసుకొని వెళ్లుచుండగా మార్గమధ్యమంలో ఆయనకు దాహము వేసెనట. అక్కడున్న గొల్లకాపరికి బుట్టను యిచ్చి దాహము తీర్చుకొనుటకు ఆ ముని నదీతీరానికి వెళ్లాడు. అగస్త్యుడు తిరిగివచ్చి చూడగా గొల్లకాపరి కనిపించలేదు. బుట్టమాత్రం క్రిందపెట్టబడి ఉండెనట. ఆ శివకేశవులున్న బుట్టను మహర్షి మళ్ళీ ఎత్తనికి ప్రయత్నించగా చాల బరువుగా నుండెనట. ఇంతలో అగస్త్య మహర్షికి ఎక్కడినుంచో ఒక పెద్ద కేక వినిపించెనట. ఆ తరువాత మునీశ్వరుడు తన దివ్య

దృష్టిచే చూచి ఆ ప్రదేశము చాలా పవిత్రమైనదని గ్రహించి, అక్కడే ఒక లింగాన్ని ప్రతిష్ఠించాడట! ఇది ఈ క్షేత్రానికి సంబంధించిన స్థలపురాణం. శివునికి అంకితం చేయబడ్డ దేవాలయంకూడా కట్టించబడినది. అందులకే దీనికి అగస్త్యేశ్వరాలయం అని పేరు వచ్చింది. దేవాలయంలోకి ప్రవేశించగానే కుడివైపు అగస్త్య మహాముని విగ్రహము కనిపిస్తుంది.



విచిత్రమైన శివలింగం

నదికి 400 అడుగుల ఎత్తునగల అగస్త్యేశ్వరాలయంలో ఒక విశేషమైన శివలింగం ఉంది. దాని పైభాగమున చేయి పట్టునంత భాగం గుంటవుంది. అందులో ఎల్లప్పుడు నీరువుంటుంది. ఆ నీరు యెప్పుడు ఎండిపోదు, పైకి పొంగిపోదుకూడ, యెల్లప్పుడు ఒకే పరిమాణములో నీరు వుంటుంది. నీరును తోడినకొలది తిరిగి నీరూరుతుంటుంది. ఈ శివలింగంయొక్క మహాత్మ్యము మనం ఇతర దేవాలయాలలో చూడలేం. 400 అడుగుల ఎత్తుపైనున్న యీ కొండమీది శివలింగంలోనికి నీరు వచ్చు చిత్రాతిచిత్రమైన రహస్యమార్గము ఇంతవరకు ఎవరును తెలిసికొన జాలకపోయిరి. అయితే దానికి ఒక చక్కని కథ ఉంది.

ఒక బోయవాడు పక్షిని వేటాడుతుండగా అదివచ్చి శివుని వద్ద శరణుజొచ్చెనట. బోయవాడు పక్షిని వెతుకుచూ అగస్త్యేశ్వరాలయమునకు వచ్చి శివుని దర్శించెనట. "నా పక్షిని నాకిమ్మని" బోయవాడు శివునికోరగా పక్షిగాక మరేదయినా కోరికను కోరమని ఈశ్వరుడు చెప్పెనట. అప్పుడు ఆకలితో అలమటించుతున్న బోయవాడు తనకు ఆహారము కావలయునని సమాధాన మిచ్చెనట. వెంటనే ఈశ్వరుడు చేతితో తనమెదడు తీసి బోయవానికి ఆహారముగా యిచ్చెనట. శివలింగం మీదనున్న గుంట ఈశ్వరుడు తన మెదడు తీసిన తరువాత ఏర్పడినదనీ, అందులో వుండే నీరు పాతాళగంగతీర్థకు చిహ్నమని అంటారు. ఈ విచిత్రమైన శివలింగమును అందులో ఎప్పుడు నీరూరే మహాత్మ్యమును కళ్ళార చూచుటకు అనేకమంది యాత్రికులు సంవత్సరం పొడుగునా వాడపల్లిని దర్శిస్తూనేవుంటారు. ఈ ఆలయంలో కాకతీయుల పరిపాలనా ప్రతిభను వర్ణించే ఒక శిలా శాసనం కూడా దొరికింది.

శివరాత్రి

ప్రతి సంవత్సరం మాఘ బహుళ అమావాస్య నాడు శివరాత్రి ఉత్సవం ఇక్కడ మహావైభవంగా జరుగుతుంది. ఆరోజు రాత్రి యీ పవిత్ర ఉత్సవంలో పాల్గొనడానికి పలు మూలలనుండి తండోప తండాలుగా భక్తులు వస్తారు. ప్రతి పన్రెండు సంవత్సరాల కొకసారి జరిగే కృష్ణా పుష్కరాలు కూడా పేర్కొనదగినవి. కృష్ణా మూసీనదుల సంగమస్థానమందు స్నానం చేసి అగస్త్యేశ్వరాలయాన్ని దర్శించే భక్తులకు శివుడు మోక్షం ప్రసాదిస్తాడనే నమ్మకం ప్రజల్లో ప్రగాఢంగా ఉంది. కాశీకి తీర్థయాత్రకు వెళ్ళితే కలిగే పుణ్యం వాడపల్లిలోని శివాలయం దర్శిస్తే కూడా కలుగుతుందని భక్తులలో ఒక విశ్వాసం ఉంది. అందుచేత వాడపల్లిని దక్షిణ కాశి అని కూడా అంటారు.

కిరణం

కాధా పద్మ



కాలేజీనుండి అలసిపోయి వచ్చాను.

ఇల్లంతా వెలితిగా అనిపించింది.

చల్లనీళ్ళతో ముఖం కడుక్కొని, డ్రస్సుమార్చుకున్నాను. ఇంతలో నాదగ్గర పనిచేసే సుబ్బులు కాఫీకప్పు అందిస్తూ...."అమ్మా! వంటయిపోయింది. నన్నుండమంటారా!" అంది.

"వద్దు, ఈరోజుకు నేను వడ్డించుకుంటాలే. నువ్వెళ్ళు" అన్నాను కాఫీ తాగుతూ.

సుబ్బులు వెళ్ళిపోయింది. ఖాళీకప్పు ప్రక్కన పెట్టాను. ఆమె వెళ్ళిపోవడంతో నేను మరీ ఒంటరిగా ఫీలయ్యాను. కుర్చీలో వెనక్కివాలి కూర్చుంటూ కిటికీలోంచి బయటకు చూసాను.

ప్రకృతి చుట్టూ చీకట్లు చిక్కగా అల్లుకుంటున్నాయి. వీధుల్లో ట్యూబ్‌లైట్లకాంతి ప్రకాశవంతంగా వెలిగిపోతూ కనులు మిరుమిట్లు గొలుపుతున్నాయి. వాటినలా తిలకిస్తూ నన్ను నేను మరచిపోవాలనుకున్నాను. తప్పకుండా అలా మరచిపోగలనని కూడా అనుకున్నాను. కాని, సాధ్యం కాలేదు. ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

నాకు ఊహ తెలిసిననాటినుండి ఇప్పటివరకు ఒకరికి నేను హానిచేసిన గుర్తులేదు. అయినా నేను పరుల దృష్టిలో ఎందుకో ద్రోహినైపోతున్నాను. కారణం ఆలోచించినా అర్థం కాదు. నాకు తెలిసినంతవరకు నేను ఇతరులకు సహాయపడుతూనే ఉంటాను. అయితే నాకటువంటి సహాయపడేవారు లేరు. నా కష్టాలను గుర్తించేవారు లేరు. అయినప్పటికీ ఎప్పుడూ ఇతరుల క్షేమాన్నే కోరుతుంటాను. మరి అందుకేనేమో! నాకిన్ని నిందలు!! అప్రయత్నంగా ఉదయం జరిగిన సంఘటన కళ్ళముందు కదిలింది.

కాలేజీకి వెళ్ళుతోన్నాను. ఇంతలో వెనుక......

"ఏరా! పిట్ట బాగుంది కదూ!"

"అబ్బ! వినపడుతుందేమో ఊరుకోరా బాబూ!"

"ఎహే వినపడితే మాత్రం ఏంచేస్తుందిరా! బొత్తిగా నీది పిరికి గుండెరా! అయినా ఈ రోజుల్లో ప్రయత్నించాలేగాని, ఏ పిట్టయినా పడక మానదురా!"

"సరేగాని, ఇంతకీ ఈవిడ వెధవావిడనుకుంటా కదూ!"

"కుంటా ఏవిట్రా నీ ముఖం! పూర్తిగా వెధవముండే. అవునులే. వ్యత్యాసం తేలీడం లేదుకదూ! మొదట్లో ఆ ముఖాన బొట్టు కాదుకదా కనీసం పౌడరుకూడా ఉండేదికాదు. ఒక్క చీర మూడురోజులు కట్టేది. మరి యిప్పుడో! స్నో, పౌడరు రాసిన ముఖంలో కనీకనిపించనంత బొట్టు ఉంటుంది. రోజుకో నలగని చీర ధరిస్తుంది. అబ్బో! చాలా మారిపోయిందిలే. మొదట్లో నీతిమంతురాలనుకున్నాను. కాని, మాంచి నటకురాలురా బాబు! అంతేకాదు వీలుంటే తలలుకూడా మార్చేస్తుంది."

"నిజంగా"

"మరేవిటనుకున్నావోయ్!"

వింటూ భరించలేని ఆ మాటలకు చివ్వున వెనుదిరిగాను. ఎవరో ఇద్దరు అపరిచిత వ్యక్తులు, నన్నుచూసి వెకిలిగా నవ్వడమే గాకుండా అందులో ఒకరు కన్నుకొట్టారు. నా ఆశ్చర్యానికి అంతులేదు. క్షణం అలాగే బిగుసుకుపోయి నిలబడిన. తరువాత మామూలుగా అయ్యేటప్పటికి వాళ్ళు వెళ్ళిపోవడం కూడా జరిగిపోయింది. అయినా వాళ్ళను వెతికి తెచ్చి బాగా బుద్ధి చెప్పాలనిపించింది. జీవితంలో వాళ్ళు మరచిపోలేనటువంటి శాస్తిచేసి మరీ పంపాలనిపించింది. అయితే ఇంతలో ఒక సహోద్యోగి వచ్చి విష్ చేయడంతో ఊహలు చెదిరిపోయాయి

వెంటనే యింటి స్థితిగతులు గుర్తుకు రావడం జరిగింది. మరింకేం ఆలోచించక, సరాసరి వెళ్ళిపోయాను. కాని, మనసు పని మీద లగ్నం చెయ్యలేక పోయాను. వాళ్ళెవరో తెలియదు. అయితే వాళ్ళకు నేను తెలిసి ఉన్నట్లే మాట్లాడారు. అవి మాటలా! కాదు ఈటెలు. ఆ ఈటెల్లాంటి మాటలతో హృదయాన్ని గుచ్చారు వాళ్ళనేం చెయ్యాలి! ఇంత అన్యాయంగా అన్నందుకు వాళ్ళనేం చేసినా పాపం లేదేమో! నలుగురికి చెప్పి వాళ్ళెక్కడున్నా వెదికి తెచ్చి శిక్షించాలనిపించినా చివరకది ఉత్తమంగా తోచలేదు. అందుకనే అది విరమించుకుని ఆలోచించసాగాను కానిఅది కూడా అనవసరమనిపిస్తోందిప్పుడు.

పేదవాని కోపంలా యీ ఆవేశానికి విలువలేదు. ఎంతహోదాలో ఉన్నా స్త్రీని. అందునా మామూలు స్త్రీని అరిటాకు సామెతలా బ్రతుకు పతనమయ్యేకంటే ఎవరు ఎన్ని అన్నా పట్టించుకోకపోవడం అన్నివిధాల ఉత్తమం. శంఖం పూరిస్తున్న 'జంగం వెనుక ఊరకుక్కలెంత భీకరంగా అరచినా పట్టించుకోడట. అంతేనేమో స్త్రీ కర్తవ్యం కూడా! కనుక, యిలా ఆలోచించడంలో అర్థంలేదు.

రేడియో ఎప్పుడు ఆన్‌చేసి ఉంచానో తెలియదు. ప్రోగ్రామ్సు అయిపోవడంతో అది ఒకటేపనిగా బుర్రుబుర్రు మంటోంది. రేడియో కట్టేసి టైమ్‌చూసుకున్నాను చేతివాచ్‌లో పదిన్నర దాటిపోయింది. నిద్రవచ్చే సూచనలు కనిపించడంలేదు. మనస్సు భోజనంపైకిపోవడం లేదు. కూర్చున్న చోటునుండి లేచాను గదులన్నీ ఒకసారి తిరిగివచ్చి. మళ్ళీ యథాప్రకారం కుర్చీలో కూలబడ్డాను

ఇల్లంతా నిశబ్దంగా ఉంది పెట్టిన వస్తువులన్నీ పెట్టిన చోటుల్లో కదలకుండా కనిపిస్తున్నాయి. రోడ్డుపై వెళ్ళే వాహనాల శబ్దం తప్ప మరేశబ్దం వినపడ్డంలేదు. రక్షణకొరకు వాయిదాల పై అప్పుచేసి ఓ చిన్న ఇల్లుకట్టుకున్నాను నా అనేవాళ్ళు లేరని, బ్రతుకు తెరువు కనపడ్డం లేదని, రోజులు గడవడం కష్టంగా ఉందనీ...... రంగయ్య కూతురు లక్ష్మి వచ్చి బాధగా తనముందు విలపిస్తోంటే ...చూస్తూ ఊరుకోలేక వాళ్ళను చేరదీశాను ఉన్న ఖాళీస్థలంలోనే ఓ చిన్న ఇల్లులాంటిది కట్టించి వాళ్ళకు ఇచ్చాను. ఇంట్లో పనంతా చూసి లక్ష్మి వంటచేసి పెడుతోంది. రంగయ్య పైపని చూసుకుంటూ రకరకాల మొక్కలు తెచ్చి ఇంటి ముందున్న కాస్త స్థలంలోను వేసి అందంగా పెంచుతున్నాడు ఇంటి సంరక్షణ కొరకు వాళ్లు చక్కగా సరిపోయారు. వీధిలో రాత్రులు కాపలాగా తిరుగుతున్న ఘూర్ఖా అప్పుడప్పుడూ వచ్చి యోగక్షేమాలు తెలుసుకుని చాయికు నాలుగు డబ్బులడిగి తీసుకు వెళుతుంటాడు. రోజూ కాలేజీకి వెళ్ళి వస్తుంటాను. రంగయ్య, లక్ష్మి ఎంతో సహాయం చేస్తూవుంటారు. ఘూర్ఖా వీధిలో అందరికి రక్షణగా తిరుగుతుంటాడు గుమ్మంలో పూల మొక్కలు అందంగా పెరుగుతుంటాయి. రోజులు క్షణాల్లో గడిచిపోతూవుంటాయి. అంతకన్నా వేగంగా వయసు...వయసు...ఛ! మళ్ళీ ఆలోచనలొస్తున్నాయి. ఇలా ఎంతసేపని అలోచించను! ఒకవేళ పడుకుంటే ఆలోచనలు రావేమో! అనుకుంటూనే లేచివెళ్ళి బెడ్‌లైట్ వేసుకుని, నిద్రరాకపోయినప్పటికి బలవంతంగా కళ్ళు మూసుకుని పడుకున్నాను.

మారుతున్న కాలం ఆగనంటూ కదలిపోతోంది. మారని మనుష్యుల్లో మూర్ఖత్వం అలాగే కనిపిస్తోంది. అయితే ఈ మధ్య నా హృదయం మరీ విపరీతంగా విలపిస్తోంది. నా నిరీక్షణలో కాలం కరిగిపోతోంది. వయసు ముదురుతోంది. కలలు అలలై తేలిపోతున్నాయి. కొన్ని ఆశయాలు నెరవేరినప్పటికి ఆశలు మిగిలిపోతున్నాయి. చివరికి నేను మోడులా మిగిలిపోతానేమో తెలియదు. గడచిన ఈ కొద్దికాలంలోను ఎన్నో వింతలు మరెన్నో మార్పులు జరిగిపోయాయి. ప్రొద్దస్తమానం కష్టపడిన సంపాదనతో నన్ను నేను పోషించుకుంటున్నాను. ఈ సంపాదన, ఈ శ్రమ అంతా ఎందుకు, ఎవరికొరకు?! మిగిలి ఉందనుకున్న ఆశాకిరణం కాస్తా కరిగి నీరయిపోతోంది ఏమిటో! వద్దనుకుంటూనే ఆలోచిస్తున్నాను.

వంట పూర్తి చేశాను. చెయ్యడానికి మరో పని కనపడ్డం లేదు. వేళ మించినప్పటికి మనసు భోజనంపైకి పోవడం లేదు. క్షణం నిస్పృహగా నిట్టూర్చాను. సాధారణంగా నాకెప్పుడూ హాయిగా నిద్రపట్టదు. కనుక రవీంద్రుని సాహిత్యం తెరిచాను. అలా తెరుస్తున్నప్పుడు, నేనెప్పుడో అందులో నే పెట్టి మరచిన ఉమా శశి పెళ్ళి శుభ లేఖ జారి నా వళ్ళో పడింది అలా పడిన లేఖను చేతిలోకి తీసుకుని దాన్నే తదేకంగా చూస్తూ వుండి పోయాను. అలా చూస్తూ ఉంటే గతం గుర్తుకు రాసాగింది.

* * *

ఆప్పుడు తానెంత నిరాకరించినా వినకుండా నుదుట చిన్న తిలకం దిద్ది, ఉమా శశి పెళ్ళికి లాక్కెళ్ళిపోయారు. స్నేహితులంతా కలసి వివాహవేదికపై ఉమాశశి సిగ్గుబరువుతో వరుడు ప్రక్కన కాంతులీనే కళ్ళతో ఒదిగిపోయి అందంగా కూర్చునుంది. వరుడు చూసే క్రీగంటి చూపులకు రహస్యంగా చేసే అతడి చిలిపి పనులకు శశి తన్మయత్వంతో తబ్బిబ్బయిపోతూ మత్తుగా కళ్ళెత్తి చూసి సిగ్గుతో తలవాల్చేసుకుంటోంది. సీతాకోక చిలుకల్లా సింగారించుకున్న ఆడవాళ్ళు హడావిడిగా తిరుగుతున్నారు దూరపు బంధువులు, స్నేహితులు అంతా కలసి పొందిగ్గా కూర్చుని వివాహ తతంగాన్ని ఆనందంగా తిలకిస్తున్నారు. మంగళ వాయిద్యాలు జోరుగా మ్రోగుతున్నాయి పురోహితులు మంత్రాలు జోరుగా వల్లిస్తున్నారు. ముత్యాల పందిరి మధ్య కూర్చున్న వధూవరులకు జీలకఱ్ఱ పెట్టించడం, కాళ్ళు కడిగించడం, మూడు ముళ్ళు వేయించడం తలంబ్రాలు ఒకరిపై ఒకరు అతిఉత్సాహంతో పోసుకోవడం లాంటివి......ఆ ఆనందం...ఆ అట్టహాసం...ఆ తతంగం ముగిసిపోయినా అవియింకా తన హృదయంలో చెరగని ముద్ర వేసుకుపోయాయి.

"ఏమ్! రాధా! నిన్నే! మళ్ళీ నువ్వు పెళ్ళెందుకు చేసుకోకూడదు! కాలం చాలా మారింది. మూఢ నమ్మకాలు, ఆచారాలు అన్నీ ఏనాడో సమసిపోయాయి. దేశం పురోగ

మిస్తోంది, పునర్వివాహము ఈ నాడో సమస్య కానే కాదు. అయినా మీ వాళ్ళు నీ పెళ్ళివిషయంలో ఎందుకు శ్రద్ధవహించరు? బొట్టు పెడితే నీ ముఖం ఎంత అందంగా ఉందో తెలుసా? ఈ పందిరిలో అందరి మధ్య నీ సౌందర్యం ప్రత్యేకంగా కనిపిస్తోంది. అని స్నేహితులంతా కలసి ఏమేమో అంటోంటే వారి మాటలకు తగిన సమాధానం ఇవ్వలేక నిర్లిప్తంగా నవ్వి ఊరుకున్నాను

వివాహ మనేది జీవితంలో మరువలేనటువంటి ప్రథమ ఘట్టం. వివాహపు ఘడియలు ఆ స్మృతులు, సువర్ణాక్షరాలలో హృదయ ఫలకంపై లిఖించుకోవలసినటువంటివి. తియ్యని అనుభూతులతో అనుక్షణం ఓ మధుర క్షణంలా గడిపే...... ఆ ఘడియలు...అవి—అవి యీ బ్రతుకులో తెలియని క్షణాలు. వాటిని తెలుసుకుందామని ఆ ఆనందం అనుభవిద్దామని ప్రయత్నించిన రోజు. ....

హవ్వ!! సిగ్గు లేకపోతేసరి! ఇదెక్కడ చోద్య మేతల్లీ! మళ్ళీ పెళ్ళి చెసుకుంటావా! ఇంత కాలం గడిచాక ఇదేం బుద్ధి?! వంశాన్నంతా ఒక్కసారే గంగలో ముంచేకంటె మాకందరికి ఇంతవిషం ఇవ్వరాదటే! మొగుడు చచ్చిన ముండవి ——— హవ్వ! పెళ్ళట! పెళ్ళి!! ఏదో పోనీలే అని—నిన్ను నువ్వు పోషించు కోగలవనీ. అక్షరజ్ఞానం మంచిదనీ చదివించాం. ఉద్యోగంచేస్తా నంటే వప్పుకున్నాం. నెత్తినున్నజుత్తు తీయనని మొరాయిస్తే భరించాం. అందుకు ఇపుడు ఇలా ఎదురు తిరుగుతావన్నమాట! బొత్తిగా బరితెగించావు సుమా! అయినా మేం అనుకుంటూనే ఉన్నాం. ఇలాంటి అఘాయిత్యం లాంటిదేదో తప్పకుండా చేస్తావని! ఇంతకీ ఇదంతా మాబుద్ధి పొరపాటులే! అయినా చెప్తున్నాం విను ఇటువంటివి మన ఇంటా వంటా లేవు. వెర్రితలలువేసే ఆ నవనాగరికతలు మన వంశానికెంత మాత్రం సరిపడవు. ఆదంతే కనుక బుద్ధిగాఉండు. అటువంటి వాటిపై ఆశలే మాత్రం పెంచు కోవద్దని చెప్తున్నాం గుర్తుంచుకో. తెలిసిందా! ఆ!! ''

తల్లీ తండ్రీ ఏనాడో గతించి పోవడంతో ఆనాడు అన్నా వదినలకు నేను బరువైపోయాను. పునర్వివాహపు ప్రసక్తి వారికి పట్టలేని ఆగ్రహాన్ని, ఆవేశాన్ని తెప్పించింది.

అభం, శుభం తెలియని ఎనిమిదేళ్ళ ప్రాయంతో జరిగిన వివాహం గాని, తరువాత మరి మూడేళ్ళలో కట్టుకున్న భర్త అనబడే పాతికేళ్ళ యువకుడికి ఏదో అంటువ్యాధి వచ్చి చనిపోయినట్లు గాని. నా మనసుకు అంతగాతెలియవు. తెలిసిందల్లా ఆ సమయంలో చదువు నిరాటంకంగా ముందుకు సాగిపోవాలని మాత్రమే. అందుకే మొండిగా పట్టుదలతో ఇంత వరకు అన్నకున్న వాటిల్లో ఈ మాత్రం సాధించ గలిగాను. చదువు ముగిసిన అనంతరం టీచరుగా పనిచేస్తూ ఆర్థికంగా కుటుంబానికి తోడ్పడసాగాను. సంపాదనంతా అన్నా వదినల చేతుల్లో పోయడమే జరుగుతోంది. ఒక ఆశ, అనుభవం లేకుండా బ్రతుకు బొంగరంలో—విసుగు విరామం లేకుండా, క్రమం తప్పకుండా అలాగే జీవితం గడుస్తోంది. డబ్బు తెచ్చిందా లేదా అని అనుకునే వారేగాని, తన భవిష్యత్తేమిటనిగాని తన యోగ క్షేమాల గురించి గాని వాళ్ళెప్పుడూ ఆలోచించ లేదు. ఎప్పుడో చిన్నప్పుడు జరిగిన సంఘటనకే తన బ్రతుకు అంకితమైపోయినట్లు ఇహ ఇప్పుడు ఇంతకన్నా మార్పు తన జీవితంలో మరి ఉండ కూడదని వాళ్ళు అంటూంటే ఆలా వాళ్ళు తర్కించుకొంటూంటే చూస్తున్న నాకు మతి పోతుందేమోనని పించేది. అంతేకాదు అన్నలు తన స్వంత అన్నలు కారని మరో తల్లి కొడుకులని గుర్తుకు రావడం కూడా జరుగుతూ ఉండేది. అదీ వారి చర్యల మూలంగానే క్రమంగా గుండెల్లో బాధ గూడు కట్టుకోసాగింది.

అనుకోకుండా నాకు ట్రాన్సఫర్ అయింది

ఇది విన్న ఇంట్లో అందరూ అమితంగా ఆశ్చర్యపోయారు నన్నే గుచ్చిగుచ్చి చూస్తూ..."ఒంటరి దానివి వేరేచోట ఉద్యోగం ఎలా చేస్తావు? ఎలా వీలువడుతుంది! ఇక్కడే మరేదాయినా చూసుకో వచ్చులే!" అంటూ తేలిగ్గా కొట్టిపారేసారు.

ఆ ఇంట్లో వారందరికి గొడ్డు చాకిరీ చేస్తూ ఇటు ఉద్యోగ సంపాదన తెచ్చి వాళ్ళ చేతుల్లో పోస్తూ ఎన్నాళ్ళిలా! అలా ఎంత కాలం ఈ జీవితం?! మనసు మమతల కొరకు ఆక్రోశిస్తోంది. మనసులో భావాలు వాళ్ళు గ్రహించరు పోనీ చెప్పినా ప్రయోజనం లేదు. వాళ్ళ నెదిరించే శక్తి రావడం లేదు, అంతకాలం ఇంతేనేమో బ్రతుకు! అని ఊహిస్తూ ఆ రోజు హెడ్మిస్ట్రెస్ దగ్గరికి వెళ్ళాను.

"ఏలాగయినా నాకీ ట్రాన్స్ఫర్ ఆపు చేయించాలి మేడమ్" అని ఆవిడకు విన్నవించున్నాను.

"ఏం ఎందుకని?! ఏం ఇబ్బంది వచ్చి పడిందేవిటి?"

"ఒంటరిగా అంతదూరం వెళ్ళడం ఇష్టంలేదు. అదీగాక ఇంట్లో ఎవరికీ...... "

"ఇష్టం లేదంటావు. అవునా! ఇవన్నీ నువ్వొచ్చి చెబుతావని నాకు తెలుసు. లోకంలో నువ్వొక్క దానివే ఒంటరివనుకుంటే ఎలా! ప్రపంచంలో నీవంటి వాళ్ళు ఎంతోమంది ఉంటారు. ప్రతీ వ్యక్తికి ధైర్యం అవసరం. ప్రతీ నిముషం నిరుత్సాహంతో కృంగి పోకూడదు. నీకు మంచి భవిష్యత్తు ఉంది నీ టీచింగును చాలా మంది ప్రశంసిస్తున్నారు. నిన్ను ప్రమోషనుపై బదిలీ చేస్తున్నాం. ఇంత మంచి అవకాశాన్ని జార విడవకు. నువ్విక్కడ గడుపుతున్న గానుగెద్దు బ్రతుకు అందరికీ తెలిసినదే నీపై ఏ మాత్రము అభిమానమూ కనబరచని వాళ్ళను, నువ్వంటి పెట్టుకు బ్రతుకడంలో అర్థంలేదు, దేశం ఎంతగానో పురోగమిస్తోంది 'అయ్యో! ఒంటరిగా బ్రతకాలే' అని నువ్వనుకోవద్దు అక్కడ కావలసినన్ని వర్కింగ్ వుమెన్ హాస్టల్సు ఉన్నాయి అవసర మనుకుంటే నా సహాయం నీకెప్పుడూ ఉంటుంది, కాదనకు అందావిడ ఎంతో ఆప్యాయంగా.

ఆ ఫలితమే అందరికీ దూరమయి పోయాను. ప్రమోషన్‌లో వచ్చి చేరిన మరి కొంతకాలానికి మరికొన్ని పరీక్షలు పూర్తి చేసి ఒక కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. ఆ మార్పు కొంత వరకు మనసులో శాంతిని చేకూర్చినప్పటికీ, మనసు మమతల కొరకు తపించడం మానలేదు

పురోగమిస్తున్న ప్రపంచాన్ని, పెరుగుతున్న నాగరికతను, వృద్ధి చెందుతున్న విజ్ఞానాన్ని ఎప్పటికీ అవహేళన చేసే మనషుల మధ్య, మనస్సులేని మనిషిలా ఉన్నప్పుడు, అక్కడ———— స్నేహితులంతా కలసి బలవంతంగా దిద్దిన తిలకం తప్పితే ఎప్పుడూ నుదట బొట్టు పెట్టుకోలేదు. అలా అలవాటు పడకుండా పెంచారు. పెద్ద వాళ్ళు నుదుట కుంకుమ, చేతుల నిండుగా గాజులు, తల్లో పూలు, కాటుక, పెట్టుకోవాలని అనిపించినా, బలవంతంగా ఆ కోర్కెల నణచుకోనేదాన్ని. అంతేకాదు ఈ శతాబ్దంనాటికి ఇంకా మారని మనుషులున్నందుకు, పురోగమిస్తున్న దేశపు గాలి ఆ ప్రాంతం వైపు ఏమాత్రం తగల నందుకు ఆలోచిస్తూ, చింతిస్తూ ఉండేదాన్ని

ప్రమోషన్‌లో బదిలీ అయిన చోట మొదట్లో అందరూ వింతగా చూసేవారు. తరువాత కొద్ది రోజులకు ఏవిటో నాలో ఉన్న చిన్న చిన్న కోరికలు పైకి విజృంభించడం ప్రారంభించాయి. అంతే, నెమ్మదిగా బొట్టు పెట్టుకోవడం, చేతికి గాజులు వేసుకోవడం ప్రారంభించాను. అప్పటి నుండి మరీ వింతగా చూచేవారు తరువాత మరి కొద్ది రోజులకు కాలేజీలో ఉద్యోగం సంపాదించాను. అయితే అక్కడా అదే పరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చింది. వింతగా చూసేవారు. చూసి ఊరుకోకుండా, మరుక్షణమే గుసగుసలు ప్రారంభించే వారు తన గురించి వాళ్ళల్లో అనేక సందేహాలుదయించాయని, ఆ గుసగుసలు తన గురించేనని మొదట్లో అనుకోలేక పోయాను. నా పనేదో చేసుకుని వెళ్ళి పోయేదాన్ని. అయితే వాళ్ళనుకునే వన్నీ తన గురించేనని ఆనక గ్రహించ గలిగాను. అయితే మనసుకు బాధనిపించింది, చేసేదేమీ లేక నిస్పృహగా నిట్టూర్చేదాన్ని.

ప్రాణంగా చూసుకునే భార్య గతించిన పురుషుడయితే గత స్మృతుల్ని తేలిగ్గా వీడి ధైర్యంగా మరి నాలుగు నెలలకు మరియొక వివాహానికి సిద్ధపడతాడు అంతేకాదు, వెంటనే వివాహం చేసుకుంటాడు అయితే అది లోకం తప్పుగా తలచదని మనకు విదితమే. కాని, స్త్రీ ఒకసారి వివాహిత అయితే తెలియని ప్రాయం అయినప్పటికి ఆమెకు పునర్వివాహం కావటం ఎంత కష్టమో విజ్ఞాన వికాసాలు పెరిగిన ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా మనం లోకాన్నిగురించి చర్చించుకోవలసిన అవసరం ఇంకా ఉందనే అనిపిస్తోంది. స్టేజిపై లెక్చర్లిచ్చినంత తేలిగ్గా అచరణలో అది పెట్టలేరని అనుభవ పూర్వకంగా తెలుస్తోంది. ఇది నిజం కాదు. ఎవరం నమ్మం అని అందరూ అంటే ఆడది చేయ గలదు !

తన ప్రవర్తనలో మార్పు చూసిన భర్త తనను భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని, ఆ కారణంవల్లే తమ కుటుంబపు వ్యక్తులు తనను వెలివేశారని, అందుకే తను వంటరి జీవితాన్ని గడుపుతోందని...అందరూ ఏకమై అంటున్నారు ఇది నిజం కాదు అని తను వాదించినా, వాళ్ళు వినేట్టులేరు. అందుకే అసలు వాళ్ళను పట్టించుకు బాధపడ్డం మానేశాను కాని అప్పుడప్పుడూ ఒంటరిగా కూర్చుని ప్రజల మూర్ఖత్వానికి పిచ్చిగా నవ్వుకోవడముంది.

* * *

వంట గదిలో ఏవో గిన్నెలు పడిపోయిన శబ్దం బిగ్గరగా వినిపించింది హఠాత్తుగా ఉలిక్కిపడ్డ నేను దీర్ఘాలోచనలనుండి తేరుకుని లేచివెళ్ళాను. పిల్లి పాలు పూర్తిగా తాగలేదు. సగం తాగి మిగరాని నేలపరంచేసి పారిపోయింది. గచ్చుపై పరుచుకుంటున్న పాలను చూస్తుంటే...నా జీవితం ఆ విధంగా వృధా అయిపోతోందా అని...అనిపించింది. అక్కడ శుభ్రంచేసి, కిటికీ తలుపులు మూసి తిరిగి గదిలోకి వెళ్ళాను.

ఎదురుగా తెరిచి ఉంచిన రవీంద్ర సాహిత్యం వెక్కిరించి నట్లనిపించింది.


ఇటువంటి సాహిత్యాలెన్నిఉన్నా, ఎన్ని చదివినా ఈ లోకంలో ఆశించినంత మార్పు మాత్రం కనపడదు. అలా కాక పోయినప్పటికీ ఈ నా జీవితం ఇలా నిర్లిప్తంగా సాగిపోయినా బాగుండేది. కాని అలా కాకుండా..."మళ్ళీ పెళ్ళిచేసుకోరాదూ!" అంటూ పదిమందీ సాగదీసూ అడుగుతారు. నా పరిస్థితినంతా గ్రహించినవాళ్ళే అలా అడిగితే నేను సమాధానం ఏమివ్వగలను !

వాళ్ళకున్నట్లే నాకూ కోరికలు, అభిరుచులు అన్నీ ఉన్నాయి. సంసారం, పిల్లలు, భర్త, బాధ్యతలు, అనుభూతులు, అనుభవాలతో మధురంగా క్షణాలను గడిపేద్దామనే ఉంటుంది కాని ఎలా ! ఆకాశాన్నంటే వరకట్నపు ధరలకు— ముదురుతున్న వయసుకూ, రెండింటికి పొత్తు కుదరడంలేదు. ప్రేమించామంటూ చాలా మంది వచ్చారు. నేను ముందుగావెళ్ళి మాట ఎత్తే సరికి అసలు కనపడ్డమే మానేశారు అప్పుడనిపించింది నాకు—ప్రపంచం పురోగమించినా, విజ్ఞాన వికాసాలు ఆకాశంఎత్తున పెరిగిపోయినా, మనిషి నరనరంలో జీర్ణించుకుపోయిన స్వలాభం మాత్రం ఎప్పటికీ పోదని, అయినా నిరీక్షిస్తున్నాను. నిరీక్షణలో కాలం వృధాగా అయిపోతోంది. ఇలా ఈ తీరని కోరికల మధ్య ఒంటరిగా ఇంకా...ఎంతకాలం జీవించాలో! తలపుకే భయంగా ఉంది ఊహలతో, వివిధ ఆలోచనలతో నాతల పగిలి పోతుందేమో అన్నట్టుంది కిటికీలోంచి బయటకు చూస్తుంటే ఆకాశం నల్లగా, అందులోని తారకలు తెల్లగా మెరుస్తున్నాయి. చల్లటి గాలివచ్చి నా శరీరానికి తగులుతోంది. భవిష్యత్తేమిటా అని శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాను.

ఇంతలో ఉన్నట్టుండి రంగయ్య ఇంటినుండి చిన్నపిల్లవాడి ఏడుపు సన్నగా వినిపించింది. క్షణం నా కళ్ళముందు క్రిందటి సంవత్సరం పెళ్ళయిన లక్ష్మి రూపమే మెదిలింది. హాయిగా ఆనందంగా జీవితాన్ని గడుపుతున్న లక్ష్మి సంవత్సరానంతరం చక్కటి బిడ్డనుకని చనిపోయింది ఈవార్త లక్ష్మి భర్తకు షాక్

(తరువాయి 64వ పేజీలో)

మిరియాల ధనముతో మొగిలి దేవాలయము



ఎస్. ఎస్. కుప్పురాజు

ఆంధ్రప్రదేశ్ అందాలసీమ. అందులో చితూరు జిల్లా క్షేత్రములకు సీమయై విలసిల్లుచున్నది. తిరుపతి, శ్రీకాళహస్తి రమణీయమైన ప్రకృతి సౌందర్యముతో వెలయు హార్స్‌లీ కొండలు. సదాశివకోన, కంకుంది మొదలగు ముఖ్య క్షేత్రములతో పాటు మొగిలి క్షేత్రములో మొగిలీశ్వర దేవాలయము చాల ప్రసిద్ధిగాంచి విలసిల్లుచున్నది. చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం పంచాయతీ సమితిలో మదరాసు నుండి బెంగుళూరు పోవు మార్గములో చిత్తూరునకు పడమర 18 వ మైలులో మొగిలి క్షేత్రమున్నది. ఇచ్చట మొగిలీశ్వరస్వామి ఆలయము ప్రసిద్ధ పుణ్య క్షేత్రము. అసంఖ్యాక భక్తులు ముఖ్యముగా శివరాత్రిలందు ఇచ్చటికి వచ్చి స్వామికి భక్తి శ్రద్ధాంజలులు చూపుదురు.

ఈ దేవాలయము చాలా పురాతనమైనది. దీనికి చరిత్ర ఆధారములు లేనట్లు కనబడుచున్నది. ఇచ్చట లభించు కొన్ని లిపులను మాత్రము కేంద్రప్రభుత్వము తరపున పురావస్తు భద్రత శాఖ వారు పరీక్ష నిమిత్తం వ్రాసి కొనిపోయారు.

మొగిలి దేవస్థానము చుట్టు ప్రకృతి సౌందర్యముతో విలసిల్లుచున్నది. ఇచ్చట కొండలు, సెలయేర్లు, పైరు పచ్చలు కన్నుల పండువ గొల్పును. దేవాలయములోని కోనేరు చాల ప్రసిద్ధికెక్కినది. ఈ కోనేరునకు నిరంతరము నంది నోటి నుండి నీరు వచ్చి పడుచుండును. కాని కోనేరులో మాత్రం ఒకే స్థాయిలో నీరు నిలిచి యుండును. నీరు సదా నంది నోటి నుండి పడుచున్నప్పటికి కోనేరు తగ్గక, హెచ్చక ఒకే స్థాయిలో ఉండుట ప్రజలకు ఆశ్చర్యమును కలుగజేయుచున్నది. యాత్రికులు చూచి ఆనందించెదరు. దేవస్థానము తరపున ఇటీవల ఒక చిన్న అతిథి గృహమును కూడా నిర్మించియున్నారు. దేవస్థాన ధర్మాదాయ సంఘము వారిచే ఈ దేవాలయము నడుపబడుచున్నది. శివరాత్రులందు పది రోజులు ఉత్సవములు జరుగును. అనేక వేల జనులు ముఖ్యముగా తమిళనాడు మొదలగు పొరుగు రాష్ట్రముల నుండి వచ్చెదరు. దేవస్థానము తరపున తిరుపతి-పలమనేరుకు బస్సు నడుపబడుచున్నది. తిరుపతి నుండి యాత్రికులు వచ్చి పోవుటకు వీలగునట్లు ఈ బస్సు నడుపబడుచున్నది.

మొగిలి క్షేత్రమునకు సంబంధించిన పురాణ గాథలు అనేకములు గలవు. మొగిలీశ్వర మహాత్యమును గురించి గ్రంథములు రచింపబడియున్నవి. మొగిలప్ప అను గోవుల కాపరి ఇచ్చట మొగిలి పొదలయందు వంట చెఱకు కొరకు గొడ్డలితో నరకుచుండగా రక్తము స్రవించినదని అచ్చట ఈశ్వర విగ్రహము తిలకించి ఈశ్వరునకు దెబ్బ తగిలి రక్తము స్రవించినదని మొగిలప్ప విగ్రహమునకు పూజలు చేయుచుండెను.

గొడ్డలి పెట్టుచే చెంప విరిగిన దృశ్యము ఈనాడు మొగిలీశ్వర విగ్రహమునందు చూడవచ్చును. మొగిలప్ప గోవుల మేపుచుండ అతని మందలో గంగ గోవొకటి ప్రతిదినము మంద వదలి ఎటకోపోయి మరల ఆ మందలో కలసి వచ్చుచుండెను. ఒక దినము మొగిలప్ప దాని వెంట పోయెను; ఆ యావు దక్షిణ దిక్కుగ పోయి దేవరకొండయను పర్వతశిఖరము క్రింద చటియ చేరెను. అచ్చట స్వామి వారి భార్య కామాక్షమ్మ గోవు వెంట బోయిన మొగిలప్పతో నిట్లనెను. "ప్రతి దినము నేను ఈ పశు క్షీరము తీసికొనుట వాడుకయై యున్నది. ఇచ్చట మేమున్న విషయము ఇతరులకు చెప్పరాదు. చెప్పిన, నీ మస్తకము వేయి ముక్కలగును". కొన్నాళ్ళకు భార్య నిర్బంధము వలన అతడా రహస్యమును వెల్లడించెను. తల పగిలి చనిపోయెను.

మిరియాల వర్తకులు

మరియు ఇచ్చటి దేవాలయము మిరియాల వర్తకుల ధనముతో కట్టుబడినదని లోక ప్రతీతి. మిరియాల వర్తకులు మదరాసునకు పోవుచు మార్గమధ్యమున మొగిలి యందు విశ్రమించెడి వారట. ఒకనాటి రాత్రి ఒక బాల బ్రాహ్మణుడు కన్పించి మిరియాలిమ్మని అడుగగా తమ దగ్గర యున్నవి జొన్నలని, మిరియాలు లేవని అసత్యము పల్కి దాతృత్వ గుణము లేక లోభులై ప్రవర్తించిరి. చెన్నపురికిపోయి వారు తమ మిరియాల మూటలను గుత్త వ్యాపారస్థునికి అమ్మిరి. అతడు మామూలుగా తూకము వేసుకొనెను. కానిమూటలన్నియు తూకమువేసిన తర్వాత ఒక మూటను విప్పి చూచెను. అందు జొన్నలు కనబడగా సందేహముగల్గి మూటలన్నియు విప్పిచూచెను. మూటలన్నిటిలోను జొన్నలు కన్పడినవి. ఆ మూటలను వాపస్ చేయగా మిరియాల వ్యాపారస్థులు చాలా వాపోయి తమకు మొగిలి క్షేత్రములో బ్రాహ్మణవేషములో కన్పడిన వ్యక్తి మొగిలీశ్వరుడని ఎంచి అతనికి మిరియాలు లేవని, జొన్నలని అబద్ధము చెప్పినందుకు మిరియాల మూటలు జొన్నల మూటలుగా మారినవని తలంచి తమ అవివేకమునకు చింతించి

భగవంతుని ప్రార్థించి, జొన్నల మూటలు మిరియాలుగా మారిన వానిని విక్రయించగా వచ్చిన ధనమును మొగిలీశ్వరునకు సమర్పింతుమని మ్రొక్కుకొనిరి. తదుపరి జొన్నల మూటలు మిరియాల మూటలుగా మారినవి. మిరియాలు ఒక విదేశీ వ్యాపారస్థునికమ్మి విశేష ధనమును వారు పొంది తిరుగుదారి పట్టిరి. చిత్తూరువరకు వచ్చి దురాశచే యథాప్రకారము పోవుదారిని విడిచి స్వామికి ధనమర్పింప విష్టపడక స్వామివారున్న మార్గమును తప్పిపోసాగిరి తప్పుడు దారిలో పయనించుచు ఒకరాత్రి నిద్రించు సమయమున ధనపు సంచులతోనున్న ఎద్దు తప్పించుకొని రాత్రి మొగిలీశ్వరుని వద్ద చేరినది. వ్యాపారస్థులు నిద్రలేచి చూడగా, ధనపు సంచులతోనున్న ఎద్దు అదృశ్యమగుటచూచి ఎద్దు జాడలలో వెదకివెదకి తుదకు మొగిలి క్షేత్రములోని మొగిలీశ్వరుని ఎదుట ధనరాసులతోనున్న ఎద్దును చూచి ఆశ్చర్యపడి మొగిలీశ్వరుని ప్రార్థించి తమ తప్పులను మన్నించుమనికోరి ఆ ధనముతో మిరియాల వ్యాపారస్థులు ఆలయ గోపురము, తటాకము యొక్క ప్రకారము నిర్మించి నిత్యపూజలకు మాన్యములు నేర్పరచిరి. వారు తమ ఇండ్లకు పోయిన పిదప తమ ధనములచ్చట చేరియుండుట చూచి సంతసించిరట. ఆ నాటి రాత్రినుండి శివరాత్రి ఉత్సవములు వైభవముగా జరుగుచున్నవని లోక ప్రతీతి.

జమీందారుల సేవ

బంగారు పాళ్యం జమీందారులలో ముఖ్యముగా రాజా రామదాసప్ప నాయని బహద్దూర్ వారికి మొగిలీశ్వరునిపై గల భక్తి కొనియాడదగినది. ఆయన కాలమున మొగిలి దేవాలయములోని నంది కోనేరుగల తొట్టిమండపము నిర్మించ బడినదని తెలియుచున్నది. ఒకప్పుడు రాజారామదాసప్ప నాయని బహదూర్‌వారు ఇచ్చట నుండి బిలముద్వారమున పోయి స్వామివారిని పూజించివచ్చుచుండిరి.

స్వామి జ్ఞాపకార్థము రామదాసప్పవారు తమ రాజనగర మహాద్వారముపై "శ్రీ మొగిలీశ్వరుని సహాయము" అను విలాసమును వ్రాసెను. ఇప్పటికిని ఈ విలాసమును తిలకింప వచ్చును. వీరితర్వాత రాజ్యపాలనచేసినశ్రీ శేషాచలపతి రాజాలుంగారు మొగిలీశ్వర స్వామియందు అతి భక్తిశ్రద్ధలు చూపిరి. వీరు తమ ఆస్థాన పండితులచే 'శివరాత్రి మహాత్యము' "మాంసభక్షణ నిషేధము" "బంగారు సాముద్రిక దర్పణము" మొదలగు గ్రంథములు వ్రాయించెను వారి అనంతరము ముద్దు బంగారు వెంకటప్పనాయని వారు స్వామియందు భక్తిగలిగి యుండిరి. నాగస్వర గాయకుడైన రామదాసను భక్తుడు ఇచ్చట శిలాబిలద్వారము చూచుచుండ ఆ బిలము పెద్దదిగా కన్పడెను. అందేమున్నదో చూచెదనని లోపలకు పోయెను మరల ఆ బిలము ఎప్పటివలె ఉండెను. కొన్ని దినములు గడచినను అతడు తిరిగి రాలేదు. ఈ విషయము చాలా మందికి తెలిసినది. బండను భేదించి అతనిని వెలికి దీయుటకు కొందరు యోచించిరి. ఇరువది దినములు పూర్తి అయిన పిదప మొగిలీశ్వరుడతడు బయటకు వచ్చునట్లు చేసెను. అచ్చటికి రెండు మైళ్ళ దూరములోనున్న స్థలమునకు విభూతి కొండ అందురు. ఇచ్చట లభించు విభూతి పవిత్రమైనది. ఈ విభూతి ఈశ్వరుని నిత్యాపూజలకు ఉపయోగించబడుచున్నది.

వసతులు

ఇచ్చట యాత్రికులు నిలుచుటకు వసతులు పూర్తిగా లేవు. మరియు ఇచ్చట దేవాలయమునందు వివాహములు గూడ జరుగుచున్నవి. వివాహములు జరుపుటకు తలపెట్టిన కల్యాణ మంటపము పని ఇంకను ప్రారంభింపలేదు. వాహనములు, రథములు తయారు చేయవలసియున్నది. దేవాలయ పునరుద్ధరణ చేసి యాత్రికులకు వసతులు కల్పించిన యీ క్షేత్రము పెద్ద పుణ్యక్షేత్రముగా యాత్రా కేంద్రముగా అభివృద్ధి చెంది 'దక్షిణ కాశి యనబడునట్లు వర్ధిల్లుటకు అవకాశములు కలవు.

(52వ పేజీనుండి)

కిరణం

అయ్యింది. అతడు మతిచెడి ఎటో వెళ్ళిపోయాడు. పాపం! ఈ వయసులో రంగయ్యకెంత మానసికవ్యథ!!

ఓపిగ్గా మనవణ్ణెత్తుకుని ఊరుకోబెడుతున్నాడు రంగయ్య.

రాత్రి చాలానే అయినట్టుంది. ఘూర్ఖా వీధిలో తిరుగుతున్న చప్పుడు వినిపిస్తోంది.

తటాలున నా ఊహలమధ్య ఉదయించిందో ఆశాకిరణం లాంటి భావం. వెంటనే తలుపులు తీసుకుని వీధిగుమ్మంలోకొచ్చి లైటువేసి "రంగయ్యా" అని పిలిచాను.

పిల్లవాణ్ణెత్తుకున్న రంగయ్య నా పిలుపు విని పాపం వడివడిగా వచ్చాడు. వస్తూనే "ఏమ్మా! ఏంకావాలి?" అన్నాడు. నేను చేతులు చాపాను.

నా చర్య అర్థం కాని రంగయ్య "ఏమిటమ్మా!" అన్నాడు.

"నీ మనుమణ్ణియి రంగయ్యా!" అన్నాను

"వద్దమ్మా! చానా మురికితో ఉన్నాడు. ఈపొద్దు నీళ్ళోయలేదు."

"ఫరవాలేదు ఇకనుండి నే పోస్తాలే. నన్ను నీ కూతురనుకో రంగయ్యా! బాబును నే పెంచుతాను. నువ్విక్కడే ఉండిపో." రంగయ్య అర్థం కానట్టు అయోమయంగా, ఆశ్చర్యంగాను నా వైపు చూసాడు.

నేను మళ్ళీ అవే మాటలన్నాను.

ఈ సారి రంగయ్య కళ్ళు ఆనంద బాష్పాలతో మెరిసాయి. "తల్లీ! నీ దయ నీ దయమ్మా! సల్లగా ఉండు.'' అని అంటూ బాబును నా కందించి తన ఇంటికి వెళ్ళిపోయాడు తిరిగి రావడానికి.

ఇంతవరకూ తీరని కోరికల మధ్య తల్లడిల్లిన నేను కనీసం ఇప్పుడయినా...నా జీవితంలో ఒక కోరిక తీరినందుకు... బాబు ముఖంలోకి తృప్తిగా చూస్తూ లోపలకు దారి తీసాను___ లోకాన్నెదిరించే ధైర్యంతో.

అనావృష్టి....

(38వ పేజీ నుండి)

చొప్పున అమ్ముతున్నారు. 1972 మార్చి మాసాంతం వరకు యీ విధంగా చవుక ధరకు అమ్మేందుకుగాను ప్రభుత్వానికి రూ. 1 94 కోట్లు సబ్సిడీ రూపేణా ఖర్చవుతుంది.

పశుగ్రాసం

వర్షాలు లేకపోవడంతో పశు గ్రాసానికి కొరత ఏర్పడ్డట్టు అనేక ప్రాంతాల నుంచి నివేదికలు అందాయి. అయితే ఆగస్టులో కురిసిన వర్షాలవల్ల పశుగ్రాసం పరిస్థితి కొంత మెరుగు పడగలదని భావిస్తున్నారు. అప్పటికీ కొన్నికొన్ని ప్రాంతాల్లో పశుగ్రాసానికి ఏర్పడ్డ కొరత దృష్ట్యా రాయలసీమా, తెలంగాణా ప్రాంతాల్లో వినియోగం నిమిత్తం నల్లామలై అడవులనుంచి 1000 టన్నుల ఎండు గడ్డిని తెచ్చే పథకం ఒకటి అమలు పరచాలని ఉద్దేశించబడింది. దీనిని పెంచడానికీ, అక్కడ నుంచి తేడానికీ మొత్తం రూ. 4.85 లక్షలు అవుతుందని అంచనా. ఈ గడ్డిని టన్ను ఒక్కంటికి రూ. 50లు మించకుండా అమ్మాలని ఉద్దేశించారు. ఇందుకు అయ్యే ఖర్చులో అమ్మకం ద్వారా వచ్చిన మొత్తంపోగా మిగిలిన రూ. 4.35 లక్షలను ప్రభుత్వమే భరించాలని భావించింది.

మంచినీటి సరఫరా

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో త్రాగడానికి మంచి నీరుకు కరువు ఏర్పడ్డట్టు వార్తలు అందడంవల్ల అలాంటి చోట్ల అవసరమైతే మంచి నీటి బావుల్ని లోతు చేయించే నిమిత్తం ప్రతి కలెక్టరు అధ్వర్యంలో ఒక లక్షరూపాయలుచొప్పున ప్రభుత్వం వుంచింది. ఆగస్టు వర్షాల వల్ల తాత్కాలికంగా నైనా యీ మంచినీటి పరిస్థితి కొద్దిగా మెరుగైంది.

తక్షణ సహాయం మంజూరు

తక్షణ సహాయక చర్యగా ప్రభుత్వం కరువు నివారణ పనులను చేపట్టేందుకై రెండు కోట్ల రూపాయల్ని ప్రభుత్వం అగస్టు మాసారంభంలో మంజూరు చేసింది. ఆ నెలాఖర్లోనే మరో రెండు కోట్ల రూపాయల్ని కూడా మంజూరు చేయడం జరిగింది. ఇంతవరకు మంజూరు చేసిన రూ 4 కోట్ల లోనూ సహాయక చర్యకు మంచినీటి బావులను లోతు చేయడానికి, మంచినీటిని యితర ప్రాంతాలనుంచి తేవడానికి రూ 2 కోట్లు కేటాయించబడ్డాయి. మిగతా రెండు కోట్లను చిన్న రైతులకు ఋణాల్ని యివ్వడానికి, పశుగ్రాసం కొనుక్కోడానికి, సేద్యపు నీటి బావుల్ని లోతు చేయడానికి ప్రత్యేకించారు.

కరువు సహాయక చర్యలు

ఈ కరువు వల్ల మనరాష్ట్రంలో దాదాపు 37 88 లక్షల మంది వ్యవసాయ కూలీలు యిబ్బందికి గురి అయ్యారని అంచనా. అయితే గతంలో మనకున్న అనుభవం దృష్ట్యా చూస్తే వీరిలో 50 శాతం మందికి ప్రభుత్వ పనులద్వారా ఉపాధి కల్పించవలసి వుంటుంది. 1971 సెప్టెంబరు నుంచి 1971 డిశంబరు వరకు దాదాపు 100 రోజులకు పంధొమ్మిది లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించ వలసివుంది. ఈ మానవ పనివేళల కాలం విలువ రూ 19 కోట్లు వుంటుంది. రోజుకూలీ రూ 2.50 చొప్పున ఇంతమందికీ యిన్ని రోజులకు కూలీ క్రింద ఖర్చు 47.5 కోట్లు అవుతుంది. గ్రామీణ కార్యక్రమాల క్రింద, ఉపాధి కల్పనా కార్యక్రమాల క్రింద రూ 3 కోట్లు ఖర్చయ్యే పనులను పైన పేర్కొన్నకాలంలో చేపట్టవచ్చు. మిగిలిన మొత్తం రూ 44.5 కోట్లను ప్రత్యేక కరువు సహాయక పనులకు వినియోగించవచ్చు. కరువు సహాయక పనుల్లో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నదీ రబీ పంట సాగుకు ఎంతవరకు అవకాశాలు వున్నవీ మొదలైన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి డిశంబరు మధ్యలో యీ పరిస్థిని మరోమారు సమీక్షించడం జరుగుతుంది.

ఆపత్కాల తక్కావీ ఋణాలు

రాష్ట్రంలో వ్యాపించిన కరువు పరిస్థితుల వల్ల అయిదు ఎకరాలకన్న తక్కువవున్న రైతులు దాదాపు 12 లక్షల మంది ఇబ్బందికి గురిఅయ్యారు. వీరిలో 50 శాతం మందికి ఆపత్కాల తక్కావీ ఋణాలు కావలసివుంటాయనుకున్నా, కుటుంబానికి సగటున రూ 150 మించకుండా సహాయంచేస్తే మొత్తం రూ 9 కోట్లు అవసరమౌతాయి.

ఆహారధాన్యాల మీద సబ్సిడీ

బియ్యం రవాణాకు తదితర ఖర్చులకు, రవాణాలో తరుగుదలకు అయ్యే మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. సబ్సిడీలో మిగతా మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం భరిస్తుంది. పైవాటిక్రింద కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరించే మొత్తం రూ 86.68 లక్షలు కాగా మిగతా రూ 1.07 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. పశుగ్రాసం సరఫరాకు సంబంధించి సబ్సిడీ రూ 4.35 లక్షలని అంచనా. మంచి నీటి సరఫరాకు మొత్తం ఖర్చు సుమారు రూ 25 లక్షలు అవుతుందని అంచనా.

విత్తనాలు, క్రిమిసంహారకాలపై సబ్సిడీ

రైతులు తక్కువ కాలంలో పండే పంటల్ని పండించుకోడానికీ, రబీ పంట వేసుకోవడానికీ వీలుగా వారికి 25 శాతం సబ్సిడీ మీద విత్తనాలను సరఫరా చేసే ఏర్పాట్లు చేయాలని ఉద్దేశించబడింది. క్రిమిసంహారక మందుల్ని సైతం 25 శాతం సబ్సిడీపై అందజేయాలని ఉద్దేశించారు. దీనికిగాను మొత్తం రూ 1.50 కోట్లు కావలవుంటుంది.

మహాభారతము

తెప్పెగంటుల లక్ష్మణశాస్త్రి

50

ధర్మ: —సర్పరాజా! 'శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ' ములకు ఆధారమేమి? మనస్సు ఈవిషయములన్నింటిని ఒకే సారి యేల గ్రహించదు? అన్నింటికిని శాంతచిత్తుడవై యథార్థముగా బదులు చెప్పుము.

సర్ప: —ఆయుష్మంతుడా! స్థూల-సూక్ష్మ-కారణ శరీరముల నాశ్రయించి, ఇంద్రియములతో గూడుకొని యున్న ఆత్మయే నానా విధములైన సుఖ దుఃఖాది భోగములను అనుభవించును. జ్ఞానము, బుద్ధి, మనస్సు. ఇవియే ఆ భోగానుభవమునకు కారణములు-శబ్ద-సర్శ-రూప-రస-గంధములకు ఆధార భూతములగు ఆకాశము-వాయువు-తేజస్సు-జలము-పృథివి అను పంచ భూతముల చేత నిర్మితమైన యీ శరీరములో జీవాత్ముడు ఉండి, అందులోనే యున్న మనస్సు ద్వారా క్రమముగా ఈ యైదు విషయములను అనగా, శబ్దాదులను అనుభవించుచుండును. రాజా! విషయములను అనుభవించునపుడు ఈ జీవాత్మ యొక్క మనస్సు అతని బుద్ధి యేదో యొక విషయము నందు మాత్రమే కట్టబడియుండును. ఆ కారణముచేతనే జీవుడు ఒకే సారి అనేక విషయములను గ్రహించుట సంభవము కాదు. ఆ జీవాత్మ, రెండు కనుబొమ్మల నడుమ ఉండి ఉత్తమ-అధమ బుద్ధులు గలవారిని భిన్నభిన్న ద్రవ్యముల వేపు పురికొల్పు చుండును. బుద్ధి యొక్క ప్రేరణననుసరించి కర్మలు చేసిన పిదప గూడ జ్ఞానులగు వారికి అనిర్వచనీయమైన ఒక అనుభూతి కలుగును. అదియే క్షేత్రజ్ఞుడగు ఆత్మను తోప జేయు విధియని తెలిసికొనుము.

ధర్మ :—సర్ప రాజా! 'మనస్సు-బుద్ధి' ఈ రెంటి లక్షణమేమి? అధ్యాత్మ జ్ఞాన విదులగు వారికి దానిని తెలిసికొనుట ముఖ్య కర్తవ్యమని చెప్పుదురు.

సర్ప :—బుద్ధి యొక్క ప్రయోజన మేమనగా, ఆత్మకు భోగ-మోక్షములను సంపాదించి పెట్టుటయే. బుద్ధి ఆత్మను ఆశ్రయించియే శబ్ద స్పర్శాది విషయముల వైపునకు పోవును. అందు వలన బుద్ధి అత్మను అనుసరించునదియని తలచబడుచున్నది. ఆ యనుసరణము గూడ అత్మ యొక్క చైతన్య శక్తి సంబంధము చేతనే బుద్ధికి ఏర్పడును, బుద్ధియొక్క జ్ఞాన శక్తి ప్రభావము చేతనే అనగా- గుణ విధానము చేతనే మనస్సు గుణములు గలదగును. అనగా మనస్సు ఇంద్రియ విషయములను గ్రహించుటకు శక్తిమంతమగును. కనుక బుద్ధి కార్యారంభము నుండి ప్రకటితమగును, మన సైతే సర్వదా ప్రకటితమయి యుండును. నాయనా! ఈ విశేషము వలననే మనస్సునకు-బుద్ధికి భేదము కలదు. నీవు గూడ ఈ విషయములన్నియు తెలిసిన వాడవే కదా! ఇందులో నీ అభిప్రాయమేమి? తెలుపుము.

ధర్మ :—సర్ప రాజా! నీవు మహా బుద్ధిమంతుడవు. నీవు గొప్ప బుద్ధి విశేషములను ప్రదర్శించితివి. తెలియ వలసిన వస్తువును తెలిసికొన్నావు. ఇక నా వలన నీకు తెలియదగిన దేమున్నది? నీవు సర్వజ్ఞుడవు. స్వర్గలోక నివాసివిగా నుంటివి. అత్యద్భుతములైన కర్మములను ఆచరించి యుంటివి. అట్టి నీకు బ్రాహ్మణోత్తములకు అవమానము చేయు నంతటి మోహమేల కలిగెను? ఈ విషయములో నా మనస్సు నందు చాల సంశయము గలదు. తీర్చుము.

సర్ప :—ధర్మరాజా! ఐశ్వర్యము-సంపద అనునది గొప్ప బుద్ధిమంతులను, మహా శూరులనుగూడ మోహములలో పడ వేయును. సుఖములలోను, విలాసములలోను మునిగి యున్న వారందరు మోహపరవశులౌదురని నా విశ్వాసము. నేను గూడ ఐశ్వర్య మదముచేత మోహితుడనై పతితుడ నైనప్పుడు తెలివి తెచ్చికొంటిని.

ఇప్పుడు చింతించుచు నీకు మంచి బుద్ధిని ఉపదేశించుచున్నాను. రాజా! నేడు నీ వలన నాకు ఎంతో మేలు కలిగినది. నీ వంటి సత్పురుషునితో మాట్లాడుటవలన నాకు కల్గిన అతి కఠిన శాపము తొలగిపోయినది.

రాజా? నేను పూర్వము స్వర్గమునకు రాజుగా నుంటిని. అప్పుడు దివ్య విమానములో కూర్చొని ఆకాశములో తిరుగుచుంటిని. త్రైలోక్యాధిపత్యముచేత కలిగిన గర్వముచేత మత్తుడనై యెవరిని గూడ లెక్క చేయకుంటిని. త్రిలోక వాసులగు బ్రహ్మర్షులు- దేవతలు- గంధర్వులు- యక్ష- రాక్షసాదులందరును నాకు పన్నులను ఇచ్చుచుండిరి. ఏ ప్రాణిని నేను కంటజూచెదనో ఆ ప్రాణి తేజస్సును హరించుచుంటిని అది నా దృష్టికి గల బలము. నేను ఎక్కిన పల్లకిని వేయి మంది బహ్మర్షులచేత మోయించుచుంటిని. అట్టి నా యపచారము త్రైలోక్య రాజ్యాధిపత్యము నుండి నన్ను భ్రష్టుని జేసినది. ఎట్లనగా, నా పల్లకిని మోయు బ్రహ్మర్షులలో నొకడగు అగస్త్య మహామునిని నేను కాలితో తన్నితిని. అప్పుడు కుపితుడై ఆ మహాముని 'సర్పము కమ్ము' అని నన్ను శపించెను. వెంటనే నాకు గల రాజలాంఛనములన్నియు తొలగిపోయి ఆ విమానము నుండి జారి క్రిందపడుచు నేను సర్పమై అధోముఖముగ దిగజారి పోవుచున్నట్లు గ్రహించితిని. అప్పుడు, 'మహాత్మా! మూర్ఖుడనై యట్లు అపచారముచేసిన నాకు శాపాంతమును సెలవీయవలసినది' అని అగస్త్యమహామునిని ప్రార్థించితిని. ఆ ముని దయతో ఇట్లనెను :— "రాజా! నీకు ఈ గర్వము వలనను, ఘోరపాపము నాచరించుటవలనను సంభవించిన యీ శాపము నుండి యుధిష్ఠిర మహారాజు విముక్తిని ప్రసాదింపగలడు. నీ పాపము సర్పయోనిలో నుండినందువలన క్రమముగా క్షీణించును. అప్పుడు నీవు తిరిగి పుణ్యఫలమును పొందగలవు." అప్పుడా మహాముని తపోబలమును చూచి నాకు మిక్కిలి విస్మయము కలిగెను.

"రాజా! అగస్త్యమహాముని యొక్క 'బ్రహ్మజ్ఞానము- బ్రాహ్మణత్వము' ఈ రెంటిని చూచి నాకు చాల ఆశ్చర్యము కలిగి బ్రాహ్మణత్వ విషయములో నేను మొదటి ప్రశ్నమును నిన్ను అడిగితిని. 'సత్యము- ఇంద్రియనిగ్రహము - తపస్సు-దానము అహింస -ధర్మతత్పరత' ఈ సద్గుణములే సర్వదా మనుష్యుడు సిద్ధిని బడయుటకు కారణములగును గాని, జాతిగాని, కులముగాని కాదు. రాజా! ఇదిగో నీ సోదరుడు మహాబలి భీమసేనుడు. ఇతనిని విడిచితిని, కైకొనుము. ఇతడు క్షేమముగా నున్నాడు. నీకు కల్యాణమగుగాక. నేను తిరిగి స్వర్గమునకు పోయెదను. సెలవిమ్ము" అని చెప్పి నహుషమహారాజు అజగర దేహమునుండి విముక్తుడై దివ్యశరీరమును ధరించి స్వర్గలోకమునకు పోయెను.

యుధిష్ఠిర మహారాజుగూడ భీమధౌమ్యులతో తన ఆశ్రమమునకు తిరిగిపోయి, అక్కడనున్న మునులకు ఆ వృత్తాంతము చెప్పెను. అందరును భీమసేనుని ఆశీర్వదించి అతడు క్షేమముగా తిరిగి వచ్చినందుకు సంతసించిరి.

వర్షా-శరద్వర్ణనము

వైశంపాయన మహాముని జనమేజయ మహారాజుతో తరువాతి కథ యిట్లు చెప్పదొడగెను :— జనమేజయా! పాండవులు ద్వైతవనములో నుండగానే వర్షాకాలము సంప్రాప్తమయ్యెను. అది గ్రీష్మాంతమునందు సర్వభూతములకు సుఖము కలిగించునదిగా నుండెను. అప్పుడు మహామేఘములు నల్లనివై భూమ్యాకాశములను కప్పుచు రాత్రింబవళ్లు వర్షించెను. గ్రీష్మాంతమునందు నూర్లవేలు మేఘములు మెఱుపులతోను ఉరుములతోను బయలుదేరి సూర్య తేజస్సును కప్పుచు కురిసెను. భూమియందంతయు గరిక మొలచెను. ఈగలు, సర్పములు జలము నుండి బయలు వెడలెను. జలసిక్తమై భూమి శాంతముగా నుండి సర్వప్రాణులకు మనోహరముగా నుండెను. అంతటను జలమయమైన భూమియందు మిట్టపల్లములు, నదీపర్వతములు అను భేదము తెలియకుండెను. ఆ ఋతువునందు నదులు జలముచేత క్షోభిల్లుచు బుసకొట్టుచు మహావేగముగా పరుగెత్తుచున్న బాణములవలె అడవులలో ప్రవహించుచుండెను. వానతాకిడికి గగ్గోలు పడుచు అడవులనున్న వరాహ- మృగ-పక్షుల యొక్క వివిధ ధ్వనులు అడవులలో వినపడుచుండెను నెమళ్ళు గండుకోయిలలు కప్పలు దర్పించి యిటునటు తిరుగుచు పడుచుండెను. ఇట్లు విజృంభించియున్న వర్షాకాలము శాంతించిన తరువాత శరత్కాలము ప్రవేశించెను.

శరత్తునందు, క్రౌంచపక్షులు, హంసలు విహరించుచుండెను. నదీజలములు ప్రసన్నములయ్యెను వనములందు పర్వతములందు అనేక లతా వృక్షములు పెరుగుచు విరాజిల్లెను. ఆకాశము స్వచ్ఛమై నక్షత్రములచే ప్రకాశించుచుండెను వారికి ఆకాలము మంగళకరముగా నుండెను దుమ్ము ధూళిలేక పగళ్లు శాంతముగా నుండెను. సుఖస్పర్శముగల వాయువుచేత రాత్రులు ఆనందదాయకములయ్యెను విమలముగా చంద్రబింబము శోభిల్లెను. తెల్లని కలువలచేత కమలములచేతను నదులు తటాకములు సమలంకృతములై కనపడుచుండెను. స్వచ్ఛ జలముగల సరస్వతీ నదిని తిలకించుచు పాండవులు మహానందమునందిరి ద్వైతవనమునందే కార్తికపూర్ణిమను గడపి సపరివారులై అచటి నుండి పాండవులు 'కామ్యక' వనమునకు ధౌమ్యుని ముందిడుకొని పోయిరి.

శ్రీకృష్ణ మార్కండేయ సమాగమము

వారు కామ్యకవనమునందుండగానచటి కొకనాడొక బ్రాహ్మణుడు వచ్చి 'కృష్ణభగవానుడు, చిరంజీవియు మహాతపశ్శాలియగు మార్కండేయ మహామునియు మిమ్ముచూచుటకిచటికి త్వరలో రానున్నారు' అనిచెప్పుచుండగనే శ్రీకృష్ణుడు సత్యభామా సహితుడై శచీదేవితో నింద్రునివలె నొప్పుచు నచటికి వచ్చెను. శ్రీకృష్ణుడు ధర్మజునకు, భీమునకు నమస్కరించి ధౌమ్యాచార్యుని పూజించి నకులసహదేవుల వందనములు స్వీకరించి అర్జునుని మాటిమాటికి ఆలింగనముచేసికొనెను. ద్రౌపదిని ఓదార్చి కుశలమడిగెను. సత్యభామ ద్రౌపదిని కౌగిలించుకొని ఆదరించెను పాండవులు కృష్ణుని పూజించిరి. కృష్ణుడు అర్జునునితో చేరి కూర్చున్నప్పుడు

కుమారస్వామితోబాటు కూర్చొనియున్న పరమేశ్వరునివలె విరాజిల్లెను. అర్జునుడు తన వనవాస వృత్తాంతమంతయు కృష్ణునకు తెలిపి సుభద్రాభిమన్యుల క్షేమమడిగి తెలిసికొనెను. శ్రీకృష్ణుడు అందరిని ఆదరించిన తరువాత ధర్మజునితో నిట్లనెను :—

"ధర్మనందనా ! రాజ్యలాభముకన్న ధర్మమే గొప్పది. ధర్మ వృద్ధికి ముఖ్య సాధనము తపస్సు. నీవు సత్యము, మన శ్శుద్ధి అను సద్గుణములు కలవాడవు వాటితోబాటు స్వధర్మాచరణముగూడ శ్రద్ధతో చేయుచున్నావు. కనుక నీవు ఇహపర లోకములు రెండును సాధించితివి. నీవు తొలుత బ్రహ్మచర్య పాలనముచేయుచు పరిపూర్ణముగా వేద శాస్త్రములను అభ్యసించితివి. ధనుర్వేదమునుగూడ నేర్చితివి క్షాత్ర ధర్మముచేత ధన సంపాదనచేసి అనేక యజ్ఞములను ఆచరించితివి రాజా ! గ్రామ్య ధర్మములగు కామాదులయందు నీకు ఆసక్తి లేదు ఎట్టి కోరికలకు లోబడవు ధనాశచేత ధర్మమును వీడవు. అందుచేతనే నీవు 'ధర్మరాజ' అను సార్థక నామమున ప్రసిద్ధుడవైతివి

"రాజా ! నీవు రాజ్యమును, ధనమును, భోగములను పొందికూడ, 'దాన - సత్య - దయా-తపస్-శ్రద్ధా-బుద్ధి-క్షమా-ధైర్యములు అను సద్గుణములయందే నీకు ఎక్కువ ఆసక్తి యున్నది. ఆనాడు నిండు సభలో ద్రౌపదికి జరిగిన అవమానమును నీవంటి క్షమాధనుడు దప్ప మరియెవడు సహించగలడు ? నీవు తప్పక సర్వ సంపదలతో తులతూగుచు తిరిగి రాజ్యమును పొంది యేలగలవు. ఇందులో సంశయము లేదు నీ ప్రతిజ్ఞ గడువు తీరియున్నచో, ఇప్పుడే మేమందరము నీకు బాసటగా నుండి కురు సైన్యము ఓడించుటకు సంసిద్ధులమైయున్నాము. మీ యందరి భాగ్యవశముచేత అర్జునుడు సర్వాస్త్ర కోవిదుడై స్వర్గమునుండి తిరిగివచ్చెను.

ద్రౌపదిని చూచి యిట్లనెను : "ఇప్పుడు అర్జునునితో గూడి పరిపూర్ణురాలవైతివి. నీ పుత్రులు ధనుర్వేద చతురులై సజ్జనులుగా సంచరింతురు. అనేకములైన ఆశలు, ప్రలోభములు చూపి నీ తండ్రి, నీ సోదరులు రమ్మని పిలిచినప్పటికిని నీ పుత్రులు తమ మాతామహగృహమునకు పోవక ఆత్మాభిమానముతో నున్నారు. వారు ద్వారకా పురిలోనే ఉండి ధనుర్వేద శిక్షను బడయుచున్నారు. తల్లివైన నీవు పుత్రులకు ఎట్టి సత్ప్రవర్తనలు నేర్పగలుగుచుంటివో అట్టివే పూజ్యురాలైన కుంతీ దేవి, సుభద్ర వారికి నేర్పి సుశిక్షితులను జేయుచున్నారు. ప్రద్యుమ్నుడు అనిరుద్ధాదులకువలెనే నీ పుత్రులకుగూడ శిక్షకుడుగానుండి వారిని రక్షించుచున్నాడు. వివిధాయుధముల శిక్షణమును, రథాశ్వగమన శిక్షణమును వారికి అభిమన్యుడు నేర్పుచున్నాడు. ఆ కుమారుల విద్యా యోగ్యతలనుజూచి ప్రద్యుమ్నుడు సంతుష్టుడగుచున్నాడు." అ తర్వాత కృష్ణుడు ధర్మరాజుతో నిట్లనెను .

"రాజా ! కుకురులు - అంధకులు మొదలగు యోధులు నీ యాజను నెరవేర్చుటకు సిద్ధముగ నున్నారు. బలరాముని సైన్యాధిపత్యములోగల యోధాగ్రేసరులనేకులు నీకు యుద్ధములో సహాయము చేయుటకు సంసిద్ధులైయున్నారు నరకాసుర-సాల్వాదులనువలె దుష్టుడగు దుర్యోధనుని సపరివారముగా వధించివేయుము. రాజా ! నీ వొకవేళ ప్రతిజ్ఞా పాలనకై యీ పదుమూడేండ్లు ఈ విధముగానే కడపదలచినచో నీ విచటనే కూర్చొనియుండుము. ఆజ్ఞ యిచ్చినచో పైన సూచింపబడిన యోధులందరు దుర్యోధనాదులను చీల్చి చెండాడి, రాజ్యమును వశపరచుకొని హస్తిపురిలో నీ రాకకై యెదురు చూచుచుండెదరు. ఆజ్ఞ యిమ్ము. పాపములను దుఃఖములను నిస్తరించి నీవు సుఖముగా హస్తిపురిలో ప్రవేశింతువుగాక." ఈ మాటలు విని ధర్మరాజు ఇట్లనెను.

"కృష్ణా ! నీవు చెప్పిన మాటలు చాల యోగ్యములుగా నున్నవి. నీవు పాండవులకు సర్వదా రక్షకుడవు. ఇందులో సంశయము లేదు. ఇప్పుడు నీవు చెప్పినంతపని, కాలము వచ్చినప్పుడు చేయగలవని నాకు విశ్వాసము గలదు. ఇంతదాక పన్నెండేండ్లు వనవాసమును ఒంటరిగా గడపితిమి. ఈ ఒక్కయేడు అజ్ఞాతవాసముగూడ నీ దయచేత పూర్తిచేసి మా ప్రతిజ్ఞ నెరవేర్చుకొనిన తరువాత నీకే వశులమై నీవు చెప్పినట్లు చేసెదము. నిన్ను విడిచి యెక్కడికి పోగలము. 'పాండవులు సత్య వ్రత నిష్ఠులు' అను బుద్ధియే నీకు ఉండుగాక. ఆ పిదప సపరివారముగా మేము నీ యాజ్ఞావర్తులమే కదా !"

ఇట్లు వారిరువురు మాట్లాడుకొనుచుండగా నచటికి మార్కండేయ మహాముని వచ్చెను. ఆ మునికి అనేక వేల యేండ్ల ప్రాయము గలదు. అతడు తపో వృద్ధుడు, మహా ధర్మాత్ముడు. ఇంత పెద్ద వయస్సు గలవాడైనను నతడు ఇరువది యైదేండ్లవానివలె వృద్ధాప్యము గాని, మరణముగాని లేక, రూప సౌందర్యాది గుణ యుక్తుడగు యువకునివలె కనపడెను. అట్టి మార్కండేయ మహా మునిని అచ్చటివారందరు అర్ఘ్య పాద్యాదులతో పూజించి ఆసనముపై కూర్చొనజేసి అతనిని పరివేష్టించియుండిరి. అప్పుడు అచటివారి అనుమతితో కృష్ణుడా మునితో నిట్లనెను : "మహాత్మా ! సకల ధర్మవేత్తవైన నీ ముఖమునుండి, సనాతనములైన సదాచారములను, ప్రాచీనములగు ఇతిహాసములను, పుణ్యకథలను, రాజుల యొక్క, స్త్రీ యొక్క, ఋషుల యొక్క ప్రవర్తనలను గూర్చియు వినగోరుచున్నాము దయచేసి చెప్పుము."

అట్లు సంభాషణలు జరుగుచుండగనే అక్కడికి దేవర్షియగు నారదుడు పాండవులను చూచుటకు వచ్చెను. అప్పుడక్కడి వారందరును స్వాగత సత్కార పూర్వకముగా నారదునకు పూజలు సల్పిరి. "మీరందరు మార్కండేయ మహాముని చెప్పు కథలను వినుటకు కుతూహలులైయున్నట్లు తోచుచున్నది. సావధానులై వినుడు. మీకు నేను అడ్డురాను" అని నారదుడు చెప్పి మార్కండేయ మునితో "బ్రహ్మర్షీ! పాండవులకు నీవు చెప్పదలచిన కథలను చెప్పుము" అనెను. ఆ మాటకు మార్కండేయ ముని 'మీరందరు ఒక క్షణకాలము ఓపికపట్టుడు. చెప్పవలసినది చాల కలదు, అనెను. ఆమాట విని వారందరు ఒక క్షణకాలము మధ్యాహ్న

సూర్యునివలె ప్రకాశించుచున్న మార్కండేయ మహామునిని చూచుచు నిశ్శబ్దులై యుండిరి. అప్పుడు కథ చెప్పదలచుచున్న ఆ మునితో ధర్మరాజు కథను పురికొల్పుచు ఇట్లనెను:—

శుభాశుభ కర్మఫల వివరణము

"మహాత్మా! నీవు దేవ—దానవ—మునీశ్వరుల యొక్క, మహాత్ముల యొక్క, రాజర్షులు—మొదలైన వారందరియొక్కయు ప్రవర్తనలను చక్కగా తెలిసినవాడవు. నీవు అందరికి సేవింపదగినవాడవు—ఉపాసింపదగిన వాడవు. మమ్ము చూచుటకు ఈ శ్రీ కృష్ణుడు గూడ నీ వలెనే యిక్కడికి వచ్చినాడు. నేను సుఖహీనుడగుటను దుర్మార్గులగు ధార్తరాష్ట్రులు సుఖసంపదలు గల వారగుటను చూచి నా మనస్సులో నొక విచారము కలుగుచున్నది. అది యేమనగా శుభాశుభ కర్మలకు పురుషుడు కర్తయగును గనుక అతడే ఆ కర్మఫలములను అనుభవించును. దానికి ఈశ్వరుడు కర్తయెట్లగును? మానవుడు శుభాశుభ కర్మల నెట్లు అనుభవించును? సుఖదుఃఖములను ప్రాప్తింపజేయు కర్మల విషయమై మానవుని ప్రవృత్తి యెట్లుండును? మనుష్యుడు తాను చేసిన కర్మల ఫలమును ఈ లోకములోనే అనుభవించునా? లేక పరలోకములోనా? దేహి తన శరీర త్యాగముచేసి పరలోకమునకుపోయిన తరువాత ఈ లోకములో నతడాచరించిన శుభాశుభ కర్మలు అతని నెట్లు పొందును? అట్టి కర్మల ఫలసంయోగము అతనికి ఈ లోకములోగాని లేక పరలోకములోగాని యెట్లు కలుగును? ఈ సంశయము తీర్చుము" ఆ ప్రశ్నములకు మార్కండేయ ముని ధర్మరాజునకు ఇట్లు ఉత్తరము చెప్పెను:—

"యుధిష్ఠిరా! నీ యీ ప్రశ్నము యథార్థముగాను యుక్తిసంగతముగాను నున్నది. తెలియవలసిన విషయములన్నియు నీకు తెలియును కాని కేవలము లోకమర్యాదా పరిపాటి ననుసరించి యడిగితివి. ఇహలోకములోను, పరలోకములోను మానవుడు సుఖదుఃఖముల నెట్లు ననుభవించునో తెలిపెదను సావధానుడవై వినుము:—

"ప్రప్రథముగా పుట్టిన బ్రహ్మదేవుడు జీవులకు నిర్మలములు, పరిశుద్ధములునైన శరీరములను సృజించి వాటితోపాటు వారికి సర్వ ధర్మములను తెలుపు ధర్మశాస్త్రములను గూడ ప్రసాదించెను. ఆ సమయములో మనుష్యులందరు ఉత్తమ వ్రతములను పాలించువారుగాను సత్యవాదులుగాను నుండిరి. వారు కోరిన ఫలములను పొందు సంకల్పము ఎప్పుడుగూడ వ్యర్థము కాకుండెను. రాజా! ఆ కాలపు మనుష్యులందరు బ్రహ్మ స్వరూపులుగాను పుణ్యాత్ములుగాను, చిరంజీవులుగాను నుండిరి. అందరుగూడ స్వచ్ఛంద సంచారముగలవారై దేవతలతోపాటు ఆకాశమున తిరుగుచు వచ్చుచుండిరి. వారు స్వచ్ఛంద మరణముగలవారుగాను, తక్కువ బాధలుగలవారుగాను భయోపద్రవములు లేనివారుగాను, పూర్ణకాములుగాను నుండిరి దేవతలను, ఋషులను, మహాత్ములను చూడగలుగుచుండిరి. వారికి సర్వధర్మములు ప్రత్యక్షములుగా నుండెను. ఇంద్రియ నిగ్రహముగలవారై మాత్సర్య రహితులుగా నుండిరి. వేయి సంవత్సరములు జీవించుచు వేయిమంది సంతానముగలవారై యుండిరి.

"ఆ తరువాత కాలాంతరమునందు మానవులు కామక్రోధాదులకు లోబడి, మాయాకపటములుగలవారై తమకు ఇచ్ఛ లేకున్నను బలాత్కారముగా దేహములను విడుచుచు వచ్చిరి. వారు పూర్వజన్మములలో చేసిన పాపకర్మముల మూలముగా పశుపక్ష్యాది తిర్యగ్యోనులందు జన్మించుచు, నరక దుఃఖముల ననుభవించుచు మాటిమాటికి జనన మరణ సంకటములలో తపించుచు వచ్చిరి. రాను రాను మానవుల యిచ్ఛలుగాని, సంకల్పములుగాని, జ్ఞానముగాని పనికిమాలినవై వ్యర్థములై వారి స్మరణశక్తి గూడ క్షీణమైపోయెను ఒకరిపై నొకరికి విశ్వాసములేక పరస్పరము దుఃఖదాయకులగానైరి వారు చేసిన చెడుకార్యముల గుర్తులు శరీరములందు ప్రకటితములుకాగా, కొందరు నీచకులములో పుట్టుచుండిరి కొందరు అనేక రోగములతో బాధపడజొచ్చిరి. మరికొందరు దుష్టులుగాను, ప్రతాప శూన్యులుగాను నగుచు వచ్చిరి. ఇట్లు పాపకర్మల నాచరించు వారి యాయువు కూడ క్షీణింపజొచ్చెను. క్షుద్రములగు ఆశలను తీర్చుకొనుటకై ప్రతివారి యెదుట చేతులుచాచి యాచింపజొచ్చిరి ఎందరో నాస్తికులుగాను, చపలచిత్తులుగాను అయిరి.

"కురునందనా! ఈ ప్రపంచములో మృత్యువు తరువాత జీవులు తమ తమ పూర్వకర్మల ననుసరించియే పరలోక గమనము గలవారగుదురు. చనిపోయిన తరువాత పుణ్య పాప కర్మములు ఎక్కడ నిలచియుండి, జీవులకు అనుభవనీయములగును? అని నీ వడిగిన ప్రశ్నమునకు సమాధానము వినుము:—

"ఈ మనుష్యుడు, ఈశ్వరుడు నిర్మించిన పూర్వ శరీరము ద్వారా, అనగా అంతఃకరణములో శుభాశుభకర్మల సంచయమును నిలిపికొనియుండును ఆయువు క్షీణించిన తరువాత ఈ శరీరమును విడిచి యితర శరీరముతో జన్మించును. అప్పు డతడు పూర్వజన్మలో చేసిన శుభాశుభ కర్మలు అతని వెంటనే ఛాయా రూపములో నంటియుండి ఉత్తర జన్మములో గూడ సంక్రమించి సమయము కనిపెట్టి స్వస్వ కర్మ ఫలముల నిచ్చుచుండును. కనుక జీవుడీజన్మలో చేసిన పుణ్య పాప కర్మ ఫలము ననుభవించుటకు యోగ్యత గలవాడై ఉత్తర జన్మము నొందును. అందులో తన పూర్వ కర్మ ఫలానుభవమును ఎంత ప్రయత్నించినను తప్పించికొనజాలడు. ఒక్క జ్ఞానులు మాత్రమే అంత ర్దృష్టిగల వారై ఆ రహస్యమును తెలిసికొన గలుగుదురు

"పాండవోత్తమా! ఇంత దాక పాప కర్మల గతిని గూర్చి చెప్పితిని ఇప్పుడు పుణ్యాత్ముల గతిని గూర్చి వినుము తపశ్శాలురై, సమస్త వేదశాస్త్రముల నభ్యసించి, నియమ పాలనమును స్థిర బుద్ధితో చేయుచు, సత్యసంధులై, గురు శుశ్రూష చేయువారై మంచి స్వభావము గలవారై, సాత్త్విక స్వభావము, ఓర్పు, జితేంద్రియత్వము అత్యంత తేజస్సు గలవారుగా పుణ్యాత్ములుండెదరు. వారు పునర్జన్మలో మంచి కుటుంబములో పుట్టి మంచి లక్షణములు

గలవారుగా నుందురు. వారు జితేంద్రియులగుట చేత మనస్సును వశములో నుంచుకొందురు. సాత్వికమగు నంతఃకరణము గల వారగుటచేత ఆరోగ్యవంతులుగా నుందురు భయములు కష్టములు లేని వారగుటచేత వారికి ఏ పీడలు, ఉపద్రవములు నుండవు. అట్లు వివేకులైనవారు గర్భమునుండి భూమి పైన పడునప్పుడు గాని, లేక గర్భమునందే ఉన్నప్పుడుగాని జ్ఞానదృష్టి గలవారై తమ యొక్క గాని పరమాత్మ యొక్క గాని యథార్థజ్ఞానము గలవారై యుందురు. లౌకికము శాస్త్రీయమునైన జ్ఞానము ప్రత్యక్షముగా గల మహాత్ములైన అట్టి ఋషి పుంగవులు ఈ కర్మ భూమిలో కారణ వశాత్తు జన్మించి తిరిగి దేవలోకము నకు పోవుదురు. రాజా! అట్టి వివేక జ్ఞానము గలవారు ప్రారబ్ధవశమున తమ కర్మ ఫలములను కొన్నిటిని పొందగలరు. కొన్ని కర్మల ఫలములను హఠాత్తుగా పొందెదరు. మరికొన్ని కర్మల ఫలములను తమ ప్రయత్నముల చేత పొందుదురు.

"యుధిష్ఠిర మహారాజా! ఈ విషయములో నొక ముఖ్యమైన అంశమును చెప్పెదను వినుము—పురుషులలో కొందరు ఈ లోకములోనే పరమ సుఖమును పొందెదరు. మరి కొందరిక్కడ కాక పర లోకములోనే పొందగలరు. కొందరికి ఈ లోకములోను పర లోకములోను ఆ పరమ సుఖ ప్రాప్తికలుగును. మరి కొందరు ఇక్కడను, పర లోకములోను సుఖమును పొందరు. ధనవంతు లీలోకములో సర్వదా విషయ సుఖముల నందగలరు. తమ శరీర సౌఖ్యము నందే ఆసక్తులైన వారికి ఈ లోకమునందు మాత్రమే సుఖానుభవము కలుగును. పరలోకములో వారికి ఎంత మాత్రము సుఖము అబ్బదు.. ఏ మనుష్యులు ఈ లోకములో యోగ సాధనము నందు తపస్సమాధి యందు, స్వాధ్యాయము- అనగా వేదశాస్త్రాధ్యయనము నందు, అహింసయందు తత్పరులై యింద్రియ నిగ్రహముచేత తమ శరీరమును దుర్బలముగా చేయుదురో వారికి ఈ లోకమునందు సుఖానుభవము ఉండదు. అట్టివారు పరలోకములోనే పరమ కల్యాణమును పొందెదరు. ఎవరైతే కర్తవ్య బుద్ధితో మొదట ధర్మమునే ఆచరించుచు, ధర్మము ద్వారా మాత్రమే న్యాయముగా ధనార్జనము చేసి, సకాలములో స్త్రీని వివాహము చేసికొని, ఆమెతోబాటు యజ్ఞయాగాది క్రతువులు, ఈశ్వర భక్తి మొదలగు ధర్మముల నాచరించెదరో అట్టి వారికి ఇహ లోకములోను పర లోకములోను సుఖప్రాప్తి సిద్ధించును. ఎవరైతే, విద్య కొరకుగాని తపోదానముల కొరకుగాని ధర్మ పూర్వకమైన సంతానోత్పత్తి కొరకుగాని ప్రయత్నము చేయరో అట్టి మూర్ఖులు ఈలోకములో గాని, పర లోకములో గాని సుఖమును అనుభవించ జాలరు. భోగములు గూడ బడయరు.

ధర్మరాజా! మీరందరు వీర్య పరాక్రమ శాలురు. మీ యందు లోకాతీతమగు తేజస్సు నిండియున్నది. శరీర బలము గలిగి దేవకార్యమును నెరవేర్చుటకు ఈలోకములో జన్మించితిరి. ఆ కారణము చేతనే మీరు సకల విద్యాపారంగతులైతిరి. మీరందరు శూరులు, వీరులు, తపస్సు ఇంద్రియ నిగ్రహము-సత్ప్రవర్తన ఇట్టి వ్యవహారముల యందే సర్వదా తత్పరులై యుందురు. ఆ కారణముచేతనే మీరు ఈ లోకములో గొప్ప గొప్ప కార్యములను చేసి దేవతలను, ఋషులను, సమస్త పితృ దేవతలను యథా విధిగా సంతృప్తి పరచెదరు. ఆ తరువాత మీ సత్కర్మల ఫలముగా మీ రందరు క్రమముగా పుణ్యాత్ములకు నివాసస్థానమైన ఉత్తమ స్వర్గ లోకమునకు పోయెదరు. కౌరవరాజా! ఆ కారణము చేత మీరు, ఇప్పుడు మీకు కలిగిన కష్టములను చూచి మనస్సులో ఏ మాత్రము భయపడ నక్కరలేదు. ఈ క్లేశము భవిష్యత్తులో మీకు గలుగు సుఖమునకు సూచకముగా భావింపుడు" అని వైశంపాయనుడు జనమేజయునితో చెప్పి తరువాతి కథనిట్లు చెప్ప దొడగెను.

"అట్లు మార్కండేయ ముని చెప్పిన ధర్మములను విని సంతుష్టులై పాండవులు తిరిగి ఆ మునిని 'మహాత్మా! బ్రాహ్మణుల మహిమను గూర్చి వివరించి చెప్పుము' అని అడిగిరి. ఆ మాటకు మార్కండేయ మహా ముని యిట్లు చెప్పదొడగెను:—

బ్రాహ్మణమహిమ

"రాజా! హైహయ కులములో రూప యౌవన సంపన్నుడగు 'పరపురంజయుడు' అను రాజుండెను. అతడు వేట వ్యసనము గలవాడు. ఒకనాడు అడవిలో వేటాడుచు లేడి చర్మమును గప్పికొని తపస్సుచేయుచున్న యొక మునిని లేడిగా భ్రమించి బాణముతో గొట్టి చంపెను. పిదప నతడు ముని యని తెలిసి యా రాజు, తానుచేసిన పాపకృత్యమునకు మిక్కిలి పరితపించి హైహయ రాజుల కడకుపోయి యా వృత్తాంతమును దెలిపెను. హైహయులు ఆ వంశనాశకరమైన బ్రహ్మర్షి హత్యను విని చాల విచారించి యందరు బయలుదేరి యా మునీశ్వరుడెవడోయని తెలిసికొనుటకు అడవిలో వెదక జొచ్చిరి. అట్లు వారు పోవుచు కశ్యప ముని పుత్రుడగు 'అరిష్టనేమి' యాశ్రమమునకు పోయిరి. ఆ మునికి వారందరు నమస్కరించి నిలిచిరి. వారిని ఆ మహా ముని యథార్హముగా పూజించి అతిథి సత్కారము చేసెను. అప్పుడు హైహయులా 'అరిష్టనేమి' తో మహామునీ! దౌర్భాగ్యముచేత బ్రాహ్మణ హింసచేసిన మేము నీకు పూజార్హులము కా' మని యనిరి. ఆ మాట విని అరిష్టనేమి వారితో నిట్లనెను:—

" ఆ ముని యెక్కడ నున్నాడు? మనమందరము కలిసి వెదకుదము రండు" అనెను. దానికి వారు జరిగిన సంగతి యంతయు చెప్పి 'ఎంత వెతకినను మా చేత జచ్చిన యా ముని మా కెచ్చటను గనపడలేదు' అనిరి. ఆ మాట విని అరిష్టనేమి 'పరపురంజయా! నీ చేత చంపబడిన ముని బహుశః ఇతడై యుండును." అని యొక ముని కుమారునిజూపి, "యితడు తపో బలశాలియగు నా పుత్రుడు"! అని చెప్పెను. వారప్పుడతనిని జూచి యాశ్చర్యపడి 'చచ్చిన యితడెట్లు బ్రతికెను? ఇతనిని పునః జీవింపజేసిన శక్తి మీ తపో బలమా? ఈ సంగతి మేము విన దగినదగుచో దయచేసి చెప్పుడు," అనిరి. ఆ ముని యిట్లనెను.

"రాజా! మా పైన మృత్యువు యొక్క ప్రభావ మెంత మాత్రము సాగదు. దానికి కారణము వినుడు.

మేము పరిశుద్ధమైన ప్రవర్తనగలిగి, సోమరితనము లేక, సంధ్యోపాసనాదికములందాసక్తి గలవారమై యుండి, పవిత్రమగు నాహారమును తినుచు న్యాయపూర్వకముగా ధనోపార్జనచేయుచు, బ్రహ్మచర్య వ్రత నిష్ఠులమై యుందుము. ఎప్పుడుగూడ సత్యమునే యెరుగుదుము గాని అసత్యమునందు మనస్సు పోనీయము. స్వధర్మమునే అనుష్ఠించుచుందుము గనుక మాకు మృత్యు భయము ఉండదు. బ్రహ్మవేత్తలగు వారిమంచి గుణములనే ప్రశంసించుచు వారి దుష్ప్రవర్తనను గూర్చి చెప్పము గనుక మాకు మృత్యు భయము లేదు అన్నపానాదులచేత అతిథులను, భోజనదానము చేత భృత్యులను తృప్తి పరచి వారు తినగా మిగిలిన దానిని మేము భుజించు సదాచారము గలవారమగుటచేత మాకు మృత్యు భయము లేదు మనోనిగ్రహము, ఇంద్రియ నిగ్రహము, ఓర్పుగలిగి పుణ్య తీర్థములను సేవించుచు, సత్పాత్రదానము చేయుచు, పుణ్య దేశములందు సత్పురుషులతో నివసించుచుందుము గనుక మృత్యువు వలన మాకు భయము ఉండదు. మాకు గల సద్గుణములలో కొన్నిటిని మాత్రమే మీకు చెప్పితిని. ఇంతకంటె గూడ నెన్నియో ప్రభావములు మా యందున్నవి మీకు విస్తరించి చెప్పలేదు. ఇక మీరు భయపడకుండ పోగలరు. మీకు పాపముండదు." అని యా ముని చెప్పగనే వారు సంతసించి యా మహా మునిని పూజించి తమ దేశమునకు పోయిరి.'' అని మార్కండేయ మహా ముని బ్రాహ్మణ మహిమను సంగ్రహముగాను సోదాహరణముగాను పాండవులకుచెప్పి బ్రాహ్మణుల ప్రభావమును ఇంకను వినుడని యిట్లనెను :—

"పూర్వము వేనరాజుయొక్క పుత్రుడగు పృథుచక్రవర్తి యొకప్పుడు అశ్వమేధయాగము చేయుటకు దీక్షితుడై యుండెను. ఆయన వద్దకు అత్రి మహాముని ధనార్థియై పోవదలచెను. కాని యతడు ధర్మముపట్ల అభిరుచి, విశ్వాసము గలవాడై పృథుచక్రవర్తిని ధన మడుగుటకు పోవలేదు. వనములో తపస్సు నాచరించుచునే యుండ దలచెను. ఆ తపోధర్మముచేతనే తనకు సుఖశాంతులు ధనార్జన కన్న నెక్కువ కలుగునని తలచి తన భార్యా పుత్రులను దానికి అంగీకరింపజేసి యడవికి పోయి తపస్సుచేయుటకు అరంభించెను. అతని భార్య ధర్మాత్మురాలైన మహాసాధ్వి. ఆమె, నాథా! నీవు పృథుచక్రవర్తి కడకేపోయి అధిక ధనమును యాచించుము. ఆ రాజు ఇప్పుడు యజ్ఞము చేయుచున్నాడు. కనుక ఈ సమయములో నతనిని నీవు ధనమును కోరినట్లైతే ఆ రాజు తప్పక నీకు అధిక ధనమును ఈయగలడు. బ్రహ్మర్షీ! అక్కడి నుండి ధనమును తెచ్చి యీ పుత్రులకు పంచి యిమ్ము. ఆ తరువాత నీ యిచ్ఛాను సారముగా నడవిలోనుండవచ్చును. ధర్మజ్ఞులగు మహాత్ములు 'ఇదియే ధర్మము' అని చెప్పెదరు.' అని యనెను. దానికి అత్రి ముని యిట్లనెను :—

"మహాభాగులారా! 'పృథుచక్రవర్తి ధర్మమును, అర్థమును సాధించుచున్నాడు. అతడు సత్యవ్రతుడు' అని మహాత్ముడగు గౌతమముని నాకు చెప్పియుండెను. కాని యా మహారాజుచేయు యజ్ఞములోనున్న బ్రాహ్మణులు నాపై ద్వేషము గలిగియున్నారు. కనుక గౌతముని మాట ప్రకారము నేను రాజు నాశ్రయించుటకు పోవను. ఆ యజ్ఞ సభలో నేను చెప్పబోవు మంచి ధర్మ వచనములను అక్కడి బ్రాహ్మణులు తద్వ్యతిరేకముగా నా రాజునకు బోధించెదరు. ఐనను, నీ మాట ప్రకారము అక్కడికి అవశ్యముగా పోయెదను. ఆ పృథురాజు నాకు అనేక గోవులను, అధిక ధనమును ఈయగలడు' అని చెప్పి యచటికి పోయి యా రాజు నిట్లు పొగడెను.

"రాజా! నీవు ఈ భూమండలములోని రాజులలోనెల్ల సర్వోత్తముడవు గనుక నీవు ధన్యుడవు అన్ని విధములగు నైశ్వర్యములు నీకు గలవు. నీ కంటె మించిన ధర్మాత్ములు మరి యొకరు లేరని మునివరులు స్తుతించుచున్నారు.' ఆ మాట విని గౌతముడు సహించలేక 'అత్రీ! ఇట్లు మరియొకసారి అనకుము. నీవు చంచల మనస్సుగలవాడవు గనుక నిట్లనుచున్నావు' మనకు ప్రథమ ప్రజాపతి యింద్రుడగును అని యనెను. ఆ మాటకు అత్రి, ఈ పృథు చక్రవర్తియే విధాత. ఇతడే ప్రజాపతి సమానుడగు నింద్రుడు. నీవు మోహముచే నిట్లనుచున్నావు. నీకు బుద్ధిలేదు." అని యనెను. దానికి గౌతముడు, నాకు మోహము లేదు. బాగుగా తెలియదును. నీవే మోహితుడవై యున్నావు. నీవు స్వార్థవశుడవై రాజును కలియుటకు ఈ సభకువచ్చి అతనిని స్తుతించుచున్నావు. ధర్మము నెరుగవు. ధర్మ ప్రయోజనము నంతకన్న నెరుగవు. నీవు అజ్ఞానివి. మూర్ఖుడవు. కేవలము వయస్సుచేత మాత్రము నీవు వృద్ధుడవు.'' అని యనెను.

అప్పుడా యజ్ఞశాలలోనున్న యితర బ్రాహ్మణులందరు 'ఈ యిరువురెందుకు వాదించుచున్నారు? వీరికి ఈ సభలో ప్రవేశమిచ్చిన వారెవరు?' అని యనిరి. దానికి నచటనున్న 'కాశ్యపుడు' అను మహాముని 'ఈ యిరువురు ఒక విషయముపై వివాదపడి దాని నిర్ణయముకొరకు కిచటికి వచ్చినారు.' అని యనెను. గౌతముడిట్లనెను. "మహర్షులారా! ఈ యత్రి, 'పృథుచక్రవర్తియే ప్రజాపతి' యనెను. నేను కాదంటిని. ఈ విషయములో మా యిరువురకు వివాదము కలిగెను. ఆ మాట విని వారందరు సనత్కుమారుని వద్దకుపోయి 'ఆ సంశయమును తీర్చు' మని వేడిరి. సనత్కుమారుడిట్లనెను :—

(సశేషము)

గ్రంథ సమీక్ష

సమర్ పథే బాంగ్లా

(కవితా సంకలనం)

సమీకర్త : **వే. నరసింహారెడ్డి**

వెల : రూపాయి.

ప్రతులకు : సాందీపని ప్రచురణలు, 2/18 బ్రాడీపేట గుంటూరు-2

బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అమానుష కృత్యాలు ప్రపంచ ప్రజలను దిగ్భ్రాంతిలో ముంచాయి. అనేక రాజకీయ, రాజనైతిక కారణాలవల్ల కొన్ని ప్రభుత్వాలు పాకిస్తాన్ ప్రభుత్వాన్ని బహిరంగంగా ఖండింపలేక పోయినప్పటికీ ఆ యా దేశాలలోని ప్రజలు, రాజకీయవేత్తలు, మేధావులు, మానవ కారుణ్యవాదులు చరిత్రలో కనీవినీ ఎరుగని యీ జనహత్యా కాండను నిర్ద్వంద్వంగా ఖండించి తూర్పు బెంగాల్ స్వాతంత్ర్య యోధులపట్ల తమ సానుభూతి, మద్దతు ప్రకటించారు.

భారత ప్రభుత్వం ఎనభై లక్షలకు పైబడిన తూర్పు బెంగాల్ శరణార్థులకు పోషణ కల్పిస్తున్నది. తూర్పు బెంగాల్ ఓటమి తన ఓటమి అన్నంత సానుభూతితో భారత ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఇటీవలనే ఆంధ్రప్రదేశ్ శాసనమండలి తూర్పు బెంగాల్ సంఘటనల పట్ల ఆందోళన ప్రకటిస్తూ తీర్మానించింది.

భారత దేశంలో అన్ని రాష్ట్రాలలో, ప్రాంతాలలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు తూర్పు బెంగాల్ స్వాతంత్ర్య యోధులను ఆదరించి ఆశీర్వదిస్తున్నారు. అన్ని భాషలలోని కవులు వారి విజయాన్ని ఆకాంక్షిస్తూ గళమెత్తి పాడుతున్నారు. తెలుగుభాషలో కూడా చాలామంది కవులు తూర్పు బెంగాల్‌ను సమర్థిస్తూ గేయ రచనలు చేశారు. ఈ సంకలనంలో 25 మంది తెలుగు కవుల రచనలు సమీకరించబడినవి. రవీంద్రుని 'ఆమార్ సోనార్ బంగ్లా' అనే గీతము, హుమయూన్ ఆజాద్, అబూహేనా ముస్తఫా కమాల్ అనే యిద్దరు బెంగాలీ కవుల కవితలు కూడా ఇందులో చేర్చబడినవి. "మరల రావణుడుదయించె" అనే శీర్షికతో దాశరథి రాసిన పద్యాలతో యీ సంకలనం ప్రారంభమైంది. ఆ నాటి రావణుడు దశకంఠుడన్ని, నేటి రావణుడు లక్ష తలలతో, "కోటి చేతులతో తుపాకులు ధరించి" నాడని దాశరథి వర్ణించాడు సాధారణంగా. సంప్రదాయ చ్ఛందస్సులలో ఒదగని ఆధునిక ఉద్యమాల సంఘటనలను వీర రసోద్దీపనతో వాటిలో అమర్చగల నేర్పు ఆధునిక కవులలో ఒక దాశరథికే వున్నది అంటే అతిశయోక్తి కాదు. ప్రజా ఉద్యమాలను తుపాకులు అణచలేవు అని చెప్పటానికి దాశరథికి తోచిన మనోజ్ఞమైన ఉపమానాల మాల చూడండి.

"గదతో భాను మయూఖముల్ విరుగునా,
ఖడ్గమ్ముతో శ్వేత నీ
రదముల్ వ్రయ్యలు సేయగా బడునొకో,
రంపాన ప్రత్యూష వా
యు దుకూలమ్ములు ముక్కలై విడునొకో,
ఉన్మాది వాక్యమ్ములన్
మృదు కావ్యత్వము కానవచ్చునొకొ,
యెంతే వ్యాఖ్య కావించినన్."

యింకా యీ సంచికలో డా. సి. నారాయణరెడ్డి, కాళోజీ, మాదిరాజు రంగారావు, ముగ్గురు "చేతనావర్త" కవులు, ప్రసాదరాయ కులపతి, భండారు సదాశివరావు, ముదిగొండ శివప్రసాద్ ప్రభృతులైన కవులున్నారు. అన్నింటిలోకి మకుటాయమానమైన రచన శ్రీ ముదిగొండ వీరభద్రయ్య రాసిన "స్వర్గ నరకాలు" అనే గేయం. ముప్పై మంది తూర్పు బెంగాల్ శరణార్థులు భయ వాతావరణంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సైనికుల బారి పడకుండా సరిహద్దు దాటి భారత దేశంలో ప్రవేశించిన సంఘటన తీసుకుని రాసిన కథాత్మక రచన యిది. ఇందులో కథాంశము, వర్ణన, తగు పాళ్ళలో మేళవింపబడి కవిత ఉచ్ఛస్థాయినందు

బంగ్లాదేశ్ సంఘటనలపట్ల

కున్నది. ఈ ముప్పై మందిలో ఒక తల్లి చంటివాణ్ణి చంకలో పెట్టుకుని వెళ్ళుతుంటుంది. ఆమె కథా నాయిక. ఏ మాత్రం చప్పుడు ఐనా సైనికులు పసిగట్టి యీ ముప్పై మందిని హతమారుస్తారు. దురదృష్టవశాత్తు మధ్యలో చంటివాడు ఏడుపు మొదలెడుతాడు. వెంటనే తల్లి వాని గొంతు నులిమి చంపేస్తుంది. పసివాడి ఏడుపు ఆగింది. శరణార్థులు సరిహద్దు దాటారు. "ఆమె చేతిలోని బిడ్డడు క్రింద పడ్డాడు; ఆమెకూడా క్రిందపడి పోయింది." మిగిలిన ఇరువై తొమ్మిది మందిని రక్షించడానికి కన్న కొడుకును బలిపెట్టి తానుకూడా మానసిక క్షోభతో మరణించిన వీరవనిత గాథ యిది. పసివాణ్ణి గొంతు నులిమి చంపడానికి ముందు తల్లి మనస్సులో స్వల్ప వ్యవధిలోనైనా ఎంతో భావసంఘర్షణ జరిగి వుండాలి దానిని స్పష్టంగా చిత్రించకపోవడం యీ గేయంలోని ఒక ప్రధానమైన లోపం. అలా జరిగివుంటే ఆమె పాత్ర చిత్రణ యింకా మెరుగ్గా వుండేది.

"వాడు నిద్ర పోతున్నాడు
ఆ దేశంలో చాలాకాలంగా అందరూ నిద్రపోయారు".
"ఆ తల్లి వాడికి పాలిచ్చేది
పాలతోపాటు తరతరాల దారిద్ర్యాన్ని. శ్రమ జీవనాన్నీ
యిచ్చేది."

తెనుగు కవుల ఆందోళన

"ఆ తల్లి ముందుకు నడిచింది.
నిజంగా ముందుకు నడచింది
దేవతలకన్నా ముందుకు నడిచింది."

వంటి మంచి కవితాత్మకమైన, వచన కవితలోని ఒడుపులు తెలిసిన పంక్తులు యీ గేయాలలో చాలావున్నై.

ఇటువంటిదే మరో కవితా సంకలనం.

బంగ్లాదేశ్ గీతాంజలి

ప్రచురణ : వికాస సాహితి, మద్రాసు-31.

వెల : రూపాయి

ప్రతులకు : విశాలాంధ్ర ప్రచురణాలయము, విజయవాడ-2.

లేక వికాససాహితి, మద్రాసు.

బంగ్లాదేశ్ ప్రజా ప్రతిఘటన ప్రారంభమైన తరువాత అనేక తెలుగు పత్రికలలో ప్రకటించబడిన తెనుగు గేయాలను యితర భారతీయ కవులూ, బంగ్లాదేశ్ కవులూ రాసిన కవితల అనువాదాలను యీ సంకలనంలో ప్రకటించారు. యీ గ్రంథం అమ్మకాల ద్వారావచ్చే ఆదాయాన్ని బంగ్లాదేశ్ ప్రజల సమరానికి సమర్పిస్తామని ప్రచురణకర్తలు ప్రకటించారు. ఈ సంకలనంలో దాశరథి, అరుద్ర, పోలూరి ఆంజనేయప్రసాద్, రాంభట్ల కృష్ణమూర్తి, మురారి, గంధం జోయల్ మొదలగు 27 మంది అభ్యుదయ కవుల రచనలు క్రోడీకరించబడినవి. యింకా సుభాష్ ముఖోపాధ్యాయ (పశ్చిమబెంగాల్), అమృత ప్రితమ్ (పంజాబీ), కైఫీ ఆజ్మీ (ఉర్దూ) సి. జి. పి నాయర్ (మళయాళం) అనే కవుల రచనల అనువాదాలు, నసీమున్ ఆరా, నజీమ్ మహమ్మద్, హుమయున్ ఆజాద్ మకిద్ హైదర్, సయ్యద్ షమ్సుల్‌హక్, బేగం సూఫియాకమల్, అబూసికందర్ జఫార్ మొదలగు బెంగాలీ కవుల గేయాల అనువాదాలు వున్నవి.

"మతం ఒకటైనా అభిమతాలు ఒకటి కాలేవు.
భాషరాని పాలకుడు ప్రజల ఆభిలాషలు గుర్తించలేడు."

అన్నాడు అరుద్ర.

"బంగ్లాదేశంలో ప్రతి గడ్డిపోచ ఎదురు తిరిగింది.
ప్రతిగాలి సవ్వడిలో ప్రచ్ఛన్న యుద్ధ నినాదాలు వినిపించినై,"

అని వర్ణించాడు. పోలూరి ఆంజనేయప్రసాద్.

"దేగమీద పావురాలు తిరుగబడ్డాయి
తెగించిన గొర్రెలన్నీ తోడేలుతో కలియపడ్డాయి
కొలిమి నాల్గుప్రక్కల లేళ్ళు చుట్టుకున్నాయి
చలి చీమలన్నీ చేరి బలవంతమైన సర్పాన్ని పట్టుకున్నాయి
ఎదలో ముల్లు విరిగింది
గదిలో పిల్లి ఎదురు తిరిగింది."

అని స్వాధీన బంగ్లాదేశ్ అవతరణను వివరించాడు. డా. తంగిరాల, అలాగే

"ఈనాడు చీమలు సింహాలుగా పోరాడు
ఆపదలో అల్లాడే ప్రతిచీమా సింహమే"

అని వర్ణించాడు అనిసెట్టి.

సుభాష్ ముఖోపాధ్యాయ చేసిన భావన చాలా బాగుంది.

"మేము బెంగాల్‌కి రెండు కళ్ళలాంటి వాళ్ళం
ముక్కు మమ్మల్ని వేరు చేస్తుంది - ఫరవాలేదు
తలుపు వేసేసివుంది; కాబట్టి కిటికీ తెరిచాను"

ఇతర ప్రాంతాలకు చెందిన కవులు ఏ విధంగా భావన చేసినా దూరానవుండి చెప్పే మాటలుగానే వుంటాయి. ప్రత్యక్షంగా నరకయాతన అనుభవిస్తున్న ప్రజలమధ్య వుండి రాసిన బంగ్లాదేశ్ కవుల భావనలు ఏలావుంటాయో చూడటం అవసరం.

"చీకట్లని చీల్చే గానం నా కంఠంలోవుంది.
భవిష్యత్తు ద్వారాలనుతెంచే తాళంచెవి నా
చేతుల్లో వుంది." (నసీమున్ ఆరా)


"బంగ్లా మట్టిమీద బ్లడ్ బ్యాంకులో ప్రతి ఒకడు
రాలుస్తాడు
నాలుగు నెత్తురు చుక్కలు
భవిష్యత్తు కది పెట్టుబడి " (హుమయూన్ ఆజాద్)

"నేను చంద్రుణ్ణి చేరలేక పోయినా
ఎట్లు సూర్యుణ్ణందుకుంటా నేనాడైనా"


(మకిద్ హైదర్)

ప్రజోద్యమాలనూ, స్వాతంత్ర్య సమరాలనూ సమర్థించడంలో తెనుగుకవులు అగ్రశ్రేణిలో వుంటారని మరొకసారి యీ రెండు సంకలనాల ద్వారా ఋజువయింది.

—కుందుర్తి



4



1

నగరంలో......వార్తాచిత్రాలు

(1) ఆంధ్ర కేసరి శతజయంత్యుత్సవాలను రాష్ట్రపతి శ్రీ వి వి. గిరి హైదరాబాదులో సెప్టెంబరు 9 వ తేదీన ప్రారంభించారు.

(2) రాష్ట్రపతి హైదరాబాదులో కొన్నాళ్లు గడిపాక సెపెంబరు 27వ తేదీన ఢిల్లీ బయలుదేరారు.


(3) సెప్టెంబరు 24 వ తేదీన సరోజినీదేవి ఆస్పత్రిలో డా.పి. శివారెడ్డి విశ్రాంతి గృహానికి రాష్ట్రపతి శంఖుస్థాపన చేశారు.

(4) భారత ఉప రాష్ట్రపతి శ్రీ జి. యస్. పాఠక్ సెప్టెంబరు 23వ తేదీన హైదరాబాదులో "కేంద్ర రాష్ట్ర సంబంధాలు" అనే చర్చాగోష్ఠిని ప్రారంభించారు.

(5) సెప్టెంబరు 21 వ తేదీన ఫ్రెంచి రాయబారి శ్రీ జీన్ వ్యాడీల గార్దే ఆంధ్రప్రదేశ్ గవర్నరును కలుసుకున్నారు.



2



5



3


నగరంలో...... వార్తాచిత్రాలు

1. ఆంధ్రప్రదేశ్ గవర్నరు జూబ్లీహాల్లో సెప్టెంబరు 15 వ తేదీన ట్రేడ్ యూనియన్ శత్రుత్వాలు — జాతీయ సమైక్యత అనే విషయంపై జరిగిన 2 రోజుల గోష్ఠికి ప్రారంభోత్సవం చేశారు.


2. గాంధీభవన్‌లో సెప్టెంబరు 5 తేదీన "బంగ్లా దేశ్" గురించి అఖిల పార్టీమహాసభ

3. మాజీ ముఖ్య మంత్రి గౌరవార్థం సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ చేసిన విందులో న్యాయశాఖ కార్యదర్శి శ్రీ జె. వీరస్వామి ప్రసంగించారు

4. సెప్టెంబరు 27 వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ఢిల్లీలోని ఖ్వాజా నిజాముద్దీన్ ఇన్ అవులియా దర్గా సందర్శించారు.




1



2




3



4

కలిసి పయనించటం లాభదాయకం!



మీరు ఒక గుంపుగా ప్రయాణం చేస్తే ఎయిర్-ఇండియా వారి ఎఫినిటీ గ్రూప్ స్కీము క్రింద తక్కువ, చాలా తక్కువ ఛార్జీలు చెల్లించవలసి ఉండును.

ఎటువంటి గుంపులు ఇందుకు అర్హులు ?

మీ గుంపులో కనీసం 15 మంది సభ్యులైనా ఉండాలి. మీరంతా కనీసం 6 మాసాల పాటైనా ఒకే స్కూలు/కాలేజి, ఇన్‌స్టిట్యూట్. ఫర్మ్. క్లబ్, సొసైటీ. కార్పొరేషన్. అసోసియేషన్ లేక సమాఖ్యకు చెందినవారై ఉండాలి.

ఎటువంటి ప్రయోజనానికి ?

ఒక కాన్ఫరెన్స్ లేక కన్వెన్షన్‌కు హాజరవ్వటానికి గాని లేక కులాసా కోసం గాని మీరు ప్రయాణం చెయ్యదలచినట్లైతే మీకా తగ్గింపు సదుపాయం లభించగలదు. ఎయిర్—ఇండియా మీ గుంపులో భాగముగా మీ భార్య/భర్త మరియు పిల్లలను గూడా చేర్పటానికి అంగీకరించగలదు. నిజంగా మీరు ఎంతో డబ్బు—కొన్ని సెక్టర్లలో ఒక్కొక్క ఛార్జీ మీద రు. 2000 లకు పైగా—ఆదా చేసుకోగల్గుతారు.

జిఐటిని గురించి మీ ట్రావెల్ ఏజెంటును సంప్రదించండి. గ్రూప్ ఇంక్లూజివ్ టూర్ స్కీము క్రింద కలిసి ప్రయాణం చేసే 10 మంది గల గుంపుకు విమాన ఛార్జీలలో, హోటల్ బుక్కింగులలో, వివిధ ప్రదేశాలను చూడటానికి ఏర్పాటుచేసిన టూర్లలో తక్కువ రేట్ల ప్రయోజనం మీకు లభిస్తుంది. మీ ట్రావెల్ ఏజెంటు 21-రోజుల యూరపు పర్యటనను కేవలం రు. 5,800లకు మాత్రమే ఏర్పాటుచేయగలడు.

మీ స్థానిక ఎయిర్-ఇండియా ఆఫీసు లేక మీ ట్రావెల్ ఏజెంటును పూర్తి వివరాలకై సంప్రదించండి. కలిసి ప్రయాణం చేయటం ఎంతో లాభదాయకమని మీరు తెలుసుకోగల్గుతారు.

ఎయిర్-ఇండియా

మిమ్మల్ని ప్రేమించే ఎయిర్‌లైన్

AI-3005 A

జిల్లాలు



* నెల్లూరుజిల్లాలోని శ్రీహరి కోటనుంచి అక్టోబరు 9న ఉదయం 11-15 గంటలకు ప్రయోగించిన మొట్టమొదటి రోహిణి-125 రాకెట్టు తిలకిస్తోన్న భారత అణుశక్తి సంఘం అధ్యక్షులు శ్రీ విక్రం సారాభాయ్, శ్రీహరికోట రాకెట్ స్టేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ హెచ్. జి. ఎస్. మూర్తి, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి శ్రీ ఎ. భగవంతరావు ప్రభృతులు.

స్కూలు భవనాలకు నిధుల మంజూరీ

భోనగిరి పంచాయతీ సమితికి చెందిన ఆర్థిక సంఘం సమితి అధ్యక్షుడు శ్రీ కె. నర్సింహారెడ్డి అధ్యక్షతన ఇటీవల సమావేశమై సమితిలోని 21 స్కూలు భవనాల మరమ్మతు పనుల కొరకు రు. 5,000 వేలు మంజూరుచేసింది. సమితి సాధారణనిధుల నుంచి ఈ డబ్బు మంజూరుచేయబడింది.

త్రాగునీటి కొరత ఏర్పడిన గ్రామాలలో కొత్త నీటి బావులు త్రవ్వించడానికి నిధులు కేటాయించవలసిందని మేడిపల్లి సర్పంచ్ శ్రీ కె. రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సమితి ఆఫీసు ఆవరణలో బోరింగు బావిని త్రవ్వించాలని ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

అశ్వారావు పేటలో కరువు సహాయక చర్యలు

ఖమ్మం జిల్లాలోని అశ్వారావు పేట పంచాయతీ సమితిలో కరువు నివారణ సహాయక పథకం క్రింద రూ. 41,000 ల ఖర్చుతో తిరుమలకుంట గ్రామము నుండి వినాయకపురం గ్రామం వరకూ, మల్లెలవాగు నుండి జిల్లా పరిషత్తు రోడ్డు వరకూ రోడ్లపనులను ప్రారంభించారు. తద్వారా 230 మంది కార్మికులకు రెండు నెలలవరకు ఉపాధి లభిస్తుంది. ఇదికాక వ్యవసాయ కూలీలకు ఉపాధికల్పించే నిమిత్తం గ్రామాలలో రోడ్లు నిర్మించడానికి నిర్ణయించబడింది.

కుటుంబ నియంత్రణ చికిత్స వార్డు నిర్మాణం

కడప జిల్లాలోని జమ్మల మడుగులోని కాంప్ బెల్ ఆసుపత్రిలో రూ. 1.5 లక్షల ఖర్చుతో 20 పడకలు గల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స వార్డును నిర్మించారు. సంవత్సరానికి 600 ట్యుబెక్టమీ శస్త్రచికిత్సలు చేసేపక్షంలో నిర్వాహణ ఖర్చుల నిమిత్తం రు 47,000 కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది.

అద్దె-కొనుగోలు పద్ధతిపై ఆటోరిక్షాల కేటాయింపు

సమాజంలోని బడుగువర్గాలకు చెంది, వృత్తి రీత్యా ఆటోరిక్షా డ్రైవర్లుగా ఉన్న వారినందరినీ సహకార వ్యవస్థ



* ఒంగోలు జిల్లా కలెక్టరు శ్రీ కె. చంద్రయ్య టంగుటూరి ప్రకాశం శతజయంత్యుత్సవాల సందర్భంగా అక్టోబరు 9న ప్రకాశంగారి రెండవ కోడలు శ్రీమతి టి. అన్నపూర్ణమ్మకు వెయ్యి రూపాయల్ని బహూకరిస్తున్న దృశ్యం,

పరిధిలోకి తెచ్చి అద్దె- కొనుగోలు పద్ధతులపై వారికి ఆటోరిక్షాలను సరఫరా చేయడానికి బృహత్ప్రణాళికను తయారు చేశారు. మొదటి దశలో, హైదరాబాదులోని రెండు ఆటోరిక్షా డ్రైవర్ల సహకార సంఘాలలో సభ్యులుగా చేరిన 200 మంది డ్రైవర్లకు సహాయం అందజేయాలని నిర్ణయించారు.



* పశ్చిమ గోదావరిజిల్లా కలెక్టరు ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలోని చింతలపూడివద్ద విష్ణుసాగరం ప్రాజెక్టుకు శంకు స్థాపన చేస్తున్న దృశ్యం.

ఈ వాహనాలను అద్దె- కొనుగోలు పద్ధతి డ్రైవరు సభ్యులకు అందజేస్తారు. పూర్తి ధరచెల్లించిన తర్వాత యీ డ్రైవరు- సభ్యుడు వాహనం యజమాని అవుతాడు. సహకారరంగంలో టాక్సీడ్రైవర్ల సంఘాల ఏర్పాటు తర్వాత యిది రెండవ కొత్త కృషిగా భావించవచ్చు.

గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికల్పన

గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికల్పన పథకం క్రింద అనంతపురం జిల్లా, హిందూపూర్ తాలూకా, కొడిగెనహళ్లి పంచాయతీ సమితిలో దుర్భిక్షానికిలోనైన వ్యవసాయకూలీలకు ఉపాధి కల్పించడానికి 8 పనులను చేపట్టారు. రు 1,15,000 ల ఖర్చుతో చేపట్టే కార్యక్రమం ద్వారా 125 మందికి ఉపాధి లభిస్తుంది. కె, ఎ నుండి వీరవరం వరకుగల రోడ్డు. సోమఘట్ట నుండి కోడికొండ రోడ్డుల మరమ్మతులు. ముల్లమేతుకపల్లి నుండి మాడుగిరివరకు, హిందూపూర్ నుండి కోటిపివరకు బి.ఎన్. నుండి తూముకుంట వరకుగల రోడ్ల మరమ్మతులు యీ కార్యక్రమంలో ఉన్నాయి.

పైన పేర్కొన్న పనులు పూర్తిచేయడానికి నాలుగు నెలల పాటు 125 మంది కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

నల్లగొండ జిల్లాలో అనావృష్టి పరిస్థితులు

ఢిల్లీకి చెందిన నలుగురు పత్రికా ప్రతినిధులు అనావృష్టి పరిస్థితులు పరిశీలించడానికి ఆగస్టు 29న నల్లగొండ సందర్శించారు.

మాల్కాపురం గ్రామంలో వారు స్థానిక నాయకులను. అధికారులను ఇంటర్వ్యూచేశారు అనావృష్టి కారణంగా పూర్తిగా బీటలు బారిపోయిన మల్కాపురంను వారు చూశారు. ఈ పత్రికా ప్రతినిధులు ఎండిపోయిన కొన్ని పంట పొలాలను కూడా చూచారు.

మూసీ ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో వారు పైర్లు ఎండిపోయి బీటలు వారిన పొలాలను చూచారు. మూసీలో నీటిమట్టం ఒక అడుగు మాత్రమే ఉంది.

జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ ప్రతాప్ కరణ్, జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీ ఉప్పల రంగారెడి యితర అధికార, అనధికార సభ్యులు యీ పత్రికా ప్రతి నిధులతో సూర్యాపేటలో అనావృష్టి పరిస్థితులను గూర్చి చర్చించారు

గుంటూరు జిల్లాలో అనావృష్టి ఫలితంగా రూ.28 కోట్లు నష్టం

రెవిన్యూ బోర్డు మూడవ సభ్యుడు శ్రీ డి. ఆర్. సుందరం ఆగస్టు 26 వ గుంటూరులో ప్రసంగిస్తూ గుంటూరు జిల్లా అనావృష్టి ఫలితంగా మొత్తం 11, 82లక్షల ఎకరాల ఖరీఫ్ పంటకుగాను 7.61 లక్షల ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని అన్నారు.

3.94 లక్షల ఎకరాలలో ఎటువంటి పైర్లు వేయలేదనీ, పైర్లువేసిన 3.57 లక్షల ఎకరాలలో పంట ఎండిపోయిందనీ, దీని ఫలితంగా రూ. 28 కోట్ల నష్టం కలిగిందనీ ఆయన అన్నారు.

జిల్లాలో 728 గ్రామాలకుగాను, 503 గ్రామాలలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయనీ. డెల్టా ప్రాంతం మినహా జిల్లా అంతటా అనావృష్టి పరిస్థితి నెలకొన్నదనీ ఆయన అన్నారు

సెప్టెంబరులో రూ. 20 లక్షల మేరకు సహాయ కార్యక్రమాలు అమలు జరపాలని ఆయన ఆదేశించారు. బోర్డు సభ్యుడు, జిల్లా కలక్టరు యితర అధికారులు జిల్లా 500 మైళ్ళలో పర్యటించారు.

అనావృష్టి నివారణ కార్యక్రమానికి ప్రారంభోత్సవం


ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఆర్. భువన సుందర రెడ్డి, ఆగస్టు 27 న కొత్తగడ్డలో లింక్ రోడ్డు నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. సుడిమెళ్ల పంచాయతీ సమితిలోని ఇర్పనాపురం గ్రామానికి సరిహద్దు కుగ్రామం ఇది. అనావృష్టి సహాయక కార్యక్రమం క్రింద యీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొత్తగడ్డ ఒక గిరిజన గ్రామము. బయ్యారం గ్రామానికి రెండు మైళ్ల దూరంలో ఈ గ్రామం వున్నది.

గిరిజన గ్రామాలలో ఖమ్మం జిల్లా పరిషత్ అధ్యక్షుని పర్యటన

ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఆర్. భువన సుందర రెడ్డి బోడు పంచాయతీ సమితిలోని మార్కొడు, అల్లాపల్లి గిరిజన గ్రామాలలో పర్యటించారు. ఆయన గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ సభ్యులతో కరువు నివారణ పనులు తక్కావీ ఋణాలకు సంబంధించిన విషయాలను గురించి చర్చించారు. మార్కొడులో క్రాష్ ప్రోగ్రాం ప్రకారం సందిబంధం కుంట మరమ్మతుకు గ్రామ రోడ్డు పనులు ఆరంభించవలసినదని యీ పనుల కొరకు రూ. 5,000 లు మంజూరు చేయబడినాయని ఆయన గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపారు. అల్లాపల్లి గ్రామస్థులు, జిల్లా పరిషత్తు అధ్యక్షుణ్ణి కలుసుకొని జిల్లేరువాగునుంచి ఎర్ర చెఱువుకు కాలువ త్రవ్వినట్లైతే శాశ్వతమైన నీటి పారుదల సౌకర్యాలు ఏర్పడతాయని వినతి చేశారు. ఎర్రచెరువులోని మిగులు నీరు వృధాకాకుండా ఒక రిజర్వాయరు కట్టినట్లైతే దానివల్ల అంతోగు గ్రామ గిరిజన రైతులకు లాభం చేకూరుతుందని వారు కోరారు:

చిత్తూరులో చౌక ధరల దుకాణాలు

చిత్తూరు జిల్లా కలెక్టరు శ్రీ బి. వి. రామారావు పత్రికా సమావేశంలో ప్రసంగిస్తూ చిత్తూరు జిల్లాలో 76 చౌక ధరల దుకాణాలు తెరువబడినాయని తెలిపినారు. అవసరమైతే వీటి సంఖ్య 150 కి హెచ్చింపబడుతాయని తెలిపారు.



* నల్గొండ జిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య అక్టోబరు 6న నల్గొండలోని జిల్లాపరిషత్తు హాలులో సమాజ వికాస వారోత్సవానికి ప్రారంభోత్సవం జరిపినప్పటి చిత్రం.

ఆహార సంస్థల నిలవలనుంచి జిల్లాకు 100 టన్నుల బియ్యం కేటాయించబడినాయి. రూపాయికు కిలో చొప్పున యీ బియ్యం అమ్మడం జరుగుతున్నది. తిరుపతి, చిత్తూరు మునిసిపల్ ప్రాంతాలలో జనతాబజార్ల ద్వారా బియ్యం విక్రయించబడుతున్నవి. శ్రీ కాళహస్తి తాలుకాలో, పల్లం ఫిర్కాలో పంట పరిస్థితులు తృప్తికరంగా లేవు. పలమనేరు, కుప్పం, మదనపల్లి తాలూకాల్లో యిటీవల వర్షాలు వచ్చినప్పటికి చెఱువులకు తగినంతగా నీరు రాలేదు. అయితే యీ వర్షాలవల్ల యిప్పుడున్న పైరులకు కొంత మేలు కలుగుతుంది. అయితే ఆలస్యంగా వర్షాలు రావడంవల్ల పంట ఫలితాలు దెబ్బ తినవచ్చునని కలెక్టరు చెప్పారు.

చిన్న, మధ్యతరహా రైతులకు రూ. 4.59 లక్షలు మంజూరి

నల్లగొండ జిల్లా, నకిరేకల్ పంచాయతీ సమితిలోని 11 గ్రామాలలో చిన్న, మధ్యతరహా వ్యవసాయదారుల పథకం క్రింద 72 పాతబావులను మరమ్మతు చేయించడానికి రూ. 1,32,500 లు, 44 క్రొత్త బావులను త్రవ్వడానికి రూ. 1,43,500 లు, చిన్న, మధ్యతరహా వ్యవసాయదారులకు స్పెషల్ అధికారి శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాదరావు మంజూరు చేశారు. ఆయన రూ. 1,83,500 విలువచేసే 71 విద్యుచ్ఛక్తి మోటార్లను కూడ మంజూరు చేశారు.

చిత్తూరు జిల్లాలోని హరిజన వాడలలో విద్యుచ్ఛక్తి సరఫరా

చిత్తూరు జిల్లా కలక్టరు శ్రీ బి. వి. రామారావు పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ యిదివరకే విద్యుచ్ఛక్తి యీయబడిన గ్రామాలలోని 300 హరిజన వాడలకు యిప్పుడు విద్యుచ్ఛక్తి సరఫరా

చేయబడుతుందని అన్నారు. దీనికి జరిగే ఖర్చులను జిల్లా పరిషత్తు పంచాయతీ సమితి నిధుల నుండి భరిస్తారు. ఈ పథకాన్ని దశల వారిగా అమలు జరుపుతారని కూడా ఆయన తెలిపారు.

దుర్భిక్ష పరిస్థితుల సమీక్ష

మైలవరం పంచాయతీ సమితి సర్వసభ్య సమావేశం, సమితి అధ్యక్షుడు శ్రీ కె. భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో సమితి ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితులను గూర్చి సమీక్షించి, అన్ని పంచాయతీలలో చౌకదుకాణాలను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని తీర్మానించారు. శాసన సభ్యులు శ్రీ సి. హెచ్. వెంకటరావు ప్రసంగిస్తూ సమితి ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితుల నివారణకు తీసుకుంటున్న వివిధ సహాయక చర్యలను గూర్చి వివరించారు.

తక్కావీ ఋణాల పంపిణీ

రామన్నపేట తాలూకాలో అనావృష్టి పరిస్థితులు వున్నందు వల్ల అక్కడ సహాయక చర్యలు తీసుకొనే నిమిత్తం నల్గొండ జిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య రూ. 50,000లు కేటాయించారు. ఈ డబ్బుతో పశుగ్రాసం కొనుగోలు చేయడానికి, బావులను లోతుగా త్రవ్వించడానికి ఒక కార్యక్రమం తయారు చేయబడింది.

రామన్నపేట తహశీల్దారు, బి.డి.ఓ. డిప్యూటీ తహశీల్దారు ఇతర అధికారులు ఈ తాలూకాలో సుమారు 80 గ్రామాలలో పర్యటించారు. తక్కావీ ఋణాలు పంచిపెట్టడానికి పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ గుమ్మి అనంతరెడ్డి కూడా వీరివెంట పర్యటించారు.

గిరిజనుల భూముల నీటిపారుదలకు పంపుసెట్లు సరఫరా

సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టరు శ్రీ ఎ. శ్రీరాములు, సెప్టెంబరు 1వ తేదీన నెల్లూరు జిల్లాలోని గాంధీ నగర్ గిరిజన కాలనీలో విద్యుచ్ఛక్తి మోటారు, పంపు సెట్టుకు ప్రారంభోత్సవం చేశారు.

ఈ విద్యుచ్ఛక్తి మోటారు, పంపుసెట్టును ప్రభుత్వం గిరిజనులకు ఉచితంగా సరఫరా చేసింది. గిరిజనులకు యిదివరకే కేటాయించిన 30 ఎకరాల భూమికి ఈ పంపుసెట్టు ద్వారా నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. గిరిజనులకు రూ. 7,000 మేరకు వ్యవసాయ ఋణాలను కూడా మంజూరు చేశారు.

శ్రీకాకుళంలో కరువు సహాయక పనులు

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీ కె పురుషోత్తమనాయుడు జిల్లాలోని పంచాయతీసమితి, అధ్యక్షులు, బి.డి.ఓ.లు, తహశీల్దార్లు, జిల్లా అధికారుల సమావేశం సెప్టెంబరు 10న ఏర్పాటుచేసి కరువు సహాయక పనులు, సన్నకారు రైతుల అభివృద్ధి, ఏజన్సీ, హరిజన



* కొత్తఢిల్లీలోని గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీ పి. వి. వెంకటప్పయ్య సెప్టెంబరు 14న సిరిసిల్లాలో సిరిసిల్లా సహకార విద్యుత్ సరఫరాసంఘం పరిధిలో వున్న ప్రాంతాన్ని మేప్‌లో పరిశీలిస్తున్న దృశ్యం

నివేశన స్థలాల కేటాయింపు, గ్రామీణ నిరుద్యోగ నిర్మూలన కార్యక్రమాలను విజయవంతంగా అమలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ జి. శ్రీరాములు నాయుడు కూడా హాజరైనారు.

గుంటూరులో షెడ్యూలు కులాలవారికి 1,000 ఇండ్ల నిర్మాణం

గుంటూరులోని షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల భవన నిర్మాణ సహకార సంస్థ జిల్లా కలెక్టరును ఆ సంస్థకు అధ్యక్షునిగాను, జిల్లా పరిషత్తు అధ్యక్షుణ్ణి, ఉపాధ్యక్షుణ్ణిగాను నామినేటు చేసింది. జిల్లా రెవిన్యూ ఆఫీసర్, జిల్లా పరిషత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, జిల్లా సహకార శాఖాధికారి, సాంఘిక



రెవెన్యూబోర్డు ప్రథమ సభ్యులు శ్రీ ఎన్. భగవాన్‌దాస్ ఆగ 26న పత్తిపాడు తాలూకా శంఖవరంలో చవుక దుకాణానికి ప్రారంభోత్సవం చేశారు.

సంక్షేమ శాఖాధికారి, ప్రాంతీయ సహకార శాఖాధికారి, యీ సంస్థకు డైరెక్టర్లుగా నామినేటు చేయబడినారు. కలెక్టరు అధ్యక్షతన యీ డైరెక్టర్ల సమావేశం జరిగింది. సమితి ప్రాంతాలలో 1,000 ఇండ్లు, గుంటూరు పట్టణంలో 300 ఇండ్ల నిర్మాణానికి యీ సమావేశంలో నిర్ణయం తీసుకోబడింది. ఈ ఇండ్ల నిర్మాణానికి మొత్తం రు. 23,40,000 లు ఖర్చు అవుతుంది. ఇంటికి రూ. 1,800 లు ఖర్చు అవుతుంది. ఈ పథకం క్రింద అదనంగా 2,000 ల ఇండ్లను నిర్మించడానికి ప్రతిపాదనలు తయారుచేయబడుతున్నాయి. కలెక్టరు పి. ఎ. శ్రీ సి. నారాయణ స్వామి ప్రసంగిస్తూ యీ పథకంలోని ముఖ్యాంశాలను వివరించి చెప్పారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల అభివృద్ధి. సంక్షేమం విషయాలలో జీవిత భీమా సంస్థ ప్రముఖపాత్ర వహిస్తున్నది.

పెందుర్తిలో ఉత్తమ ప్రాథమిక పాఠశాలలకు బహుమతులు

పెందుర్తి పంచాయతీ సమితిలోని పినగాడి, కుర్మన్నపాలెం, గ్రామాలలోవున్న ఎలమెంటరీ స్కూళ్లకు 1970-71 సంవత్సరానికి ఉత్తమమైనవిగా నిర్ణయింపబడినాయి ఈ రెండు స్కూళ్ళకు వెండి షీల్డులు బహూకరింపబడినాయి. ఈసందర్భంలో సమితి అధ్యక్షులు శ్రీ పి. అప్పల నరసింహం ప్రసంగిస్తూ హైయ్యర్ గ్రేడ్ టీచర్ల పదవిని సెకండరీ గ్రేడ్ పదవులుగా మార్చడానికి సమితి యోచిస్తున్నదని తెలిపారు. బి. డి. ఓ. ప్రసంగిస్తూ బ్లాకులోని ఎలిమెంటరీ స్కూళ్లను అభివృద్ధి పరచడానికి కావలసిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

ఉట్నూరులో గ్రామీణ పరిశ్రమ కేంద్రము

పరిశ్రమల అభివృద్ధి కార్యక్రమం క్రింద ఉట్నూరులో గ్రామీణ చేతి వస్తువులు, పరిశ్రమల కేంద్రం నిర్వహింపబడుతున్నది. ఈ కేంద్రంలో వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, చేనేత పనులలో కళాకారులకు శిక్షణ గరుపబడుతున్నది. సెప్టెంబరు 1 నుంచి 13 వ జట్టుకు శిక్షణ ఆరంభమైనది. శిక్షణ కాలం 11 నెలలు. ప్రస్తుతం యిందులో 32 మంది శిక్షణ పొందుతున్నారు. వీరిలో 12 మంది గిరిజనులున్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు రూ. 30 లు స్టయిపెండు యివ్వబడుతుంది. ఈ పథకానికి సాలీనా రూ. 66,00 లు ఖర్చు అవుతుంది. యింతవరకు యీ కేంద్రంలో 325 మంది శిక్షణ పొందారు. శిక్షణ పొందిన వారికి వారు తమ తమ వృత్తులను చేపట్టడానికి వీలుగా రూ. 210 ల ఖర్చుకాగల మేలురకం పనికరాలు సరఫరా చేయడం జరుగుతున్నది. ఈ కేంద్రం శిక్షణ యివ్వడమేకాకుండా వస్తువుల ఉత్పత్తినికూడ కొనసాగిస్తున్నది. ఈ కేంద్రంలో తయారయ్యే కుండలు శ్రేష్ఠమైనవిగా ప్రశస్తి పొందినాయి.

శ్రీకాకుళంజిల్లాలో సన్నకారు రైతులకు ఋణాలు

శ్రీకాకుళం జిల్లా కలెక్టరు శ్రీ కె. పురుషోత్తమ నాయుడు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ యీ సంవత్సరం వాణిజ్య బ్యాంకులు 5,500 మంది సన్నకారు రైతులకు సుమారు రూ. 33 లక్షల ఋణం మంజూరు చేస్తాయని తెలిపారు. ఎక్కువ దిగుబడి నిచ్చే పంటలను పండించడానికి ఎకరానికి రూ. 300లు చొప్పున ఋణాలు యివ్వబడుతాయి. విత్తనములు రసాయనిక ఎరువుల రవాణా ఖర్చుల క్రింద ఎకరానికి రూ. 12.95 పైసల చొప్పున సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ సబ్సిడీ యిస్తుంది. సస్యరక్షణ కార్యక్రమం క్రింద 25 శాతం ఖర్చు సబ్సిడీగా యివ్వబడుతుంది.

ఈ సంచికలో రచయితలు

శ్రీ అక్కిరాజు వాసుదేవరావు, సమాచార శాఖ మంత్రి
శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, ఎం. ఎల్. ఎ, సత్తెనపల్లి
శ్రీ వడ్రంగి రాజేశ్వరరావు, జర్నలిస్టు, ఏలూరు
శ్రీ శశికాంత శాతకర్ణి తత్వశాస్త్రశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు.
శ్రీ రావిపాటి మహానంద, ఎం. ఎల్. ఎ, దరిశి
శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ, చిత్రకారుడు, 272 ఎ, న్యూమలక్‌పేట హైదరాబాదు.
శ్రీ ఉమ్మెత్తల నరసింహమూర్తి, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా
శ్రీ చావలి రామమూర్తి, నిజామాబాదు
శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, హైదరాబాదు
శ్రీ కాలిపు కూర్మావతారం, జిల్లా పరిషత్ హైస్కూలు, పిరిడి, శ్రీకాకుళం జిల్లా
శ్రీ పి. వి. సుబ్బారావు బి. ఎ. పి. ఆర్. ఒ, అడ్డతీగల, తూ. గో. జిల్లా
శ్రీ ముద్దసాని రాంరెడ్డి, ఊటూరు, కరీంనగర్ జిల్లా
శ్రీ టి.ఎ. పద్మనాభరావు, నెల్లూరు
శ్రీమతి ఎ. లక్ష్మీరమణ, 87, మెహిదీపట్నం, హైదరాబాదు
శ్రీ గంధం అప్పారావు, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, మద్రాసు
శ్రీ సి.వి. నరసింహారెడ్డి, సమాచారశాఖ, హైదరాబాదు
శ్రీమతి కాథా పద్మ, కాలాడేరా, హైదరాబాదు
శ్రీ ఎస్. ఎస్. కుప్పురాజు, బి.ఎ.పి.ఆర్.ఒ, బంగారుపాళ్యం చిత్తూరు జిల్లా
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, సమాచారశాఖ, హైదరాబాదు.



పుష్కలమైన పంటలకు ఫాక్టమ్‌ఫాస్

అన్ని రకముల భూములకు, పైర్లకు, అనుకూలమై తన ఆధిక్యతను నిరూపించుకున్న, అద్భుత సంకీర్ణ ఎరువు. దక్షిణ ప్రాంత రాష్ట్రముల రైతులు విరివిగా వాడు ఎరువు. భారత దేశంలో రసాయన ఎరువుల ఉత్పత్తికే పునాది వేసిన బ్రహ్మాండమైన ప్రప్రథమ ఫాక్ట్ ఎరువుల ఫాక్టరీ ప్రతిష్ఠను చాటే ఎరువు

వరి పైరుకు శిఫారసు చేయబడ్డ ఎరువుల మోతాదులు. ఎకరాకు కిలోగ్రాములలో

	ఫాక్టమ్‌ఫాస్ 16 20	మ్యూరియేట్ ఆఫ్ పొటాష్	యూరియా
వరి :			
(ఎ) అధిక దిగుబడినిచ్చే రకాలు	180	50	58
(బి) దేశవాళీ రకాలు	135	26	12


ఫాక్ట్ కర్షక బంధు

ది ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కూర్ లిమిటెడ్, ఉద్యోగమండల్ - కేరళ

ఆంధ్రప్రదేశ్ ఏరియా ఆఫీసు: షాపూర్‌వాడి, హైద్రాబాద్-4.


ప్రాంతీయ కార్యాలయాలు.- నిజామాబాద్ వరంగల్, కర్నూలు నెల్లూరు

aries. EKM. FT 152.TL



తెలుగు దేశంలోని సంగీత, నృత్య, నాటక రీతులు చాలా ప్రాచీనమైనవి. క్రీస్తుకు పూర్వమే నృత్య నాటకాలు, సంగీత వాద్యాలు ఆంధ్రదేశంలో వున్నట్లు హాలుని గాథాసప్తశతిలో పేర్కొనబడింది. అభినయ దర్పణం, భరతార్ణవం గ్రంథకర్త నందికేశ్వరుడు తెలుగువాడు.

కూచిపూడి నృత్య నాటకం తెలుగు ప్రజల ప్రత్యేక కళా విశేషం. సిద్ధేంద్రయోగి "భామాకలాపం" ఈ కళను అత్యున్నత స్థాయికి చేర్చింది. దక్షిణ భారతంలో నృత్యకళా వికాసానికి కూచిపూడి నృత్యరీతులు దోహదం చేశాయి.


Reg. No. H. 133